సత్యమేవ జయతే

సాక్షి


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

WWW.SAKSHI.COM


పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 18 | సంచిక: 84

ఆదివారం | 15-6-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 7.00
సంపుటి: 18
సంచిక: 84
ఆదివారం
15-6-2025



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




"YOU HAVE ARRIVED HOME"
Iconic Architecture, Extraordinary Craftsmanship, Obsessive Detailing.
1,07,000+ SQ.FT. Indoor amenities
something MORE for Everyone
ASBL
BROADWAY
EXCLUSIVE
3 BHKs
STARTING FROM
₹2.5 CR
LOCATED IN
FINANCIAL DISTRICT
092 895 89630
asbl.in/broadway
TG RERA NO: P02400009684
FILE NO: 002916/BP/HMDA/0847/SKP/2025
THE CLUB 52,000 SQ. FT.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 84

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 15-6-2025



డబ్ల్యూటీసీ విజేత దక్షిణాఫ్రికా

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో బవుమా సేన 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 1998 తర్వాత సఫారీ టీమ్‌కు ఇదే తొలి ఐసీసీ టైటిల్.

- వివరాలు 14లో



మృతులు 274 మంది

ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 274కు పెరిగింది. విమానంలోని 242 మందిలో 241 మందితోపాటు మెడికల్ కాలేజీ క్యాంటీన్, హాస్టళ్లలో 33 మంది మృతి చెందారు.

- వివరాలు 6లో



మహేశ్‌కుమార్ | జీవన్‌సాయి

నీట్ యూజీ తెలంగాణ టాపర్ కాకర్ల జీవన్‌సాయి

- జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు
- రాజస్తాన్ విద్యార్థి మహేశ్‌కుమార్ ఆలిండియా టాపర్...
- ఏపీ టాపర్‌గా నిలిచిన 19వ ర్యాంకర్ కార్తీక్ రామ్‌కిరీటి
- టాప్ 100లో తెలంగాణ నుంచి 5, ఏపీ నుంచి ఆరుగురికి చోటు
- ఫలితాలు ప్రకటించిన ఎన్టీఏ.. మొత్తం 12,36,531 మంది అర్హత
- తెలంగాణ నుంచి 41,584 మంది.. ఏపీ నుంచి 36,776 మంది అర్హులు
- టాప్ టెన్‌లో ఒక్కరే బాలిక.. వచ్చే నెలలో కౌన్సెలింగ్

12లో

హాలీవుడ్‌కు వేదికవ్వాలి

అంతర్జాతీయ సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికగా మారాలి: సీఎం రేవంత్

- అందుకు సినీ పెద్దలు కృషిచేయాలి...
- ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది సినిమా అభివృద్ధి కోసమే..
- తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి.. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది
- నేను మరో 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా..
- ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా
- తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ప్రసంగించిన సీఎం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ నటుడి అవార్డు అందుకుంటున్న హీరో అల్లు అర్జున్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సినీ పరిశ్రమ హాలీవుడ్‌కు హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ దిశగా సినీ పెద్దలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ సినిమా అంటే ఒకప్పుడు బాలీవుడ్ అని అందరూ భావించేవారు.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. భారతీయ సినిమాల్లో తెలుగు సినిమా ముందు వరుసలో ఉందని చెప్పారు. ఇకపై బాలీవుడ్‌కు హైదరాబాద్ వేదిక కానుందని పేర్కొన్నారు. శనివారం హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. 2014 నుంచి 2024 వరకు ఉత్తమ చలనచిత్రాలకు

మిగతా 3వ పేజీలో ▶

దాడులు... ప్రతిదాడులు

టెల్‌అవీవ్‌పై విరుచుకుపడిన ఇరాన్ ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల పర్వం

- మరో ఇద్దరు ఇరాన్ కీలక అధికారులు మృతి
- ఇరాన్ మిలటరీ కొత్త చీఫ్‌గా అమీర్ నియామకం
- బాలిస్టిక్ మిస్సైల్ ప్రోగ్రాం కొత్త చీఫ్‌గా మౌసావి
- మళ్లీ దాడిచేస్తే టెహ్రాన్‌ను అగ్నికి ఆహుతి చేస్తాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక

6లో





పత్రికా స్వేచ్ఛ అణచివేత.. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- ప్రభుత్వ చర్యలపై స్పందించకుంటే భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో సీనియర్ సంపాదకులు, జర్నలిస్టుల ఆందోళన
- కొమ్మినేని అరెస్టుకు ముక్త కంఠంతో ఖండన

3లో

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్. చిత్రంలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డి, దిలీప్‌రెడ్డి, దేవులపల్లి అమర్, అల్లం నారాయణ, కె. రామచంద్రమూర్తి, విజయ్ బాబు, శైలేష్‌రెడ్డి, టంకశాల అశోక్

అమెరికాలో చట్టసభ్యులపై కాల్పులు

6లో

ప్రమాదంలో 26 మెడికల్ కాలేజీల మనుగడ!

- రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణపై ఎన్ఎంసీ అసంతృప్తి
- 18న ఢిల్లీలో వ్యక్తిగత విచారణకు రావాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈకి పిలుపు
- విచారణలో ఎన్ఎంసీ సంతృప్తి చెందకపోతే 2,700 సీట్లపై ప్రభావం

15లో

దేశాన్ని బట్టి నిద్ర!

కనీస నిద్ర గంటలపై కొత్త అధ్యయనం

'ఆదర్శ' నిద్రా సమయం అంటూ లేదు

దేశ సంస్కృతిని అనుసరిస్తే చాలు

నిద్రంటూ పడితే అదీ ఆరోగ్యమే

కెనడా, బ్రిటన్ వర్సిటీల పరిశోధన



10 గంటల నిద్ర అనారోగ్యమే!

ఆరోగ్యవంతులు చక్కగా నిద్రపోతారు. చక్కగా నిద్రపోయే వారు ఆరోగ్యంగా ఉంటారు. మరి ఎన్ని గంటలు నిద్రపోతే ఆరోగ్యంగా ఉంటారు? మంచి ఆరోగ్యానికి కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర అవసరమని ఏళ్లుగా డాక్టర్లు చెబుతూ వస్తున్నదే. అయితే అలాంటి పట్టింపు అవసరం లేదని, జీవన శైలిని బట్టి కాస్త తక్కువగానో ఎక్కువగానో నిద్రించవచ్చని కెనడాలోని విక్టోరియా, బ్రిటన్‌లోని కొలంబియా విశ్వ విద్యాలయాల పరిశోధకులు తమ తాజా అధ్యయనంలో వెల్లడించారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్




దేశానికొక 'తగినంత నిద్ర'

నిద్ర కేవలం దేహధర్మం మాత్రమే కాదని, ఆ దేశ అలవాట్లు, సంస్కృతి, పని వేళలు, అక్కడి వాతావరణం, సూర్యరశ్మి తగిలేలా ఉండటం, సామాజిక నిబంధనల వంటి అనేక కారకాలు నిద్ర పోయే సమయాన్ని ప్రభావితం చేస్తాయని 'విక్టోరియా స్కూల్ ఆఫ్ నర్సింగ్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉన్న డాక్టర్ క్రిస్టీన్ చెబుతున్నారు. ''ఒక దేశంలో 'తగినంత' నిద్రగా పరిగణన పొందేది, మరొక దేశంలో అతి నిద్ర కావచ్చు, లేదా చాలినంత నిద్ర కాకనూ పోవచ్చు'' అని ఈ అధ్యయనంలో పాల్గొన్న క్రిస్టీన్ అంటున్నారు. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఐరోపా, ఆసియా, ఆఫ్రికా తదితర 20 దేశాలలో ఈ అధ్యయనం కోసం ఆన్‌లైన్ ప్రశ్నపత్రాన్ని పూర్తి చేసిన దాదాపు 5,000 మంది వ్యక్తుల నిద్ర అలవాట్లు, ఆరోగ్య డేటాను విశ్లేషించి క్రిస్టీన్ బృందం ఈ ముగింపునకు వచ్చింది. నిద్రా సమయంపై గతంలోనూ అనేక సుప్రసిద్ధ సంస్థలు ఎన్నో అధ్యయనాలు చేశాయి. అలా జరిగిన 14 అధ్యయనాల నుండి అదనపు సమాచారాన్ని కూడా ప్రస్తుతం బృందం సేకరించింది. అంతేకాకుండా ఆయుర్దాయం, గుండె జబ్బులు, ఊబకాయం, మధుమేహం వంటి వాటికీ, నిద్రపోయే గంటలకు మధ్య ఉన్న సంబంధాన్ని లెక్కలోకి తీసుకుని పరిశోధకులు ఈ ఫలితాలను వెల్లడించారు.

ప్రతి దేశంలోనూ సంస్కృతికి అనుగుణం కాని నిద్ర గంటల వల్ల ఆరోగ్యం దెబ్బతింటోందని కూడా క్రిస్టీన్ బృందం తమ అధ్యయనంలో కనుగొంది. అంటే చాలా తక్కువ నిద్రపోవడం లేదా చాలా ఎక్కువ నిద్రపోవడం అని కాకుండా, వారి సంస్కృతిని అనుసరించి నిద్ర పోవటం అన్నదే వారిని ఆరోగ్యంగా ఉంచుతోంది. బ్రిటన్ పౌరులు కొందరు 10 గంటల 26 నిమిషాల కంటే ఎక్కువ నిద్రపోయిన కారణంగా.. అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నారని క్రిస్టీన్ బృందం పేర్కొంది. అమెరికాలో 8 గంటల 13 నిమిషాలు నిద్ర పోయే వారిలో కూడా ఈ సమస్య కనిపించింది. క్రిస్టీన్ బృందం తమ అధ్యయనంలో పోషకాహారం, సంపద, అసమానత, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలను చేర్చలేదు. కాబట్టి నిద్ర గంటలకు, ఆరోగ్యంపై నిద్ర చూపే ప్రత్యక్ష ప్రభావంపై తీర్మానాలేవీ చేయలేకపోయారు. 'ఎవరైనా ఎన్ని గంటలు నిద్రపోవాలన్న ప్రశ్నకు సమాధానం నిజంగా చాలా సంక్లిష్టమైనది. మనిషికి రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం అనేందుకు ఎటువంటి ఆధారాలూ లేవు. మీ నిద్ర, ఆరోగ్యం విషయంలో మీ సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాలి' అని కీలే విశ్వవిద్యాలయంలోని స్లీప్ సైకాలజిస్ట్ డాక్టర్ దల్జిందర్ చామర్స్ సూచించారు.

ఎవరు ఎన్ని గంటలు?



(ప్రపంచ సగటు : 7 గంటల 15 నిమిషాలు)

ఫ్రాన్స్‌లో ఎక్కువ... జపాన్‌లో తక్కువ

తాజా అధ్యయనం ప్రకారం.. భారతీయులు సగటున 7 గంటల 15 నిమిషాలు నిద్రపోతున్నారు. ఈ విషయంలో ప్రపంచ సగటు కూడా మన నిద్రా సమయంతో సమానంగా ఉండటం విశేషం. ఫ్రాన్స్ జాతీయులు తక్కిన దేశస్థుల కన్నా ఎక్కువ సమయం నిద్రిస్తున్నారు. ప్రశ్నపత్రం పూరించిన ముందు రోజు రాత్రి సగటున వారు 7.52 గంటలు నిద్రించారు. ఇక అందరికన్నా తక్కువగా నిద్రపోయిన వారు జపనీయులు. వారు 6.18 గంటలు మాత్రమే నిద్రపోయారు. బ్రిటన్ వాళ్లు 7 గంటల 33 నిమిషాలు నిద్రపోతే, అమెరికాలో నిద్రా సమయం 7 గంటల 2 నిమిషాలే. క్రిస్టీన్ బృందం మరికొన్ని ఆశ్చర్యకరమైన విషయాలను కూడా కనుగొంది. ఆరోగ్యకారకమైన 'ఆదర్శ' నిద్రా సమయం అంటూ ఏ దేశంలోనూ లేదు! తక్కువ సగటు నిద్ర వ్యవధి ఉన్న దేశాల వారిని ఎక్కువసేపు నిద్రపోయే దేశాలలోని వ్యక్తులతో పోల్చి చూసినప్పుడు వాళ్ల ఆరోగ్యం అధ్వానంగా ఉందని చెప్పటానికి ఈ బృందానికేమీ ఆధారాలు కనిపించలేదు. దేశ సంస్కృతికి అనుగుణమైన నిద్ర గంటలు.. ఆదర్శ నిద్ర గంటల కంటే ఆరోగ్యంగా ఉంచుతున్నాయని అధ్యయనం పేర్కొంది.

హాలీవుడ్‌కు వేదికవ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి 1964లో నంది అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆ ఆనవాయితీ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగింది. కొన్ని కారణాలవల్ల ఈ అవార్డుల పంపిణీ వాయిదా పడుతూ వచ్చింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక సినీ అవార్డుల ప్రదానంపై నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ఇవాళ గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం


'భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ. తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికైంది. రాష్ట్ర ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది మీ అభివృద్ధి కోసమే. తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి. రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మరో 22 ఏళ్ల నేను క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. నేను ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా. ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం కేటాయిస్తాం. నేను ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి తెలంగాణ విజన్ గురించి వెల్లడించాను. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తాం. ఇప్పటివరకు నేను అనుకున్నవన్నీ సాధించాను. ఇది కూడా సాధ్యమవుతుందని 100 శాతం నమ్మకం ఉంది. తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు నాలుగో తరం కొనసాగుతోంది. గద్దరన్న అంటే ఒక విప్లవం.. ఒక వేగుచుక్క.. ఆయనే మాకు ఒక స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే మేం పోరాటాలు చేశాం. తెలంగాణ అభివృద్ధికి మీ అందరి సహకారం ఉండాలని కోరుతున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు

గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గద్దర్ ఫౌండేషన్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఫౌండేషన్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని గతంలో గద్దర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

కోటి తారల వీణ.. సినీ తెలంగాణ
-13వ పేజీలో..

ఇదండీ సంగతి



కేవలం ఆత్మరక్షణ కోసమే గాలిలో కాల్పులు జరపాల్సి వచ్చింది!

పత్రికా స్వేచ్ఛ అణచివేత.. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

ప్రభుత్వ చర్యలపై స్పందించకుంటే భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో సీనియర్ సంపాదకులు, జర్నలిస్టుల ఆందోళన | జర్నలిస్టు సమాజమంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వాలపై ఉద్యమించాలని పిలుపు | కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును ముక్త కంఠంతో ఖండించిన సంపాదకులు

సాక్షి, హైదరాబాద్: పత్రికాస్వేచ్ఛను హరిస్తూ మీడియా ప్రతినిధులను అరెస్టు చేయడంపై సీనియర్ సంపాదకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టు సమాజమంతా ఐక్యంగా ఉండాలని, ప్రభుత్వాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మీడియాపై ప్రభుత్వాలు చేస్తున్న ఒత్తిడి, అణచివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలపై స్పందించకుంటే భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలను మీడియా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం– పత్రికా స్వేచ్ఛ' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీనియర్ జర్నలిస్టు ఆర్.దిలీప్ రెడ్డి ఈ సమావేశానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. 'ప్రభుత్వాలు జర్నలిస్టులను భయపట్టేలా వ్యవహరిస్తున్నాయి. కొమ్మినేని శ్రీనివాస రావు కించపరిచే వ్యాఖ్యలు చేయకపోయినా ఆయనను అరెస్టు చేయడం అన్యాయం. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది' అని సీనియర్ సంపాదకులు అన్నారు. ఇటీవల ఏపీలో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడాన్ని ముక్త కంఠంతో ఖండించారు. అదేవిధంగా తెలంగాణలో కూడా ఇటీవల సంపాదకుడు రహమాన్‌పై కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు కె.శ్రీకాంత్‌రావు, ట్రెజరర్ రాజేష్, సభ్యులు బాపూరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు వ్యక్తపర్చిన అభిప్రాయాలు వారి మాటల్లోనే...


కొమ్మినేని అరెస్టుతో ప్రభుత్వ ఉద్దేశం బయటపడింది



కె.రామచంద్రమూర్తి
సీనియర్ సంపాదకులు

సుదీర్ఘ కాలంగా జర్నలిజంలో ఉన్న వ్యక్తి కొమ్మినేని. ఆయన వివాదాస్పదంగా మాట్లాడే వ్యక్తి కాదు. అలాంటి వ్యక్తిని సంబంధం లేకుండా ప్రభుత్వం అరెస్టు చేయడం... కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా అదుపులోకి తీసుకోవడం దుర్మార్గం. ప్రభుత్వం సాక్షి మీడియా కార్యాలయాలపైనా దాడికి ప్రోత్సహించినట్లుగా ఉంది. దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వం ప్రోత్సహిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది. సమాజంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉంటుంది. కానీ మాట్లాడనీయకుండా.. బెదిరింపులకు గురిచేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్లే.

పత్రికా స్వేచ్ఛను కోరుకునేది ప్రజలే..



టంకశాల అశోక్
సీనియర్ సంపాదకులు

పత్రికా స్వేచ్ఛ అనేది ఒక వర్గానికి సంబంధించిన అంశం కాదు. దీన్ని ప్రధానంగా కోరుకునేది ప్రజలే. పత్రికలు చురుకుగా ఉన్నప్పుడే ప్రతీ విషయం ప్రజలకు చేరుతుంది. కానీ ప్రస్తుతం ప్రతికాస్వేచ్ఛ ప్రమాదంలో పడింది. కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం. ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించడం చూస్తుంటే ఏపీ ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో స్పష్టమవుతుంది. ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి గత 40 ఏళ్లగా ఏ వర్గాన్నీ గౌరవించిన మనిషి కాదు. ప్రతీ రంగంలో తన వ్యతిరేకులను అణచివేయడం ఏళ్లగా చూస్తున్నాం. ప్రస్తుతం ప్రతికా స్వేచ్ఛనే కాదు... అన్ని స్వేచ్ఛలు హరించుకుపోతున్నాయి. నియంత పాలన మాదిరిగా ప్రభుత్వాలను నిర్వహిస్తున్నారు.

పాత్రికేయుల భద్రత గురించి ఆలోచించాలి



కె.శ్రీనివాస్
సీనియర్ సంపాదకులు

రాజకీయ కక్ష సాధింపులో మీడియా పావులుగా మారుతోంది. ఏపీ, తెలంగాణ అనే కాదు.. చాలా రాష్ట్రాల్లో మీడియా టార్గెట్ అవుతోంది. ఈ పరిస్థితుల్లో పాత్రికేయుల భద్రత గురించి ప్రధానంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. సమాచారం అందించే ఏ వ్యవస్థ అయినా మీడియా కిందనే గుర్తించాలి. ఓ వార్త విషయంలో ప్రైవేటు వ్యక్తులు కేసు పెడితే నాపై కూడా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేశారు. వాస్తవానికి కొమ్మినేని శ్రీనివాస రావును అరెస్ట్ చేయాల్సిన అవసరం లేదు. ఇదివరకు సోషల్ మీడియా వాళ్లను అరెస్ట్ చేసినప్పుడు ప్రధాన స్రవంతి మీడియా పెద్దలు పట్టించుకోలేదు. ఇప్పుడది మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకు వచ్చింది. కొమ్మినేని అరెస్టుతో ఎంతపెద్ద జర్నలిస్టునైనా అరెస్టు చేస్తామనే అభిప్రాయాన్ని ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళ్లింది. తెలంగాణలో కేసీఆర్‌కు భిన్నంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన ఏమాత్రం లేదు.

సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చినా కొన్ని మీడియా సంస్థలు వెక్కిరిస్తున్నాయి



విజయ్ బాబు
సీనియర్ సంపాదకులు

కొమ్మినేని అరెస్టు... సాక్షి ఎడిటర్ ధనంజయ్ రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించిన తీరు ఏపీ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. కొన్ని మీడియా సంస్థలు జర్నలిజం విలువలను దిగజార్చుతున్నాయి. కొమ్మినేని అరెస్టు విషయంలో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. కొమ్మినేని నవ్వితే అరెస్టు చేయడాన్ని కక్ష సాధింపుగా కోర్టు అభిప్రాయపడింది. కానీ సుప్రీంకోర్టు సూచనలపై కొందరు వ్యంగ్యంగా చర్చిస్తున్నారు. కొన్ని మీడియా సంస్థలు సెక్షన్లు తెలియకుండా చర్చలు పెట్టేస్తున్నారు. ఇది మీడియా ఉనికికే ప్రమాదకరం. కొమ్మినేని భార్యకు చంద్రబాబు ఉద్యోగం ఇచ్చారని కొన్ని మీడియా సంస్థలు చర్చ పెట్టడం దారుణం. ఇలాంటి నీచమైన, దుర్మార్గమైన చర్చలు పెట్టొద్దు.

పత్రికలకు స్వేచ్ఛ లేదు



దిలీప్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే పత్రికలకు స్వేచ్ఛ ఉన్నట్టు కనిపించడం లేదు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినా.. వార్త రాసినా ఉపేక్షించే పరిస్థితిలో లేవు. అందుకు తాజా ఉదాహరణ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు వ్యవహారమే. వాస్తవానికి ఆయనను అరెస్టు చేయడం సమంజసం కాదు. తెలంగాణలోనూ ఇలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా జర్నలిస్టు సమాజం ఐక్యంగా ఉండాలి.

..అయినా ప్రజా ప్రయోజన వార్తలు ఆగవు



రహమాన్
సంపాదకులు

గద్వాల జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తారనే స్థానికుల సమాచారంతో నేను వార్తలు రాశాను. ఇథనాల్ పరిశ్రమ అత్యంత ప్రమాదకరమైంది. దీంతో ప్రజలు ఆందోళనబాట పట్టారు. దీనిపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తూ నన్ను అరెస్టు చేసింది. అయినా ప్రజలకు ప్రయోజనం కలిగించే వార్తలు రాయడం ఆపను.

కలిసి ఉంటేనే మనుగడ



శైలేష్ రెడ్డి
సీఈఓ, టీ న్యూస్

వ్యవస్థలో అన్ని రంగాలు ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటున్నాయి. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయస్థానాలు ఇలా అన్నీ ప్రభుత్వ అధీనంలో ఉండేవే. దీంతో జర్నలిస్టులను అకారణంగా టెర్రరిస్టుల మాదిరిగా అరెస్టు చేసి వారికి బెయిల్ రాకుండా చూసే ప్రయత్నం జరుగుతోంది. జర్నలిస్టు సమాజమంతా కలిసికట్టుగా ఉంటేనే మీడియా మనుగడ ఉంటుంది.

మీడియాను భయపెట్టే ప్రయత్నమిది..



దేవులపల్లి అమర్
సంపాదకులు
మన తెలంగాణ

కొమ్మినేని అరెస్టుతో మీడియాను భయపెట్టే ప్రయత్నం జరుగుతోంది. కొమ్మినేని తప్పు లేకున్నా.. ఒకరకమైన భయం కలిగించే వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేశారు. రాజకీయ నేతలు తమకు అనుకూలంగా ఉండే వార్తలే రాయాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం మీడియా స్వతంత్రంగా లేదు. రాజకీయ పార్టీల మద్దతుతో కొనసాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. అయినప్పటికీ పాత్రికేయులు తమ పరిమితులకు లోబడి వాస్తవాలను మాత్రమే రాయాలి. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వా మ్యం రెండూ వేర్వేరు కాదు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం కొమ్మినేని అరెస్ట్‌తో ఆగుతుందని అనుకోవడం లేదు. దీంతో భయపడి మిగతావారు వ్యతిరేక వార్తలు రా యకుండా ఉంటారని అనుకుంటున్నారు. ఇలాంటి సమయంలో మిగతా జర్నలిస్టులు రియాక్ట్ కాకుంటే ఎలా..?

అరెస్టులను వ్యతిరేకించాలి..



అల్లం నారాయణ
సీనియర్ సంపాదకులు

ప్రస్తుత రోజుల్లో ఒక్కో మీడియా ఒక్కో వైఖరితో ఉంది. ఈ పరిస్థితుల్లో ఐదు పేపర్లు, పది టీవీ చానళ్లు చూస్తే తప్ప వాస్తవాలేంటో అర్థం కావడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం మీడియా ప్రతినిధులను అరెస్టు చేస్తుంటే... ఇక్కడ రేవంత్ ప్రభుత్వం ఏకంగా అసెంబ్లీలోనే గుడ్డలూడదీసి కొడతానంటోంది. గద్వాల జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన ఓ జర్నలిస్టును తెలంగాణ ప్రభుత్వం అరెస్ట్ చేయాలని చూస్తోంది. ఈపరిస్థితుల్లో జర్నలిస్టులు ఐక్యంగా ఉండి అరెస్టులను వ్యతిరేకించాలి.

కక్ష సాధింపునకు పరాకాష్ట



ఆర్.ధనంజయ రెడ్డి
సంపాదకులు, సాక్షి

సాక్షి టీవీ డిబెట్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు అనని మాటలకు ఆయన్ను అరెస్టు చేయడం సరికాదని సాక్షాత్తూ సుప్రీంకోర్టే చెప్పింది. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానాలి. కొమ్మినేని అరెస్టే సరి కాదని న్యాయస్థానం స్పష్టంచేస్తుంటే, సాక్షి కార్యాలయాలపై దాడులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. టీడీపీ కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రభుత్వం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సరైన కారణం లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని, ఎవరి ఇంట్లోనైనా సోదాలు చేయొచ్చనే తప్పుడు సంప్రదాయానికి తెరతీసింది. ఇది రాబోయే రోజుల్లో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగించనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.

తగ్గుతున్న ఐఐటీల ప్రభ

ఎక్కువ ర్యాంకులొచ్చినా మొదటి విడతలోనే సీట్లు..

జోసా తొలి రౌండ్ సీట్ల కేటాయింపు

జాతీయ కాలేజీల్లో 62 వేలకుపైగా సీట్లు భర్తీ

కౌన్సెలింగ్‌లో పాల్గొన్న 127 విద్యా సంస్థలు

టాపర్లంతా ముంబై ఐఐటీ వైపే



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో తొలి దశ సీట్ల కేటాయింపును జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) శనివారం వెల్లడించింది. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు సహా జాతీయ ఇంజనీరింగ్ (ఎన్ఐటీలు), ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలు (జీఎఫ్‌టీఐలు) మొత్తం 127 సంస్థలు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. వీటి పరిధిలో 62,854 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మొత్తం ఆరు దశల్లో కౌన్సెలింగ్ చేపట్టాలని జోసా ఈ ఏడాది నిర్ణయించింది. తొలి దశ కౌన్సెలింగ్‌లో ఐఐటీల్లో 18,160 సీట్లను భర్తీ చేశారు. సామాజిక కేటగిరీల వారీగా సీట్ల కేటాయింపు జరిగినట్టు జోసా వెల్లడించింది. జాతీయస్థాయి టాప్ ర్యాంకర్లంతా ఐఐటీ బాంబేలోనే సీట్లు పొందారు. అందులోనూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులకు అన్ని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రధానంగా ఆప్షన్లు ఇచ్చారు.

మారిన ట్రెండ్

గతంతో పోలిస్తే ఈసారి జోసా కౌన్సెలింగ్ భిన్నంగా కన్పిస్తోంది. ఎక్కువ ర్యాంకులు వచ్చినవారికి కూడా తొలి దశలోనే సీట్లు వచ్చాయి. గత ఏడాది ఆఖరి రౌండ్‌లో కూడా ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో కటాఫ్ (బాలుర విభాగం) 6,375 దాటలేదు. ఈసారి తొలి రౌండ్‌లోనే 6,242 ర్యాంకు విద్యార్థికి కూడా సీటు వచ్చింది. తాజా కౌన్సెలింగ్‌ను గమనిస్తే జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలపై విద్యార్థులకు ఆసక్తి తగ్గుతున్నట్టు కన్పిస్తోంది. కోవిడ్ తర్వాత జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌కు విద్యార్థులు సీరియస్‌గా సన్నద్ధమవ్వడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు రాష్ట్రాల్లో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ సంస్థలు, ప్రైవేటు వర్సిటీలు పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీల కోసం పోటీ పడటానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష కూడా కఠినంగా ఉంటోందని విద్యార్థులు భావిస్తున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే ఐఐటీల నాణ్యత ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

2024-25లోని కటాఫ్ ర్యాంకుల వివరాలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

వివిధ జాతీయ సంస్థల్లో ఇంజనీరింగ్ సీట్లు

విద్యా సంస్థ	సీట్లు
ఐఐటీలు	18,160
ఎన్ఐటీలు	24,525
ట్రిపుల్ ఐటీలు	9,940
జీఎఫ్‌టీఐలు	10,228
మొత్తం	62,853

మంచి ర్యాంకు రాకున్నా... ఆఖరివరకూ నిరీక్షించాలి

మంచి ర్యాంకు రాకున్నా ఈసారి ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు వచ్చే అవకాశం కన్పిస్తోంది. ఎందుకంటే పోటీ తక్కువగానే కన్పిస్తోంది. వేలల్లో ర్యాంకులు ఉన్న వారికి ఈసారి సీట్లు వచ్చే వీలుందని భావించాలి. బ్రాంచీ, సంస్థ విషయంలో కొంత ఆలోచించి అడుగేయాలి.

- ఎంఎన్ రావు (జేఈఈ అధ్యాపకులు)



తరము వెంబడి తరము గతించి పోవుచున్నది: భూమియొకటే యెల్లప్పుడును నిలుచునది.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.చవితి ప.2.13 వరకు తదుపరి పంచమి, **నక్షత్రం:** శ్రవణం రా.11.53 వరకు తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** తె.3.51 నుండి 5.26 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు, **అమృత ఘడియలు:** ప.1.14 నుండి 2.51 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నెతన్యాహు (ఇజ్రాయెల్ ప్రధాని)

రాయని డైరీ


మాధవ్ శింగరాజు

యుద్ధాన్ని మొదట ప్రారంభించిన వారే శాంతి కోసం మొదట ప్రయత్నం చేసినవారు అవుతారు. అయితే వారికి నోబెల్ శాంతి బహుమతి వస్తుందా రాదా అన్నది నేనెప్పుడూ ఆలోచించని విషయం.

వార్స్, ఆపరేషన్స్, బ్యాటిల్స్... ఇన్నిటితో ఎన్నేళ్ల యుద్ధం చేసినా శాంతి సిద్ధిస్తుందని చెప్పలేం. శాంతిని కోరుకునేవారు నిరంతరం యుద్ధయజ్ఞం చేస్తూనే ఉండాలి. శాంతిని కాపాడుకుంటూ ఉండటమే శాంతి స్థాపన.

శుక్రవారం, తెల్లారకుండానే 200 యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ ఇరాన్‌తో శాంతి ప్రయత్నాలు ప్రారంభించింది. ఏవైనా రెండు దేశాలు టేబుల్ ముందు ఎదురెదురుగా కూర్చొని శాంతి కోసం జరుపుకొనే చర్చల కంటే – ఎవరి దేశంలో వారు, ఎవరి 'వార్ రూమ్'లో వారు కూర్చొని శతఘ్నులను ఒకరి వైపు ఒకరు విసురుకోవటం వల్లనే ఎప్పటికైనా శాంతిని సాధించగలమని నా నమ్మకం.

శాంతి కోసం జరిగే చర్చలు ఎంత వికారంగా ఉంటాయో చూడండి. చర్చలకు కూర్చున్నాక కదా కండిషన్స్ అనేవి! అసలు చర్చలకు కూర్చోటానికే కండిషన్స్ పెట్టేస్తారు!



శాంతి కోసమా చర్చలు? లేక, మా నుదుటి మీద మేము పిస్టల్ గురి పెట్టుకుని కాల్చుకోవటం కోసమా?!

చర్చలకు ముందు చర్చలు. సంప్రదింపులకు ముందు సంప్రదింపులు. రాయబారాలకు ముందు రాయబారాలు. రాకపోకలకు ముందు రాకపోకలు. ఈ మధ్యలో శాంతి ఎక్కడో చేజారి జారిపోతుంది.

ఇంటర్నల్ కేబినెట్ మీటింగ్స్‌లో నా కొలీగ్స్‌తో నేనదే చెబుతాను. "చూడండి, నాకేం కావాలన్న దానిపై నాకు క్లారిటీ ఉంది. నాకు శాంతి ప్రక్రియలు అవసరం లేదు. శాంతి ఫలితాలు కావాలి" అని అంటాను.

శాంతి కోసం ఐక్యరాజ్య సమితి చేసే ప్రయత్నాలైతే పరమ పావనంగా ఉంటాయి! గడాఫీని తీసుకెళ్లి 'యూఎన్ హ్యూమన్ రైట్స్'కి ఛైర్మన్‌గా కూర్చోబెడుతుంది. సద్దాం హుస్సేన్‌ని పిలిపించుకుని 'యూఎన్ నిరాయుధీకరణ'కు అధ్యక్షుడిని చేస్తుంది. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తుంటే "తప్పు కదా మిత్రమా", "తగదు కదా నా ప్రియ దేశమా!" అంటోంది.

యూఎన్‌కు నేను ఒకటే చెబుతాను. "మీరు 'పీస్ టాక్స్'తో చేయలేని పనిని మేము 'పీస్ ఎటాక్స్'తో చేస్తున్నాం" అని!

ఇంకొకటి కూడా చెబుతాను. ఇరాన్ అణ్వాయుధాలను పోగు చేసుకుంటోంది. ఆ పోగు నిన్న ఉన్నట్లుగా నేడు లేదు. వారం క్రితం ఉన్నట్లుగా నిన్న లేదు. నెల క్రితం ఉన్నట్లుగా వారం క్రితం లేదు. ఏడాది క్రితం ఉన్నట్లుగా నెల క్రితం లేదు. పోగు కుప్ప అయింది. కుప్ప గుట్ట అయింది. గుట్ట దిబ్బ అయింది. ఆ దిబ్బ ఇప్పుడు ఇజ్రాయెల్‌కు థ్రెట్ అయింది.

నా ప్రశ్న ఒక్కటే – ఇరాన్‌కు రెడ్ లైన్స్ గీసేందుకు నిరాకరించే వారికి, ఇజ్రాయెల్ ముందు రెడ్ లైట్ పెట్టే నైతిక హక్కు ఉంటుందా? అని.

అనేక విషయాల్లో నన్ను తప్పపట్టే ప్రపంచానికి అనేకానేక విషయాల్లో నేను కరెక్ట్ అనీ తెలుసు. కానీ ఒప్పుకోదంతే!

ఏదైనా దేశం 'రాక్ బాటమ్'కి చేరుకుందంటే ఇక అక్కడే మిగల్లేదని అర్థం. మంచీ చెడ్డ, నీతీ నియమం, ఆశా శ్వాస... ఏమీ మిగల్లేదని. అలాంటి దేశాన్ని కలుపుకోనన్నా కలుపుకోవాలి. లేదా యుద్ధ ట్యాంకుల్ని పెట్టి కలుపునైనా ఏరి పారేయాలి.

హఠాత్తుగా భారీ విస్ఫోటనం! జెరూసలేంలో నేనున్న గది ఒక్కసారిగా దద్దరిల్లింది. కిటికీ అద్దాలు బద్దలయ్యాయి. సమీపంలో – "కొడుకా... నాయనా..." అని ఓ తల్లి ఆక్రందన! ఇరాన్ నుంచి ఖొమైనీ తిరుగుయుద్ధం ప్రారంభించినట్లున్నాడు.

ఇజ్రాయెల్ మాత్రం యుద్ధాన్ని ఆపదు. ఒక తల్లి తన పిల్లల్ని ఏ ఉదయమైనా నిర్భయంగా బయటికి పంపగలిగేంతైనా శాంతిని నెలకొల్పేవరకు ఇజ్రాయెల్ తన యుద్ధాన్ని ముగించదు.

నవ్విపోదురు గాక..!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



"ఆరు సూపర్ సిక్స్ హామీలూ పూర్తయ్యాయి. గుర్తుపెట్టుకోండి. ఇంకా ఎవరైనా సూపర్ సిక్స్ అని మాట్లాడితే, వారికి నాలుక..." అంటూ వాక్యం మధ్యలో చంద్రబాబు కాస్త విరామం పాటించారు. ఆ ప్రెస్ మీట్‌ను టీవీల్లో చూస్తున్న వాళ్లకు నాలుకను కోసేస్తా అంటారేమో అనే అనుమానం రావడం సహజం. ఎందుకంటే, గత ఏడాదికాలంగా హామీల అమలు గురించి గట్టిగా ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టడం, ఏదో వంకతో జైలుకు పంపించడం అందరూ గమనిస్తూనే ఉన్నారు గనుక! చంద్రబాబు పాటించిన వాక్య విరామంలో గట్టి హెచ్చరికను పంపించే ఉద్దేశం కూడా ఉండవచ్చు. విరామం తర్వాత వాక్యాన్ని 'మందం' అనే మాటతో ముగించారు. అంటే ఇకముందు ఎవరైనా సరే సూపర్ సిక్స్ అమలు కాలేదని మాట్లాడితే వారి నాలుక మందం అనుకోవాలి. వాక్య విరామ హెచ్చరిక కూడా వారికి వర్తిస్తుందనుకోవాలి.

సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'తల్లికి వందనం' నిధుల విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఈ పరోక్ష హెచ్చరిక జారీ చేశారు. 'తల్లికి వందనం' పథకాన్ని కూడా 2025–26 అకడమిక్ ఇయర్ కోసం విడుదల చేశారు. బకాయి పడిన గత సంవత్సరం నిధులు హుష్ కాకే! మిగిలిన ఐదు పథకాల సంగతి? వాటినెప్పుడు అమలు చేశారు? దీపం పథకం కింద ఏటా ఇవ్వాల్సిన మూడు ఉచిత సిలిండర్ల బదులు రెండు ఇచ్చారు. సరే, అది కూడా అమలైంది. 'అన్నదాత సుఖీభవ' కింద రైతుకు ఇస్తానన్న రూ. 20 వేల నగదు సాయానికి కూడా ఓ అంటకత్తెర కథ చెప్పారు. ఈ నెల 20న కేంద్రం విడుదల చేసే రెండు వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక విడత విడుదల చేస్తామని చెప్పారు. కేంద్రం మూడు విడతల్లో విడుదల చేసే ఆరు వేలకు మరో 14 వేలను మూడు విడతల్లో కలిపి అందజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. బకాయి పెట్టిన గతేడాది సొమ్ము అటకెక్కినట్టే! మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆగస్టు 15న ముహూర్తం పెట్టినట్టు చెప్పారు. పూర్తి వివరాలు తెలియాలి.

సూపర్ సిక్స్‌లో భాగంగా ఉన్న మరో రెండు అతి కీలకమైన పథకాలను మాత్రం దేవుడి ఖాతాలో వేస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. పందొమ్మిది నుంచి యాభై తొమ్మిది సంవత్సరాల మధ్య వయసున్న మహిళలందరికీ 'ఆడబిడ్డ నిధి' కింద నెలకు రూ.1500 చొప్పున ఏటా 18,000 రూపాయలను జమ చేస్తామని కూటమి ఇచ్చిన ఎన్నికల హామీ. ఇప్పుడు దాన్ని పీ–ఫోర్ అనే పథకంతో లింక్ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంటే ఆడబిడ్డల అదృష్టాన్ని డబ్బున్న వారి ఔదార్యంతో ముడివేశారన్నమాట. ఎన్నికల హామీ ప్రకారం ఈ పథకానికి దాదాపు ఏటా 35 వేల కోట్లు అవసరమని అంచనా. ఇంతటి ఔదార్యాన్ని పి–ఫోర్ పథకం ద్వారా పిండుకోవాలట! ఇది అయ్యే పనేనా?

సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీ నిరుద్యోగ భృతి. ప్రతి నిరుద్యోగికి నెలకు మూడు వేల రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంది. పన్నెండు నెలలు బకాయి పెట్టారు. ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంతో జత చేస్తామని చెబుతున్నారు. అసలు రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతమంది? నైపుణ్య శిక్షణ ఎంతమందికి ఇస్తారు? అందులో ఈ మూడు వేల రూపాయలు పోషించే పాత్రేమిటి? అనే మీమాంసలనవసరం. ఈ పథకానికీ పాడె కట్టినట్టే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో యాభయ్యేళ్లు నిండిన ప్రతివారికీ పెన్షన్ అమలు చేస్తామని మరో కీలకమైన వాగ్దానాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చారు. దాని గురించి ఏడాది గడిచిపోయినా ఇప్పటికీ మాటా లేదు, ముచ్చటా లేదు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను విశ్లేషిస్తే ఒక్క మొదటి యేడాదికే రూ. 80 వేల కోట్లకు పైగా వాగ్దాన భంగానికి పాల్పడినట్టు తేలింది.

ఎన్నికల ప్రచారం సందర్భంగా కూటమి నాయకులు ఫ్లాగ్‌షిప్‌గా పెట్టుకున్న సూపర్ సిక్స్‌లోనే అరకొరగా రెండు, అత్తెసరుతో మరో రెండు ప్రకటించారు. భారీగా వ్యయమయ్యే ఇంకో రెండు పథకాలకు తిలోదకాలొదిలేశారు. ఫ్లాగ్‌షిప్ సంగతే ఇట్లా ఉంటే మిగతా మేనిఫెస్టో హామీల గురించి చర్చించడానికేముంటుంది? మోసం చేశారని ఆవేశపడటం తప్ప. మేనిఫెస్టో మీద, దాని హామీల మీద చర్చ జరగడం కూడా కూటమి సర్కార్ సహించడం లేదు. మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశామని వారు చెబుతున్నారు. అందరూ అదే చెప్పాలి. ఇందుకు భిన్నంగా ఎవరూ మాట్లాడకూడదు. పత్రికల్లో గానీ, టీవీల్లో గానీ, సోషల్ మీడియాలో గానీ ఇందుకు భిన్నమైన సమాచారం రాకూడదు. వస్తే రెడ్‌బుక్ నోరు తెరుస్తుంది. రెడ్‌బుక్ ఆదేశాలతో దాదాపు వెయ్యిమంది సోషల్ మీడియా కార్యకర్తల మీద కేసులు నమోదయ్యాయి. పలువురిని అరెస్టు చేశారు. పలు కుటుంబాలు ఇంకా వేధింపులకు గురవుతున్నాయి. 70 మంది పాత్రికేయులపై కేసులు పెట్టారు. పదిమందిపై దాడులు చేశారు. ప్రత్యర్థి రాజకీయపక్షంపై జరుగుతున్న దాడులను ఇక్కడ ప్రస్తావించడం లేదు. వారిపై జరుగుతున్న హత్యాకాండ జోలికెళ్లడం లేదు. వారి ఆస్తుల విధ్వంసం గురించి కూడా చెప్పడం లేదు. కేవలం పాత్రికేయులపై, సోషల్ మీడియా కార్యకర్తలపై జరుగుతున్న దమనకాండను గురించి మాత్రమే ఈ నివేదన. వారి కలాలకూ, గళాలకూ బిగిస్తున్న శృంఖలాలను గురించి మాత్రమే ఈ ఆవేదన.

నాలుగున్నర దశాబ్దాలు పాత్రికేయ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు ఈ భయానక పాలనకు ఒక స్పష్టమైన ఉదాహరణ. పత్రికా రంగంలో అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి కొమ్మినేని. రెండు పత్రికల్లో స్టేట్ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. ఢిల్లీ బ్యూరోకు నాయకత్వం వహించారు. ఒక పత్రికలో ఒకే సమయంలో సెంట్రల్ డెస్క్ ఇన్‌ఛార్జిగా నేను, స్టేట్ బ్యూరో చీఫ్‌గా కొమ్మినేని కలిసి పనిచేసిన అనుభవం ఉన్నది. ఈ అనుభవంతో చెప్పగలిగిన మాట ఒక్కటే. పాత్రికేయ వృత్తి పట్ల, ఆ వృత్తిలో పాటించవలసిన ప్రమాణాల పట్ల పూర్తిస్థాయి నిబద్ధత కలిగిన వ్యక్తి కొమ్మినేని శ్రీనివాసరావు. న్యూస్ ఛానెళ్ల పర్వం ప్రారంభమైన తర్వాత దాదాపు పద్దెనిమిదేళ్లుగా మూడు టీవీ చానెళ్లలో కేఎస్ఆర్ లైవ్ షో పేరుతో వర్తమాన రాజకీయాలపై చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. ఈ తరహా చర్చా కార్యక్రమాల్లో అత్యంత సంయమనం పాటిస్తూ హద్దుమీరకుండా, చర్చ పక్కదారి పట్టకుండా తన నియంత్రణలో నడిపించే వారిలో అగ్రగణ్యుడు కొమ్మినేని.

అమరావతి మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడాడని కొమ్మినేని మీద, వార్తా విశ్లేషకుడు కృష్ణంరాజు మీద పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు పెట్టారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సెక్షన్ కూడా ఒకటి. పెరుగుతున్న వేశ్యల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉన్నదనే ఒక నివేదికను కృష్ణంరాజు ప్రస్తావించారు. ఈ తరహా వార్తలు గతంలో యెల్లో మీడియాలో కూడా వచ్చినవే. ఈ ప్రస్తావన సందర్భంగా అమరావతిని ఉద్దేశించి కృష్ణంరాజు మాటల్లో దొర్లిన ఒక అనుచిత వ్యాఖ్యానాన్ని షో నిర్మాహకుడైన కొమ్మినేనికి కూడా ఆపాదించి ఒక వ్యూహం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మహిళల ప్రదర్శనలనూ, సాక్షి మీడియాపై దాడులనూ ప్రభుత్వం ఆర్గనైజ్ చేసింది. కొమ్మినేని, కృష్ణంరాజు, సాక్షి మీడియాలపై కేసులు నమోదు చేశారు. కొమ్మినేనిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినప్పుడు అట్రాసిటీ కేసుపై మేజిస్ట్రేట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధం లేని కేసులు పెట్టడంపై ఎస్పీకీ, డీఎస్పీకి మెమోలు కూడా ఇచ్చారు. ఆ సెక్షన్ తొలగించి రిమాండ్‌కు పంపారు.

సుప్రీంకోర్టులో కొమ్మినేనికి ఊరట లభించింది. తాను చేయని వ్యాఖ్యలకు యాంకర్‌ను ఎలా బాధ్యుల్ని చేస్తారని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ లాయర్లను ప్రశ్నించింది. ఈ కేసులో కూడా ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లోథ్రా వంటి భారీ మొత్తంలో ఫీజు వసూలు చేసే లాయర్లనే కూటమి ప్రభుత్వం మోహరించింది. కొమ్మినేనికి వెంటనే బెయిల్ లభిస్తే మిగతా పాత్రికేయుల్లో ప్రభుత్వం పట్ల భయం మిగలదనే సందేహం కావచ్చు. ఆ బెయిల్‌ను అడ్డుకునేందుకు భారీగానే ప్రజాధనాన్ని ఖర్చు చేసింది. విశ్లేషకుని వ్యాఖ్యానానికి కొమ్మినేని నవ్వాడు గనుక ఆయన కూడా శిక్షార్హుడేనని కూటమి లాయర్లు చేసిన వాదన సుప్రీంకోర్టులో నవ్వుల పాలైంది. కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

విఫల పాలనతో ప్రజామోదం కోల్పోతున్నప్పుడు అసంతృప్తిని చల్లార్చడానికి నియంత పాలకులు ఎక్కువగా నిర్బంధాన్నే నమ్ముకుంటారు. విమర్శకులు నవ్వినా, తుమ్మినా, దగ్గినా కూడా తిరుగుబాటు సంకేతంలాగానే వారికి కనిపించవచ్చు. నవ్వులే కాదు పువ్వులు కూడా వారిని భయపెడతాయి, వారి నీడలు కూడా వారిని భయపెడతాయి. ఈ భయం నుంచి బయట పడాలంటే వారి ముందున్న మార్గం ఒకటే. తాము ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ధైర్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంటించుకోవాలి. ఇదిగో ఇన్ని హామీలను అమలు చేశామని ఇంటింటికీ వెళ్లి వైసీపీలాగా ధైర్యంగా చెప్పగలగాలి. లేకుంటే రాబోయే మూడునాలుగేళ్లూ నిర్బంధ కాండనే నమ్ముకోవాల్సి వస్తుంది. నిర్బంధకాండలో ఎవరూ నిలబడలేరని చరిత్ర చెబుతున్నా పాలకులకు చెవికెక్కదు. ఎంతమందిని భయపెట్టాలనుకున్నా, ఎంతమందిని జైలుకు పంపినా, ఎంత హత్యాకాండ కొనసాగించినా రాబోయే మార్పును ఆపడం సాధ్యం కాదు. 'నువ్వు అన్ని పువ్వులనూ కోసి పారేయవచ్చు, కానీ వచ్చే వసంతాన్ని ఆపడం నీ తరం కాదు...' చిలీ దేశానికి చెందిన సుప్రసిద్ధ స్పానిష్ కవి పాబ్లో నెరూడా చెప్పిన నిత్య సత్యాన్ని గుర్తు చేసుకోవడం అవసరం. మందీ మార్బలంతో పత్రికా కార్యాలయంపై దండెత్తడం, అక్షరాన్ని దహనం చేసే ప్రయత్నం చేయడం ఎంత అవివేకమైన చర్యలో చరిత్ర తప్పక నిరూపిస్తుంది. టీవీలో ఓ యాంకర్ నవ్వు, ఇన్‌స్టాలో ఓ యువకుడి సెటైర్, వేదికపై ఓ గాయకుడి పాట, పొలంలో ఓ రైతన్న ఆగ్రహం... ఇలాంటివన్నీ తనకు నచ్చలేదని కేసులు పెడుతూపోతే జనానికి కొన్ని కామెడీ పాత్రలు గుర్తుకొస్తాయి. నవ్విపోదురు గాక నాకేటి... అనుకుంటే ఇంకేమీ ఉండదు మరి.

> విఫల పాలనతో ప్రజామోదం కోల్పోతున్నప్పుడు అసంతృప్తిని చల్లార్చడానికి నియంత పాలకులు ఎక్కువగా నిర్బంధాన్నే నమ్ముకుంటారు. విమర్శకులు నవ్వినా, తుమ్మినా, దగ్గినా కూడా తిరుగుబాటు సంకేతంలాగానే వారికి కనిపించవచ్చు. నవ్వులే కాదు పువ్వులు కూడా వారిని భయపెడతాయి. వారి నీడలు కూడా వారిని భయపెడతాయి. ఈ భయం నుంచి బయట పడాలంటే వారి ముందున్న మార్గం ఒకటే. తాము ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ధైర్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంటించుకోవాలి. ఇదిగో ఇన్ని హామీలను అమలు చేశామని ఇంటింటికీ వెళ్లి వైసీపీలాగా ధైర్యంగా చెప్పగలగాలి. లేకుంటే రాబోయే మూడునాలుగేళ్లూ నిర్బంధకాండనే నమ్ముకోవాల్సి వస్తుంది. ఎంతమందిని భయపెట్టాలనుకున్నా, ఎంతమందిని జైలుకు పంపినా, ఎంత హత్యాకాండ కొనసాగించినా రాబోయే మార్పును ఆపడం సాధ్యం కాదు. 'నువ్వు అన్ని పువ్వులనూ కోసి పారేయవచ్చు, కానీ వచ్చే వసంతాన్ని ఆపడం నీ తరం కాదు...' సుప్రసిద్ధ స్పానిష్ కవి పాబ్లో నెరూడా చెప్పిన నిత్య సత్యాన్ని గుర్తు చేసుకోవడం అవసరం.

vardhelli1959@gmail.com

శ్రీశ్రీ ఒక తీరని దాహం

సందర్భం



తాడి ప్రకాష్

జలజల పారే గంగా గోదావరీ అనే జీవనదులూ, మబ్బుల్ని తాకే హిమాలయ పర్వత శ్రేణులూ, పున్నమి వెన్నెల్లో తాజ్ మహల్ సౌందర్యమూ, బిస్మిల్లాఖాన్ షెహనాయి రాగాల లాలిత్యమూ... వీటి గురించి మళ్లీ మళ్లీ మాట్లాడుకున్నా బావుంటుంది.

కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ యేల ఏడ్చెదో...
బాల రసాలసాల నవపల్లవ కోమల కావ్య కన్యకున్...
మందార మకరంద మాధుర్యమును గ్రోలు...
వంటి తియ్యని తెలుగు కవిత్వాన్నీ,
సిరులు మించిన పసిడి బంగారు జిలుగు
దుప్పటి జారగా... అంటూ కవ్వించే జనార్దనాష్టకం పద్యాల నడకలోని తూగునీ ఎన్నిసార్లు పాడుకున్నా అదే చెక్కుచెదరని అందం. అంతే తన్మయత్వం!

మహాభారతం, 'కన్యాశుల్కం', 'అన్నా కరెనినా', 'ద బ్రదర్స్ కరమజోవ్', 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్', చలం 'ఓ పువ్వు పూసింది'– ఎలాగో 'మహాప్రస్థానమూ' అంతే.

ఒక సూపర్ క్లాసిక్. మరిచిపోలేని మాస్టర్ పీస్! అది తెలుగు సాహిత్యాన్ని యుద్ధరంగంలోకి నడిపించింది. తెలుగు కవిత్వాన్ని అజేయమైన శక్తిగా నిలిపింది. నీలాకాశంలోకి తెలుగు పతాకాన్ని ఎగరేసింది. విశ్వనాథ సత్యనారాయణ లాంటి పండితుడూ, సంప్రదాయవాదీ విస్తుపోయాడంటే, శ్రీశ్రీ ఎగరేసిన జెండాలా, సంస్కృత సమాసాలకు తల్ల కిందులై కాదు, అందులోని స్వచ్ఛమైన అచ్చమయిన కవిత్వాన్ని చూసి, అలా రాయడం మరొకరి వల్లకాదని తెలిసి! 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు? ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అది మోసిన బోయీలెవ్వరు?'– విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో ఆ నాలుగు లైన్లూ చదివి, దివాకర్ల వెంకటావధాని, రెండు మూడొందల ఏళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో ఇలా అన్నవాడెవడూ లేడని ఒక ఉద్వేగంతో చెప్పారు.

శ్రీశ్రీని పరుసవేది అన్నాడు జ్వాలాముఖి. మోడువారిన చెట్టు చిగురించి మళ్లీ జీవితంలోకి ప్రవేశించడం మనకి నేర్పుతుంది. శ్రీశ్రీ కవిత్వం చదివిన వాళ్ళందరి అనుభవమూ అదే. మనోవాక్కాయకర్మ శుద్ధి పరిపూర్ణంగా గలవాడికి మాత్రమే అలాంటి కవిత్వం సిద్ధిస్తుంది. సరస్వతీదేవి సాక్షాత్కరిస్తుంది.

మహాప్రస్థానానికి 75 ఏళ్లు అంటున్నారు. తొలిసారి 1950లో అచ్చయింది గనక ఇలా అనొచ్చు. హంగ్రీ థర్టీస్‌లోనే 1934–40 మధ్యనే శ్రీశ్రీ ఈ గీతాలు రాశారు. రాసి తొంభై సంవత్సరాలు అయింది. సెలబ్రేట్ చేసుకోడానికి ఒక అకేషన్ అని తప్పితే, జీవనది లాంటి ఆ కవిత్వం మన సంస్కృతిలో, అనుభూతిలో, మన రక్తంలో ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది. మహాప్రస్థానంలో మీకు ఏ కవిత ఇష్టం? కొంపెల్ల జనార్దనరావు కోసమా? ఎచటికి పోతావీ రాత్రి? దారిపక్క చెట్టుకింద కూర్చున్న ముసిల్దా? సంధ్యా సమస్యలా? శైశవ గీతా? గంటలా? కవితా ఓ కవితా? ఇలా మనం ఎన్ని పొయెమ్స్ అయినా చెప్పగలం. వాటిని అప్పచెప్పగలం కూడా! అయితే, తాను రాసిన వాటిల్లో శ్రీశ్రీకి బాగా నచ్చిన కవిత ఏదో తెలుసా? అది మహాప్రస్థానంలో లేదని కూడా తెలుసా? 'శరశ్చంద్రిక' నాకు యిష్టం అని ఒక సందర్భంలో చెప్పారు శ్రీశ్రీ. ఆ దీర్ఘ కవిత 'ఖడ్గసృష్టి'లో మొట్టమొదటిది! నవీన విశ్వవిద్యాలయాల్లో పురాణ కవిత్వంలాగా శ్రవణ యంత్రశాలల్లో శాస్త్రీయ సంగీతం లాగా ఇలా వచ్చావేం వెన్నెలా? అంటూ వెన్నెలలో మహాకవి సంభాషణ మొదలవుతుంది. సాదాసీదాగా, నిరలంకారంగా, ఊర్నే నువ్వూ నేనూ మాట్లాడుకున్నట్టే ఉంటుంది. శరశ్చంద్రిక చదవడం పూర్తి అయ్యేసరికి మనం ఒక వెన్నెల తుఫాన్‌లో చిక్కుకుపోతాం. సాక్షాత్తూ వెన్నెల సముద్రం మీద సంతకం చేస్తున్న దృశ్యం ఒక మహత్తరమైన పెయింటింగ్‌లా మనోఫలకం మీద నిలిచిపోతుంది.



◆ మహాప్రస్థానానికి 75 ఏళ్లు అంటున్నారు. తొలిసారి 1950లో అచ్చయింది గనక ఇలా అనొచ్చు. హంగ్రీ థర్టీస్‌లోనే, 1934–40 మధ్యనే శ్రీశ్రీ ఈ గీతాలు రాశారు. రాసి తొంభై సంవత్సరాలు అయింది. సెలబ్రేట్ చేసుకోడానికి ఒక అకేషన్ అని తప్పితే, జీవనది లాంటి ఆ కవిత్వం మన సంస్కృతిలో, అనుభూతిలో, మన రక్తంలో ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది.

ప్రలోభాలకూ, పద్మశ్రీలకూ తలవంచని తీరానికి చెందినవాడు. పురిపండా అప్పలస్వామి ఒరియా సాహిత్య చరిత్ర రాసిన తెలుగువాడు. చేతిరాతతో లండన్ మహాప్రస్థానం ఎందుకూ? అని శ్రీశ్రీ సందేహిస్తున్నప్పుడు, పురిపండా ఇలా అన్నారు: 'మహాప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం. నాకు తెలిసినంత మట్టుకు మరే భారతీయ భాషలోనూ 'కవితా ఓ కవితా' అంత గొప్పగీతం రాలేదు'. ఈ మాట ఒక జ్ఞానపీఠ్ అవార్డు కన్నా తక్కువదేమీ కాదు. మార్క్సిస్ట్ ఈస్థటిక్స్‌కి మహాప్రస్థానమే ఒక సజీవ ఉదాహరణ.

గదిలో ఎవరూ లేరు, గదినిండా నిశ్శబ్దం, సాయంత్రం ఆరున్నర, గదిలోపల చినుకుల వలె చీకట్లు... అని మొదలవుతుంది 'ఆకాశ దీపం', వట్టి వచనం. తొంభై సంవత్సరాల క్రితం ఇలా రాయడానికి ఎంత ధైర్యం శ్రీశ్రీకి? 'దీపం ఆరిపోయింది – తారగా మారిపోయింది' అని కవిత ముగిసేసరికి గుండె పేలిపోతుంది. అందుకే చలం 'బుద్ధున్నవాడెవడూ దీన్ని కవిత్వం అనడు' అన్నారు. ఈ కవి అప్పీల్ బుద్ధినీ, వివేకాన్నీ, కళానిబంధనల్నీ మించిన ఏ అంతరాళానికో తగుల్తుంది. ఆ అంతరాళం అనేది ఉన్నవాళ్ళకి అని చెప్పారు.

నిప్పులు చిమ్ముకుంటూ... అంటూ ఆరు లైన్ల పొట్టి కవిత రాసినా, కవితా ఓ కవితా అని ఆరేడు పేజీల దీర్ఘకవిత్వం రాసినా శ్రీశ్రీలో ఆవేశం, సముద్ర కెరటమై ఎగిసిపడుతుంది. లెనిన్, స్విన్‌బర్న్, సాల్వడార్ డాలీ, కొంపెల్ల జనార్దనరావు... ఇలా ఎవరి గురించి రాసినా పాఠకుణ్ణి నిద్రపోనివ్వని శ్రీశ్రీ ముద్ర మనందరి కలెక్టివ్ ఎక్స్‌పీరియన్స్! కనకదుర్గా చండ సింహం జూలు దులిపే ఆవులించింది – అనే శుద్ధవచనాన్ని నరాలు తెగే కవిత్వంగా మార్చే రహస్యం తెలిసినవాడు –అతనొక్కడే!

మహాప్రస్థానము, ఖడ్గసృష్టి మాత్రమే రాసి శ్రీశ్రీ చేతులు దులుపుకోలేదు. సిరిసిరిమువ్వలు, ప్రాసక్రీడలు, లిమరిక్కులు, గల్పికలు, అనువాదాలు, నాటికలు, కథలు, వీలునామా, సినిమా పాటలు, ఆత్మకథ 'అనంతం' – మరెన్నో రాశాడు. అద్భుతాలు చేశాడు. జీవితాంతమూ రాస్తూనే ఉన్నాడు. ఎంత రాశాడో అంతకు మించి చదువుకున్నాడు. శ్రీశ్రీ జ్ఞాని. రుషితుల్యుడు. కష్టజీవులందరికీ మిత్రుడు. తెలుగుజాతి వరపుత్రుడు. దేవరకొండ బాలగంగాధర తిలక్ అమృతం కురిపించినా, వెలుతురెక్కడ సోనియా అంటూ బైరాగి విలపించినా, చెట్లు కూలుతున్న దృశ్యాన్ని చూసి అజంతా కన్నీళ్లు పెట్టినా; జనంలో నడు, కాలాన్ని వెంటపెట్టుకు నడూ అని మఖ్దూమ్ మొహియుద్దీన్ పిలుపు ఇచ్చినా, సత్యమూర్తి చిరుగాలి సితారా సంగీతం వినిపించినా; ఎండ్లూరి సుధాకర్, మద్దూరి నగేష్‌బాబు వెలివాడల వేదనని కన్నీటి అక్షరాలుగా పరిచినా అది శ్రీశ్రీ తిరుగుబాటు వేదాంతానికి ఉత్తేజపూర్వకమైన కొనసాగింపు మాత్రమే.

గురజాడ వేంకట అప్పారావు పరిచిన వారసత్వపు వెలుతురు దారుల్లో శ్రీశ్రీ, ఎర్రకాంతుల ఇనోదయాన్ని డిస్కవర్ చేసి, నవ్య కవిత్వంతో నిండిన వేల పాలపుంతల్ని ప్రసాదిస్తే ఆ వెలుగు వెన్నెల జోడిలో ఆధునిక తెలుగు కవిత్వం మానవ జీవన మాధుర్య సౌందర్య తీరాలను తాకి పరవశిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, రచయిత । 97046 41559

పెద్దలను ఆదరిద్దాం!

ప్రతి సంవత్సరం జూన్ 15న జరుపుకొనే 'ప్రపంచ వృద్ధులపై వేధింపుల అవగాహన దినోత్సవం' ఓ సామాజిక, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం. యువతకు వయోవృద్ధులు మార్గదర్శకులు. అయితే చాలామంది వృద్ధుల పట్ల చులకన భావాన్ని ప్రదర్శించడం విచారకరం. 'నేటి యువకులే రేపటి వృద్ధులు' అనే విషయాన్ని వారు గ్రహించాలి. వృద్ధులను శారీరక, మానసిక వేధింపులకు కొందరు గురి చేస్తున్నారు. వారి డబ్బు లేదా ఆస్తిని దుర్వినియోగం చేస్తున్నారు. వారి అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం చూపడం సర్వసాధారణం అయ్యింది. లైంగిక వేధింపులకు పాల్పడటమూ కనిపిస్తోంది.



వృద్ధులకు దక్కాల్సిన హక్కులను వాళ్లకు కల్పించాలి. సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక, జనాభా మూలాల గురించి అవగాహన పెంచడం ద్వారా వృద్ధుల మెరుగైన జీవితాన్ని ప్రోత్సహించగలం. వృద్ధులపై వేధింపులకు సంబంధించిన విషయాలను బయట పెట్టడానికి వారికి అవగాహన కల్పించడం, వారికి సమాజంలో హాయిగా, సురక్షితంగా, గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉందని జ్ఞాపకం చేయడం వంటి కార్యక్రమాలను ఈ అవగాహనా దినోత్సవం రోజున చేపట్టడం జరుగుతుంది.

వృద్ధాప్యం అంటేనే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే దశ. వేధింపులు కూడా తోడైతే వృద్ధుల జీవితం దారుణంగా తయారవుతుంది. ప్రభుత్వాలు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి వృద్ధుల జీవించే హక్కును కొనసాగించే విధంగా; ఆర్థిక, ఆరోగ్య భద్రతను కల్పించే విధంగా కార్యక్రమాలను కొనసాగించాలి. వృద్ధులు ఉన్న కుటుంబం... ఆ కుటుంబంలోని చిన్నారులకు మొదటి పాఠశాల. తమ తల్లిదండ్రులు నానమ్మ, తాతయ్యల పట్ల చూపించే ప్రేమ, ఆదరణలను చూస్తూ పెరిగిన చిన్నారులు వారి తల్లిదండ్రూలకూ ఆ ఆదరణనే పంచుతారు. పెద్దవారిని గౌరవించడం మన సంస్కృతి అని గుర్తుంచుకోండి!

– డా॥ వై. సంజీవ కుమార్, సామాజిక కార్యకర్త (నేడు ప్రపంచ 'వృద్ధులపై వేధింపుల అవగాహన' దినోత్సవం)

ఆదాయం ఆశల పల్లకీలో..



దేశంలోని 74 శాతం గ్రామీణ కుటుంబాలు రాబోయే ఒక ఏడాదిలో తమ ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు 'నాబార్డ్' (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) తాజా సర్వే వెల్లడించింది. 2025 మే నెలలో జరిగిన ఆ సర్వే ప్రకారం - ఈ 74 శాతం అన్నది గత మార్చిలో 72 శాతంగా నమోదైంది. 2024 సెప్టెంబర్‌లో నాబార్డ్ ద్వైమాసిక 'రూరల్ ఎకనమిక్ కండిషన్స్ అండ్ సెంటిమెంట్స్ సర్వే (ఆర్.ఇ.సి.ఎస్.ఎస్.) ప్రారంభం అయినప్పటి నుంచి - రానున్న ఒక సంవత్సరంలో తమ ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్న వారి శాతంలో ఇదే అత్యధికం.

- సాక్షి, స్పెషల్ డెస్క్



పెరుగుతుందన్న ధీమాతో 74 శాతం గ్రామీణులు | పొదుపు మొత్తాలు తగ్గాయన్న 28.7 శాతం మంది | నాబార్డు ద్వైమాసిక సర్వేలో ఆసక్తికర అంశాలు

ఉపాధి లభ్యతపై సానుకూలత

వచ్చే త్రైమాసికంలో లభించనున్న ఉపాధి అవకాశాలపై అంచనాలు కూడా ఇదే తరహాలో ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో 53.5 శాతం కుటుంబాలు ఉపాధి పరిస్థితుల్లో మెరుగుదలను ఆశించగా, 2024 సెప్టెంబర్ తర్వాత ఇదే అత్యధిక ఆశావహ శాతం. కేవలం 8 శాతం మంది మాత్రమే తగ్గుదలను అంచనా వేశారు, ఫలితంగా నికర సానుకూలత 45.4కు చేరుకుందని నాబార్డ్ సర్వే వెల్లడించింది. 2025 జనవరిలో స్వల్పంగా తగ్గిన ఆశలు తిరిగి స్థిరంగా కోలుకున్నాయి. ఈ ఏడాది మే నెలలో కుటుంబ ఆదాయాలు స్వల్ప మెరుగుదలను చూపించాయి. సర్వేలో పాల్గొన్నవారిలో 37.4 శాతం మంది గత సంవత్సరంతో పోలిస్తే తమ ఆదాయంలో పెరుగుదల కనిపించినట్లు తెలిపారు. మార్చిలో ఇది 34.8 శాతంగా ఉంది. అయితే 21.4 శాతం మంది తమ ఆదాయం తగ్గిందని, 41.3 శాతం మంది 'ఏమో చెప్పలేం' అని సమాధానం ఇచ్చారు.

పొదుపు ఆలోచన కొంత తగ్గింది!

నాబార్డ్ సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో వినియోగ వ్యయాలు కూడా బలంగానే ఉన్నాయి. 79.1 శాతం కుటుంబాలు తమ ఖర్చు పెరిగినట్లు తెలిపాయి. ఇది మార్చి నెలతో పోలిస్తే (79.9 శాతం) స్వల్పంగా తగ్గినప్పటికీ , నికరంగా 74.6 వద్ద స్థిరంగా ఉంది. ఈ ధోరణి గ్రామీణ కుటుంబాలలోని నిరంతర విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే ఇందుకు భిన్నంగా, పొదుపు చేయాలన్న ఆలోచన తగ్గిపోయింది. కేవలం 18.8 శాతం కుటుంబాలు మాత్రమే తమ పొదుపు మొత్తాలు పెరిగినట్లు చెప్పగా, 28.7 శాతం కుటుంబాలు తగ్గాయని తెలిపాయి. ఫలితంగా 9.9 శాతం నికరమైన ప్రతికూలత కనిపించింది. మార్చి (-11.9) నుంచి ఇది స్వల్ప మెరుగుదలను సూచిస్తున్నప్పటికీ, సర్వేలో వరుసగా ఐదవ విడతలో సైతం పొదుపు బలహీనంగానే ఉంది.

నైరుతితో చిగురించిన ఆశలు

600 గ్రామాల్లో.. ప్రతి నమూనా గ్రామం నుంచి 10 కుటుంబాలను ఎంపిక చేసుకుని 6,000 మందితో నాబార్డ్ ఈ సర్వే నిర్వహించింది. ఈ ఏడాది మే నెలలో ఐదవ విడత సర్వే పూర్తయింది. సర్వే ఫలితాలను బట్టి గ్రామీణ ప్రాంతాలలో తమ ఆదాయంలో పెరుగుదలను ఆశించే వారి సంఖ్య పెరగటం మాత్రమే కాకుండా, తమ ఆదాయం క్షీణించవచ్చునని మునుపు అనుకున్న వారి సంఖ్య సర్వే మొదటి విడతలోని 7.3 నుంచి 6.7 శాతానికి తగ్గటం విశేషం. గ్రామీణ కుటుంబాలలో ఆదాయం వృద్ధి గురించి పెరుగుతున్న ఆశావాదం.. గత కొన్ని నెలలుగా గ్రామీణ రంగం పుంజుకుంటోందన్న సానుకూల ఆలోచనలకు అనుగుణంగా ఉంది. 2025లో 'సాధారణం కంటే ఎక్కువ'గా నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటుందన్న అంచనా గ్రామీణ రంగంలో సానుకూల మార్పునకు దోహదపడింది. ఆ సానుకూలత గ్రామీణ భారతదేశంలో వ్యవసాయ వృద్ధిని, కొనుగోలు శక్తిని పెంచుతుందన్న ఆశలు రేపింది.

పెరగనున్న వాస్తవ వేతనాలు



ఇటీవలి 'ఇండియా రేటింగ్స్' నివేదిక ప్రకారం కూడా అనుకూల రుతుపవనాల వ్యవసాయ వృద్ధి కారణంగా 2025–26 లో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరిగినవి) స్థిరంగా 6.5 శాతం నుంచి 7 శాతం వరకు వృద్ధి చెందుతాయని అంచనా. ఏదైనా ప్రతికూల వాతావరణ పరిస్థితులు, సంఘటనలు, రుతుపవనాల పురోగతిలో అంతరాయం, వాణిజ్యం లేదా భౌగోళిక రాజకీయ సమస్యలు సంభవిస్తే మాత్రం వాస్తవ వేతన వృద్ధి రేటు తగ్గవచ్చని కూడా నివేదిక సూచించింది. కాగా, నాబార్డ్ నివేదిక ప్రకారం.. ఆదాయం పెరుగుదలపై మే నెలలో స్వల్పంగా గ్రామీణ కుటుంబాల ఆశలు చిగురించాయి. 53.8 శాతం మంది మెరుగైన ఆదాయాలు వస్తాయని భావిస్తున్నారు. 2025 మార్చిలో ఈ ఆశ 52.5 శాతంగా మాత్రమే ఉంది.

ఆదాయం గురించి ఏమన్నారంటే.. (శాతాలలో)

సంవత్సరం	పెరుగుతుంది	తగ్గుతుంది	మార్పు లేదు
2024 సెప్టెంబర్	70.2	7.3	22.5
నవంబర్	71.3	7.8	20.9
2025 జనవరి	71.2	7.4	21.4
మార్చి	72.2	7.5	20.3
మే	73.6	6.7	19.7

సీఐఎస్ఎఫ్ అధీనంలోకి సాగర్ డ్యామ్!



నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు భద్రత సీఐఎస్ఎఫ్ (కేంద్ర పారిశ్రామిక రక్షణ దళం) అధీనంలోకి వెళ్లనున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. సాగర్ డ్యామ్ నిర్మాణ సమయం దగ్గర నుంచి నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోనే ఆర్మ్‌డ్ రిజర్వ్ సాయుధ దళం ఉండి భద్రతను చూసేది. 2004లో సాయుధ దళం నల్లగొండకు తరలి వెళ్లింది. అప్పటి నుంచి ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పీఎఫ్) పహారాలో నాగార్జునసాగర్ డ్యామ్ భద్రత కొనసాగుతోంది. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన సమయంలో కేంద్ర ప్రభుత్వం సాగర్‌డ్యామ్‌ను సీఐఎస్ఎఫ్ పహారాలోకి తీసుకుంటామని చెప్పింది. తర్వాత దీనిని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో ఎస్‌పీఎఫ్ పహారాలోనే సాగర్‌డ్యామ్ కొనసాగుతూ వచ్చింది. అయితే 2023 నవంబర్ 30న అర్ధరాత్రి అనూహ్యంగా ఏపీ వైపు నుంచి వచ్చిన సాయుధ పోలీసు బలగాలు ఆంధ్రప్రదేశ్ వైపున గల ప్రాజెక్టు భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సాగునీటి పారుదల శాఖల మధ్య వివాదం తలెత్తింది. రెండు రాష్ట్రాలు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశాయి. కేంద్ర హోం శాఖ జోక్యం చేసుకుని.. డ్యామ్‌పైకి సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపింది. ఈ క్రమంలో డ్యామ్‌పై ఎస్‌పీఎఫ్ బలగాలతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించాయి. రెండు నెలల క్రితం తెలంగాణ వైపున గల సీఆర్‌పీఎఫ్ బలగాలు పర్యవేక్షణను ఉపసంహరించుకున్నాయి. ఆంధ్రవైపున మాత్రం సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించే ఉన్నాయి. తెలంగాణ సాగునీటి శాఖ అధికారులు ఇటీవల కృష్ణాబోర్డు అధికారులతో జరిగిన సమావేశంలో డ్యామ్‌కు ఇరువైపులా సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉండాలని, లేదంటే ఇరువైపులా ఉపసంహరించుకోవాలనే విషయాన్ని లేవనెత్తారు. దీంతో జూన్ చివరలో ఏపీవైపు నుంచి కూడా సీఆర్‌పీఎఫ్ దళాలు విరమించుకుంటాయని ఏపీ సాగునీటి శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో డ్యామ్ భద్రత నిర్వహణను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించాలనే ఆలోచనలో బోర్డు అధికారులున్నట్లు సమాచారం.


ఉత్తర రింగు అంచనా వ్యయం 18,500 కోట్లు

- కేంద్రానికి కొత్త డీపీఆర్‌ను సమర్పించిన ఎన్‌హెచ్ఏఐ
- ఆరు వరుసల రోడ్డు, ఎనిమిది వరుసల వంతెనలతో డీపీఆర్
- 162 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.9,500 కోట్ల ఖర్చు
- పాత డీపీఆర్‌తో పోలిస్తే రూ.4,200 కోట్లు పెరిగిన అంచనా

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణానికి రూ.18,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈమేరకు కన్సల్టెన్సీ సంస్థ రూపొందించిన సవరించిన డీపీఆర్‌ను తాజాగా కేంద్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్ఏఐ అందజేసింది. ఉత్తర భాగాన్ని నాలుగు వరుసలకు బదులు ఒకేసారి ఆరు వరుసలుగా, దానిమీద నిర్మించే వంతెనలు, ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లను ఎనిమిది లేన్లుగా నిర్మించాలని ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, దీని నిర్మాణానికి కొత్త డీపీఆర్‌ను రూపొందించారు. నాలుగు వరుసలుగా నిర్మించాలని తొలుత నిర్ణయించిన సమయంలో రూపొందించిన డీపీఆర్ ప్రకారం నిర్మాణ వ్యయం రూ.14,300 కోట్లుగా తేలగా, ఇప్పుడు మరో రూ.4,200 కోట్లు పెరిగింది.

నిర్మాణ వ్యయం రూ.9,600 కోట్లు

ఉత్తర భాగం దాదాపు 162 కి.మీ. నిడివితో ఉండనుంది. దీని నిర్మాణానికి రూ.9,600 కోట్లు ఖర్చు అవుతుందని తాజా డీపీఆర్‌లో అంచనా వేశారు. మూడు నెలల క్రితం జరిగిన పీఎం గతిశక్తిలోని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూపు సమావేశంలో, రోడ్డు నాలుగు వరుసలుగా నిర్మిస్తే కేవలం ఐదారేళ్లలోనే ట్రాఫిక్ రద్దీ పెరిగి ఇరుకుగా మారే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమైంది. అందువల్ల కనీసం 15 ఏళ్లపాటు విస్తరించాల్సిన అవసరం లేకుండా ఉండాలంటే ఒకేసారి ఆరు వరుసలుగా నిర్మించాలని నిర్ణయించారు. రోడ్డు పొడవునా రెండు వైపులా సర్వీసు రోడ్లను కూడా నిర్మించాలని నిర్ణయించారు. ఉత్తర భాగంలో 11 చోట్ల భారీ ఇంటర్‌ఛేంజ్ లూప్ స్ట్రక్చర్లు, 3 భారీ వంతెనలు, 105 చిన్న వంతెనలు, 85 కల్వర్టులుంటాయి. ఈ వంతెనలన్నీ ఒకేసారి ఎనిమిది వరుసలుగా ఉంటాయి. ఫలితంగా రోడ్డు నిర్మాణానికి భారీగా ఖర్చు కానుంది. ఉత్తర భాగానికి 2 వేల హెక్టార్ల భూమి అవసరం. దీనికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. గ్రామాలవారీగా అవార్డులను పాస్ చేస్తున్నారు. త్వరలో నిర్వాసితులకు పరిహారాన్ని పంపిణీ చేయనున్నారు. డీపీఆర్‌లో ఈ భూసేకరణ పరిహారాన్ని రూ.5,500 కోట్లుగా చూపారు. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమంగా భరిస్తాయి. అలైన్‌మెంటు పరిధిలో ఉన్న భూమిలోని స్తంభాలు, పైపు లైన్లు లాంటి వాటిని తరలించేందుకు రూ.400 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు.



టెండర్ల ప్రక్రియలో జాప్యం..

నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. ఆ తర్వాత దీన్ని ఆరు వరుసలు, వంతెనలను ఎనిమిది వరుసలకు పెంచటంతో పాత టెండర్లనే సవరించి గడువు పొడిగిస్తారా, కొత్తగా మళ్లీ టెండర్లు పిలుస్తారా అన్నదానిలో స్పష్టత రాలేదు. ఓవైపు అవార్డులు పాస్ చేస్తూ, పరిహారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, టెండర్ల విషయంలో మాత్రం ఎటూ తేల్చకుండా జాప్యాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా కొత్త డీపీఆర్‌ను సమర్పించినందున దీని ఆధారంగా ఖర్చును సవరించి ఆ మేరకు టెండర్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ సంవత్సరాంతానికి ఉత్తర భాగం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు. కేంద్ర మంత్రి మండలిలోని ఆర్థిక వ్యవహారాలు చూసే కమిటీ దీనికి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. త్వరలో ఆ ప్రక్రియ జరుగుతుందని చెబుతున్నారు. ఆ వెంటనే టెండర్లను తెరిచి నిర్మాణ సంస్థను గుర్తిస్తారని పేర్కొంటున్నారు.

12,48,049 కేసుల పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- రూ.935 కోట్ల పరిహారం చెల్లింపులు
- అదాలత్‌లతో కోర్టుల సమయం ఆదా: ఏసీజే



కానిస్టేబుల్ కుటుంబానికి రూ.1.40 కోట్ల చెక్కును అందజేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఒకే రోజు 12,48,049 కేసులను పరిష్కరించారు. వీటిలో ప్రి–లిటిగేషన్ కేసులు 4,63,038, వివిధ కేటగిరీల్లోని పెండింగ్ కేసులు 7,85,011 ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.935 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 319 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. హైకోర్టులో 2, రుణ రికవరీ ట్రిబ్యునల్‌లో 2, జిల్లాల్లో 315 బెంచ్‌లను అందుబాటులో ఉంచారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, పాట్రన్ ఇన్ చీఫ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ మార్గదర్శకాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పర్యవేక్షించారు. ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్ సికింద్రాబాద్ సివిల్ కోర్టులో అదాలత్ సేవలను ప్రారంభించారు.

కమ్యూనిటీ మధ్యవర్తిత్వం మరింత పెరగాలి..

అనంతరం ఏసీజే మాట్లాడుతూ.. పార్టీలు ఇరువురూ విజయం సాధించేందుకు లోక్ అదాలత్ చక్కని వేదిక అని సూచించారు. కోర్టుల్లో ఓ పార్టీకి అనుకూలంగా తీర్పు వస్తే.. మరో పార్టీ ఆ తీర్పుపై ఉన్నత న్యాయస్థానాలకు అప్పీల్ చేయాలని భావిస్తుందన్నారు. ఈ లోక్ అదాలత్‌తో కోర్టుల విలువైన సమయం ఆదా అవుతుందని.. పార్టీల మధ్య సద్భావన, స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతినకుండా కాపాడుతుందని చెప్పారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వం మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కోర్టుకు వచ్చిన వివాహ సంబంధ కేసుల పరిష్కారం కష్టంగా మారుతోందని.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తేనే స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు. ఈ మేరకు కేసుల పరిష్కార వివరాలను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి సీహెచ్.పంచాక్షరి సాయంత్రం మీడియాకు విడుదల చేశారు. కామారెడ్డిలో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి అత్యధికంగా రూ.1.40 కోట్ల విలువైన పరిహారాన్ని బీమా సంస్థ నుంచి అందించినట్లు చెప్పారు.

ఇసుక దందాకు చెక్ పెడతా

- కార్మిక, గనుల శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి



చెన్నూర్‌లో మంత్రి వివేక్‌ను వెండి కిరీటంతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్/జైపూర్: రాష్ట్రంలో ఇసుక అక్రమ దందాకు చెక్ పెడతానని, రాయల్టీ ద్వారా ఇసుక రవాణా చేపడుతామని, తద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందని కార్మిక, గనుల శాఖమంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు చెన్నూర్, జైపూర్ తదితర మండలాల్లో శనివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో కొత్త గనులు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో మైహోం వంటి బడా కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చి పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లేకున్నా తెలంగాణలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు.

వెండి కిరీటంతో మంత్రికి ఘన సన్మానం

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిత హిమవంతరెడ్డి దంపతులు వెండికిరీటంతో ఘనంగా సన్మానించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సత్కరించారు.

చచ్చే వరకు ప్రజల్లో ఉంటా.. సేవ చేస్తా

- పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మహేశ్ కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి


సాక్షి, హైదరాబాద్: తాను చచ్చే వరకు ప్రజల్లో ఉండి.. వారికి సేవ చేస్తానని, తనకు వచ్చిన మంత్రి పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనకు మంత్రిగా అవకాశం ఇచ్చిన ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. తనకు మంత్రి పదవి రావడానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలందరు మద్దతు ఇచ్చారని, వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని, మక్తల్ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, బీసీ బిడ్డ శ్రీహరికి మంత్రి పదవి రావడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటుందని, అన్ని పదవులలో బీసీలకు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.



త్వరలోనే భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంపు!

కసరత్తు పూర్తిచేసిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

- తొలుత హెచ్ఎండీఏ పరిధిలోని భూములకు వర్తింపు
- కనీసం 20% నుంచి 100% వరకు వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువలు పెంపు
- సీఎం నిర్ణయమే తరువాయి..
- విలువలు పెంచినా స్టాంపు డ్యూటీ తగ్గించే యోచనలో ప్రభుత్వం?



(నోట్: ప్లాట్లు, ఇండ్లు చదరపు గజాల్లో, ఫ్లాట్‌లు చదరపు అడుగుల్లో.. విలువ పెంపు రూపాయల్లో)

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువలు త్వరలోనే పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తును పూర్తి చేసింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించిన నివేదికను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి.. సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారని, దానికి సీఎం ఆమోదం తెలిపిన వెంటనే పెరిగిన భూముల విలువలు అమల్లోకి వస్తాయని తెలుస్తోంది. అయితే, ముందుగా హెచ్ఎండీఏ పరిధిలోని భూములకు మాత్రమే ఈ విలువల సవరణ వర్తింపజేస్తారని, కొన్ని రోజుల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పెంచుతారని తెలుస్తోంది. కాగా, భూముల రిజిస్ట్రేషన్ విలువలు భారీగా పెరిగినా, ప్రజలపై ఎక్కువ భారం పడకుండా అర శాతం మేర స్టాంపు డ్యూటీ తగ్గించే అవకాశాలున్నాయని సమాచారం.

ఏడాది క్రితమే..

వాస్తవానికి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూన్‌లో భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధి వర్తించే విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి.. సబ్‌రిజిస్ట్రార్ల ద్వారా సవరణ ప్రతిపాదనలను తెప్పించారు. 2024, జూన్ 29 నాటికి సవరించిన విలువలను ప్రభుత్వానికి పంపి ఆమోదం అనంతరం ప్రజాభిప్రాయం సేకరించి 2024, ఆగస్టు1 నుంచి సవరించిన రిజిస్ట్రేషన్ విలువలను అందుబాటులోకి తేవాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సబ్‌రిజిస్ట్రార్ల స్థాయిలో కసరత్తు జరిగిన అనంతరం ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన పెట్టింది. రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో భూముల విలువలు పెంచితే మరింత వ్యతిరేక ప్రభావం చూపుతుందని, తద్వారా మార్కెట్ నష్టపోతుందనే ఆలోచనతో అప్పట్లో ఆ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకుంది. ఆ తర్వాత థర్డ్ పార్టీ చేత విలువల సవరణ ప్రక్రియను చేపట్టింది. థర్డ్ పార్టీ కూడా నివేదిక ఇచ్చింది. అయినా, ఎప్పటికప్పుడు భూముల విలువల సవరణ అంశం వాయిదా పడుతూనే వచ్చింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మళ్లీ కసరత్తు ప్రారంభించింది.

గత నెలలో మళ్లీ షెడ్యూల్..

భూముల విలువల సవరణ కోసం ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం మరో జీవో విడుదల చేసింది. విలువలను సవరించేందుకు వీలుగా మళ్లీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తూ, జీవో నం. 41ని విడుదల చేసింది. సవరణ ప్రతిపాదనలను పంపేందుకు మళ్లీ ప్రత్యేక ఫార్మాట్లను క్షేత్రస్థాయికి పంపింది. ఆ తర్వాత ఎప్పుడు ఏం చేయాలనే టైంటేబుల్‌ను కూడా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ విడుదల చేసింది. ఈ టైంటేబుల్ ప్రకారం వివిధ అధికారుల స్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయని, వీటిని ఉన్నతాధికార వర్గాలు పరిశీలించాయని, అనంతరం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆమోదం తెలిపారని, ఇప్పుడు బంతి సీఎం రేవంత్ కోర్టులో ఉందని సమాచారం.

తక్కువ ఉన్న చోట్ల ఎక్కువగా

విశ్వసనీయ సమాచారం ప్రకారం భూముల విలువలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ విలువలు సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయ భూముల ఎకరం కనీస విలువ రూ.4 లక్షలుగా నిర్ధారించాలని, 3 కేటగిరీల్లో ఈ విలువలను సవరించి, హైవేల పక్కన ఉండే వ్యవసాయ భూములకు రూ.40–50 లక్షల వరకు పెంచాలనే ప్రతిపాదనలు సీఎం వద్దకు చేరినట్టు సమాచారం. వ్యవసాయేతర భూములు, ఆస్తుల విషయంలోనూ కొంత మేర దూకుడు పెంచాలని, కనీసం 20 నుంచి 100 శాతం వరకు ఈ విలువలు సవరించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం రియల్ ఎస్టేట్ సంస్థల బ్రోచర్లు, ప్రకటనలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ, మున్సిపల్ వర్గాల ద్వారా కూడా సమాచారం సేకరించారు. ఈ మేరకు పట్టణ ప్రాంతాల్లో ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్ల విలువలను నిర్ధారించనున్నట్టు తెలుస్తోంది.

దాడులు... ప్రతిదాడులు

టెల్‌అవీవ్‌పై విరుచుకుపడిన ఇరాన్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల వర్షం

- మరో ఇద్దరు ఇరాన్ కీలక అధికారులు మృతి
- ఇరాన్ మిలటరీ కొత్త చీఫ్‌గా అమీర్ నియామకం
- బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రాం కొత్త చీఫ్‌గా మౌసావి
- మళ్లీ దాడిచేస్తే టెహ్రాన్‌ను అగ్నికి ఆహుతిచేస్తాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక

టెహ్రాన్/జెరూసలేం/దుబాయి/వాషింగ్టన్: తొలిదెబ్బతోనే పలువురు ఇరాన్ సైనిక సారథులు, అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, అణు శాస్త్రవేత్తలు, సైనిక ముఖ్యులను సమాధిచేసిన ఇజ్రాయెల్ శనివారం మరోసారి ప్రళయ భీకరంగా విరుచుకుపడింది. శనివారంనాటి దాడిలో మరో ఇద్దరు ఇరాన్ కీలక అధికారులు ప్రాణాలుకోల్పోయారు. సైనిక జనరల్ స్టాఫ్‌లో డెప్యూటీ ఇంటెలిజెన్స్ అధికారి అయిన జనరల్ గోలామ్‌రెజా మెహ్రాబీ, ఆపరేషన్స్ విభాగ డెప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీలు మరణించిన విషయాన్ని ఇరాన్ సైతం ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ నుంచి దూసుకొచ్చిన క్షిపణులు ఇరాన్‌లోని పలు జనావాసాలపై పడ్డాయి. అయితే ఎంతమంది చనిపోయారనే వివరాలు తెలియరాలేదు. టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పైనా క్షిపణులు పడ్డాయి. ఆగ్నేయ ఇరాన్ 'ఖుజెస్తాన్'ప్రావిన్సులోని అబదాన్ నగరంపై, మిలటరీ స్థావరం సమీపంలోని కెర్మాన్‌షా ప్రాంతంలోనూ ఇజ్రాయెల్ దాడులుచేసింది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసంకావడంతో ఇప్పుడు ఆ దేశ గగనతలం గాల్లో దీపంగా తయారైందని, ఇష్టమొచ్చినట్లు మేం దాడిచేయగలమని ఇజ్రాయెల్ రక్షణశాఖ అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీడెఫ్రిన్ ప్రకటించారు. 70 ఫైటర్‌జెట్లతో శత్రు గగనతల రక్షణ వ్యవస్థను భస్మీపటలం చేశామని పేర్కొన్నారు.

రేడియో ధార్మికత సాధారణమే

సైన్యాధికారులను కోల్పోయి సైనికంగా, స్థావరాలను కోల్పోయి ఆయుధపరంగా, శాస్త్రవేత్తలను కోల్పోయి విజ్ఞానపరంగా ఎంతో నష్టాన్ని చవిచూసిన ఇరాన్ వెంటనే ప్రతికార దాడులకు దిగింది. శనివారం ఉదయం సైతం మరోసారి వందలకొద్దీ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌రాజధాని టెల్ అవీవ్ సిటీమీదకు ఎక్కుపెట్టింది. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ క్షిపణ విధ్వంసక వ్యవస్థ సమర్థవంతంగా వాటిని గాల్లోనే పేల్చేసింది. దీంతో ఆకాశంలో భారీ విస్ఫోటనాలు, మెరుపులు చూసి, భారీ శబ్దాలు విని ఇజ్రాయెల్‌వాసులు భయకంపితులయ్యారు. అయితే భారీఎత్తున ఒకేసారి క్షిపణులు దూసుకురావడంతో కొన్ని ఐరన్‌డోమ్ వ్యవస్థను దాటుకొని మరీ లక్ష్యాలను ఢీకొట్టాయి. దీంతో రిషాన్ లీజియన్ నగరంలో ఇద్దరు, టెల్‌అవీవ్‌లోని రమాత్ గాన్ ప్రాంతంలో ఒక మహిళ చనిపోయారు. డజన్ల మంది గాయపడ్డారు. సంబంధిత వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దాడులనేపథ్యంలో టెల్ అవీవ్ సమీప బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ మూసేసింది. మృతసముద్ర తీర ప్రాంతంలో చాలా డ్రోన్లను కూల్చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ అణు కేంద్రంపై శుక్రవారం పలుమార్లు దాడులుజరిగాయని, రేడియోధార్మికత స్థాయిలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ శనివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేసింది.

ఇరాన్ ఆర్మీ చీఫ్‌గా అమీర్ హతామి

ఇరాన్ నూతన ఆర్మీ చీఫ్‌గా అమీర్ హతామి నియమితులయ్యారు. ఇరాన్ సుప్రీం కమాండర్ అయతొల్లా అలీ ఖమేనీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇకపై హతామి ఇరాన్ సైన్యానికి చీఫ్ కమాండర్‌గా వ్యవహరిస్తారు. హతామి 2013 నుంచి 2021 వరకు ఇరాన్ రక్షణ మంత్రిగా పనిచేశారు. ఇరాన్ సైనిక వ్యవస్థతో బలమైన సంబంధాలున్న హతామికి మూడు దశాబ్దాలకు పైగా వ్యూహాత్మక, కార్యాచరణ అనుభవం ఉంది. మరోవైపు బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రాం నూతన చీఫ్‌గా జనరల్ మజీద్ మౌసావితో ఖమేనీ శనివారం భర్తీచేశారు. ప్రస్తుత చీఫ్ అమీర్ అలీ హజిజాదే శుక్రవారంనాటి దాడుల్లో చనిపోవడం తెల్సిందే.



ఇరాన్ క్షిపణి దాడితో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో సంభవించిన భారీ పేలుడు



ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు ఇంటర్‌సెప్టర్ మిసైల్స్ ప్రయోగిస్తున్న ఐరన్‌డోమ్

యుద్ధాన్ని ఆపాలన్న ప్రపంచదేశాలు

ఇప్పటికే హమాస్, ఇజ్రాయెల్ యుద్ధంతో పశ్చిమాసియాలో అస్థిరత రాజ్యమేలుతుండగా కొత్తగా ఇరాన్‌తోనూ ఇజ్రాయెల్ సమరానికి సై అనడాన్ని ప్రపంచదేశాలు తప్పుబట్టాయి. ఉద్రిక్త పరిస్థితులను తగ్గించుకోవాలని కోరాయి. శాంతిస్థాపన దిశగా చర్చలు జరపాలని శనివారం వాటికన్ సిటీలో సెయింట్ పీటర్స్ బాసిలికాలో నూతన పోప్ లియో–14 సందేశం ఇచ్చారు. ఇతర ఉనికి మరొకరు ప్రశ్నించకూడదని, బెదిరించకూడదని అన్నారు. ''ఇరాన్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్ బాంబులేస్తే, టెల్‌అవీవ్‌పై ఇరాన్ క్షిపణులను పడేసింది. పెరిగిన ఉద్రిక్తతలను చాలించండి. ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయమిది. శాంతి, దౌత్యమార్గాల్లో నడవండి''అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శనివారం పిలుపునిచ్చారు.

రహస్యంగా డ్రోన్లు తరలించి..

రష్యాలోకి ఉక్రెయిన్ రహస్యంగా డ్రోన్లను తరలించినట్లే ఇజ్రాయెల్ సైతం ఇరాన్‌లోకి రహస్యంగా డ్రోన్లను తరలించి గగనతల రక్షణ వ్యవస్థల వద్దకు చేర్చింది. అదనుచూసి ఎస్–300 యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ లాంఛర్లను, రాడార్ వ్యవస్థలను డ్రోన్లతో పేల్చేసింది. రాడార్లులేకపోవడంతో సులభంగా ఇజ్రాయెల్ ఫైటర్‌జెట్లు ఇరాన్ ప్రధానభూభాగందాకా వచ్చి భీకరస్థాయిలో బాంబులు జారవిడిచి వినాశనం సృష్టించాయి. అర్ధరాత్రి దాడి తాలూకు వీడియో ఫుటేజీని ఇజ్రాయెల్‌నిఘా విభాగం మొస్సాద్ శనివారం విడుదలచేసింది. ఇలాంటి వీడియోలను మొస్సాద్ విడుదలచేయడం అత్యంత అరుదు. విమానాలను కూల్చేసే లాంఛర్లపై ఇజ్రాయెల్ ఆత్మాహుతి డ్రోన్లు ల్యాండ్ అయి పేలిపోవడం ఆ దృశ్యాల్లో కనిపించింది. ''మావైపుగా క్షిపణులు ప్రయోగించడం మానకుంటే టెహ్రాన్‌ను అగ్నికి ఆహుతిచేస్తాం. మరుభూమిగా మార్చేస్తాం. మా పౌరులకు హాని తలపెడితే మిమ్మల్ని మసిచేస్తాం. టెహ్రాన్‌పై మరోదఫా దాడులకు మా యుద్ధవిమానాలు సదా సిద్ధంగా ఉన్నాయి''అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి 'ఇజ్రాయెల్ కట్జ్'అన్నారు. ఈయన పేరులో దేశంపేరూ ఉండటం విశేషం. ''ముప్పును సమూలంగా తొలగించేదాకా దాడులు ఆపబోం. దాడులు రోజులతరబడి కొనసాగొచ్చు''అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అన్నారు.

ఇరాన్ 'అణు'కల చెదిరింది

యురేనియంను అత్యంత శుద్ధిచేసి అణుబాంబును తయారుచేయాలన్న ఇరాన్ కల చెదిరిపోయిందని ఇజ్రాయెల్ ప్రకటించింది. అణు కేంద్రం ధ్వంసంకావడం, అందులో కీలక వ్యవస్థలు కూలిపోవడంతోపాటు అత్యంత కీలకమైన 9 మంది అణుశాస్త్రవేత్తలు చనిపోయిన నేపథ్యంలో ఇరాన్ ఇప్పట్లో అణుబాంబును తయారుచేయడం అసాధ్యమని విశ్లేషణలు వెలువడుతున్నాయి. అణువిద్యుత్ కేంద్రానికి సరిపడా యురేనియంను శుద్ధిచేసేందుకు ఇరాన్‌కు అనుమతి ఉండగా అదనపు యురేనియంను శుద్ధిచేస్తోందని చాన్నాళ్ల నుంచి ఆరోపణలురావడం తెల్సిందే. శుక్రవారంనాటి దాడుల్లో అణువిద్యుత్‌కేంద్రం బ్యాకప్ ఇంధన శక్తివ్యవస్థను ఇజ్రాయెల్ నాశనంచేసింది. దీంతో కరెంట్ కష్టాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.

అణు చర్చలు అర్ధరహితం

అమెరికా ఓవైపు మాపై యుద్ధానికి ఇజ్రాయెల్‌ను ఎగదోస్తూ మరోవైపు చర్చలకు సిద్ధపడటం అర్ధరహితమని అగ్రరాజ్యంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అణుచర్చల కోసం ఇప్పటికే ఇరుదేశాల మధ్య ఐదుసార్లు చర్చలు జరగ్గా ఆరోసారి ఆదివారం ఒమన్‌లో జరగనున్నాయి. ఇజ్రాయెల్‌ను మాతో యుద్ధానికి దించి అమెరికా మరోదఫా చర్చలకు అర్థంలేకుండాచేసిందని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయిల్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే పశ్చిమాసియాలోని మీ స్థావరాలపై దాడులుచేస్తామని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లను ఇరాన్ హెచ్చరించింది. దీంతో ఆదివారం జరగబోయే చర్చలపై సందిగ్ధత నెలకొంది. మరోవైపు, ఇజ్రాయెల్ వైపుగా వెళ్తున్న కొన్ని ఇరాన్ క్షిపణులను తాము ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలతో కూల్చేశామని అమెరికా అధికారి ఒకరు వెల్లడించడం గమనార్హం.

కశ్మీర్ 'పోస్ట్'పై ఇజ్రాయెల్ క్షమాపణలు

టెహ్రాన్‌పై వైమానిక దాడులు చేశామంటూ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్) శుక్రవారం తమ 'ఎక్స్'ఖాతాలో పెట్టిన ఒక పోస్ట్ భారత్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ''ఇరాన్ అనేది ప్రపంచం మొత్తానికి పెనుముప్పుగా మారింది. ఇది ఇజ్రాయెల్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోలేదు. త్వరలో అన్ని దేశాలతోనూ ఇది ఇలాగే వ్యవహరిస్తుంది. అందుకే దాడులు చేయడం మినహా మాకు మరోదారి కనిపించలేదు''అని ఐడీఎఫ్ శుక్రవారం ఒక మ్యాప్‌ను పోస్ట్‌పెట్టింది. అయితే ఈ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్‌ను పాకిస్తాన్‌లో భాగంగా చూపించింది. దీంతో నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంటనే తప్పు తెల్సుకున్న ఇజ్రాయెల్ శనివారం క్షమాపణలు చెప్పింది. ''ఈ ప్రాంత భూభాగాన్ని చూపుతూ ఊహాత్మకంగా గీసిన మ్యాప్ అది. సరిహద్దులను కచ్చితంగా సూచించడంలో ఈ మ్యాప్ విఫలమైంది. మ్యాప్ కారణంగా మేం ఏదైనా నేరానికి పాల్పడినట్లు భారత్ భావిస్తే సారీ'అని ఐడీఎఫ్ శనివారం ఒ పోస్ట్ పెట్టింది.

సోదాలు, అరెస్టులకు తాత్కాలిక విరామం

- వలసదారులపై వైఖరి మార్చుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లలో సోదాలు నిలిపివేయండి
- ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఆదేశాలు

వాషింగ్టన్: అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరి మార్చుకున్నారు. వలసదారులందరినీ ఇప్పటికిప్పుడు ఉన్నపళంగా బయటకు తరిమేస్తే తలెత్తే ఇబ్బందులిటో అనుభవంలోకి వస్తున్నాయి. కార్మిక శక్తి ఒక్కసారిగా తగ్గిపోతే పరిశ్రమలు నష్టాల్లోకి జారుకొనే ప్రమాదం పొంచి ఉంది. అందుకే సోదాలు, అరెస్టులు తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. వ్యవసాయ క్షేత్రాలు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లలో సోదాలు నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ)కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మాంసం ప్యాకింగ్ ప్లాంట్లతోపాటు చేపల పెంపకం కేంద్రాల్లోనూ సోదాలు నిలిపివేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు గురువారం రాత్రి ఐసీఈ అధికారులకు అధికారికంగా ఈ–మెయిల్ పంపించినట్లు సమాచారం. ముగ్గురు ప్రభుత్వ అధికారులు ఈ విషయం ధ్రువీకరించారు. వ్యవసాయ సంబంధిత పరిశ్రమలు, హోటళ్లు, రెస్టారెంట్లలో మానవ అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం వస్తే సోదాలు కొనసాగించవచ్చని, అరెస్టులు చేయొచ్చని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

సుప్రీంకోర్టు పనివేళల్లో మార్పు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు పనివేళల్లో మార్పుచేర్పులు చోటుచేసుకున్నాయి. కోర్టు కార్యాలయాలు ఇకపై సాధారణ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయి. 4:30 గంటల తర్వాత అత్యవసరమైన పనులు మాత్రమే స్వీకరిస్తారు. శనివారాలు మధ్యాహ్నం 1 గంట వరకు కార్యాలయాలు తెరిచి ఉంటాయి. మధ్యాహ్నం 12 తర్వాత అత్యవసరమైన ఫైలింగ్స్ మాత్రమే అనుమతిస్తారని సుప్రీంకోర్టు అధికారిక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఆర్టికల్ 145 కింద సంక్రమించిన విశేషాధికారాలతో సుప్రీంకోర్టు నిబంధనలు(2013) ఆర్డర్ 2లో 1 నుంచి 3 నిబంధనలకు ఈ మేరకు సవరణలు చేసినట్లు పేర్కొంది. ఇవి జూలై 14 నుంచి అమల్లోకి వస్తాయి.

నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన
మధ్యప్రదేశ్‌లో 'ఇల్లే తాజ్‌మహల్'!
ఎయిరిండియా విమాన ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు
ఆ సీటే ఇప్పుడు హాట్ కేకు
ఈ–పేపర్ జాతీయం పేజీలో...

274కు పెరిగిన మృతుల సంఖ్య

మెడికల్ కాలేజీలో 33 మంది దుర్మరణం

- వారిలో ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు
- మరొకరు 14 ఏళ్ల స్థానిక బాలుడు
- మిగతా మృతుల వివరాలపై అస్పష్టత

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 274కు పెరిగింది. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో విమానంలోని 242 మందిలో ఒక్కరు మినహా అంతా దుర్మరణం పాలవడం తెలిసిందే. విమానం రన్‌వే సమీపంలోని బీజే మెడికల్ కాలేజీ క్యాంటీన్, బాయ్స్ హాస్టల్ భవనాలపై పడి పేలిపోవడమే గాక మరో రెండు పరిసర భవనాలకు కూడా నిప్పంటుకుంది. దాంతో వాటిలో ఉన్నవారిలోనూ చాలామంది చనిపోయారు. వారి సంఖ్య 33గా శనివారం తేలింది. ఇదే తుది సంఖ్యా, లేక మృతుల సంఖ్య మరింత పెరుగుతుందా అన్నది చూడాల్సి ఉంది. ఎందుకంటే ప్రమాద సమయంలో మెస్, హాస్టల్ భవనాల్లో కనీసం 40 మందికి పైగా వైద్య విద్యార్థులున్నట్టు కాలేజీ వర్గాలు శనివారం తెలిపాయి. వారికి తోడు పలువురు స్థానికులు కూడా ఉన్నట్టు వెల్లడించాయి. అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రికి ఇప్పటిదాకా 270 మృతదేహాలు వచ్చినట్టు బీజే మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ధవల్ గమేతీ తెలిపారు. మృతుల్లో ఐదుగురు ఎంబీబీఎస్ విద్యార్థులని గురువారమే తేలడం తెలిసిందే. అక్కడ టీ స్టాల్ నడిపే కుటుంబానికి చెందిన ఆకాశ్ పాట్నీ అనే 14 ఏళ్ల బాలుడు కూడా చనిపోయినట్టు తాజాగా ధ్రువీకరణ అయింది. మిగతా 27 మందిలో వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇతరులు ఎంతమంది అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రమాదంలో నాలుగు భవనాలు బాగా దెబ్బతిన్నట్టు కాలేజీ డీన్ మీనాక్షీ పారిఖ్ వెల్లడించారు. ''దర్యాప్తు నిమిత్తం బాయ్స్ హాస్టల్ భవనాలను ఖాళీ చేయిస్తున్నాం. ఇప్పటికే 200 మంది విద్యార్థులకు పైగా ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న, జరగబోయే ఎంబీబీఎస్ ఇంటర్నల్ పరీక్షలను వాయిదా వేస్తున్నాం''అని ప్రకటించారు. హాస్టల్ భవనంపై చిక్కిన విమానం తోక భాగం నుంచి శనివారం ఉదయం ఒక మృతదేహాన్ని వెలికితీశారు. అది ఎయిర్‌హోస్టెస్‌దిగా తేల్చారు.

కొనసాగుతున్న డీఎన్ఏ పరీక్షలు

ప్రమాదంలో మృతదేహాలు పూర్తిగా కాలిపోయిపోవడం తెలిసిందే. గుర్తుపట్టే స్థితిలో ఉన్న 8 మృతదేహాలను ఇప్పటికే కుటుంబీకులకు అప్పగించారు. మిగతా వాటికి డీఎన్ఏ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారానికి 11 మృతదేహాలను గుర్తించారు. మృతుల కుటుంబాలకు సాంత్వన కలిగించేందుకు కౌన్సెలర్లను అందుబాటులో ఉంచారు. మరణించిన విమాన ప్రయాణికుల కుటుంబాలకు టాటా గ్రూప్ రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించడం తెలిసిందే.

బోయింగ్ విమానాల్లో భద్రతా తనిఖీలు

ప్రమాదం నేపథ్యంలో డీజీసీఏ ఆదేశాల మేరకు 26 బోయింగ్ 787–8, ఏడు 787–9 సిరీస్ విమానాలను భద్రతాపరంగా క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది. ఇప్పటిదాకా 9 విమానాల్లో తనిఖీలు పూర్తయినట్టు వెల్లడించింది. తనిఖీల కారణంగా పలు ఎయిరిండియా విమానాల రాకపోకలు ఆలస్యమవుతాయని తెలిపింది. ప్రమాదానికి గురైన బోయింగ్ 787–8 విమానానికి వచ్చే డిసెంబర్‌లో సమగ్ర తనిఖీలు జరగాల్సి ఉంది. దాన్ని చివరిసారిగా 2023 జూన్‌లో క్షుణ్నంగా తనిఖీ చేశారు. కుడివైపు ఇంజన్‌ను గత మార్చిలో ఓవరాలింగ్ చేశారు.

వీడియో తీసిన టీనేజర్‌ను విచారించిన పోలీసులు

ఎయిరిండియా విమాన ప్రమాద వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరల్ కావడం తెలిసిందే. ఆర్యన్ 17 ఏళ్ల బాలుడు తన మొబైల్‌తో ఆ వీడియో తీశాడు. దర్యాప్తులో భాగంగా సాక్షిగా అహ్మదాబాద్ క్రైం బ్రాంచ్ పోలీసులు అతని స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకున్నారు. తాను వీడియో రికార్డు చేయడం మొదలు పెట్టిన 24 సెకన్లలోనే విమానం కూలినట్టు ఆర్యన్ మీడియాకు తెలిపాడు. ''కళ్లముందే జరిగిన ప్రమాదంతో విపరీతంగా భయపడిపోయా. చాలాసేపటిదాకా కనీసం సరిగా మాట్లాడలేకపోయా. వీడియోను మొదట నా సోదరికి చూపించా. తర్వాత మా నాన్నకు చెప్పా. కళ్లు మూసినా, తెరిచినా విమాన ప్రమాదమే గుర్తుకొస్తోంది. మేముండే ఈ ప్రాంతం ప్రమాదకరమైనదిగా కనిపిస్తోంది. ఇక్కడ ఉండాలని లేదు''అని చెప్పుకొచ్చాడు. ఆర్యన్ ఆ రోజంతా ఏమీ తినలేదని, రాత్రంతా నిద్ర కూడా పోలేకపోయాడని అతని తల్లి చెప్పింది.



విమాన భాగాలను తొలగిస్తున్న క్రేన్

రెండుసార్లు వాయిదా వేసుకుని.. రూపానీ మృత్యుప్రయాణం!

విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ వాస్తవానికి మే 19నే లండన్ వెళ్లాల్సింది. అసెంబ్లీ ఉప ఎన్నిక పనుల కారణంగా టికెట్ రద్దు చేసుకుని ప్రయాణాన్ని జూన్ 5కు వాయిదా వేసుకున్నారు. తర్వాత అదీ రద్దు చేసుకుని జూన్ 12న ప్రమాదం బారిన పడిన ఏఐ171లోనే టికెట్ బుక్ చేసుకున్నారు. అలా విధి ఆయనను మృత్యుముఖానికి నడిపించింది. 2డి నంబర్ సీట్‌లో కూచున్న ఆయన ప్రమాదం అనంతరం చెలరేగిన మంటల్లో చిక్కి మరణించారు.

విమానం కిందికి పడిపోతోంది

పైలట్ చివరి మాటలు

అహ్మదాబాద్: ''విమానం పైకి ఎగరడం లేదు. కిందికి పడిపోతోంది. ఇప్పుడు కమ్యూనికేషన్ లైన్ బలహీనంగా ఉంది. మేడే''... అహ్మదాబాద్ ప్రమాదానికి గురైన విమానంలోని ఎయిర్ ఇండియా పైలట్ చివరి మాటలివీ. విమానం కూలిపోవడానికి కొన్ని క్షణాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కు పైలట్ చివరి సందేశం చేరవేశాడు. ఏదో పెద్ద ప్రమాదమే జరగబోతోందని ఈ సందేశాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చని నిపుణులు అంటున్నారు. గురువారం మధ్యాహ్నం 1.37 గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన ఏఐ171 విమానం కొన్ని క్షణాల వ్యవధిలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే.

'171' నంబర్‌కు బైబై

నెంబర్లు మార్చేసిన ఎయిర్ ఇండియా

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో 'ఏఐ171'అనే నంబర్ కలిగిన బోయింగ్ 787–8 విమానం కూలిపోవడం, 270 మంది మరణించడంతో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. తమ విమానాలకు ఏఐ171, ఐఎక్స్171 పేర్లను తొలగించాయి. అహ్మదాబాద్–లండన్ మధ్య నడిచే విమానాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి 'ఏఐ159'అనే కొత్త నంబర్‌తో పిలువనున్నట్లు ఎయిర్ ఇండియా వర్గాలు శనివారం వెల్లడించాయి. ఈ మేరకు టికెట్ల బుకింగ్ వ్యవస్థలో శుక్రవారం నుంచే మార్పులు చేసినట్లు తెలిపాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సైతం తమ విమానానికి 'ఐఎక్స్171'నంబర్‌ను వదులుకుంటున్నట్లు వెల్లడించింది. కొత్త నంబర్‌ను ఇంకా ప్రకటించలేదు. ప్రమాదానికి గురైన విమానం నంబర్‌ను మార్చడం కొత్తేమీ కాదు. ప్రమాదంలో మరణించినవారికి నివాళిగా పాత నంబర్‌ను వదిలేసుకోవడం చాలా ఏళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతోంది.

అమెరికాలో చట్టసభ్యులపై కాల్పులు

మిన్నెసోటా చట్ట సభ్యురాలు, ఆమె భర్త దుర్మరణం

- సెనేటర్ దంపతులపైనా దుండగుని కాల్పులు
- పోలీసు వేషంలో ఘాతుకం, కార్లో నేతల చిట్టా

బ్లెయిన్/బ్రూక్లిన్: అమెరికాలో ఘోరం జరిగింది. ఇద్దరు మిన్నెసోటా రాష్ట్ర చట్టసభల సభ్యులపై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. డెమొక్రటిక్ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రతినిధుల సభ సభ్యురాలు, మాజీ స్పీకర్ మెలిసా హోర్ట్‌మన్, ఆమె భర్త మార్క్ కాల్పులకు బలి కాగా రాష్ట్ర సెనేట్ సభ్యుడు, డెమొక్రటిక్–ఫార్మర్–లేబర్(డీఎఫ్ఎల్) పార్టీ నేత జాన్ హాఫ్‌మన్ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. మిన్నెసోటా రాష్ట్రంలోని బ్రూక్లిన్ పార్క్, ఛాంప్లిన్ పట్టణాల్లో ఈ దారుణాలు జరిగాయి.

తొలుత సెనేటర్‌పై...

దుండగుడు పోలీస్ స్క్వాడ్ తరహా ఎస్‌యూవీ వాహనంలో పోలీసు యూనిఫాంలో ఘాతుకాలకు పాల్పడ్డాడు. ముందుగా శుక్రవారం తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో ఛాంప్లిన్ పట్టణంలోని సెనేటర్ జాన్ ఇంటికి వెళ్లాడు. పోలీసు వాహనం, పోలీస్ అధికారి యూనిఫాం చూసి జాన్ తలుపు తీశారు. వెంటనే దుండగుడు లోనికి చొరబడ్డాడు. జాన్ దంపతులపై పలుమార్లు కాల్పులు జరిపి వచ్చిన కార్లోనే పారిపోయాడు. రక్తమోడుతున్న జాన్ దంపతులను పోలీసులు వెంటనే ఆస్పత్రిలో చేర్చారు. పలు సర్జరీల తర్వాత కాస్త కోలుకున్నా వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం తెల్లవారుజామున 3.35 గంటలకు దుండగుడు బ్రూక్లిన్ పార్క్ పట్టణంలో హోర్ట్‌మన్ ఇంటికెళ్లాడు. అతన్ని పోలీసుగా భ్రమించి లోపలికి రానిచ్చిన హోర్ట్‌మన్ దంపతులపై కాల్పులు జరిపాడు. దాంతో వాళ్లు అక్కడిక్కడే మరణించారు. అదే సమయానికి సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీసులు హోర్ట్‌మన్ ఇంటివైపు వచ్చారు. ఇంట్లోంచి బయటికొస్తున్న దుండగుడు వారిపై కాల్పులకు దిగాడు. తర్వాత ఇంటి వెనుక తలుపు గుండా పారిపోయాడు. ఇంటి ముందు నిలిపి ఉంచిన అతని కార్లో పలువురు చట్టసభ సభ్యుల పేర్లతో కూడిన చీటీ పోలీసులకు దొరికింది. అబార్షన్ చేసే వైద్యులు, వాటిని సమర్థించే లాయర్లు, పలు రాష్ట్రాల చట్టసభల సభ్యులు... ఇలా 70 మంది పేర్లు అందులో ఉన్నాయి. తూటాలున్న బ్యాగు కూడా దొరికింది. దుండగున్ని ప్రిటోరియన్ గార్డ్ సెక్యూరిటీ సంస్థలో సెక్యూరిటీ పెట్రోల్స్ విభాగం డైరెక్టర్ వాన్స్ బోల్టర్ (57)గా అనుమానిస్తున్నారు. అతనికోసం వేట మొదలెట్టారు. ఇవి రాజకీయ ప్రేరేపిత హత్యలేనని మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ ఆరోపించారు. దుండగున్ని వెంటనే పట్టుకుంటామని చెప్పారు.



మెలిసా హోర్ట్‌మన్



జాన్ హాఫ్‌మన్

'నో కింగ్స్' కరపత్రాలూ..

దుండగుని కారులో 'నో కింగ్స్' కరపత్రాలు కూడా కనిపించాయి. అక్రమ వలసదారుల అరెస్టులను నిరసిస్తూ మొదలైన ఉద్యమంలో భాగంగా అమెరికావ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 'నో కింగ్ పేరిట ర్యాలీలు జరుగుతుండటం తెల్సిందే. కాల్పుల ఘటన నేపథ్యంలో మిన్నెసోటాలో ర్యాలీలను విరమించుకున్నారు.

ఈ నెల 19న యాక్సియోమ్–4 మిషన్

న్యూఢిల్లీ: సాంకేతిక కారణాలతో ఇప్పటిదాకా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన యాక్సియోమ్–4 మిషన్ ప్రయోగాన్ని నెల 19వ తేదీన చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శనివారం ప్రకటించింది. భారత వ్యోమగామి శుభాన్షు శుక్లాతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు స్పేస్‌ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) చేరుకోబోతున్నారు. యాక్సియోమ్–4 స్పేస్ మిషన్‌లో భాగంగా అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్–9 రాకెట్ ప్రయోగించబోతున్నారు. వాస్తవానికి ఈ నెల 11న ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉండగా, రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ ఇంధనం లీకేజీ కారణంగా వాయిదా వేశారు. సమస్యను పరిష్కరించడంతో ఈ నెల 19న ప్రయోగానికి ఏర్పాట్లు చేసినట్లు ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది.



మాన్సూన్ రెగట్టాలో పతకాల పంట
హుస్సేన్ సాగర్‌లో మాన్సూన్ రెగట్టా చాంపియన్‌షిప్ శనివారం ముగిసింది. ఉత్కంఠగా సాగిన పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. -8లో



విన్యాసాల వాయిద్యం.. మార్ఫా సంగీతం..
ప్రాంతాలకతీతంగా అలరిస్తోంది మార్ఫా సంగీతం వాయిద్యం. ఆఫ్రో, అరబ్ సంప్రదాయం నుంచి వలస వచ్చిన ఈ సంగీతం భాగ్యనగర సంస్కృతిలో భాగమైపోయింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం
నగరంలో ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.











దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ)లో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ శనివారం ఘనంగా నిర్వహించారు. భారత వైమానిక దళంలోని ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ శాఖలకు చెందిన 254 మంది ఫ్లైట్ కేడెట్ల ప్రీ- కమిషనింగ్ శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిర్వహించిన వైమానిక విన్యాసాలు ఆద్యంతం సందర్శకులను అబ్బురపర్చాయి. ఆకాశ్ గంగ, ఎయిర్ వారియర్ డ్రిల్, సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీంలు గగుర్పొడిచే ప్రదర్శనలు చేశాయి. పైలటస్ పీసీ–7 ఎంకే–2, హాక్, కిరణ్ ఎంకే–1, చేతక్ ట్రైనర్ విమానాల విన్యాసాలు సైతం ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – సాక్షి, సిటీబ్యూరో

ఎమర్జెన్సీ 'రెస్పాన్స్'.. శభాష్

'డయల్–112'కు అనేక ఫోన్ కాల్స్

- అత్యవసర సమయాల్లో తక్షణ స్పందన
- ఒకేరోజు నాలుగు నేరాలపై సత్ఫలితాలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీ ఐసీసీసీ) అధీనంలో పని చేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టం (టీజీఈ ఆర్ఎస్ఎస్) 'డయల్–112'కు వచ్చిన కాల్స్‌పై తక్షణం స్పందిస్తోంది. శుక్రవారం ఒకేరోజు నాలుగు ప్రధాన నేరాలపై స్పందించి, సత్ఫలితాలు సాధించినట్లు డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి శనివారం ప్రకటించారు.

అధికారుల కీలక పాత్ర..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డయల్–112 రాష్ట్రానికి సంబంధించి టీజీ ఐసీసీసీ కేంద్రంగా పని చేస్తోంది. తప్పిపోయిన వ్యక్తులను కనుగొనటం నుంచి హత్యలు, అత్యాచార యత్నాలు వంటి తీవ్రమైన నేరాల నిరోధంలోనూ కీలకంగా వ్యవహరిస్తోంది. డయల్–112 బృందం వేగంగా స్పందించి, పోలీసుస్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేయడంతో శుక్రవారం నాలుగు కేసులు పరిష్కారమైనట్లు డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాల్లో క్షేత్రస్థాయి అధికారులు కూడా కీలక పాత్ర పోషించారని తెలిపారు.

ఆ నాలుగు ఇలా..

- నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలోని కోకాపేట లేబర్ కాలనీలో సునీత దేవ్ తప్పిపోయిన తన కుమారుడిపై 'డయల్–112' ఫిర్యాదు చేశారు. దీని ద్వారా సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కొద్దిసేపట్లోనే వెతికి అప్పజెప్పారు. అలాగే నగరంలోని అంబర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు మహిళల అనుమతి లేకుండా వారి వీడియోలు తీస్తున్నాడు. దీనిపై ఫిర్యాదు రావడంతోనే క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసిన డయల్–112 అతడిని పట్టుకోవడంలో సహకరించింది.
- నల్లగొండ జిల్లాలో ఓ హత్యాయత్నం, సంగారెడ్డి టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అత్యాచారయత్నం సందర్భాల్లోనూ ఇలాంటి స్పందనే కనబరిచింది. అత్యవసర సమయాల్లో ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సి వచ్చినా డయల్–112 సేవలు వినియోగించుకోవాలని కమలాసన్‌రెడ్డి కోరారు. బాధ్యతాయుతమైన కొందరు పౌరులు చేసే ఫోన్ కాల్ ఓ జీవితాన్ని నిలబెట్టం, నేరాన్ని నిరోధించడానికీ ఉపకరిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.



అంబర్‌పేటలో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నగరం మెరిసేలా.. పేదలు మురిసేలా!

ముంబై తరహాలో మురికి వాడల్లో అభివృద్ధి



'నగరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద స్లమ్స్‌లో 'జీ ప్లస్ త్రీ' గృహాలు నిర్మిస్తాం. ప్రతియేటా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 పేద కుటుంబాలకు ఇళ్లను అందిస్తాం. సురక్షిత తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. భూగర్భ జలాలు పెంపునకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత, అపార్ట్‌మెంట్లలో ఎస్టీపీలు తప్పనిసరి. మెట్రో రైలు మూడు దశల్లో విస్తరించేందుకు చర్యలు చేపట్టాం. కాలుష్యం వెదజల్లే కాలం చెల్లిన వాహనాలను ఇక అనుమతించబోం. పాతబస్తీలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఇంకా ఏం చెప్పారంటే..

- ఇందిరమ్మ మోడల్ కాలనీలో జీ ప్లస్ త్రీ ఇళ్లు
- సురక్షిత తాగునీరు.. మెరుగైన డ్రైనేజీ సిస్టం
- ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు
- పాతబస్తీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ
- మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పాలన



'సాక్షి'తో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, సిటీబ్యూరో:

ముంబై తరహాలో హైదరాబాద్‌లోని మురికి వాడలను అభివృద్ధి చేస్తాం. ఇరవై ఏళ్లకుపైగా పేదలు నివసిస్తున్న ప్రభుత్వ స్థలాల (మురికి వాడలు)ను ఇందిరమ్మ మోడల్ కాలనీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. డబుల్ బెడ్రూం బహుళ అంతస్తు భవన సముదాయాల మాదిరిగా నిర్వహణ భారం లేకుండా జీ ప్లస్ త్రీ ఇళ్లు నిర్మించి ఇస్తాం. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరయ్యాయి. కొత్త నగరంతో పాటు పాతబస్తీని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

తాగునీరు.. డ్రైనేజీ వ్యవస్థకు ప్రాధాన్యం

నగరవాసులకు కలుషితం లేని సురక్షిత నీటి సరఫరాయే లక్ష్యంగా పెట్టుకున్నాం. మురుగునీరు రోడ్లపై సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపట్టాం. 180 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇచ్చింది. 2050 నాటికి సరిపడేలా గోదావరి ఫేజ్–2, 3 దశల కింద మరో 20 టీఎంసీల నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించనున్నాం. మురుగునీరు శుద్ధి చేసి మూసీలో వదిలే విధంగా ఎస్టీపీలు నిర్మిస్తున్నాం. ఇప్పటికే వంద శాతం మురుగు శుద్ధిలో చేరువయ్యాం. ఉచిత నీటి సరఫరా నిర్వహణ ఆర్థిక భారమైనప్పటికీ ఎలాంటి ఆటంకం లేకుండా అందిస్తున్నాం. మూసీని సియోల్, సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళి రచించాం.

ఇంకుడు గుంతలు... ఎస్టీపీలు తప్పనిసరి

సుమారు 300 గజాలకు పైగా నివాస గృహాల్లో ఇంకుడు గుంతలు.. బహుళ అంతస్తు భవన సముదాయాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) తప్పనిసరి. వర్షపు నీరు వృథా కాకుండా పరిరక్షించుకుంటే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుంది. బహుళ సముదాయాల్లో ఎస్టీపీల ద్వారా మురుగునీటి శుద్ధి చేసుకొని చెట్లు, ఇతర అవసరాలకు వినియోగించుకోవాలి. ఇది సామాజిక బాధ్యతగా అందరూ పాటించాల్సిందే.

మెట్రోను విస్తరిస్తాం..

మహా మెట్రోను నలు దిశలా విస్తరిస్తాం. మెట్రో ఫేజ్–2 కోసం పాత బస్తీలో భూసేకరణ కొనసాగుతోంది. త్వరలో జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట వరకు రెండు కారిడార్లతో పాటు ఫోర్త్ సిటీ వరకు విస్తరిస్తాం.

ఇక కాలుష్య రహిత వాహనాలు

ఢిల్లీ తరహా వాయు కాలుష్యం పెరిగిపోకుండా కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. ఈవీ పాలసీ కింద ఎలక్ట్రిక్ వాహనాలకు ఉచిత రిజిస్ట్రేషన్‌తో పాటు జీవిత కాలం పన్ను మినహాయింపు అమలు చేసున్నాం. సిటీలో డీజిల్ బస్సుల స్థానంలో పీఎం ఈ– డ్రైవ్ పథకం కింద దశలవారీగా సుమారు 2,800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నాం. కాలుష్యం వెదజల్లే.. కాలం చెల్లిన డీజిల్ వాహనాలను నగర శివారుకే పరిమితం చేయాలని యోచిస్తున్నాం.

అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్

నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచేందుకు బ్రేక్ ఫాస్ట్ అమలుకు ప్రణాళిక రూపొందించాం. త్వరలో అమలు చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాల కల్పన, విద్యాబోధన ఉండేలా చర్యలు చేపట్టాం.

కాలనీలకు పచ్చందం!

సమస్యగా మారిన ఖాళీ స్థలాల లభ్యత

- కాలనీల్లోనే ఎక్కువ మొక్కలు నాటే యోచన
- ఏపుగా ఎదిగేవి తక్కువ.. చిన్నవే ఎక్కువ
- లక్ష్యం 25.52 లక్షలు.. ఇళ్లల్లో నాటుకునేందుకు 3.63 లక్షల మొక్కలు
- వన మహోత్సవానికి జీహెచ్ఎంసీ కార్యాచరణ

సాక్షి, సిటీబ్యూరో: వన మహోత్సవానికి జీహెచ్ఎంసీ కార్యాచరణ సిద్ధం చేసింది. 25.52 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రచించింది. ఈ ఏడాది బల్దియా పరిధిలో 25 లక్షల మొక్కలు నాటాలనే ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఇందుకు చర్యలు తీసుకోనుంది. గతంలో నాటిన కోట్లాది మొక్కలతో ఖాళీ స్థలాల్లేకపోవడంతో కాలనీల్లో ఎక్కువ మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తం 25,52,599 మొక్కల లక్ష్యంలో కాలనీల్లోని వివిధ ప్రాంతాల్లో 6,24,566 మొక్కలు నాటాలని నిర్ణయించారు. కాలనీల అనంతరం అవెన్యూ ప్లాంటేషన్‌గా మేజర్ రోడ్లు, మైనర్ రోడ్లు, సెంట్రల్ మీడియన్లు, మోడల్ కారిడార్లు తదితర ప్రాంతాల్లో 6,08,388 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. చెరువులు, పార్కులు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బల్దియా ప్రణాళిక ఇలా..

- అవెన్యూ ప్లాంటేషన్స్: అవెన్యూ ప్లాంటేషన్స్‌లో భాగంగా 6,08,388 మొక్కలు.
- ఓపెన్ స్పేస్ ప్లాంటేషన్స్: ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలు, శ్మశాన వాటికల ప్రాంతాల్లో 1,95,525 మొక్కలు.
- కాలనీ ప్లాంటేషన్స్: కాలనీ ప్లాంటేషన్స్‌లో భాగంగా కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా, కాలనీల్లో ఉన్న పార్కులు, కొత్తగా పార్కుల ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాలు, జీహెచ్ఎంసీ ఖాళీ స్థలాల్లో 6,24,566 మొక్కలు.
- లేక్ ప్లాంటేషన్స్: చెరువుల కట్టలపై, బఫర్‌జోన్లతోపాటు చెరువుల సమీపాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో 1,95,525 మొక్కలు.
- మియావాకీ ప్లాంటేషన్స్: యాదాద్రి తరహాలో ఎక్కువ ఖాళీ ప్రదేశమున్న ప్రాంతాల్లో ఒకేచోట అడవిలా గుబురుగా పెరిగే మొక్కలు 30,000.
- పొదలు, గుబుర్లు: తక్కువ ఎత్తుతో పొదలుగా, గుబుర్లుగా పెరిగే మొక్కల్ని ఫ్లై ఓవర్ల కింద, మీడియన్లు, పార్కుల్లో నాటేందుకు 5,12,937 మొక్కలు.
- అర్బన్ ఫారెస్ట్ పార్కులు: అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో నాటేందుకు, పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్ల స్థానాల్లో నాటేందుకు 98,000 మొక్కలు.
- ప్రజలకు పంపిణీ: ఇళ్లల్లో నాటుకునేందుకు 3,63, 937 మొక్కల్ని ప్రజలకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. నాటిన మొక్కలు చనిపోకుండా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సంరక్షిస్తామని జీహెచ్ఎంసీ జీవవైవిధ్యం విభాగం అధికారులు పేర్కొన్నారు.

చిరు వ్యాపారాలతో ఆటంకాలు

ప్రధాన రహదారుల మార్గాల్లో మొక్కలు నాటే అవకాశాలున్నప్పటికీ, చాలా ప్రాంతాల్లో చిరు వ్యాపారాలుండటంతో ఎక్కువ మొక్కలు నాటేందుకు అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. వారి ఉపాధిని దృష్టిలో ఉంచుకొని కుండీల్లో ఉండే మొక్కలు పెడుతున్నా, కుండీల పైనే వారి సామగ్రి ఉంచడం వంటి పనులు చేస్తున్నారని పేర్కొన్నారు.

జోన్ల వారీగా లక్ష్యం ఇలా..

జోన్	ఏపుగా పెరిగేవి	పొదలు	చిన్నవి మొత్తం
ఎల్‌బీనగర్	42,115	4,10,980	4,53,095
చార్మినార్	15,322	3,09,182	3,24,504
ఖైరతాబాద్	40,000	2,10,000	2,50,000
శేరిలింగంపల్లి	1,49,135	4,50,865	6,00000
కూకట్‌పల్లి	1,08,900	5,16,100	6,25,000
సికింద్రాబాద్	84,870	2,15,130	3,00000
మొత్తం	4,40,342	2,11,2257	25,52,599



ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏ విస్తరణ

- కొత్తగా విలీనమైన 1,355 గ్రామాల్లో స్తంభించిన నిర్మాణ రంగం
- అనుమతులపై కొరవడిన స్పష్టత
- పెండింగ్ జాబితాలో దస్త్రాలు
- బిల్డర్లు, రియల్టర్ల పడిగాపులు

పరిధి పెంచె.. ఫైళ్లు విస్మరించె..



సాక్షి, సిటీబ్యూరో: షాద్‌నగర్‌కు చెందిన ఓ రియల్టర్ 10 ఎకరాల లే అవుట్ కోసం అనుమతి కోరుతూ నెల రోజుల క్రితం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఫైల్ నంబర్ కూడా లభించింది. కానీ.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫైల్‌లో ఎలాంటి కదలికా లేదు. ఇలా ఒక్క షాద్‌నగర్ ప్రాంతంలోనే కాదు. హెచ్ఎండీఏలో కొత్తగా విలీనమైన 1,355 గ్రామాల్లో లే అవుట్‌లు, నిర్మాణరంగ అనుమతులు స్తంభించాయి. వందలాది ఫైళ్లు పెండింగ్ జాబితాలో పడిపోయాయి. గత మార్చిలో ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏను విస్తరించిన సంగతి తెలిసిందే. అప్పటి వరకు డీటీసీపీ నుంచి అనుమతి పొందిన ప్రాంతాలన్నీ హెచ్ఎండీఏకు బదిలీ అయ్యాయి. రెండు నెలలుగా దరఖాస్తులను స్వీకరించేందుకు 'కీ'లు కూడా విడుదలవుతున్నాయి. హెచ్ఎండీఏ స్వీకరించిన దరఖాస్తులను ఫైల్ నెంబర్‌లను కేటాయిస్తున్నారు. కానీ ఫైళ్లు ముందుకు కదలడం లేదు. ప్రొసీడింగ్స్ (అనుమతులు) లభించడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి భూములు కొనుగోలు చేసి లే అవుట్‌లను అభివృద్ధి చేసిన తాము తీవ్రంగా నష్టపోవాల్సివస్తోందని రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, తమ సొంతింటి కలను వాయిదా వేసుకుంటున్నామని మధ్యతరగతి వర్గాలు పేర్కొంటున్నాయి.

అతీగతీ లేని పురోగతి..

నిబంధనల మేరకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను రూపొందిస్తారు. దీని వివరాల ఆధారంగా కమిషనర్ నుంచి ప్రొసీడింగ్స్ లభిస్తాయి. కాగా.. కొత్తగా విలీనమైన గ్రామాల మ్యాపింగ్ ఇంకా పూర్తి చేయకపోవడం, మాస్టర్‌ప్లాన్‌లో వాటి వివరాలపై స్పష్టత లేకపోవడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. మరోవైపు గతంలో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)కి దరఖాస్తు చేసుకున్న ఫైళ్లు కూడా హెచ్ఎండీఏకు చేరాయి. వాటిపై కూడా ఎలాంటి పురోగతి లేకుండాపోయింది.

అనుమతులిచ్చేదెవరు?

మరోవైపు డీటీసీపీ పరిధిలో భూములు కొనుగోలు చేసి లేఅవుట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొని ఫీజులు చెల్లించిన వాళ్లు కూడా వందల్లో ఉన్నారు. ప్రస్తుతం వారికి డీటీసీపీ నుంచి అనుమతులు లభించడం లేదు. ఆ విభాగానికి చెందిన అధికారులు సైతం స్పందించడం లేదు. అప్పటి నిబంధనల మేరకు తమ విధులు తాము నిర్వహించినట్లు పేర్కొంటున్నారు. 'యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం రాచకొండలో లే అవుట్ కోసం గతంలోనే డీటీసీపీకి ఫీజులు చెల్లించాం. ఇప్పటి వరకు అనుమతి లభించలేదు. ఇటు హెచ్ఎండీఏ, అటు డీటీసీపీ చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది' అని ఓ రియల్టర్ విస్మయం వ్యక్తం చేశారు. లే అవుట్ అనుమతుల అంశం తమ పరిధిలో లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు కొత్త మాస్టర్‌ప్లాన్ వస్తే తప్ప తాము అనుమతులు ఇవ్వలేమని హెచ్ఎండీఏ అధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో రియల్టర్లు, వ్యాపార వర్గాలు, ఆర్కిటెక్టర్లు తదితర వర్గాల్లో గందరగోళం నెలకొంది. అనుమతుల కోసం కొంతకాలం ఆగాల్సిందేనని చెబుతున్నప్పటికీ ఇంకా ఎంతకాలం అనే విషయంలో స్పష్టత లేకపోవడంతో తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని పలు నిర్మాణ సంస్థలకు చెందిన ప్రతినిధులు తెలిపారు.

మేస్త్రీ ఆత్మహత్య

రాజేంద్రనగర్: తాను పనిచేస్తున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఓ మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ భానుమతి తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన సాహు (28) తన భార్యతో కలిసి బతుకు తెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. హైదర్‌గూడ జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో మేస్త్రి పని చేస్తూ జీవిస్తున్నాడు. అపార్ట్‌మెంట్ వద్దనే ఉంటూ భార్యభర్తలిద్దరూ పని చేసేవారు. శనివారం మధ్యాహ్నం సాహు 8వ అంతస్తు పైకి వెళ్లి తోటి కార్మికులు చూస్తుండగానే పై నుంచి కిందికి దూకాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయా లకు గురైన సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. సాహు ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదవశాత్తు 14వ అంతస్తు నుంచి జారి పడి..

చందానగర్: ప్రమాదవశాత్తు 14వ అంతస్తు నుంచి కాలు జారి కింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం నల్లగండ్లలోని అపర్ణ జీనీత్‌లో నివాముండే మరనాని జోగారావు (61) భార్య దాసరి లక్ష్మీ నరసమ్మతో కలిసి ఫ్లాట్ నెంబర్ జె-1402లో నివాసముంటున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు 14వ అంతస్తులోని తన ఇంటిలోని బాల్కనీలో పని చేస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం స్థానికులు 14వ అంతస్తులోని అతని భార్యకు సమాచారం అందించారు. కిందకు దిగి చూడగా ఆమె భర్త విగత జీవిగా పడిఉన్నాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులకు సమాచారం అందించగా వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



మాన్సూన్ రెగట్టాలో పతకాల పంట..

ఆరు రోజుల పాటు జరిగిన ఛాంపియన్‌షిప్ ● 16వ మాన్సూన్ రెగట్టాలో తెలంగాణ సెయిలర్ల ప్రతిభ



సాక్షి సిటీ బ్యూరో: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో ఆరు రోజుల పాటు జరిగిన 16వ మాన్సూన్ రెగట్టా ఛాంపియన్‌షిప్ శనివారం ముగిసింది. ఉత్కంఠగా సాగిన పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్-15 బాలుర విభాగంలో రిజ్వాన్ మహమ్మద్ స్వర్ణం గెలుచుకోవడమే కాకుండా 'బాయ్స్ ట్రోఫీ'ని కైవసం చేసుకున్నాడు. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనుజ కామేశ్వర్- శ్రావణ్ కత్రావత్ జోడీ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అండర్-15 బాలికల విభాగంలో లాహిరి కొమరవెల్లి హోరాహోరీ పోరులో రజత పతకం సాధించింది. అంతేకాకుండా టోర్నమెంట్‌లో అత్యంత నిలకడైన ప్రదర్శనకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'ఎస్‌హెచ్ బాబు మెమోరియల్ ట్రోఫీ'ని గెలుచుకుంది. తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ స్వర్ణం సాధించింది. పదో రేసులో శ్రేయ ప్రథమ స్థానంలో నిలిచి, ఓపెన్, బాలికల విభాగాల్లోనూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. అండర్-19 మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దీక్షిత, గణేష్ రజత పతకం సాధించారు. అండర్-15 బాలికల విభాగంలో చంద్రలేఖ తాతారి, బాలుర కేటగిరీలో వినోద్ దండు కాంస్యాలు గెలుచుకున్నారు. అండర్-15 బాలికల విభాగంలో తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ స్వర్ణం అందుకుంది. అండర్-18 లేజర్ బాలికల విభాగంలో అలియా సబ్రీన్ (తమిళనాడు) బంగారు పతకం సాధించింది. అండర్-19 స్కిఫ్ క్లాస్‌లో కార్తీక్ కొట్రోల- హృదయ్ జోషి (గోవా) స్వర్ణం నెగ్గగా.. కృష్ణ-తంగై (మైసూర్) రజతం, అజయ్ గజ్జి, సత్యం ఝా (గోవా) కాంస్యం సాధించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం

- మొదటి అదనపు సెషన్స్ కోర్టు జడ్జి వినోద్‌కుమార్
- ప్రశాంతంగా ముగిసిన జాతీయ లోక్ అదాలత్

సిటీ కోర్టులు: కక్షిదారులు తమ కేసులను వెంటనే పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ఒక చక్కటి వేదిక అని నాంపల్లి క్రిమినల్ కోర్టు మొదటి అదనపు సెషన్స్ కోర్టు జడ్జి వినోద్‌కుమార్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నాంపల్లి క్రిమినల్ కోర్టు, మనోరంజన్, సికింద్రాబాద్, రైల్వే కోర్టు, ఇంటిగ్రేటెడ్ కోర్టులలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నాంపల్లి క్రిమినల్ కోర్టు మొదటి అదనపు సెషన్స్ కోర్టు జడ్జి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, న్యాయవాదులు, ఇతరులు కక్షిదారులు తమ కేసులు పరిష్కరించుకోవడంలో ప్రముఖ పాత్ర పోషించి వారికి సహాయసహకారాలు అందించారని తెలిపారు. ఇదేవిధంగా భవిష్యత్‌లో కూడా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించడంలో కృషిచేయాలని కోరారు. అప్పుడే కక్షిదారులు ప్రశాంతంగా ఉంటారని తెలిపారు. పెండింగ్ కేసులు పరిష్కరించుకోవడంతో కక్షిదారులకు ఊరట లభించిందని తెలిపారు.

◆ లోక్ అదాలత్ పెండింగ్ కేసుల విషయంలో సత్వర పరిష్కారాన్ని అందించి కక్షిదారులకు మనశ్శాంతిని అందించే మంచి వేదిక అని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియగం చేసుకోవాలని నాంపల్లి క్రిమినల్ కోర్టులో 12వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి టి.అనిత తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడం కోసం పోలీసు సిబ్బంది కృషిచేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.విశ్వప్రసాద్ తెలిపారు.

◆ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన నేపథ్యంలో మొత్తం 30 బెంచీలు ఏర్పాటు చేసి కక్షిదారులకు సేవలు అందిస్తున్నామని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావిద్ పాషా తెలిపారు. మొత్తం 3,65,293 పెండింగ్ కేసులు ఉండగా అందులో 2,32,062 కేసులను పరిష్కరించి హైదరాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

'గాంధీ' నుంచి ఇద్దరు రోగులు అదృశ్యం

గాంధీఆస్పత్రి: వేర్వేరు ఘటనల్లో ఇరువురు రోగులు గాంధీ ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యారు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా న్యాకల్ మండలం మల్గికి చెందిన మహ్మద్ రసూల్(50) చికిత్స నిమిత్తం గాంధీఆస్పత్రిలో చేరాడు. ట్రీట్మెంట్ కొనసాగుతున్న క్రమంలో ఈనెల 13వ తేదిన టీ తాగేందుకు అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి వార్డుకు చేరలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో కుమారుడు షేక్ ఇమ్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మహ్మద్ రసూల్ (ఫైల్)



నర్సింహ (ఫైల్)

మరో ఘటనలో...

మేడ్చల్ జిల్లా గాజులరామారం చంద్రగిరినగర్‌కు చెందిన అరకల నర్సింహ (55) కుటుంబ కలహాల నేపథ్యంలో తలను గోడకు కొట్టుకుని గాయాల పాలై చికిత్స నిమిత్తం ఈనెల 12వ తేదిన గాంధీఆస్పత్రిలో చేరాడు. మతిస్థిమితం కోల్పోయిన నర్సింహ ఆస్పత్రి ప్రాంగణంలో భార్యతో గొడవ పడి అక్కడి నుంచి పారిపోయి తిరిగి ఆస్పత్రికి చేరలేదు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదో అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం..

సనత్‌నగర్: ఎర్రగడ్డ జనప్రియా అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి ఓ మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏలూరు జిల్లా అడ్డగిద్దల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రాజు, కొక్కిణి శ్రావణి (30) దంపతులు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు నడుస్తుండడంతో మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం శ్రావణిని ఎర్రగడ్డ జనప్రియా అపార్ట్‌మెంట్స్‌లో ఉండే తల్లిదండ్రులు శ్రీనివాస్, దుర్గాలు తమ వద్దకు తీసుకువచ్చారు. గత ఆరు నెలలుగా తల్లిదండ్రులతో కలిసి ఉంటూ స్థానికంగా హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. మూడు రోజుల క్రితం వీరు ఊరిలో ఉన్న అల్లుడు రాజు వద్దకు వెళ్లి తమ కూతురు కాపురం నిలబెట్టాలనే ఉద్దేశంతో ఒప్పించి అతనిని కూడా ఇక్కడికి తీసుకువచ్చారు. అయితే భార్యాభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపం చెందిన శ్రావణి శనివారం ఉదయం 8.30 గంటలకు జనప్రియా అపార్ట్‌మెంట్స్ ఐదో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శ్రావణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల వల్లనే శ్రావణి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రావణి (ఫైల్)

గంజాయి విక్రేత అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదర్‌నగర్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ యువకుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద బ్యాగులో ఉన్న 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండ ప్రాంతంలో నివాసం ఉండే బచ్చల లోకేష్ (22) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా ఉన్న కొందరు యువకులతో కలిసి గంజాయి తాగడం అలవాటు చేసుకున్నాడు. మహారాష్ట్రలోని పర్బనీ ప్రాంతంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నగరంలో ఎక్కువ ధరకు విక్రయించడం ద్వారా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్ వద్ద నల్లటి బ్యాగులో అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు విషయం బయటపడింది.

భర్తను హత్య చేసిన భార్య

సైదాబాద్: భర్తకు మద్యం తాగించి..మత్తులో ఉన్న అతడిపై భార్య ఇనుపరాడ్‌తో దాడి చేయటంతో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన గురించి వివరాలు ఈవిధంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జీషాన్ అలీ (45) నగరానికి వలస వచ్చి 18 ఏళ్ల క్రితం చంద్రా అలియాస్ అయేషా పర్వీన్‌ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. చాలా కాలం ఎల్‌బీనగర్‌లో నివసించిన వీరు తమ ఐదుగురు సంతానంతో ఇటీవల సింగరేణి కాలనీలో అద్దెకు దిగి పూల వ్యాపారం చేసేవారు. జీషాన్ అలీ తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడేవాడు. యూపీలోని శరన్‌పూర్‌లో నివసించే అతని సోదరుడు షకీర్ అలీ వారిని ఫోన్‌లో సముదాయించే వాడు. అయితే అయేషా ఇటీవల మరొకరితో చనువుగా ఉంటుందని జీషాన్ అలీ భార్యతో గొడవపడటం ఎక్కువైంది. ఈ నెల 11న అయేషా తన భర్తను ఇనుపరాడ్‌తో విచక్షణారహితంగా కొడుతుండగా వారి ఇంటి నుంచి వచ్చిన శబ్దాలు విని స్థానికులు వెళ్లి ఆమెను అడ్డుకొని జీషాన్‌ను పడుకోబెట్టి వెళ్లి పోయారు. మరుసటి రోజు అయేషా తన భర్తను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా వారు పరీక్షించి అతని పరిస్థితి విషమంగా ఉందని ఉస్మానియాకు తీసుకెళ్లమన్నారు. అక్కడికి వెళ్లగా..అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు షకీర్ అలీ శుక్రవారం యూపీ నుంచి నగరానికి వచ్చి ఓజీహెచ్‌లో తన అన్న మృతదేహాన్ని గుర్తించాడు. తన సోదరుడిని కొట్టి చంపిన అయేషాపై సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి అరెస్టు

ఫిలింనగర్: మద్యం మత్తులో కారు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారకులైన ఐదుగురిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..షేక్‌పేట ఓయూ కాలనీలో నివసించే వడ్ల వెంకటేష్‌తో పాటు ఆయన స్నేహితులు శ్రీను, కిరణ్, అనిల్ నలుగురూ కలిసి అర్ధరాత్రి మల్కం చెరువు వద్ద మద్యం తాగారు. అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులోనే కారు నడుపుకుంటూ ఓయూ కాలనీ వైపు వెళ్తుండగా ఇంటి ముందు పార్కింగ్ చేసిన అజాహరుద్దీన్ అనే వ్యక్తికి చెందిన కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో అజహరుద్దీన్ కారు దెబ్బతిన్నది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఉన్న వారికి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా అందరూ మద్యం తాగినట్లుగా తేలింది. వీరందరినీ అరెస్టు చేశారు.

మరో ఘటనలో..

ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి సమీపంలో బొటిక్ నడిపిస్తున్న హరీష్ శుక్రవారం అర్ధరాత్రి 11.30 గంటలకు బొటిక్‌లోనే మద్యం తాగి..మత్తులో కారు నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఎఫ్‌ఎన్‌సీసీ సమీపంలో మహనీయుల చౌరస్తా వద్ద కారు అదుపుతప్పి రఘుపతి వెంకయ్యనాయుడు విగ్రహం దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో దిమ్మె ధ్వంసమైంది. డివైడర్ కూడా దెబ్బతినగా కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న హరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసలు ఘటనా స్థలానికి చేరుకుని హరీష్‌కు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగినట్లుగా నిర్ధారణ అయ్యింది. శనివారం ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడి బాట

తూతూమంత్రంగా కార్యక్రమాలు
- కొత్త అడ్మిషన్లు అంతంతమాత్రమే..
- భాగస్వాములు కాని బస్తీవాసులు
- ఖైరతాబాద్‌లో బడిబాట ఫ్లాప్


ఫిలింనగర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఆచార్య జయశంకర్ పేరిట విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. బాధ్యత వహించాల్సిన ఉపాధ్యాయులే ఈ కార్యక్రమంలో తూతూమంత్రంగా పాల్గొంటూ ఇళ్లకు జారుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారుల జాడ లేకపోవడంతో ఈ పథకం కాస్తా నీరుగారిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశ్యంతో, కొత్త అడ్మిషన్లు స్వీకరించాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ, 43 ప్రాథమిక పాఠశాలల పరిధిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఇప్పటి వరకు కొత్త అడ్మిషన్లు 100 కూడా దాటలేదంటే ఈ కార్యక్రమం ఎంత అధ్వాన్నంగా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు. సదరు ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటూ ఇంటి బాట పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు సైతం పట్టీపట్టనట్లుగా..

ప్రజా ప్రతినిధులు కూడా పెద్దగా బడిబాటలో భాగస్వాములు కావడం లేదు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించాల్సిన టీచర్లు తమకెందుకొచ్చిన గొడవలే అంటూ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బస్తీ సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలను కూడా భాగస్వాములను చేసుకుని బస్తీల్లో తిరుగుతూ బడిబాటపై అవగాహన కలిగించాల్సి ఉండగా ఆ దిశలో ఎక్కడా కార్యక్రమాలు చేపట్టడం లేదు. బడిబాటలో పాల్గొనాలనే ఆలోచన కూడా ప్రజాప్రతినిధుల్లో కరువైంది. ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు మినహా ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మిగతా వారు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు, అక్రమంగా ఇళ్లు నిర్మించే బిల్డర్ల నుంచి డబ్బులు దండుకునే నేతలు ఇలాంటి కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు.

బడిబాటలో కానరాని విద్యాశాఖ అధికారులు

ఇంకోవైపు ఖైరతాబాద్ జోన్‌కు విద్యాశాఖ అధికారి ఎవరో కూడా తెలియదంటే ఆ శాఖ ఎంత అధ్వాన్నంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు. బడిబాటలో విద్యాశాఖ అధికారులు ఎక్కడా కనిపించలేదు. విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, ప్రజాప్రతినిధులు ఈ బడిబాటలో పాల్గొని ఉంటే తల్లిదండ్రులకు సర్కార్ బడులపై నమ్మకం వచ్చేదని, తమ పిల్లలను పాఠశాలలో చేర్పించి ఉండేవారని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.
ఇదిలా ఉండగా పాఠశాలల ప్రారంభం రోజే పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా లభిస్తాయనే విషయాన్ని ప్రజలకు అవగాహన కలిగించడంలో కూడా అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇవ్వడాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్‌ను సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. ఫార్ములా ఈ–రేస్ సజావుగా సాగిందని అందులో ఎలాంటి అక్రమాలు జరగక్కుండా ఎటువంటి అవినీతికి చోటులేకున్నా కేటీఆర్‌ను విచారించడం చట్ట వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు.

ఘనంగా 'ఎర్నెస్టో చెగువేరా' జయంతి వేడుకలు



హిమాయత్‌నగర్: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మానవత్వ విలువలు కలిగిన మహనీయుడు 'ఎర్నెస్టో చెగువేరా'అని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. శనివారం చెగువేరా 97వ జయంతిని హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చెగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు నెర్లకంటి శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివకుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పంజగుట్ట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రేమ్‌నగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేహెచ్ భగవాన్‌దాస్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకుంటున్న సమ్మర్ ఉత్సవ్ మేళా




ఖైరతాబాద్: వీకెండ్ కావడంతో శనివారం సాగర తీరంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా సందర్శకులతో సందడిగా మారింది. ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాలో సాయంత్రం వేళ కుటుంబ సమేతంగా విచ్చేసిన వారంతా ఎంతో ఉల్లాసంగా గడుపుతున్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుబాయి ఫ్లైట్, దుబాయి పూలవనం, బూర్జ్ ఖలీఫా, ఎలియన్స్ ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిష్ టన్నల్‌లో వివిధ రకాల చేపలు కనువిందు చేస్తున్నాయి. అందాలతో సందర్శకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సమ్మర్ ఉత్సవ్ మేళా ఈ నెల 29తో ముగుస్తుందని నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

సర్పంచుల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

పంజగుట్ట: రాష్ట్రంలో తాజా మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో గ్రామాల్లో ప్రజలందర్నీ ఐక్యం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేయిస్తామని తెలంగాణ మాజీ సర్పంచులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉంటే ప్రతీ గ్రామపంచాయితీకి బిల్లులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో ఇందిరాపార్క్ వద్ద బిల్లుల కోసం నిరసన చేస్తుంటే ప్రస్తుత సీఎం, అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తమకు సంఘీభావం తెలిపి మన ప్రభుత్వం రాగానే పెండింగ్ బిల్లులు అన్నీ ఇస్తాం, మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చాడని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాగయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రవి, అరవింద్, మల్లేష్, మల్లయ్య, నరేష్, రవీందర్‌రెడ్డి, రాజయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హరుణ్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

రహమత్‌నగర్: శ్రీరాంనగర్‌కు చెందిన కాంగ్రె సీనియర్ నాయకుడు హరుణ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్ వాపోయారు. శనివారం ఉదయం స్థానికంగా జరిగిన హరుణ్ అంత్యక్రియల్లో పాల్గొని బంధుమిత్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, అరుణ్ కుమార్‌గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

ఆస్పత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన


మృతుడు కైలాస్ ప్రధాన్

రహమత్‌నగర్: భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన కైలాస్ ప్రధాన్ (35) భవనాలకు పెయింటింగ్ వేస్తుంటాడు. ఈ క్రమంలోనే కార్మికనగర్‌లో నివాస ముండే పట్ల జంగయ్య భవనానికి నాలుగు రోజులుగా పెయిటింగ్ వేస్తున్నాడు. కాగా శనివారం ఉదయం 10గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతడిని ఈఎస్‌ఐ వద్ద ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.11లోని గౌరీశంకర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అడ్వాన్స్‌డ్ ఫోకస్ కంటి ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ అనూజ తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

హిమాయత్‌నగర్: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలని శ్రీవైష్ణవ జేఏసీ తెలంగాణ శాఖ నూతన కన్వీనర్లు పీచర కృష్ణ, డింగరి రవి డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన తెలంగాణ శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆవిర్భావ సమావేశంలో వారు మాట్లాడారు. నూతనంగా నియామకం చేసే బ్రాహ్మణ పరిషత్ పాలక మండలిలో శ్రీవైష్ణవులకు 50 శాతం డైరెక్టర్ పదవులు కేటాయించాలన్నారు. దేవాదాయ శాఖలో రాష్ట్ర వ్యాప్త ఆలయాల్లో సేవలందిస్తున్న అర్చక ఉద్యోగులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహాలలో శ్రీవైష్ణవులకు 10 శాతం ఇళ్లు కేటాయించాన్నారు. కన్నప్ప సినిమాలో పిలక, గిలక సన్నివేశాలను తొలగించి బ్రాహ్మణ, శ్రీ వైష్ణవులకు మంచు మోహన్ బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శ్రీ వైష్ణవుల సంక్షేమానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సభ్యత్వాలు సేకరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహించుకోవాలని తీర్మానించారు.

రేపు బషీర్‌బాగ్‌లో ఉద్యోగ, స్కిల్ మేళా


స్కిల్ మేళా వివరాలు వెల్లడిస్తున్న దిలీప్ కుమార్

పంజగుట్ట: లక్ష్యం సొసైటీ, కేంద్ర ప్రభుత్వ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ ఉద్యోగ, శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉద్యోగ, స్కిల్ మేళా నిర్వహిస్తున్నట్లు టీఆర్‌ఎల్‌డీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బషీర్‌బాగ్‌లోని పీజీ లా కాలేజీలో నిర్వహించనున్న మేళాలో సుమారు 80కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10వ తరగతి నుంచి ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకు వారి విద్యార్హత, స్కిల్స్‌ను బట్టి దాదాపు మూడువేలకు పైగా ఉద్యోగ నియామకాలు ఉంటాయన్నారు. స్కిల్స్ లేనివారి కోసం సుమారు 40 స్కిల్, ప్లేస్‌మెంట్ సంస్థలు పాల్గొని వారి విద్యార్హతను బట్టి వివిధ రంగాల్లో శిక్షణ, ఉద్యోగావకాశం కల్పిస్తారని తెలిపారు.

- అంతే కాకుండా ఆరు జాతీయ బ్యాంకులు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని యువ పారిశ్రామికవేత్తలకు ముద్రా, స్టార్టప్, స్టాండప్ లోన్లపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. కేంద్ర కోల్ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర నైపుణ్య అభివృద్ధి, విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి, రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, కరీంనగర్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. అభ్యర్థులు అక్కడికే వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాల్, ఓంకార్, దిలీప్, గిరి, రిషభ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోరిక్షా పర్మిట్ల జారీపై హర్షం

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలో కొత్తగా 65 వేల ఆటోరిక్షా పర్మిట్ల జారీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో శనివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రుద్రాక్ష మల్లేష్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చి హామీలను ప్రభుత్వం అమలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రవాణా రంగ, ఆటో కార్మికుల ఇచ్చిన హామీలన్నింటిని త్వరలోనే నేరవేర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే సయ్యద్ ఇబ్రహీం(25) ఫాల్స్ సీలింగ్ పనులు చేస్తుంటాడు. కొంతకాలంగా గంజాయి మత్తుకు అలవాటు పడి తరచూ పోలీసుల కళ్లు గప్పి గంజాయి సేవిస్తుండగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో ఓ ప్రాంతంలో గంజాయి సేవిస్తుండగా ఇబ్రహీంను పట్టుకొని ఆయన వద్ద నుంచి 5 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో గ్యాంగ్‌వార్

రహమత్‌నగర్: వాహనం నడిపే విషయంలో తలెత్తిన గొడవ గ్యాంగ్ వార్‌కు దారి తీసింది. దీంతో బోరబండ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ రెండు బొమ్మల వద్ద అశోక్ అనే యువకుడు శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో తన వాహనాన్ని యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అటుగా వస్తున్న ఇస్మాయిల్ అతడి స్నేహితులు అశోక్‌తో గొడవకు దిగారు. ఈ క్రమంలో వారు తమ తమ స్నేహితులను పిలిపించడంతో అది గ్యాంగ్ వార్‌కు దారితీసింది. కొందరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ ఖాళీ స్థలం విక్రయానికి యత్నం

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: ఫోర్జరీ డాక్యుమెంట్లతో నర్సరీని కొనసాగిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ సొసైటీ అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు పి.సత్యనారాయణ అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.1లో జూబ్లీహిల్స్ సొసైటీ క్లినిక్ ల్యాండ్ పక్కన 2,000 గజాల్లో జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్థలం ఉంది. ఈ స్థలాన్ని పి.సత్యనారాయణ అనే వ్యక్తి 2,000 గజాల్లో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి ఫోర్జరీ అలాట్‌మెంట్ లెటర్‌తో నర్సరీ నడుపుతున్నాడని తెలిపారు. ఇటీవల కోట్లాది రూపాయల విలువ చేసే ఈ జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్పేస్‌ను అమ్మకానికి పెట్టాడన్నారు. అతడిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ సొసైటీ అధ్యక్షుడు బి.రవీంద్రనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- 1976 నుంచి ఈ నర్సరీ కొనసాగుతున్నట్లుగా సత్యనారాయణ పేర్కొంటున్నాడని, ఈ స్థలంపై ఆయన దురుద్దేశపూర్వకంగా ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్‌కార్డు తీసుకున్నాడని.. ఇంటి నంబర్‌ను కూడా క్రియేట్ చేసి జీహెచ్‌ఎంసీకి ప్రాపర్టీ ట్యాక్స్‌ను కూడా చెల్లిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. జీహెచ్‌ఎంసీ ఓపెన్ స్పేస్‌లో ఇంటి నెంబర్ తీసుకోవడమే కాకుండా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఈ స్థలానికి కూడా అమ్మకానికి పెట్టాడని ఆరోపించారు.
- ఈ స్థలంలో నర్సరీని ఖాళీ చేయించి జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకోవాల్సిందిగా తాము కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. ఆక్రమణదారులను ఈ స్థలం నుంచి ఖాళీ చేయించాలని కోరామని అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు ఈ నర్సరీ నడుపుతున్న సత్యనారాయణ అనే వ్యక్తి తన వయస్సు ధ్రువీకరణలో కూడా తప్పుడు పత్రాలు సమర్పించాడని వెల్లడించారు. ఎంతో ఖరీదైన ఈ స్థలాన్ని విక్రయించేందుకు యత్నిస్తున్న సత్యనారాయణపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నగరంలో నేడు

- మహతి వీణ విద్యాలయం ఆధ్వర్యంలో సరస్వతి ఆరాధన కార్యక్రమం రవీంద్రభారతిలో సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఆకృతి ఎలైట్ 15వ వార్షికోత్సవం ప్రత్యేకంగా లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణాలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో వస్త్రభూషణ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ స్టైల్‌తత్వ 2025 మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- ఎన్‌సీసీ సంస్థ చైర్మన్ డాక్టర్ ఏవీఎస్ రాజు బయోగ్రఫీ పుస్తకావిష్కరణ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని అన్వయ కన్వెన్షన్స్‌లో సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది.
- కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాళాశాల ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు పిస్టుల్లా కాన్–2025 సదస్సు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వైద్య రంగంలో ఆధునిక పద్ధతులు అవసరం



గాంధీఆస్పత్రి: వైద్యరంగంలో ఆత్యాధునిక పద్ధతులు, మెళకువలను నేర్చుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని పలువురు వైద్య నిపుణులు సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో అలుమ్నీ హాలులో శనివారం ఇన్‌సైట్స్ ఆఫ్ పెయిన్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) సదస్సు నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎస్ రాజకుమారి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. పెయిన్ మేనేజ్‌మెంట్ నిపుణులు మురళీధర్ జోషీ, సుధీర్ ధార, నాగలక్ష్మి, ఉమా మహేశ్వరరావు, సచిన్‌లు అల్ట్రా సౌండ్ సియామ్ గైడెడ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఆఫ్ అబ్‌లేషన్, నొప్పి నివారణ కేంద్రంలో వైద్యసేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వైద్య విధానాలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ పద్మావతి తనవంతు సాయంగా గాంధీ పెయిన్ క్లినిక్‌కు రూ.20 లక్షల విలువైన అత్యాధునిక వైద్య యంత్రాలను వితరణగా అందించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గాంధీ అనస్తీషియా హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఆవుల మురళీధర్, ప్రొఫెసర్ కిరణ్ మాదల, అసోసియేట్ అబ్బయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావులతోపాటు పలు ప్రాంతాలకు చెందిన 150 మంది అనస్తీషియా వైద్యులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కల్పించడమే లక్ష్యం

గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇండియా



హిమాయత్‌నగర్: మనిషి జీవించే హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ ట్రస్ట్ ముఖ్య లక్ష్యమని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇండియా(జీహెచ్ఆర్‌టీ) పేర్కొంది. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ట్రస్ట్ 4వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కంటే నిరంజనయ్య, కార్యదర్శిగా బండారు శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకుని, వారిని సత్కరించి, నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ట్రస్ట్ డైరెక్టర్ డా.సయ్యదా సీమ ఫాతిమా, రాష్ట్ర అధ్యక్షులు నైనంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి తమ ట్రస్ట్ అనేక సామాజిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. ప్రజల హక్కులను రక్షించడానికి కృషి చేయడం, రక్తదానం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, జోగిని వ్యవస్థ నిర్మూలన, నిరుపేదలకు ఆర్థిక సాయం వంటి తదితర సామాజిక కార్యక్రమాలు చేపడతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ రాష్ట్ర నాయకులు షరీఫ్, రెహమాన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల్లో 'సర్జికల్' స్ట్రైక్!

- 2022 నుంచి విడుదల కాని బిల్లులు
- కొత్తగా సరఫరా తమ వల్ల కాదంటున్న గుత్తేదారులు
- గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ సహా 5 ఆసుపత్రులకు నిలిచిపోనున్న సరఫరా

మూడేళ్లుగా పేరుకుపోయిన మందులు, సర్జికల్స్ బకాయిలు



సాక్షి, సిటీబ్యూరో: వానాకాలం వస్తూ వస్తూ వ్యాధులను కూడా వెంట బెట్టుకొస్తోంది. రోగుల సంఖ్య కూడా అంతకంతకూ పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రులు, బోధనాసుపత్రుల్లో వైద్యులు, మందులతోపాటు సర్జికల్ పరికరాలు ఏమాత్రం అందుబాటులో ఉన్నాయనే అంశం కూడా తెర మీదికి వస్తోంది. ప్రధానంగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ వంటి ప్రభుత్వ బోధనాసుపత్రులకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి క్రిటికల్ కేసులు వస్తుంటాయి. దీంతో సర్జికల్ పరికరాల వినియోగం ఇక్కడ అధిక మొత్తంలోనే ఉంటుంది. గత మూడేళ్ల నుంచి వాటికి సంబంధించి సమారు రూ.36 కోట్ల బిల్లులు సప్లయర్లకు ప్రభుత్వం బకాయి పడింది. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఎన్ని దఫాలు వినతులు ఇచ్చినా స్పందన కనిపించడం లేదని, కొత్తగా మందులు, సర్జికల్స్, ల్యాబ్ పరికరాలు సరఫరా చేయలేమంటూ ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అదే జరిగితే నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి దాపురించవచ్చు.

32 మంది కాంట్రాక్టర్లు .. రూ.36 కోట్లు..

హైదరాబాద్ మెడికల్ టూరిజంలో అగ్రభాగాన ఉండటంతో జంట నగరాల నుంచే కాకుండా తెలంగాణలోని నలుమూలల నుంచి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ తదితర ఆసుపత్రులకు రోగులు పెద్ద ఎత్తున వస్తున్నారు. ఆయా బోధనాసుపత్రుల మందుల బడ్జెట్‌లోని 80 శాతం టీజీఎంఎస్ఐడీసీ సరఫరా చేస్తోంది. మిగతా 20 శాతం మాత్రం ఓపెన్ మార్కెట్‌లో టెండర్లు పిలిచి గుత్తేదారుల నుంచి తీసుకుంటారు. ఇలా 32 మంది గుత్తేదారులు సరఫరా చేసిన సర్జికల్ పరికరాలు, మందులకు మూడేళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీని విలువ సుమారు రూ.36 కోట్లు ఉంటుందని గుత్తేదారులు పేర్కొంటున్నారు. ఇందులో నిలోఫర్ రూ.13 కోట్లు, గాంధీ రూ12 కోట్లు, ఉస్మానియా రూ.11 కోట్లు, పెట్లబుర్జు మెటర్నిటీ ఆసుపత్రి రూ.2 కోట్లు, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రి రూ.కోటి ఉన్నాయి. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకపోయినా, బిల్లుల చెల్లింపుల్లో మాత్రం తీవ్రమైన జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే భవిష్యత్తులో సరఫరా చేయడం తమ వల్ల కాదని తెగేసి చెబుతున్నారు.

మా పరిస్థితి ఏమి బాగాలేదు



కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉన్నాం. మూడు నెలలో, ఆరు నెలలో అంటే సరే అనుకోవచ్చు. మూడేళ్లు దాటుతోంది. మేం అప్పులు తెచ్చి మందులు, సర్జికల్స్, ల్యాబ్ పరికరాలు సరఫరా చేశాం. కొత్తగా అప్పు ఇవ్వమంటే బ్యాంకర్లు ఇవ్వడంలేదు. బయట తెచ్చిన అప్పుల వడ్డీలు తడిపి మోపెడు అవుతున్నాయి. మా పరిస్థితి ఏమీ బాగాలేదు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరుతున్నాం.

– కేజీ రామచంద్ర, ట్విన్ సిటీస్ హాసపిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

'మహిళా దక్షత'లో బీబీఏ కోర్సు

ప్రారంభించిన గవర్నర్ సతీమణి సుధాదేవ్‌జీ వర్మ



బీబీఏ కోర్సును ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధాదేవ్ జీ వర్మ, అలుగు వర్షిణి

చందానగర్: మహిళా దక్షత సమితివిద్యా సంస్థలో సురక్షితమైన అభ్యాస వాతావరణం ఉందని రాష్ట్ర గవర్నర్ సతీమణి సుధా దేవ్ జీ వర్మ అన్నారు. శనివారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షత సమితి విద్యా సంస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన బీబీఏ కోర్సును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్.అలుగు వర్షిణి, ఇన్ఫోసిస్ హెడ్ మనీషా సబూ, టెక్ మహింద్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి పల్వి కటియార్, మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన బాలికల్లో సాధికారత కల్పించడానికి మహిళా దక్షత సమితి అంకిత భావాన్ని ప్రదర్శిస్తోందని ప్రశంసించారు. నాయకత్వం వహించే, ఆవిష్కరించే, ప్రేరేపించే శక్తి అమ్మాయిలకు ఉందన్నారు. డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ యువతుల విద్యా పునాదిని బలోపేతం చేయడం, ఆత్మవిశ్వాసం కలిగిన నిపుణులుగా, వర్ధమాన వ్యవస్థాపకులుగా మారడానికి వీలు కల్పించడానికి బీబీఏ కోర్సులు దోహదపడతాయన్నారు. దోస్త్ యాప్, కౌన్సిలింగ్ ద్వారా ఈ కోర్సులో చేరవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమన్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కేసీఆరే రాష్ట్రానికి శ్రీరామ రక్ష: సబిత



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మణికొండ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాక రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తోందని, ప్రజలంతా తిరిగి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావాలని, ఆయనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అనే ఆలోచనకు వచ్చారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన 'గుడ్ మార్నింగ్ మణికొండ' కార్యక్రమానికి వంద రోజులు పూర్తి కావటంతో శనివారం అధ్యక్షుడు డి.సీతారాం అధ్యక్షతన ప్రత్యేక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్‌ను, కేటీఆర్‌ను జైలుకు పంపాలనే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో బడేబాయ్, చోటే బాయ్ పాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి అందరివాడిలా పాలన చేయాలె తప్ప గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ గురించి మాట్లాడనిదే ఆయనకు పొద్దుపోవటం లేదన్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంపై పాఠ్య పుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉందనే కోపంతో దాన్ని తొలగించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు, ఈ కార్ రేసుకు అంతర్జాతీయ గుర్తింపును చెడగొట్టేలా ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విమాన ప్రమాదానికి కేంద్రమే బాధ్యత వహించాలి

బాధితులకు ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణుల నివాళులు

కవాడిగూడ: అహ్మదాబాద్‌లో విషాదకరమైన విమాన ప్రమాదంలో విలువైన ప్రాణాలను కోల్పోవడం ఎయిర్ ఇండియా తప్పిదమేనని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర నేతలు విజయ్ మల్లంగి, బుర్ర రాము గౌడ్, డా.అన్సారీ, ఆఫస సలాం, డా.సోలొమాన్ రాజ్ మాట్లాడుతూ కొన్ని సాంకేతిక సమస్యల దృష్ట్యా చైనా ఇప్పటికే బోయింగ్ విమానం కొనుగోళ్లకు వీడ్కోలు చెప్పిందని తెలిపారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఎయిర్ ఇండియా విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు కొవ్వొత్తులు వెలిగించి వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆప్ నేతలు మాట్లాడుతూ ఈ ప్రమాదానికి డి.జి.సి.ఎ., భారత ప్రభుత్వం, ఎయిర్ ఇండియాలలో జవాబుదారి ఎవరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అటల్ సేతు ప్రారంభించిన తర్వాత పగుళ్లు, కొత్త రైల్వే స్టేషన్ల పైకప్పులు, కూలిపోతున్నాయిని పేర్కొన్నారు. విమానశ్రయాలు, నీటి ఫౌంటెయిన్ లూమ్ మారుతున్నాయని తెలిపారు. విమాన ప్రమాదానికి బాధ్యత వహించి కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు రాజీనామా చేయాలని విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్ నేతలు లక్ష్మనాయుడు, టి.రాకేష్ సింగ్ ,రాకేష్ రెడ్డి, రహమాన్, షరీఫ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో కార్మికుల జీతాలు పెంచాలి

మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్



హిమాయత్‌నగర్: ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల టెండర్ల కాలపరిమితి ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నూతన టెండర్లను ఆహ్వానించకుండా, జీతాలు పెంచకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా విమర్శించారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం టీఎస్ఎంఎస్ఐడీసీ టెండర్లను ఆహ్వానించే సమయంలో కార్మికుల జీతాలను సక్రమంగా లెక్కించకుండా గందరగోళానికి గురి చేసినట్లు విమర్శించారు. గత టెండర్ షెడ్యూల్లో జీవో నెం.60 అని ప్రతిపాదించి ఆ జీవోను కూడా అమలు చేయకుండా తక్కువ జీతాలకు పని చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాధికారులపై, కాంట్రాక్టర్లపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే నూతన టెండర్లను ఆహ్వానించి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, యూనియన్ కార్యదర్శులు పి.సురేష్, జయలక్ష్మి, ఎస్.కిష్టమ్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


16 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీలు

దుండిగల్: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకుగాను పోటీలు నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా యువజన, క్రీడల అధికారి ఒక ప్రకటనతో తెలిపారు. హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఆయా మండలాల పరిధిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్పోర్ట్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, షటిల్ పరుగు, వర్టికల్ జంప్, 800 మీటర్ల పరుగు పందెం, మెడికల్ టెస్టులు ఉంటాయని తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల వయస్సు 8 నుంచి 9 సంవత్సరాల మధ్య ఉండాలని, విద్యార్హత పత్రం, పుట్టిన తేదీ ధృవపత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, 5 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను ఆయా మండలాల ఎంఈవోలకు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయని, ఆ తర్వాత జూలై 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, ఇతర వివరాలకు 76609 19518 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రెండు పబ్‌ల్లో ఐదుగురిపై డ్రగ్ కేసులు

గచ్చిబౌలి: పబ్‌లలో చేపట్టిన తనిఖీల్లో ఐదుగురు యువకులు డ్రగ్ తీసుకున్నట్లు తేలడంతో గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్‌లోని ఫ్రాట్ హౌస్, రోగో పబ్‌లలో పోలీసులు తనిఖీ నిర్వహించారు. టెస్టులు నిర్వహించగా ఫ్రాట్ హౌస్‌లో ముగ్గురికి, రోగోలో ఒకరికి డ్రగ్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి సేవించి పబ్‌కు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాదాపూర్ న్యాక్‌కు ప్లాటినమ్ అవార్డులు



ప్లాటినమ్, గోల్డెన్ అవార్డులను అందుకున్న న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ

మాదాపూర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) బెస్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్ కన్‌స్ట్రక్షన్ సెక్టార్ కేటగిరీలలో ప్లాటినమ్ అవార్డును అందుకుంది. ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ (ఐఐఎస్ఎం 2025) ఎక్స్‌లెన్స్ ఇన్ గవర్నమెంట్ సర్వీస్ విభాగంలో గోల్డెన్ అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలో ప్రదానం చేసిన ఈ అవార్డులను న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ అందుకున్నారు.

ఫిలిం చాంబర్ వద్ద సినీ కార్మికుల ధర్నా



నిరాహార దీక్ష చేస్తున్న కార్మిక నేతలు

బంజారాహిల్స్: సినీ కార్మికులు నిరసన బాట పట్టారు. చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీని రద్దు చేయాలని పెద్ద ఎత్తున కదిలివచ్చారు. నినాదాలతో హోరెత్తించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఇళ్ల కేటాయింపు, నిర్మాణాల్లో రూ.300 కోట్ల స్కామ్‌కు కారణమైన చిత్రపురి కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఫిలిం చాంబర్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా చెలమణి అవుతున్న వల్లభనేని అనిల్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీలో సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్‌లు మాత్రమే నిర్మించాలని, అక్రమ కట్టడాలు కూల్చివేయాలని, కోర్టు ఆదేశాలు అమలు చేయాలని నినదించారు. సొసైటీలోని అవినీతిపరులకు అండగా ఉన్న ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావును సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. కోర్టు ఆదేశాలను అమలు చేయని కో–ఆపరేటివ్ కమిషనర్‌ను, రంగారెడ్డి జిల్లా డీసీఓ సుధాకర్‌లను సస్పెండ్ చేయాలన్నారు. అనిల్‌కుమార్ సినీ కార్మికుల యూనియన్ నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు ఈశ్వర్, సంకూరి రవీందర్, రాజు, నవోదయం పార్టీ అధ్యక్షుడు శివశంకర్ పటేల్, ప్రతాని రామకృష్ణగౌడ్, మోహన్‌గౌడ్, చిత్రపురి సాధన సమితి నాయకులు కస్తూరి శ్రీనివాస్, నామాల రాము తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ సమావేశం రసాభాస

నాగేందర్, విజయారెడ్డి అనుచరుల తీవ్ర వాగ్వాదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం రసాభాస మారింది. ఎంపీ అనిల్‌కుమార్, పరిశీలకుడు వినోద్‌కుమార్ ముందే అరుపులు, కేకలతో సభ ఉద్రిక్తతకు దారితీసింది. తమను పట్టించుకోవడం లేదని, తొక్కిపెడుతున్నారని ఓ మైనార్టీ నేత ఆరోపిస్తూ ఇలాగైతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ 'వార్నింగ్'ఇస్తున్నావా'అంటూ సదరు నేతను నిలదీయడంతో ఒక్కసారిగా సమావేశం ఉద్రిక్తంగా మారింది. ఎమ్మెల్యే దానం నగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి ఒకరిపై ఒకరు పరోక్ష విమర్శలు చేసుకోవడంతో కార్యకర్తలు రెండుగా విడిపోయి ఒకరిపై ఒకరు విమర్శలకు దిగారు. విజయారెడ్డి, నాగేందర్, విజయలక్ష్మి అనుచరులు పోటాపోటీగా నినాదాలు చేస్తూ ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పరిశీలకులు వారించేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు అరగంట తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ కార్యకర్తల మనోధైర్యం దెబ్బతీయవద్దని సూచించారు. జిందాబాద్‌లు, ముర్దాబాద్‌లతో ఏమీ జరగదని, ప్రజలతో మమేకమైన వారికి మాత్రమే ఆదరణ ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు రోహిణ్‌రెడ్డి, బి.భారతీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే మున్నూరు కాపుల లక్ష్యం

డాక్టర్ కొండా దేవయ్య పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న కొండా దేవయ్య పటేల్, మహేందర్ కుమార్

కాచిగూడ: మున్నూరుకాపులు అందరూ సంఘటితమై రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలోని మున్నూరు కాపు సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్, నేతలు వాసాలి వెంకన్న పటేల్, డాక్టర్ విశాల్ పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మున్నూరు కాపుల్లో ఐక్యత లేకపోవడం వల్లే రాష్ట్రమంత్రివర్గంలో తమ వర్గం నేతకు అవకాశం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది రాజకీయ నేతలు కూడా స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాలను వాడుకుంటూ వదిలేస్తున్నారని, సంఘాల పట్ల మున్నూరుకాపుల్లో కూడా వ్యతిరేకత చోటు చేసుకుంటోందన్నారు. మున్నూరు కాపులను ఐక్యం చేయడానికి ఈ నెల 22వ తేదీన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కళాకారులకు సర్కార్ ప్రోత్సాహం: జూపల్లి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సద్గురు శ్రీ శివానంద నృత్యమాల ఆధ్వర్యంలో నృత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు సుధీర్‌రావు శిష్య బృందం వివిధ అంశాలపై చక్కటి హావభావాలతో చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులకు శాస్త్రీయ కళలను నేర్పించడం అభినందనీయమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హన్మంతరావు, సంస్థ అధ్యక్షుడు సుధీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల రక్షణకు చట్టం తేవాలి

ఎన్‌పీడీడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్

హిమాయత్ నగర్: గృహ కార్మికుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని జాతీయ గృహ కార్మికుల వేదిక(ఎన్‌పీడీడబ్ల్యూ) రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్ డిమాండ్ చేశారు. గృహ కార్మికులను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కేంద్రం ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 16న అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఇందిరా పార్క్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సభ్యులు వర్గీస్ తెక్కనాథ్‌తో కలసి పలు డిమాండ్లతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో 11 లక్షలకుపైగా గృహ కార్మికులు ఉండగా, ఒక హైదరాబాద్‌లోనే 5 లక్షల గృహ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గృహ కార్మికులు ఇళ్లలో పనిచేసే సమయంలో మహిళలు, మైనర్లు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో 4 వేలకుపైగా హింసాత్మక కేసులు నమోదయ్యాయని వారు తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన గృహ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నేతలు అన్ జోసెఫ్, శంకర్, రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ కోల్డ్ రూమ్

- ఒక్కరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం
- నిమ్స్ ఆసుపత్రిలో ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



నిమ్స్‌లో రక్తదానం చేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి రవిశేఖర్ రెడ్డి

లక్డీకాపూల్: ఒక్కరి రక్తదానంతో మరో ముగ్గురి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు అన్నారు. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని పేర్కొంటూ అమ్మ జన్మనిస్తే రక్తదాత పునర్జన్మనిస్తారని పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా నిమ్స్‌లో వెయ్యి బ్లడ్ యూనిట్ల భద్రత సామర్థ్యం కలిగిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోల్డ్ రూమ్‌ను మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. వైద్య విద్యార్థులు, ఫిజియోథెరపీ, అలైడ్ హెల్త్ పారామెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ నిమ్స్‌లో బ్లడ్ కొరత లేకుండా ప్రాణపాయస్థితిలో వచ్చే రోగులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా బ్లడ్ బ్యాంక్‌ను మరింత బలోపేతం చేశామన్నారు. ఈ సందర్భంగా 75 సార్లు రక్తదానం చేసిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి తదితర రక్తదాతలను ప్రశంస పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ ప్రొ.డి శాంతి, డా.మురళీకృష్ణ , డా.మహేష్ కుమార్, పారా మెడికల్ యూనియన్ కార్యదర్శి బిడుగు శేఖర్, సిబ్బంది వెంకటరత్నం, నాగేశ్వర్ రావు, భాస్కర్ రెడ్డి, సుజాత, చిరంజీవి, సేతులక్ష్మి, రేచల్ , నీరజ, అలైడ్ హెల్త్ సైన్సు కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్య గౌడ్, తలసీమియా గ్రూప్ ప్రతినిధులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 15, జూన్, 2025

ఉల్లాసంగా సైక్లోథాన్..



అమీర్‌పేట : ప్రపంచ యోగా డే సందర్భంగా సైక్లోథాన్ నిర్వహించారు. తెలంగాణ యోగాధ్యాయణ పరిషత్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని ప్రకృతి ఆస్పత్రి నుంచి నెక్లెస్ రోడ్డు వరకూ జరిగిన సైక్లోథాన్‌ను ట్రాఫిక్ డీజీ జోయల్ డెవిస్ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. సైక్లోథాన్ లో పాల్గొన్న హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సభ్యులందరికీ జోయల్ డెవిస్ మెమెంటోలు అందజేశారు. సైకిల్ థాన్ ఆద్యంతం ఉల్లాస భరితంగా సాగింది. నేటి ఆధునిక ప్రపంచంలో యోగా ప్రత్యేకతను ప్రజలకు వివరించే ప్రయత్నం సంతోషకరమని అన్నారు. సైక్లోథాన్‌లో కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకూ ప్రయాణం చేసిన ఐదుగురు సైక్లిస్టులు పాల్గొన్నారు. 2021 నుంచి 2023 సంవత్సర మధ్యకాలంలో కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ సైకిల్‌పై వెళ్లిన రవీందర్ నందనూరి, జన్నీ గాంధీ, రేఖా సోలంకి, లావణ్య సైక్లోథాన్‌లో పాల్గొన్నారు. వేమన యోగా పరిశోధనా సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నాగలక్ష్మి, కో–ఆర్డినేటర్ డాక్టర్ భానుకిరణ్, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ట్రంఫెట్ ఫెస్టివల్ ర్యాలీ..

రాంగోపాల్‌పేట్: ట్రంఫెట్ ఫెస్టివల్ ఫెలోషిప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎస్పీ రోడ్డులోని వెస్లీ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైన ఈ ర్యాలీలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ ఇండిపెండెంట్ మోడరేటర్ విల్సన్ సింగం, సీఎస్ఐ మెదక్ డయాసిస్ వైస్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ విన్‌స్టన్, బిషప్ డాక్టర్ బక్క ఏలియా, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమాతో పాటు నగరానికి చెందిన వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. యేసు క్రీస్తు రెండో రాకడ గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వెస్లీ కళాశాల నుంచి ఈ ర్యాలీ సాగింది.



ఆర్పీఎల్ కెప్టెన్‌గా మోరెనో

వైస్ కెప్టెన్లుగా ప్రిన్స్ ఖత్రి, మాక్స్ రాడిక్
జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్‌కు జట్టు సిద్ధం

సాక్షి, సిటీ బ్యూరో: జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్పీఎల్) బరిలో నిలిచిన హైదరాబాద్ హీరోస్ జట్టు కెప్టెన్‌గా స్పానిష్ సూపర్ స్టార్ మాన్యుయెల్ మోరెనో నియమితుడయ్యాడు. అతనికి తోడుగా భారత స్టార్ ఆటగాడు ప్రిన్స్ ఖత్రి, జర్మనీకి చెందిన మాక్స్ రాడిక్ వైస్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత అంతర్జాతీయ రగ్బీ లీగ్ ఆర్పీఎల్‌లో అంతర్జాతీయ రగ్బీ స్టార్లు దేశంలోని అత్యుత్తమ ప్రతిభావంతులతో కలిసి ఆడనున్నారు. ముంబయిలోని అంధేరి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఈ లీగ్ ప్రారంభమవుతోంది. కెప్టెన్‌గా ఎంపికవడంపై మోరెనో సంతోషం వ్యక్తం చేశాడు. 'రగ్బీ ప్రీమియర్ లీగ్ పరిచయం చేసినందుకు జీఎంఆర్ గ్రూప్, రగ్బీ ఇండియాకు ధన్యవాదాలు తెలిపారు కేఎల్ఓ స్పోర్ట్స్ సహ యజమాని శ్రీనాథ్ చిటూరి.



మార్ఫా సంగీతం..

నగరంలో అబ్బురపరుస్తున్న రిథమిక్ ట్యూన్స్





విన్యాసాల వాయిద్యం..

గణేష్ చతుర్థి ఊరేగింపులైనా.. పెళ్లి వేడుకలైనా.. నగరాన్ని సందర్శించే ప్రముఖులను స్వాగతించాలన్నా టక్కున గుర్తొచ్చేది మార్ఫా బ్యాండ్. ఈ ఉల్లాసభరితమైన సంగీతం లేకపోతే హైదరాబాద్ సంప్రదాయం అసంపూర్ణమే. పాతబస్తీలో అందాల రాణులతో నృత్యం చేయించి, కొడుకు పెళ్లిలో నాగార్జునతో డ్యాన్స్ చేయించి.. తరాలకు, ప్రాంతాలకు అతీతంగా అలరించే శక్తి తనదని నిరూపించుకుంటోంది మార్ఫా సంగీత వాయిద్యం.. ఆఫ్రో, అరబ్ సంప్రదాయం నుంచి శతాబ్దాల క్రితం వలస వచ్చిన ఈ సంగీతం భాగ్యనగర సంస్కృతిలో భాగమైపోయింది. నగరంలో జరిగే ప్రతి వేడుకలోనూ తన ప్రశస్తిని చాటుకుంటోంది..

– సాక్షి, సిటీబ్యూరో

- ఆఫ్రో, అరబ్ సంప్రదాయం నుంచి హైదరాబాద్‌కు
- మిస్ వరల్డ్ పోటీదారులను ఆకట్టుకున్న మ్యూజిక్
- బారాత్‌లలో రహదారులపై విన్యాసం
- గోల్కొండ కోటలో వేడుకలకు నేపథ్యం
- నగర చరిత్రతో శతాబ్దాలుగా మమేకం
- మార్ఫా సంగీతం.. ఓ సంప్రదాయ సంబరం..

సంస్కృతి, సంప్రదాయాలకు అతీతంగా కుల, మత సంబంధం లేకుండా అభిమానులున్న నగరానికి చెందిన మార్ఫా సంగీతం ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు పొందుతోంది. మధ్యప్రాచ్యంలో మార్ఫా ప్రదర్శనలు జరుగుతుంటే, మరోవైపు ఇటీవలే న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ వంటి ప్రదేశాల్లో ఔత్సాహికుల నృత్యాలతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది.





ఆహార్యం నుంచి వైవిధ్యం..

తల చుట్టూ ఎర్రటి చెక్కిన స్కార్ఫ్‌లు చుట్టుకుని, తెల్లటి కుర్తాలు, లుంగీలను మార్ఫా కళాకారులు ధరిస్తారు. ఈ కళాకారులు రాత్రిపూట, నిర్విరామంగా మూడు నుంచి ఆరు గంటల పాటు నిలబడి ప్రదర్శనలు ఇస్తారు. మెడలో బరువైన ఢోలక్ మోస్తూనే లయకు అనుగుణంగా నృత్యం చేయాలి. ఉత్సవాలు, ఊరేగింపుల్లో తీవ్ర అలసట కారణంగా మార్ఫా కళాకారుల నోటి నుంచి రక్తస్రావం, అనారోగ్యానికి గురికావడం జరుగుతుంటుంది. మార్ఫా బ్యాండ్‌లో సంప్రదాయంగా 8, 12, 16, 22 మంది సభ్యులు ఉంటారు. ప్రేక్షకుల ఆదరణ మేరకు, బృందంలోని కొంతమంది సభ్యులు నృత్యం చేయవచ్చు. వారి సహచరులు వాయిద్యాలను వాయించేటప్పుడు అత్యంత ప్రజాదరణ పొందిన డాగర్ డ్యాన్స్ చేయాల్సి ఉంటుంది. దీనిలో ఒక కళాకారుడు కత్తిని గాలిలోకి ఊపుతూ నర్తిస్తుంటే, ఇతర సంగీతకారులు క్రమంగా బీట్ టెంపోను పెంచుతారు.

వైవిధ్యభరిత వాయిద్యాల సమ్మేళనం..

మార్ఫా సంగీతంలో 'మార్ఫా, సవారీ, నాగిన్, యాబు బక్కే రబు సాలా' వంటి వివిధ శైలితో కూడిన రిథమ్స్ ఉన్నాయి. ప్రతి ఒక్కటీ దానికంటూ సొంత విలక్షణమైన వైవిధ్యంతో అలరిస్తాయి. ఈ సంగీతం అనేక వాయిద్యాల సహాయంతో పలకిస్తారు. ప్రధానంగా మార్ఫాలు (ఢోలక్, డాఫ్ అని పిలుస్తారు). వీటిని సంగీతకారులు 'థాపి' అని పిలిచే చెక్క స్ట్రిప్‌లతో కొడతారు. వీరి పూర్వీకులు మేక చర్మంతో తయారు చేసిన మార్ఫాలపై కొట్టేవారు. నేటి కళాకారులు వాయించడం సులభం. ఖర్చు తక్కువ అవుతుందిని ఫైబర్ వాయిద్యాలు ఇష్టపడతున్నారు. కొన్ని విభిన్న వాయిద్యాలను కందూర, ముషాద్ జెట్బా, మార్ఫాలు, బిండియా పీటల్ అని పిలుస్తారు. వాటిలో ఎక్కువ భాగం ఢోలక్‌ను పోలి ఉన్నప్పటికీ పరిమాణంలో తేడాలుంటాయి. 'కళాకారులకు వారు వాయించడానికి ఎంచుకున్న వాయిద్యం ఆధారంగా వేతనం చెల్లిస్తారు' అని కళాకారులు చెబుతున్నారు.



చరిత్రతో మమేకం..

ఈ మార్ఫా బ్యాండ్‌లు తరచూ జెండా మార్చ్‌ల వంటి కార్యక్రమాలకు నియమించుకుంటారు. ఇటీవల మిస్ వరల్డ్ పోటీదారుల పాతబస్తీ సందర్శన సందర్భంగా వారికి మార్ఫా సంగీతం స్వాగతం పలికింది. నిజాం పాలనలో నగరానికి చేరుకుందీ యెమెన్ కళారూపం. ఈ కళారూపాన్ని నగరానికి ఎవరు పరిచయం చేశారు? అనే దానిపై కొంత వివాదం ఉంది. ఇది తీసుకొచ్చింది సిద్దిలు (ఆఫ్రికన్ సంతతికి చెందిన వారు) అని కొందరు చెబుతుండగా, దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చింది యెమెన్ పూర్వీకులేనని కొందరు అంటున్నారు.

కళాకారులు ఏమంటున్నారు?

'నిజాం పాలనలో వేడుకల సందర్భాల్లో ఈ వాయిద్యాన్ని వినియోగించేవారు. నేటికీ గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో మార్ఫా తప్పనిసరి' అని మార్ఫా కళాకారుడు కయ్యూమ్ బిన్ ఒమర్ చెప్పాడు. గత 28 సంవత్సరాలుగా ఈ వృత్తిలో ఉన్న ఒమర్ ప్రారంభంలో 70–80 మంది మార్ఫా బృందం ఉండేది. అయితే ప్రస్తుతం ఆ సంఖ్య 15కి తగ్గింది. మొత్తంగా చూస్తే ఇప్పటికీ మంచి ఆదాయాన్ని సంపాదిస్తున్నామనీ, తెలుగు రాష్ట్రాల వెలుపల కొన్ని ప్రదర్శనలు ఇస్తున్నామని ఒమర్ అంటున్నాడు.

డాగర్ డ్యాన్స్ హైలెట్..

సాంప్రదాయ యెమెన్ నృత్యరూపం డాగర్ డ్యాన్స్‌కు అత్యంత డిమాండ్ ఉందని అరబి మార్ఫా బ్యాండ్ యజమాని మొహమ్మద్ యూసుఫ్ చెప్పారు. అయితే, నిజమైన కత్తులకు బదులు ప్రస్తుతం ప్లాస్టిక్ లేదా చెక్క కత్తులను వినియోగిస్తున్నారు. 'గతంలో కొంతమంది ప్రేక్షకులు మద్యం మత్తులో కత్తులను లాక్కొని, ఇతరులను ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కత్తుల వినియోగాన్ని నిషేధించింది, కానీ సంప్రదాయాన్ని సజీవంగా ఉంచడానికి చెక్క లేదా ప్లాస్టిక్ కత్తులను ఉపయోగిస్తున్నాం' అని మహమ్మద్ చెప్పారు.



కళను సజీవంగా ఉంచేందుకు..

'నా పేరు ఫిరోజ్. కానీ అందరూ నన్ను జాబ్రీ అని పిలుస్తారు. చిన్నతనం నుంచి అంటే 24 సంవత్సరాలుగా మార్ఫా ప్లే చేస్తున్నా. నగరంలో ముఖ్యంగా బార్కాస్ ఏసీ గార్డ్స్ వంటి ప్రదేశాల్లో మార్ఫా ప్రసిద్ధి చెందింది. నిజాంల కింద పనిచేసిన యెమెన్ సైనికుల ద్వారా 200 ఏళ్ల క్రితం మార్ఫా నగరానికి వచ్చిందంటారు. అదేమో గానీ మా పెద్దలు ఈ కళను నాకు అందించారు. దీనిని సజీవంగా ఉంచడానికి నా వంతు కృషి చేస్తున్నా. నా బృందంలో 20 మంది సభ్యులున్నారు. నగరం అంతటా వివాహాలు, వేడుకల్లో ప్రదర్శనలు ఇస్తాం. మతాలకు అతీతంగా ఆహ్వానిస్తారు. ఇతర రాష్ట్రాలకూ వెళ్తుంటాం. కేవలం వారసత్వాన్ని సజీవంగా ఉంచాలన్నదే మా ఆలోచన. **– ఫిరోజ్ మార్ఫా ఆర్టిస్ట్ (సోషల్ మీడియా పోస్ట్ నుంచి)**

నాన్నకు నేనంటే ప్రాణం..

- రక్తదానంపై తండ్రి నుంచి స్ఫూర్తి పొందిన సంపత్ కుమార్..
- ఇప్పటివరకూ అనేక మందికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచి
- తండ్రికి ఉత్తమ కొడుకుగానే కాకుండా, డాక్టర్ వృత్తి వైపు కూతురి ప్రోత్సాహం
- నేడు ఫాదర్స్ డే నేపథ్యంలో

నాన్న.. అమ్మతో పోల్చితే నాన్నెందుకో కాస్త వెనుకబడ్డారు అంటుంటారు. కానీ తన పిల్లలు ముందుండాలని తపనతో నాన్న కాస్త వెనుకబడి ఉంటారు, వారి వెనకే ఉంటారు. పిల్లల ప్రతి విజయం వెనక, వారి ప్రతి లక్ష్యం వెనుక కనిపించని నా అన్న కృషే నాన్నది. నాన్న ఒక బాధ్యత, ఒక ముందు చూపు. అలాంటి నాన్నకి ఏం చేస్తే రుణం తీరుతుంది అనుకున్నారో ఏమో.. తన తండ్రి ఒక్కసారి ప్రాణం పోసి జన్మనిస్తే, తాను మాత్రం అనేక సార్లు రక్తదానం చేసి పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నారు డా.సంపత్ కుమార్.

– సాక్షి, సిటీ బ్యూరో



ఎన్ని గొప్ప పనులైనా చేయ్యి.. రక్తదానానికి మించింది లేదు అని తన తండ్రి చెప్పిన మాట నుంచి స్ఫూర్తి పొంది.. అనేక సార్లు రక్తదానం చేసి తండ్రి పై తన ప్రేమను చాటుకుంటున్నారు. నేటి ఫాదర్స్ డే నేపథ్యంలో తండ్రికి తనంటే ప్రాణం.. ప్రాణం పోయడం అంటే తనకి ఇష్టం అంటున్నారు సంపత్ కుమార్.

తండ్రికి తగ్గ తనయుడు..

సుమారు 25 ఏళ్ల క్రితం రక్తదానం గురించి తన తండ్రి కోట మోహన్ రావు చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుందన్నారు నగరానికి చెందిన సంపత్ కుమార్. నాన్న నింపిన స్ఫూర్తితో అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక మరణించిన వ్యక్తి చావుతో ఒక ఉద్యమంగా రక్తదానాన్ని చేస్తూ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 10, 50, 100 కాదు.. ఏకంగా 322 సార్లు రక్తంతో పాటు ప్లేట్లెట్స్, ప్లాస్మా, డబ్ల్యూబీసి దానం చేసి ప్రాణదాతగా నిలుస్తున్నారు. నాన్న నాకు పోసిన ప్రాణం కొన్ని వందల మందికి ప్రాణాలు నిలిపే వారధిగా నిలవడమే తన లక్ష్యమని, ఇదే తన తండ్రికి తీర్చుకునే రుణమని చెబుతున్నారు. ప్రతి ఏడాది ఫాదర్స్ డే రోజు ఒక గొప్ప కొడుకుగా సంతృప్తిగా ఉండడానికి ఈ రక్తదానం కారణంగా నిలుస్తుందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.



నేను ప్రాణం నిలుపుతా, తాను ప్రాణం పోస్తుంది..

నాన్న కోరికకు అనుగుణంగా అనేక సార్లు రక్తదానం చేసిన వ్యక్తిగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. రక్తదానంతో ప్రాణదాతగా నిలిస్తే.. అసలు ప్రాణదాత డాక్టర్ అని నా నమ్మకం. అందుకే నేను డాక్టర్ కాలేకపోయినా నా కూతురిని డాక్టర్‌ని చేసి అటు ఒక తండ్రికి కొడుకు గానూ, ఇటు ఒక కూతురికి తండ్రిగానూ నా వంతు బాధ్యతను నిర్వహించాను. నా కోరికకు అనుగుణంగా నా కూతురు కోట శృతి మెడిసిన్ పూర్తి చేసి డాక్టర్‌గా ఎంతో మంది ప్రాణాలను కాపాడే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

– సంపత్ కుమార్, హైదరాబాద్.

సై'టెక్' సెన్స్.. హ్యాక్ ఫ్రిక్స్..

సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధికి బాటలు వేసుకోవాలనే యువ సత్తా అక్కడ ప్రకాశించింది. ఆలోచనలే ఆయుధమైతే ఆవిష్కరణలకు సృజనే హద్దు అనే వాస్తవం ప్రతిబింబించింది. నగరంలోని హయత్‌సాగర్ అప్పాజంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎల్ఐఇటీ)వేదికగా శనివారం నిర్వహించిన హ్యాక్ ఫ్రిక్స్ సీజన్–2 ఆకట్టుకుంది. సాంకేతిక అద్భుతాలను సాకారం చేయడంలో విద్యార్థుల మేధను పరీక్షించేందుకు నిర్వహించిన ఈ కాంటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 85కి పైగా నగరాల నుంచి 500కి పైగా విద్యార్థులు తరలివచ్చారని ఎల్ఐఇటీ వైస్ చైర్మన్ తాసీఫ్ అహ్మద్ తెలిపారు. ఉత్తర, ఈశాన్య ప్రాంతాల నుంచి అత్యధికంగా వచ్చారని, కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, డేటా సైన్స్ మొదలైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వారి నైపుణ్యాల ఆధారంగా విద్యార్థులు 36 గంటల్లో ప్రాజెక్ట్ సిద్ధం చేసి, అభివృద్ధి చేయడంలో పోటీ పడ్డారని వివరించారు. ఈ పోటీ విజేతకు రూ. 1,25,000 పైగా విలువైన బహుమతులు అందుతాయన్నారు.



క్లుప్తంగా...

కేటీఆర్‌పై కేసు నమోదు

- ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఆ పార్టీకి చెందిన శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డిపై కూడా కేసు నమోదు అయింది. సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వీరిపై ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులూ బుధవారమే నమోదైనా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేటీఆర్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయని వెంకట్ తన ఫిర్యాదుతో పేర్కొన్నారు. బల్మూరి వెంకట్ బుధవారమే బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పైనా మరో ఫిర్యాదు చేశారు. ఆయన 'ఎక్స్'ఖాతా ద్వారా అనుచిత పోస్టులు చేశారనేది ఆరోపణ.

బీసీ రిజర్వేషన్ల కోసం 'తెలంగాణ జాగృతి' పోరు

- ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 17న మెదక్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. అవసరమైతే ధర్నాలు, రైల్‌రోకో, బంద్ వంటి నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. శనివారం తన నివాసంలో కవిత మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. బీజేపీకి కూడా బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని కవిత ఆరోపించారు. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని, సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని కవిత దిశానిర్దేశం చేశారు. బీజేవైఎం నాయకుడు సాయినాథ్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు శనివారం తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కవిత కండువా కప్పి ఆహ్వానించారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్‌రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని కవిత విమర్శించారు.

బీఆర్ఎస్‌లో నీ స్థానం ఏంటో తెలుసుకో..

- ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఫైర్

సాక్షి, హైదరాబాద్: అసలు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏ పార్టీలో ఉన్నారని చెప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. ఆమె బీఆర్ఎస్‌లో ఉంటే తెలంగాణ భవన్‌కు ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. 'ఇంటికి పోతే తండ్రి పలకరించడం లేదు. ఆఫీసుకు పోతే అన్న మొహం చూడటం లేదు. ఫామ్‌హౌస్‌లోకి ఎంట్రీలేక ఆమె విలవిల్లాడుతోంది. సొంత ఆఫీసులో పెయిడ్ ఆర్టిస్టులతో పిచ్చి సమావేశాలు పెట్టి సొల్లు పురాణం చెప్తోంది. ముందు బీఆర్ఎస్‌లో దెయ్యాలు ఎవరో, కోవర్టులు ఎవరో తేల్చుకుని ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడితే బాగుంటుంది' అని హితవు పలికారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో సత్యం మీడియాతో మాట్లాడారు. కవిత తండ్రి కాంగ్రెస్ పార్టీలో స్కూల్, టీడీపీలో కాలేజీ చదివి, బీఆర్ఎస్‌లో ఉద్యోగం సరిగా చేయలేక అక్రమాలకు పాల్పడి డిస్మిస్ అయ్యాడని ఎద్దేవా చేశారు. ఆర్నెల్లు తిహార్ జైల్లో ఉండి వచ్చిన కవిత తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడుతున్నారని, పరిపాలన ఎలా చేయాలో రేవంత్‌కు బాగా తెలుసునని పేర్కొన్నారు. రేవంత్‌నుద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సత్యం డిమాండ్ చేశారు.

నీట్ యూజీ తెలంగాణ టాపర్

కాకర్ల జీవన్‌సాయి

జాతీయస్థాయిలో 18వ ర్యాంకు.. టాప్ 100లో ఐదుగురు తెలంగాణ విద్యార్థులు



కార్తీక్ రామ్ కిరీటి | షణ్ముఖ నిశాంత్ | మంగరి వరుణ్ | షణ్ముఖ్ | పాదిలపు అవినాష్ | శివ మణిదీప్

సాక్షి, హైదరాబాద్/అమరావతి: దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ ప్రవేశ, అర్హత పరీక్ష (నీట్-యూజీ)లో రాజస్తాన్‌కు చెందిన మహేశ్‌కుమార్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా కాకర్ల జీవన్ సాయికుమార్ మెరిశాడు. అతడికి జాతీయ స్థాయిలో 18వ ర్యాంకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నేషనల్ 19వ ర్యాంకు సాధించిన కార్తీక్ రామ్‌కిరీటి నిలిచాడు. నీట్ యూజీ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం విడుదల చేసింది. టాప్ వంద లోపు తెలంగాణ నుంచి 5 మంది, ఏపీ నుంచి ఆరుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారిలో మొత్తంగా బాలుర కంటే బాలికలే అధికంగా ఉన్నప్పటికీ టాప్ 10 ర్యాంకుల్లో 5వ ర్యాంకు సాధించిన ఢిల్లీ విద్యార్థిని అవికా అగర్వాల్ ఒక్కరే బాలిక ఉండటం గమనార్హం. ఎంబీబీఎస్‌తో పాటు బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ యూజీ-2025 పరీక్షను ఎన్‌టీఏ మే 4న నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 22.76 లక్షల మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 22,09,318 మంది పరీక్ష రాశారు. వారిలో 12,36,531 మంది అర్హత సాధించారు. టాప్ 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులంతా జనరల్ కేటగిరీవారే. వచ్చే నెలలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సత్తా చాటిన తెలంగాణ విద్యార్థులు

తెలంగాణ రాష్ట్రం నుంచి 72,094 మంది నీట్ యూజీ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 70,259 మంది పరీక్ష రాశారు. వీరిలో 41,584 మంది అర్హత సాధించారు. అంటే 59.2 శాతం మంది అర్హత సాధించారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే తక్కువే. నీట్-యూజీ 2024లో 77,848 మంది పరీక్ష రాయగా, 47,356 మంది అర్హత సాధించారు. జాతీయ స్థాయిలో కూడా 2024 కన్నా 2025లో పరీక్ష రాసిన వారు, అర్హత సాధించినవారు తక్కువగానే ఉండడం గమనార్హం. తెలంగాణ నుంచి నేషనల్ టాప్ 100 ర్యాంకుల్లో కాకర్ల జీవన్ సాయికుమార్ (18), షణ్ముఖ నిశాంత్ అక్షింతల (37), మంగరి వరుణ్ (46), యండ్రపాటి షణ్ముఖ్ (48), బిదిష మజీ (95) ఉన్నారు. కాగా, జాతీయ స్థాయిలో టాప్ 20 మహిళా టాపర్లలో తెలంగాణ నుంచి బిదిష మజీ తోపాటు 108వ ర్యాంకు సాధించిన బ్రాహ్మణి రెండ్లకు స్థానం లభించింది. ఓబీసీ-నాన్ క్రీమీలేయర్ (ఎన్‌సీఎల్) కేటగిరీలోని టాప్ 10లో 46వ ర్యాంకు సాధించిన మంగరి వరుణ్‌కు చోటు దక్కింది. టాప్-10 ఎస్సీ కేటగిరీలో 147 ర్యాంకు సాధించిన రెడ్డిమల్ల శ్రీకాంత్ ఉన్నాడు. టాప్ 10 ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 377 ర్యాంకు సాధించిన పుజారి హాసిని, 1,178 ర్యాంకు సాధించిన బానోత్ ధీరజ్ కుమార్ ఉన్నారు.

ఏపీ నుంచి 36,776 మంది అర్హత

నీట్ యూజీ-2025లో ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది అర్హత సాధించారు. టాప్-100లో ఆరు ర్యాంకులు సొంతం చేసుకున్నారు. ఏపీ నుంచి ఈసారి 59,219 మంది దరఖాస్తు చేసుకోగా, 57,934 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 36,776 మంది అర్హత సాధించారు. 19వ ర్యాంకుతో దర్భా కార్తీక్ రామ్ కిరీటి రాష్ట్ర టాపర్‌గా నిలిచాడు. కొడవాటి మోహిత్ శ్రీరామ్ (56), దేశిన సూర్యచరణ్ (59), పాదిలపు అవినాష్ (64 ఓబీసీ), యర్రా సమీర్ కుమార్ (70 ఓబీసీ), తుమ్మూరి శివ మణిదీప్ (92 ఓబీసీ) 100 లోపు ర్యాంకులు సాధించారు. వీరుగాక కారుమంచి విక్రాంత్ జాతీయ స్థాయిలో 262 ర్యాంకుతో పాటు ఎస్సీ కేటగిరీలో 9వ స్థానంలో నిలిచాడు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కలిపి మొత్తం 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో దాదాపు 56 వేలు, ప్రైవేటు కాలేజీల్లో 52 వేల వరకు సీట్లు ఉన్నాయి. ఏపీలో 18 ప్రభుత్వ, 18 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 6,500 వరకు ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 15 శాతం సీట్లు ఆలిండియా కోటాకు పోగా, మిగిలిన 85 శాతం సీట్లను రాష్ట్ర కోటా కింద భర్తీ చేస్తారు.

కార్డియాలజిస్ట్ లేదా స్కల్ సర్జన్ అవుతా

తొమ్మిదో తరగతి నుంచే న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదవాలనుకునే వాడిని. అదిప్పుడు నెరవేరుతోంది. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదివి, అనంతరం పీజీ కార్డియాలజీ లేదా స్కల్ సర్జన్ రెండింటిలో ఒకటి చేసి వైద్య సేవలందించడమే నా లక్ష్యం. మా నాన్న డాక్టర్ డీఎస్ అరుణ్‌కుమార్ ఈఎన్‌టీ సర్జన్. అమ్మ లత గృహిణి.

– డి. కార్తీక్‌రామ్ కిరీటి, ఆలిండియా ఓపెన్ కేటగిరీ 19వ ర్యాంకు, రాజమహేంద్రవరం

నీట్ యూజీ-2025 మార్కులు, విద్యార్థుల సంఖ్య

మార్కులు	విద్యార్థుల సంఖ్య
601 - 650	1,259
551 - 600	10,658
501 - 550	39,521
451 - 500	69,503
401 - 450	88,239
351 - 400	1,05,578
301 - 350	1,26,935
251 - 300	1,57,952
201 - 250	1,98,346
144 - 200	3,03,040

నీట్ యూజీ-2025 వివరాలు

దరఖాస్తులు	22.76 లక్షలు
పరీక్షకు హాజరైనవారు	22,09,318
అర్హత సాధించినవారు	12,36,531
రిజర్వేషన్లవారీగా యూఆర్/ఈడబ్ల్యూఎస్	3,38,728
ఓబీసీ	5,64,611
ఎస్సీ	1,68,873
ఎస్టీ	67,234
ఈడబ్ల్యూఎస్	97,085
ఉన్నత వర్గాలు	3,673

686 మార్కులకు మొదటి ర్యాంకు

నీట్ యూజీ-2025 పరీక్ష మొత్తం 720 మార్కులకు నిర్వహించగా, 651 నుంచి 686 మధ్య మార్కులు వచ్చిన వారు 73 మంది ఉన్నారు. అంటే జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిన రాజస్తాన్‌కు చెందిన మహేశ్ కుమార్‌కు 686 మార్కులు వచ్చే అవకాశం ఉంది. మొత్తం అర్హత సాధించిన వారిలో 7.2 లక్షల మంది బాలికలు ఉండగా, 5.14 లక్షల మంది బాలురు ఉన్నారు.

నీట్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య జయభేరి

సాక్షి, హైదరాబాద్: నీట్-2025 ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించి శ్రీచైతన్య జయభేరి మోగించిందని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. టాప్ ర్యాంకుల్లోనూ, టోటల్ ర్యాంకుల్లోనూ అగ్రస్థానంలో దూసుకెళ్లిందన్నారు. ఆలిండియా 1వ ర్యాంకు కవిష్ (జనరల్-ఈడబ్ల్యూఎస్), 5వ ర్యాంకు దివ్య (ఎస్సీ), 6వ ర్యాంకు మహమ్మద్ సమీర్ (ఓబీసీ), 8వ ర్యాంకు ధీరజ్‌కుమార్ (ఎస్టీ), 10వ ర్యాంకు మంగరి వరుణ్ (ఓబీసీ-ఎన్‌సీఎల్), ఆలిండియా టాప్ 10లోపు 5 ర్యాంకులు శ్రీచైతన్య క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ విద్యార్థులేనని వెల్లడించారు. నాణ్యమైన శిక్షణ అందిస్తూ, అనితర సాధ్యమైన ప్రోగ్రాములు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్స్, దేశంలోనే టాప్ ఫ్యాకల్టీ కారణంగానే ఇంతటి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. నీట్-2052 ప్రశ్నపత్రం కష్టంగా ఉన్నా కూడా సీటు సాధించే విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే 15 శాతం ఎక్కువగా పెరగడం అనేది తమ కోచింగ్ సామర్థ్యానికి నిదర్శనంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100 లోపు అత్యధిక ర్యాంకులు శ్రీచైతన్య విద్యార్థులే సాధించడం పట్ల సుష్మ హర్షం వ్యక్తం చేశారు. ఇన్ఫినిటీ లెర్న్ టెక్నాలజీ సహాయంతో అందించిన అత్యుత్తమ శిక్షణ వల్ల తమ లాంగ్ టర్మ్ విద్యార్థులు కూడా అత్యధిక సంఖ్యలో ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. నీట్-2026కు సరికొత్త ఏఐ టెక్నాలజీతో నీట్ వైద్య లాంగ్ టర్మ్ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

నీట్‌లో 'అల్ఫోర్స్' అఖండ విజయం

కొత్తపల్లి (కరీంనగర్): జాతీయస్థాయిలో శనివారం ప్రకటించిన నీట్-2025 ఫలితాల్లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో సత్తా చాటారని విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. నీట్‌లో వి.శశాంక్ రెడ్డి 599 మార్కులు సాధించగా, బి.వర్షిత్ 556, అదిబాపిర్దోజ్ 553, జె.మైథిలి 535, ఎండీ అఫ్నాన్ 513, బి.భువనవృతి 508, ఏ.సాత్విక 507, జే.అనూష 500 మార్కులు సాధించినట్లు తెలిపారు. నీట్ కోచింగ్‌లో 'డాక్టర్స్-30' ప్రత్యేక ప్రోగ్రాం ద్వారా కోచింగ్ ప్రారంభించిన మూడేళ్లలో అల్ఫోర్స్ విజయ పరంపర కొనసాగుతోందన్నారు. 8 మంది విద్యార్థులు 500కు ఆపై మార్కులు సాధించారని, సుమారు 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.

నీట్-2025 ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం

విద్యారణ్యపురి: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్-యూజీ-2025) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి శనివారం తెలిపారు. నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయి అన్ని కేటగిరీలు కలిపి పి.సాయిదివ్యాస్ ఆల్ ఇండియాలో 14వ ర్యాంకు, బి.ప్రియాంక 100వ ర్యాంకు, ఎం.వినయ్ 226వ ర్యాంకు, బి.గణేశ్ 671వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 210 మందికిపైగా విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించేలా ర్యాంకులు తెచ్చుకున్నారని వెల్లడించారు.

నీట్ ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విజయభేరి

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్-2025 ఫలితాల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులతో విజయభేరి మోగించినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కేటగిరీల్లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు కె.విక్రాంత్ 9వ ర్యాంకు, ఎస్.మనస్విని 49వ ర్యాంకు, ఆర్.తరుణ్‌కుమార్ 51వ ర్యాంకు, షేక్ వసీమా 80వ ర్యాంకు, ఎస్పీ జడ్సన్ 108వ ర్యాంకు, పి.సంజన 182వ ర్యాంకుతో పాటు ఆరుగురు విద్యార్థులు ఆలిండియా 200లోపు ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు.

నీట్‌లో 'రెసోనెన్స్' ఘనవిజయం

మాదాపూర్ (హైదరాబాద్): నీట్-2025 ఫలితాలు ర్యాంకుల గణాంకాలు మాత్రమే కావని, కుటుంబం ఆశలు నెరవేరడమని రెసోనెన్స్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం నీట్ ఫలితాలపై మాదాపూర్‌లోని రెసోనెన్స్ కళాశాలలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్-2025లో 1000లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. హరిణీ శ్రీరామ్ నీట్-2025లో ఆలిండియా 72వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. రెసోనెన్స్ హైదరాబాద్ క్యాంపస్‌ల నుంచి ప్రతి ముగ్గురిలో ఒక విద్యార్థి మెడికల్ సీటు సాధించడం గర్వకారణమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో 'గోసలైట్స్' ప్రతిభ

పెనమలూరు: నీట్ ఫలితాల్లో విజయవాడ గోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని చైర్మన్ నరేంద్రబాబు తెలిపారు. విజయవాడలోని కానూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ విద్యార్థుల్లో 11 మంది 720కిగాను 600కు పైగా మార్కులు సాధించారని, 69 మంది 550కి పైగా మార్కులు, 379 మంది 500కు పైగా మార్కులు, 814 మంది 470కు పైగా మార్కులు, 1,086 మంది 450కి పైగా మార్కులు సాధించారని వివరించారు. గోసలైట్స్ విద్యార్థులు దేశవ్యాప్తంగా 1,500కు పైగా ఫ్రీ మెడికల్ సీట్లు సాధించే దిశలో ఉన్నట్లు తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్ చేస్తా

కేయూ క్యాంపస్: డాక్టర్ కావాలనే పట్టుదలతో కష్టపడి చదివి నీట్ యూజీ-2025 ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించినట్టు హనుమకొండకు చెందిన యాండ్రపాటి షణ్ముఖ తెలిపాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఆయన 720 మార్కులకు 656 మార్కులు సాధించి ఆల్‌ఇండియా 48వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన యాండ్రపాటి శ్యాంసుందర్, రజనీ దంపతుల కుమారుడు షణ్ముఖ.. ఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్‌లో చేరుతానని చెప్పాడు.

బీసీ సీఎం కావడానికి సమయం ఆసన్నమైంది

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు

- దక్షిణాదిలో తెలుగు రాష్ట్రాల్లోనే బీసీలు సీఎం కాలేదు
- భవిష్యత్తులో ఈ అవకాశం వచ్చే అవకాశాలు గట్టిగా ఉన్నాయి
- బీసీలందరూ ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం వస్తుందని వెల్లడి
- ఓబీసీల పోరుబాట పుస్తకావిష్కరణ సభలో ప్రసంగం
- హాజరైన ఎంపీ ఈటల, ఎమ్మెల్సీలు దాసోజు, అద్దంకి



పుస్తకావిష్కరణ సభలో మహేశ్ కుమార్ గౌడ్, ఈటల రాజేందర్, చిరంజీవులు, ప్రకాశ్, వకుళాభరణం కృష్ణమోహన్, దాసోజు, పి.నరహరి తదితరులు

నాంపల్లి (హైదరాబాద్): రాష్ట్రంలో బీసీలు ముఖ్యమంత్రి కావడానికి సమయం ఆసన్నమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'బీసీలకు సీఎం పదవి వచ్చే రోజులు ముందున్నాయి. వస్తాయి కూడా. ఆ సమయం దగ్గరైంది. బీసీలందరూ ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం వస్తుంది. ఈ పదవి కోసం ఏళ్లు గడిచాయి. 80ఏళ్లుగా అడుగుతున్నాం. దక్షిణాదిలో చాలా రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులయ్యారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులు అయ్యారు. కానీ మన తెలుగు రాష్ట్రాల్లోనే కాలేదు. ఈ అవకాశం భవిష్యత్తులో వస్తుంది. వచ్చే అవకాశాలు గట్టిగా ఉన్నాయి. ఇవాళో, రేపో, మాపో అని చెప్పలేను కానీ భవిష్యత్తులో అవకాశం వస్తుందని గట్టి చెప్తున్నాను. ఆ ఆకాంక్ష, కోరిక మన వర్గాల్లో ఎక్కువగా ఉంది' అని అన్నారు. శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన ఓబీసీల పోరుబాట పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మహేశ్ గౌడ్ ప్రసంగించారు. రాజకీయంగా మనకు కావాల్సింది ఆ పదవులు ఈ పదవులు కాదని, రాష్ట్రంలో ముఖ్యమైన పదవి రావాలని అన్నారు.

ఈటల లీడ్ చేస్తే కేంద్రాన్ని అడుగుదాం..

బీసీలంతా కులాలు పక్కనపెట్టి, రాజకీయ పార్టీలకు అతీతంగా హక్కుల కోసం ఉద్యమించాలని మహేశ్ గౌడ్ కోరారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో జరిగిన కుల గణన సర్వే శాస్త్రీయంగా ఉందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభల్లో రెండు బిల్లులను ఆమోదించామన్నారు. 'ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం. మీ ప్రభుత్వం కేంద్రంలో ఉంది. మీరు లీడ్ చేస్తే మీ నాయకత్వంలో మేమంతా ఢిల్లీకి రావడానికి సిద్ధంగా ఉన్నాం. అందరం కలిసి ఈ బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడానికి ప్రయత్నం చేద్దాం. కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. కేంద్ర మంత్రిగా మన రాష్ట్రం నుంచి బండి సంజయ్ ఉన్నారు. అందరం కలిసి వెళ్దాం. మా ముఖ్యమంత్రిని తీసుకొస్తాను.. ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకోండి. అక్కడ విజయం సాధిస్తే అందరికీ ఆ వాటా పొందేందుకు అవకాశం మెండుగా ఉంటుంది' అని అన్నారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం కావాలి


ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని మధ్యప్రదేశ్ ప్రజారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పి.నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీ రాజ్ రచించారు. కార్యక్రమంలో పి.నరహరి మాట్లాడుతూ.. రాజ్యాధికారమే ఓబీసీల అంతిమ లక్ష్యం కావాలని, ఆ దిశగా ఓబీసీలందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. దేశమంతటా ప్రస్తుతం బీసీల గురించే చర్చ జరుగుతోందని, తెలంగాణలోనూ బీసీల గురించి యువత, మేధావులు ఆలోచిస్తున్నారని చెప్పారు. దేశంలోని 80 కోట్ల ఓబీసీల ఆశయాలు, ఆశలు, సమస్యలు, వాటి పరిష్కారాలపై ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు.

భరోసా కల్పించే నాయకత్వం రావాలి: ఈటల

సమాజహితం కోసం ఐఏఎస్ అధికారి పి.నరహరి ఓబీసీల పోరుబాట పుస్తకాన్ని రాయడం అభినందనీయమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాలకులు సంపూర్ణంగా అమలు చేయడంతోనే ఏబీసీడీ వంటి ఉద్యమాలు తలెత్తుతున్నాయని చెప్పారు. బీసీల్లో చైతన్యం, సామాజిక స్పృహ ఉందని, బలహీన వర్గాలకు తాను ఉన్నానంటూ భరోసా కల్పించే నాయకత్వమే రావాలని ఆకాంక్షించారు. అగ్రకుల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ తమిళనాడులో పెరియార్ రామస్వామి నాయకర్ ప్రారంభించిన నల్ల చొక్కాల ఉద్యమం ఘన విజయం సాధించిందని, ఇలాగే తెలుగు రాష్ట్రాల్లో కూడా మరో నల్ల చొక్కా ఉద్యమం రావాల్సిన తరుణం ఆసన్నమైందని మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, అద్దంకి దయాకర్, టీఎస్ఎండీసీ చైర్మన్ అనిల్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నదులు, నిధులు.. రెండూ ఆంధ్రాకేనా?

- బనకచర్ల పేరిట ఏపీ జలదోపిడీపై కాంగ్రెస్ మౌనం ఎందుకు
- కేంద్రం నుంచి ఏపీకి మాట సాయం, మూట సాయం
- రేవంత్‌కు ప్రతిపక్షాలపై ఇరిటేషన్ తప్ప, ఇరిగేషన్‌పై శ్రద్ధ లేదు
- నదీ జలాల్లో అన్యాయంపై కేంద్ర మంత్రులు స్పందించాలి
- తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ జలాల్లో కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలంగాణకు ద్రోహం చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పైసా సాయం చేయలేదని, కానీ ఏపీ అక్రమంగా చేపడుతున్న గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు మాట సాయం, మూట సాయం అందిస్తోందని మండిపడ్డారు. 'బనకచర్ల ప్రాజెక్ట్ పేరిట ఏపీ చేస్తున్న జల దోపిడి - కాంగ్రెస్ మౌనం'అనే అంశంపై హరీశ్‌రావు శనివారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఇరిటేషన్ తప్ప ఇరిగేషన్ ఎక్కడ?


'రేవంత్ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని ఇరిటేట్ (అసహనానికి గురిచేయటం) చేయడం తప్ప ఇరిగేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. బనకచర్ల లింక్ ద్వారా గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలించుకుపోతున్నా ప్రతిపక్షాలపై కేసులు, విచారణలు, మంత్రివర్గ విస్తరణ అంటూ సీఎం దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నాడు. నీటిపారుదలపై అఖిలపక్ష సమావేశానికి ముందుకు రాకుండా తాము సన్నద్ధం కాలేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్తున్నాడు. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేకున్నా కేంద్రం నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏపీకి వత్తాసు పలుకుతోంది. సమైక్య పాలనలో సమైక్య పాలకుల వద్ద బానిసల్లా బతికిన వారు స్వరాష్ట్రంగా ఏర్పడినా తెలంగాణ ఆత్మగౌరవాన్ని పక్క రాష్ట్ర నాయకత్వం వద్ద తాకట్టు పెడుతున్నారు. నదీ జలాలను ఏపీకి కేంద్రం దోచి పెడుతున్నా సీఎం రేవంత్ స్పందించడం లేదు'అని హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నదీ జలాల్లో అన్యాయంపై మాట్లాడటం లేదని ఆరోపించారు. చంద్రబాబుతో బీజేపీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ ప్రాజెక్టులను కేంద్ర మంత్రులు అడ్డుకోవడం పాటు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. వెంటనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి ఏపీ జలదోపిడీని అడ్డుకునేలా ఏకగ్రీవ తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని సూచించారు.

కాళేశ్వరంపై త్వరలో ప్రజల వద్దకు

త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లను సందర్శించి ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంత రైతులతో కలిసి బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపైనా త్వరలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని పేర్కొన్నారు. సొంత అవసరాల కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడితే రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హెచ్చరించారు.

డీపీఆర్ ఎలా కోరుతారు?

- గోదావరి-బనచర్ల ప్రాజెక్టు డీపీఆర్ కోరడంపై మంత్రి ఉత్తమ్ అభ్యంతరం
- ప్రీఫీజిబిలిటీ రిపోర్టు ఆమోదించకుండానే డీపీఆర్‌ను ఎలా కోరుతారని కేంద్రానికి ప్రశ్న
- ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును సీడబ్ల్యూసీ తిరస్కరించాలని డిమాండ్
- ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి లేఖ



సాక్షి, హైదరాబాద్: గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతో పాటు ఏపీ పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఏపీ చేపట్టిన గోదావరి-బనచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను జూన్ చివరిలోగా సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని కేంద్ర ఆర్థిక శాఖ కోరడం పట్ల తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన తర్వాతే రాష్ట్రాలు సంబంధిత ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పిస్తాయని గుర్తు చేసింది. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును సీడబ్ల్యూసీ ఆమోదించినట్టు పరిగణిస్తూ ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం కోరిందా? అని ప్రశ్నించింది. డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్రం ఏపీని కోరడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశారు. ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టం చేశారు. గోదావరి-బనచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గత జనవరి 22న తాను రాసిన లేఖకు స్పందిస్తూ మే 28న సీఆర్ పాటిల్ రాసిన లేఖలో ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర జలసంఘానికి సమర్పించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత జూన్ 2న కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఓ సమావేశంలో ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టుకు సీడబ్ల్యూసీ అనుమతుల జారీలో పురోగతిని ఏపీ అధికారులు ప్రశ్నించగా, క్రియాశీల పరిశీలనలో ఉందని ఆ సమావేశంలో పాల్గొన్న కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ అమిత్‌కుమార్ ఝా హామీ ఇవ్వడం పట్ల ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ చివరిలోగా ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని ఇదే సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి ఏపీని కోరిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రీఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలి

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కోసం ఏపీకి గోదావరి ట్రిబ్యునల్ ఎలాంటి నికర జలాలను కేటాయించలేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గుర్తుచేశారు. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు-1980తో పాటు ఏపీ పునర్విభజన చట్టం-2014కి ఈ ప్రాజెక్టు పూర్తి విరుద్ధమని పేర్కొంటూ గతంలో తాను లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు. నికర జలాల కేటాయింపులు లేని ఇలాంటి ప్రాజెక్టుల ప్రీఫీజిబిలిటీ రిపోర్టులను సాధారణ పరిస్థితుల్లో సీడబ్ల్యూసీ తిరస్కరించడంతో పాటు డీపీఆర్‌లను సమర్పించాలని ఎట్టి పరిస్థితుల్లో కోరదని తెలిపారు. కేంద్ర జలశక్తి శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ సమక్షంలో ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి కోరడం తమ రాష్ట్రానికి తీవ్ర ఆందోళనకర అంశమని స్పష్టం చేశారు. దీంతో ప్రీఫీజిబిలిటీ రిపోర్టును సీడబ్ల్యూసీ ఆమోదించినట్టు భావించాలనే సందేశాన్ని ఇచ్చారని తప్పుబట్టారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రజల జలహక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, ప్రధానంగా కరువు పీడిత ప్రాంతాలపై తీవ్ర దుష్ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రాజెక్టులకు అనుమతించడం అంతర్రాష్ట్ర నదీ జలాల పంపిణీలో సమన్యాయం, సహజ న్యాయసూత్రాలు, చట్టాలకు విరుద్ధమని, చెడు సంప్రదాయానికి బీజం పడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని సీడబ్ల్యూసీని ఆదేశించాలని కేంద్ర మంత్రిని కోరారు.

తారలు తళుకులీనాయి...
నింగిలోని నక్షత్రాలు కూడా తొంగి చూశాయి.
అశ్వత్థామలు, లక్కీ భాస్కర్‌లు,
పుష్పరాజ్‌లు, ఇది చిన్న కథ కాదు అన్నట్టుగా
మాదాపూర్ హైటెక్స్‌కు అరుదెంచారు.
అలనాడు ఇంటింటా వెలిగిన
జయప్రద, జయసుధ, సుహాసినిలను
వేదిక మీద చూసి గృహిణిలు తెగ ముచ్చటపడ్డారు.


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,
సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి,
తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ 'దిల్' రాజు
ఈ వేడుకకు కర్త, కర్మలై శోభ తెచ్చారు.
ఆటలు, పాటలు, కళాప్రదర్శనలు...
చూడ్డానికి వెండితెర చాలదు!
అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, రాజమౌళి...

చుక్కల్లో చందమామలుగా అభిమానులను అలరించారు.
ఇంతకాలం ఎదురుచూసిన సినీ అవార్డుల వేడుకకు
తెలంగాణ ప్రభుత్వం పదింతలు అట్టహాసం కలిపి
నభూతో అన్నట్టుగా నిర్వహించింది.
చిత్రమాలికను చిత్తగించండి...

కోటి తారల వీణ... సినీ తెలంగాణ




నాగ్ అశ్విన్‌కి అవార్డు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో 'దిల్' రాజు, భట్టి విక్రమార్క


అల్లు అర్జున్


నివేదా థామస్


నాగవంశీ, వెంకీ


యువచంద్ర, అనన్య


మణిరత్నం


పూర్ణచంద్ర రావు


బాలకృష్ణ


విజయ్ దేవరకొండ


సుకుమార్


రాజమౌళి


కీరవాణి, చంద్రబోస్



ఇది సినిమా అవార్డ్స్ గనక సరదాగా ఓ డైలాగ్ చెబుతా అంటూ... ''ఆ బిడ్డ మీద ఒక్క గీటు పడ్డా... గంగమ్మ జాతరలో యేట తలలు నరికినట్లు రప్పా రప్పా నరుకుతా ఒక్కొక్కడిని. పుష్ప..పుష్ప రాజ్..అస్సలు తగ్గేదేలే' అంటూ 'పుష్ప 2' సినిమాలోని డైలాగ్ చెప్పి, అల్లు అర్జున్ అలరించారు. ''ప్రతిష్ఠాత్మక తెలంగాణ గద్దర్ అవార్డు ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఈ ఇనిషియేటివ్ తీసుకున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. గౌరవనీయ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నగారికి, ఉపముఖ్యమంత్రి భట్టిగారికి, 'దిల్' రాజుగారికి, వేదికపై ఉన్న పెద్దలందరికీ ధన్యవాదాలు. మై లవ్లీ డైరెక్టర్ సుకుమార్‌గారు లేకపోతే ఈ అవార్డు సాధ్యమయ్యేది కాదు. డార్లింగ్... ఐ లవ్ యూ. ఈ అవార్డు ప్యూర్‌గా మీ విజన్. 'పుష్ప' నిర్మాతలు, ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు టీమ్ అందరికీ ధన్యవాదాలు. రాజమౌళిగారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఎందుకంటే... మీరు ఆ రోజు 'పుష్ప 1' సినిమాను హిందీలో రిలీజ్ చేయమని చెప్పకపోయి ఉంటే, ఈ రోజు ఇంతటి రేంజ్ ఉండేది కాదు. ధన్యవాదాలు సార్. ఇది నాకు చాలా స్పెషల్ అవార్డు. 'పుష్ప 2' గెలిచిన మొదటి అవార్డు ఇది. ఈ అవార్డును నా అభిమానులకు అంకితం ఇస్తున్నాను. మిమ్మల్ని మరింత గర్వపడేలా చేస్తాను. నా ఆర్మీ (ఫ్యాన్స్‌ను ఉద్దేశిస్తూ..)కి థ్యాంక్స్.

– నటుడు అల్లు అర్జున్

కళామతల్లి ముద్దుబిడ్డ గద్దరన్న పేరు మీద, ఆయన పేరు చిరస్థాయిగా ఉండేలా గౌరవించి అవార్డులివ్వడం సంతోషం. ఒక దళిత కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదుగుతూ ఆయనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు గద్దర్ అన్న. ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోయేలా అవార్డులిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. 1996లో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డుని ప్రారంభించాం. ఎంతోమంది ఈ అవార్డుని పొందారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఈ అవార్డు ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఎన్టీఆర్ కొడుకుగా నాన్నగారి అవార్డుని తీసుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ అవార్డు ద్వారా నాకు ఇచ్చిన పది లక్షల నగదును బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రికి ఇచ్చినట్లు భావిస్తున్నాను. ఇందుకు రేవంత్ అన్నకి థ్యాంక్స్.

– నటుడు నందమూరి బాలకృష్ణ
(ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు)

గద్దరన్న పేరు మీద ఈ అవార్డులు ప్రారంభించడం, సినిమా ఇండస్ట్రీ అందర్నీ ఒక వేదికపైకి తీసుకొచ్చి ఈ అవార్డులివ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇది నాకు చాలా గర్వకారణమైన మూమెంట్. మహబూబ్ నగర్‌లో పుట్టిన పిల్లోణ్ని.. కాంతారావుగారి పేరు మీద ఈ అవార్డు ఇవ్వడం అనేది ఆయనకు నిజమైన నివాళి. ఈ అవార్డు తీసుకుంటున్న మొదటి వ్యక్తిని నేను అయినందుకు చాలా బాధ్యతగా భావిస్తున్నాను.. ఇంకా ఎంతో చేయాలనిపిస్తోంది. ఈ అవార్డు ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డిగారికి, ఉప ముఖ్యమంత్రి విక్రమార్కగారికి, 'దిల్' రాజుగారికి థ్యాంక్స్''.

– నటుడు విజయ్ దేవరకొండ
(కాంతారావు ఫిల్మ్ అవార్డు)

పద్నాలుగు సంవత్సరాల తర్వాత ఈరోజు తెలుగు సినిమాకు అవార్డులు ఇచ్చుకోవడం జరుగుతోంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి సంవత్సరానికి బెస్ట్ ఫిల్మ్, సెకండ్ బెస్ట్ ఫిల్మ్, థర్డ్ బెస్ట్ ఫిల్మ్ జ్యూరీ వారు సెలెక్ట్ చేశారు. బెస్ట్ ఫిల్మ్‌ను సెలెక్ట్ చేయడానికి జ్యూరీ అన్ని సినిమాలు చూసింది. నేషనల్ అవార్డ్ పొందిన సినిమాలు, రివ్యూస్ వచ్చిన సినిమాలు, కమర్షియల్‌గా బాగా ఆడిన సినిమాలు... ప్రతి సంవత్సరానికి మూడు సినిమాలుగా జ్యూరీ సెలెక్ట్ చేసింది. హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌కి ప్రతి సినిమాకి నాలుగు అవార్డులు ఇవ్వడానికి జ్యూరీ కమిటీ అడగడం, ప్రభుత్వం దాన్ని అంగీకరించి ఈరోజు ఆ అవార్డులు ఇవ్వడం జరుగుతోంది. అలాగే 2024లో అద్భుతంగా, కళాత్మకంగా వచ్చిన ఎన్నో చిన్న సినిమాలను జ్యూరీ సెలెక్ట్ చేయడం, వారికి కూడా ఈ రోజు అవార్డులు ఇచ్చుకోవడం ఆనందకరం.

– ఎఫ్‌డీసీ ఛైర్మన్ 'దిల్' రాజు

ఎన్ని అవార్డులు ఉన్నా కానీ రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అనేది ఇండస్ట్రీకి మొదటి నుంచీ చాలా ప్రత్యేకం. ఈ అవార్డుల కోసం వేచి చూస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డిగారు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ 'దిల్' రాజుగారికి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిగార్లకు థ్యాంక్స్. మమ్మల్ని ప్రోత్సహించడానికి గద్దర్‌గారి పేరు మీద ఈ అవార్డులు పెట్టడం ఆనందంగా ఉంది.

– దర్శకుడు సుకుమార్
(బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు)

'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు సాధించిన సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్‌లను ప్రత్యేకంగా సన్మానించారు

గద్దర్‌గారి పేరు మీద నిర్వహిస్తున్న ఈ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కగారి చేతుల మీదుగా అందుకుంటున్న ఈ పురస్కారం బాసర సరస్వతీ దేవి ఆశీర్వచనంగా భావిస్తున్నాను.

– సంగీత దర్శకుడు కీరవాణి

ఎక్కడెక్కడ ఏం సాధించినా మన నేల మీద, మన వాళ్ల మధ్య ఇలాంటి గౌరవం పొందడం ఎప్పటికీ మరచి పోలేని విషయం. ఇందుకు తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డిగారికి ధన్యవాదాలు.

– రచయిత చంద్రబోస్

గద్దర్ పేరుపై ఫిల్మ్ అవార్డ్స్‌ను ఇవ్వడంతో పాటు గద్దర్ ఫౌండేషన్‌కి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం నుంచి రూ. 3 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. గద్దర్ తనయుడు, గద్దర్ ఫౌండేషన్ ఛైర్మన్ సూర్యకిరణ్ గద్దర్ ఈ వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెక్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా **సూర్యకిరణ్ గద్దర్ మాట్లాడుతూ–** ''రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి అన్నగారికి, ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్కగారికి, రాష్ట్ర మంత్రులు, అవార్డులు స్వీకరించిన సినిమా ఇండస్ట్రీ అందరికీ అభినందనలు. రేవంత్ అన్నగారి ఆధ్వర్యంలో 31 జనవరి 2024న గద్దర్ ఫౌండేషన్‌ని ప్రకటించడం జరిగింది. అదే విధంగా రేవంత్ రెడ్డిగారు ప్రామిస్ చేసినట్లుగానే ఈ అవార్డు వేడుకను ఇంత ఘనంగా నిర్వహిస్తున్నారు. నాన్నగారి సాహిత్యం, నాన్నగారి విలువలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రోత్సహిస్తూ గద్దర్ ఫౌండేషన్‌కి రూ. 3 కోట్లు కేటాయించడాన్ని ఫౌండేషన్ తరపున మేం స్వాగతిస్తున్నాం. ఇందుకు గద్దర్ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు సార్... ప్రతి సంవత్సరం మీరు చేపడుతున్న కల్చరల్ అండ్ మెమోరియల్ రీసెర్చ్ సెంటర్‌కి స్థలం కేటాయిస్తున్నట్లుగా నెక్లెస్ రోడ్‌లో ప్రకటించారు సార్.. దాన్ని కూడా త్వరగా పూర్తి చేసి, వచ్చే సంవత్సరం జయంతి ఉత్సవాలు (గద్దర్), సినిమా వేడుకలు కూడా అక్కడే చేసుకుందామని కోరుతూ, మరోసారి గద్దర్ ఫౌండేషన్ నుంచి మీకు, భట్టి అన్నకు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నాను'' అన్నారు.


అవార్డు అందుకుంటున్న 'బలగం' టీమ్


'రజాకార్' నిర్మాత–దర్శకుడు గూడూరు నారాయణరెడ్డి, యాటా సత్యనారాయణ


'రుద్రమదేవి'కి అవార్డు అందుకుంటున్న గుణశేఖర్, రాగిణి...


'అల వైకుంఠపురములో...' అవార్డుతో నాగవంశీ, పూజా హెగ్డే


'మేజర్' అవార్డుతో అడివి శేష్


'శతమానం భవతి' అవార్డుతో శర్వానంద్, శిరీష్, సతీశ్


'మల్లేశం' అవార్డుతో ప్రియదర్శి, అనన్య, రాజ్. ఆర్


'పెళ్లి చూపులు' అవార్డుతో రీతూ


'పాఠశాల' అవార్డుతో మహి వి. రాఘవ్


'ఉప్పెన' అవార్డుతో రవిశంకర్, బుచ్చిబాబు, కృతీ శెట్టి




స్పెషల్ జ్యూరీ అవార్డుతో దర్శకులు సందీప్, సుజిత్, ఫరియా అబ్దుల్లా


'కమిటీ కుర్రోళ్లు' అవార్డుతో యదు వంశీ, నిహారిక...

సూపర్ ‘సఫారీ’



వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికా సుదీర్ఘ స్వప్నం నెరవేరింది...ఐసీసీ ట్రోఫీ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాడిన టీమ్ ఎట్టకేలకు ఆ లక్ష్యాన్ని చేరుకుంది...1998లో ఐసీసీ నాకౌట్ కప్ సాధించిన తర్వాత 7 వన్డే వరల్డ్ కప్‌లు, 9 టి20 వరల్డ్ కప్‌లు, 9 చాంపియన్స్ ట్రోఫీలు, 2 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లు జరగ్గా... ఒక్క సారి కూడా టైటిల్ అందుకునే అవకాశమే రాలేదు... అద్భుతంగా ఆడుతూ వచ్చి అసలు సమయంలో చేతులెత్తేసిన సందర్భాలు కొన్నయితే, అవసరమైన చోట అదృష్టం మొహం చాటేసిన సందర్భాలు మరికొన్ని... ఇప్పుడు ఆ ‘చోకర్స్’ ముద్రను వెనక్కి తోస్తూ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో సఫారీ టీమ్ సంబరాలు చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి బవుమా సేన సగర్వంగా సత్తా చాటింది. ఐసీసీ టోర్నీ ఫైనల్ అంటే చెలరేగిపోయే ఆసీస్ ఈ సారి మాత్రం బ్యాటింగ్ వైఫల్యంతో తలవంచి నిరాశగా వెనుదిరిగింది.

- 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సొంతం
- ఫైనల్లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై ఘన విజయం

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 83.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ఎయిడెన్ మార్క్‌రమ్ (207 బంతుల్లో 136; 14 ఫోర్లు) దాదాపు చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు. న్యూజిలాండ్ (2021), ఆస్ట్రేలియా (2023) తర్వాత డబ్ల్యూటీసీ గెలుచుకున్న మూడో టీమ్‌గా దక్షిణాఫ్రికా నిలిచింది. విజేత దక్షిణాఫ్రికాకు రూ. 30.76 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

27.4 ఓవర్లలో 69 పరుగులు...

ఆట ఆరంభంలోనే తెంబా బవుమా (134 బంతుల్లో 66; 5 ఫోర్లు)ను కమిన్స్ అవుట్ చేయగా, కొద్ది సేపటికే స్టబ్స్ (8)ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో దక్షిణాఫ్రికా మరో 41 పరుగులు చేయాల్సి ఉండటంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో వైపు మార్క్‌రమ్ మూడో రోజు తరహాలోనే పట్టుదలగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అతనికి బెడింగ్‌హామ్ (21 నాటౌట్) అండగా నిలిచాడు. ఎట్టకేలకు కొత్త బంతిని తీసుకున్న వెంటనే తొలి ఓవర్లోనే మార్క్‌రమ్‌ను హాజల్‌వుడ్ వెనక్కి పంపించినా...అప్పటికే ఆలస్యమైపోయింది. విజయానికి మరో 5 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా, స్టార్క్ వేసిన బంతిని వెరీన్ కవర్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో సఫారీ శిబిరంలో వేడుక మొదలైంది.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 138; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 207; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) హెడ్ (బి) హాజల్‌వుడ్ 136; రికెల్టన్ (సి) క్యారీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (సి) క్యారీ (బి) కమిన్స్ 66; స్టబ్స్ (బి) స్టార్క్ 8; బెడింగ్‌హామ్ (నాటౌట్) 21; వెరీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (83.4 ఓవర్లలో 5 వికెట్లకు) 282.** **వికెట్ల పతనం:** 1-9, 2-70, 3-217, 4-241, 5-276. **బౌలింగ్:** స్టార్క్ 14.4-1-66-3, హాజల్‌వుడ్ 19-2-58-1, కమిన్స్ 17-0-59-1, లయన్ 26-4-66-0, వెబ్‌స్టర్ 5-0-13-0, హెడ్ 2-0-8-0.



కుమారుడితో బవుమా సంబరం

చోకర్స్ కాదు... విన్నర్స్

దాదాపు ఏడాది క్రితం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో టి20 వరల్డ్ కప్ ఫైనల్లో తలపడింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో చేతిలో 6 వికెట్లతో 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనిపించగా...చివరకు 7 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డగౌట్‌లో కూర్చుకున్న కెప్టెన్ మార్క్‌రమ్ కన్నీళ్లపర్యంతమైన దృశ్యం దక్షిణాఫ్రికా అభిమానులకు కలచివేసింది. ఇప్పుడు సంవత్సరం తిరగక ముందే అతను సఫారీ ఫ్యాన్స్ దృష్టిలో హీరోగా మారిపోయాడు. ఆస్ట్రేలియా ‘బౌలింగ్ చతుష్టయం’ను ఎదుర్కొని దక్షిణాఫ్రికా 282 పరుగులు సాధించగలదా అనే సందేహాల మధ్య అతను అసాధారణ బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ‘డకౌట్’ అయినా రెండో ఇన్నింగ్స్‌లో ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా తన కెరీర్‌లో అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కెప్టెన్ తెంబా బవుమా విజయగాథ కూడా ఇలాంటిదే. 64 టెస్టుల కెరీర్‌లో కేవలం 4 సెంచరీలే సాధించిన అతను ప్రతీసారి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నాడు. ‘బ్లాక్ ఆఫ్రికన్’ కాబట్టి టీమ్‌లో చోటు దక్కిందని, రిజర్వేషన్ కారణంగానే కొనసాగుతున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తూ వచ్చాయి. తాజా ఘనతతో బవుమా నాయకుడిగా ఆకాశమంత ఎత్తున నిలిచాడు. ఫైనల్‌కు ముందు తన కెప్టెన్సీలో ఆడిన 9 టెస్టుల్లో 8 మ్యాచ్‌లు గెలిపించి ఓటమి ఎరుగని అతను...ఇప్పుడు టీమ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిచి పొట్టివాడు అయినా గట్టివాడే అని నిరూపించాడు. మార్క్‌రమ్, బవుమా 147 పరుగుల భాగస్వామ్యం ఆస్ట్రేలియా ఆట కట్టించేలా చేసింది. డ్రగ్స్ వివాదం నుంచి బయటపడిన రబాడ 9 వికెట్లతో సఫారీ విజయానికి పునాది వేయగా, రెండో ఇన్నింగ్స్‌లో ఇన్‌గిడి తన విలువ చాటాడు.

విమర్శలను అధిగమించి...

దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించినా...ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎదురుగా బలమైన ఆస్ట్రేలియాలాంటి ప్రత్యర్థి ఉండటంతో పాటు టీమ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. టాప్-7 బ్యాటర్లతో పాటు ఆల్‌రౌండర్ యాన్సెన్ మొత్తం టెస్టు పరుగులు కలిపినా... ఒక్క స్టీవ్ స్మిత్ సాధించిన పరుగులకంటే తక్కువగా ఉన్నాయి! పైగా స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, లయన్ కలిసి ఆసీస్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కొని గెలవడం దాదాపు అసాధ్యమని అనిపించింది. అన్నింటికి మించి సఫారీ టీమ్ ఫైనల్‌కు చేరిన క్రమంపై విమర్శలు ఉన్నాయి. 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రశ్రేణి టీమ్‌లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను ఒక్క టెస్టులోనూ ఎదుర్కోని టీమ్... సొంతగడ్డపై భారత్ చేతిలో 55కు ఆలౌటై చిత్తుగా ఓడింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లాంటి బలహీన ప్రత్యర్థులపై (వరుసగా 7 టెస్టులు) గెలిచి ఫైనల్ చేరిందని వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఫైనల్‌కు ముందు ‘అదంతా మా చేతుల్లో లేదు. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే దానిని ఎవరూ పట్టించుకోరు’ అంటూ స్పష్టంగా చెప్పిన బవుమా దానిని చేసి చూపించాడు. ఆస్ట్రేలియాను ఓడిస్తేనే వరల్డ్ చాంపియన్‌గా భావిస్తాం అనేవారికి సమాధానం ఇచ్చాడు. స్వదేశంలో టి20 లీగ్ కోసం ప్రధాన ఆటగాళ్లతో కాకుండా ద్వితీయ శ్రేణి జట్టును న్యూజిలాండ్ పంపగా 0-2తో టీమ్ చిత్తయింది. అయినా సరే చివరకు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టు అర్హత సాధించడం విశేషం.

ఆనందం దక్కింది...

అంతర్జాతీయ క్రికెట్‌లోకి 1991లో దక్షిణాఫ్రికా పునరాగమనం చేసింది. ఆ తర్వాత 1992 వరల్డ్ కప్ సెమీస్‌లో వర్షం నిబంధనతో ఓడిన జట్టు, 1996లో అన్ని లీగ్‌లు గెలిచి క్వార్టర్స్‌లో అనూహ్యంగా ఓడింది. 1998తో క్రానే, కలిస్, రోడ్స్, బౌచర్‌లతో కూడిన జట్టు తొలి చాంపియన్స్ ట్రోఫీని గెలిచి ఆనందం పంచింది. అయితే ఆ తర్వాతే జట్టు రాత పూర్తిగా మారిపోయింది. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌కు ముందు వరకు ఒక్క ఐసీసీ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. 1999 సెమీస్‌లో ‘టై’తో గుండె పగలగా, సొంతగడ్డపై 2003లో మళ్లీ వర్షంతో లెక్క తప్పడంతో సెమీస్ కూడా చేరలేకపోయింది. ఆ తర్వాత మూడు సార్లు సెమీస్ వరకు చేరడంలో సఫలమైంది. స్వదేశంలో 2007 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరని జట్టు తర్వాత రెండు సార్లు సెమీస్‌లోనే ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో ఐదు సార్లు సెమీస్‌కే పరిమితమైంది. వేర్వేరు కారణాలతో వచ్చిన ఈ ఓటములతో టీమ్‌లో నైరాశ్యం నెలకొంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా బోర్డులో రాజకీయాలు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలతో జట్టు ఆటపై కూడా ప్రభావం పడింది. వరుస ఓటములతో టీమ్ వెనుకబడిపోవడంతో ఇతర టీమ్‌ల దృష్టిలో అది ద్వితీయ శ్రేణి జట్టుగా మారిపోయింది. అయితే తాజా విజయం సఫారీ టీమ్‌లో కొత్త ఉత్సాహం తీసుకురానుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విజయం వారిలో జోష్ నింపడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

బర్త్ డే స్పెషల్


● ‘లెనిన్’లో శ్రీలీల


దక్షిణాదిలోని యంగ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు శ్రీలీల. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ పుట్టిన రోజు జూన్ 14న. ఈ సందర్భంగా తెలుగులో ఆమె నటిస్తున్న ‘ఉస్తాద్ భగత్‌సింగ్, మాస్ జాతర, లెనిన్’ సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ రిలీజ్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. అలాగే ‘ధమాకా’ వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ-హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం ‘మాస్ జాతర’. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘లెనిన్’. ‘ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది’ కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పై మూడు సినిమాల నుంచి శ్రీలీల బర్త్ డే స్పెషల్ పోస్టర్స్ విడుదల అయ్యాయి.

‘‘ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో స్క్రీన్‌పై సంప్రదాయంగానే ఎక్కువగా కనిపించాను.అలాగని గ్లామర్ పాత్రలు చేయనని కాదు. నేనొక ఆర్టిస్టుని. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ ఆ సీన్స్ నా పాత్రకు, సినిమాలకు ఉపయోగపడేలా ఉండాలి’’ అని హీరోయిన్ అనంతికా సనీల్ కుమార్ అన్నారు. అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘8 వసంతాలు’. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనంతిక మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో శుద్ధి యోగ్య అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర దృష్టి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. ఓ అమ్మాయి జీవితంలో 17 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల

అందుకే లా చదువుతున్నాను

- హీరోయిన్ అనంతిక

వరకు జరిగిన కొన్ని సంఘటనలను ‘8 వసంతాలు’ సినిమాగా చూపిస్తున్నాం. ఫణీంద్రగారు చెప్పిన ఈ సినిమా కథ విన్నప్పుడు నాకు, మా అమ్మకు కన్నీళ్లొచ్చాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలతో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే యాక్టింగ్ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలనుకుంటున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. చెప్పాలంటే నేను అనుకోకుండానే నటి అయ్యాను. లాక్‌డౌన్ సమయంలో పెద్దగా పని దొరకలేదు. ఆ సమయంలో అలాంటి ఆలోచనలు వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో కరాటే, మార్షల్ ఆర్ట్స్ కూడా నేను నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను ‘లా’ చదువుతున్నాను. భవిష్యత్తులో రాజకీయ నాయకురాలిని అవ్వాలనుకుంటున్నాను. అందుకే ‘లా’ చదువుతున్నాను’’ అని చెప్పారు.



‘చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి’ తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, ‘ఓ బేబీ’తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన ‘జాంబిరెడ్డి’తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. ‘హను-మాన్’ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ ‘ఫాదర్స్ డే’ గురించి ‘సాక్షి’తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...

మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్

- హీరో తేజ సజ్జా



చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, ‘ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను’ అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా ‘సరే నీ ఇష్టం’ అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించే సరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.

● నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలు పెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునే వారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.

● నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.

● నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.

● మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా ‘ప్రశాంతంగా ఉండటం’ అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.

● నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసేవాణ్ణి.

● నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.

● నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, ‘మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు’ అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... ‘వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా’ అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.

● నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు.

● మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.

● మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ ‘ఫాదర్స్ డే’కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే ‘సాక్షి’కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.




● విష్ణు మంచు

శివయ్యా అని మనసారా పిలువు...

‘‘**దే**వుడు లేడు... గీవుడు లేడు. అది ఒట్టి రాయి’ అనే డైలాగ్‌తో ప్రారంభమైంది ‘కన్నప్ప’ సినిమా తెలుగు ట్రైలర్. మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం ‘కన్నప్ప’. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ‘‘ఆ తిన్నడు సామాన్యుడు కాదు... అతడ్ని దాటి వాయులింగాన్ని చేరడం అసాధ్యం’, ‘వాయులింగం మీద దుర్మార్గుల చూపు పడింది’, ‘ఈ వాయులింగం రహస్యాన్ని కాపాడటానికి నా ప్రాణాలను సైతం అర్పిస్తాను’, ‘ఈ గూడెంలో ఏ బిడ్డకు ఆపద రానివ్వను ఇది నా ఆన. తిన్నడి ఆన’, ‘ఇలాండివాడు మీకు గొప్ప భక్తుడు అవుతాడని మీకు నమ్మకం ఏంటి ప్రభు’, ‘నీతో పాటే నేను ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను... రుద్ర’, ‘ఎవరు నువ్వు... ఆ పెద్దోళ్లందరి కంటే నేనే పెద్దోణ్ణి’, ‘నన్ను మించిన శివ భక్తుడా... ఈ సృష్టిలో లేదు’, ‘శివయ్యా అని మనసారా పిలువు..’ అనే డైలాగ్స్ ‘కన్నప్ప’ ట్రైలర్‌లో ఉన్నాయి.

'భూదాన్' స్వాహాకు కుట్ర

అక్రమార్కులకు అధికారుల సహకారం



- ప్రాథమికంగా ఫోర్జరీ పత్రాలు సృష్టించారు
- కోర్టు ఆదేశిస్తే ఇతర భూములపై ముందుకు..
- హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూముల స్వాహాకు అక్రమార్కులు కుట్రపన్నారు.. ఫోర్జరీ పత్రాలు, తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు.. తద్వారా డీ నోటీఫై చేసిన భూదాన్, గైరాన్ (ప్రభుత్వ) భూములను విక్రయించారు.. దీనికి సబ్ రిజిస్ట్రార్ నుంచి కలెక్టర్ వరకు అంతా సహకరించారు.. డాక్యుమెంట్లు, కోర్టు ఉత్తర్వులను కనీస పరిశీలన చేయకుండానే డీనోటీఫైకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.. ఆ వెంటనే అక్రమార్కులు భూములను విక్రయించేశారు.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 181, 182లోని సర్కార్ భూముల స్వాహాపై విచారణ సందర్భంగా ఈమేరకు బహిర్గతమైందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. న్యాయస్థానం ఆదేశిస్తే పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని చెప్పింది. సర్వే నం. 181, 194, 195లో భారీ భూ కబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అసిస్టెంట్ డైరెక్టర్ గజ్‌రాజ్ సింగ్ ఠాకూర్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఈడీ కౌంటర్‌లోని ముఖ్యాంశాలివీ...

ఖదీరుసా సహా పలువురిపై కేసు

'సర్వే నం. 181, 194, 195లోని భూమికి సంబంధించి మోసపూరిత కార్యకలాపాలపై పిటిషనర్ మహేశ్ పేర్కొన్నారు. ఇప్పటికే సర్వే నంబర్ 181, 182లోని భూముల అక్రమ విక్రయంపై కేసు నమోదైంది. ఖదీరున్నిసా, మునావర్, బొబ్బిలి విశ్వనాథ్, సంతోష్‌కుమార్, దామోదర్‌రెడ్డితో పాటు ఈఐపీఎల్ నిర్మాణ సంస్థపై దర్యాప్తు కొనసాగుతోంది. పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదును ఎఫ్ఐఆర్ నమోదు నిమిత్తం డీజీపీ కార్యాలయానికి పంపించాం. అక్కడి నుంచి మాకు ఎలాంటి బదులురాలేదు. నవాబ్ హాజీఖాన్‌కు 779.77 ఎకరాల భూమి ఉంది. ఇందులో 103 ఎకరాలను కుమారులకు బహుమతి (హిబ్బా)గా, ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డుకు విరాళంగా ఇచ్చారు. దీనికి అంగీకరిస్తూ నాటి తహసీల్దార్ 1995, నవంబర్ 26న ఉత్తర్వులిచ్చారు. సర్వే నం. 181లోని మిగిలిన భూమిని ప్రభుత్వం గైరాన్ భూమిగా ప్రకటించింది. కుమారులు తమ భూమిని 2005లో దస్తగిర్ షరీఫ్, ముజాఫర్ హుస్సేన్‌కు విక్రయించారు. అయితే, 2006లో సర్వే నం. 181లోని మొత్తం భూమి సర్కార్‌దిగా పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై దస్తగిరి హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. చట్టప్రకారం 181లోని 95 ఎకరాల్లో 50 ఎకరాలు భూదాన్‌గా, 45 ఎకరాలు గైరాన్ భూమిగా పేర్కొంటూ ఎంఆర్‌వో 2012లో నిషేధిత జాబితాలో చేర్చి నోటిఫై చేశారు'

తప్పుడు పత్రాలతో సేల్ డీడ్‌లు

'తప్పుడు పత్రాలతో తన భూమిని కబ్జా చేశారంటూ షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో 2023, మార్చిలో ఖదీరునిసా, మునావర్ ఖాన్, బొబ్బిలి దామోదర్‌రెడ్డి, బొబ్బిలి విశ్వనాథ్‌రెడ్డి, ఎస్.సంతోష్, కొండపల్లి శ్రీధరర్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2004లో తన తండ్రి 51 ఎకరాలను హిబ్బాగా ఇచ్చారంటూ ఖదీరునిసా, ఆమె కుమారుడు మునావర్ 2014లో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించినట్లు ఈడీ విచారణలో తేలింది. అక్రమంగా పొందిన పట్టా పాస్‌పుస్తకాలు, భూ విక్రయాలు కోర్టు ఆదేశాలతో రద్దయ్యాయి. మళ్లీ 2021లో ఖదీరున్నీసా.. విశ్వనాథ్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌కు 40 ఎకరాలు విక్రయించారు. ప్రభుత్వ భూమి అని తెలిసినా నాటి సబ్ రిజిస్ట్రార్ జ్యోతి, నిందితులతో కలసి కుట్రకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూమిగా నోటిఫై చేసిన భూములను మోసపూరితంగా బదిలీ చేసుకోవడంతోపాటు సేల్ డీడ్‌లు సృష్టించారు.'

డీనోటిఫైలో అధికారుల పాత్ర

'హాజీ అలీకి తాను ఏకైక కుమార్తెనని ఖదీరునిసా పేర్కొంది. కానీ, అప్పటికే రెవెన్యూ రికార్డుల్లో అలీఖాన్ ఇద్దరు కుమారుల పేర్లున్నాయి. తప్పుడు పత్రాలు సృష్టించేందుకు రెహమాన్, అక్తర్, షకూర్, చంద్రయ్య, మరికొందరు సహకరించారు. నకిలీ లేఖతో నిషేధిత జాబితాలోని భూమిని డీ-నోటిఫై చేయించారు. డీనోటిఫైకి భూదాన్ యజ్ఞ బోర్డుతోపాటు కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌కు భాగస్వామ్యం ఉంది. అబ్దుల్ షకూర్ బంధువులు 1992లో నవాబ్ హాజీ అలీఖాన్ నుంచి సర్వే నం. 194లోని భూమిని కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ పత్రాలతో భూ కబ్జా చేసినందుకు షకూర్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. 1992లో కొనుగోలు చేసినట్లు చూపిస్తున్న డాక్యుమెంట్లపైనా అనుమానాలున్నాయి. ఎందుకంటే.. 1992 కంటే ముందే హాజీఖాన్ భూమంతా విక్రయించారు. నకిలీ పత్రాల వాడకం, రెవెన్యూ రికార్డులను తారు మారు చేయడం లాంటి వాటితో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. అధికారుల పాత్రపైనా దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు మా దృష్టికి వచ్చిన వ్యక్తులు, ప్రభుత్వ అధికారుల పాత్రపై మరికొన్ని వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.'

ప్రమాదంలో 26 మెడికల్ కాలేజీల మనుగడ

- రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణపై ఎన్‌ఎంసీ అసంతృప్తి
- నిబంధనలకు విరుద్ధంగా 26 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు
- 18న ఢిల్లీలో వ్యక్తిగత విచారణకు రావాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈకి పిలుపు
- విచారణలో ఎన్‌ఎంసీ సంతృప్తి చెందకపోతే 2,700 సీట్లపై ప్రభావం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలల పనితీరుపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వచ్చే విద్యా సంవత్సరం (2025–26)లో ఎంబీబీఎస్ సీట్లు కేటాయింపుల్లో భాగంగా రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించి అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించింది. వచ్చే విద్యా సంవత్సరానికి దాదాపు 2,700 మెడికల్ సీట్లు కొనసాగించడమా, రద్దు చేయడమా అనే విషయంలో కమిషన్ తేల్చే ముందు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారులను వ్యక్తిగత విచారణకు పిలిచింది. ఈ నెల 18న ఢిల్లీలో వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకుల (డీఎంఈ)కు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు (యూజీఎంఈబీ) డైరెక్టర్ సుక్లా మీనా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు వర్చువల్‌గా విచారణకు హాజరు కావాలని సూచించారు.

కొత్త కాలేజీల్లో అన్నీ సమస్యలే...

వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను భర్తీచేసే ముందు ప్రతి సంవత్సరం ఎన్‌ఎంసీ ఆయా కళాశాలలను తనిఖీ చేస్తుంది. యూజీఎంఎస్ఆర్–2023 నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కాలేజీల్లో మౌలిక వసతులు, అధ్యాపకులు, విద్యార్థుల ఆధార్ బేస్డ్ బయోమెట్రిక్ హాజరు, విద్యార్థులకు సరిపడా రోగులు, ప్రాక్టికల్స్‌కు కావలసిన మృతదేహాలు, ఇతర పరికరాలు, డిజిటల్ రికార్డింగ్, సీసీటీవీ వంటివి ఉన్నాయో లేదో పరిశీలిస్తుంది. ఈసారి కూడా రాష్ట్రంలోని 35 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తనిఖీలు చేసినప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన 26 కళాశాలల్లో ఎన్‌ఎంసీ పారా మీటర్లకు అనుగుణంగా వసతులు లేవని తేలింది. కాకతీయ మెడికల్ కళాశాలలో కూడా నిబంధనల మేరకు వసతులు లేకపోవటం ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ లోపాలపై ఎన్‌ఎంసీ గతంలో షోకాజ్ నోటీసులు ఇచ్చినా, కాలేజీలు సమాధానాలు సంతృప్తికరంగా లేవని పేర్కొంది. ముఖ్యంగా విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాల కల్పన, క్లినికల్ ట్రైనింగ్ వంటి అంశాల్లో తీవ్ర ఉల్లంఘనలు ఉన్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరానికి కళాశాలలను కొనసాగించడమో.. రద్దు చేయడమో నిర్ధారించేందుకు విచారణకు హాజరు కావాలని ఆదేశించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ఎన్‌ఎంసీ నిబంధనలు పాటించని 26 కళాశాలలు ఇవే..

ఖమ్మం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, వరంగల్ (కాకతీయ మెడికల్ కాలేజీ), భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, రామగుండం, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మెదక్, ములుగు, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, వనపర్తి, పెద్దపల్లి, వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిబంధనల మేరకు లేవని ఎన్‌ఎంసీ తేల్చింది.

హక్కుల పరిరక్షణలో సుప్రీం కీలకపాత్ర



జాతీయ సదస్సు బుక్ విడుదల చేస్తున్న న్యాయమూర్తులు జస్టిస్ అభిషేక్ రెడ్డి, జస్టిస్ రాధారాణి, జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ నందా, జస్టిస్ నర్సింగ్‌రావు

- జాతీయ సదస్సులో జస్టిస్ రాధారాణి వెల్లడి
- పాల్గొన్న జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ నందా, జస్టిస్ నర్సింగ్‌రావు

సిటీ కోర్టులు: ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు కీలక పాత్ర పోషిస్తోందని, పౌరుల హక్కులకు భంగం కలిగినప్పుడు కాపాడేందుకు ఆదేశాలు జారీ చేస్తోందని జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. కుల, మత, లింగ, ఇతర వివక్ష లేకుండా సమానత్వపు హక్కును అందించడంలో అత్యున్నత న్యాయస్థానం పాత్ర ప్రశంసనీయమన్నారు. సుప్రీంకోర్టు ప్రారంభమై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మార్వాడి శిక్షా సమితి (ఎంఎస్ఎస్) న్యాయ కళాశాల ఆధ్వర్యంలో బేగంపేట్‌లో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ టి.మాధవిదేవి, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డి హాజరయ్యారు. జస్టిస్ టి.మాధవిదేవి మాట్లాడుతూ... దేశంలో లింగ సమానత్వం కోసం సుప్రీంకోర్టు అనేక తీర్పులిచ్చిందన్నారు. పెరిగిపోతున్న లింగ భేదాన్ని తగ్గించేందుకు గర్భనిర్ధారణ పరీక్షలపై నిషేధం విధించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. జస్టిస్ సూరేపల్లి నందా మాట్లాడుతూ.. 75 ఏళ్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక సంచలనాత్మక తీర్పులను, వాటి పరిణామాలను చదివి వినిపించారు.

ప్రణీత్‌రావు పదోన్నతిపైనా ప్రభాకర్‌రావుకు ప్రశ్నలు

- డీపీసీలో ఫైల్ క్లియర్ కావడం పైనా ఆరా తీసిన సిట్

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ విభాగం మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును సిట్ అధికారులు మూడోసారి తొమ్మిది గంటలు ప్రశ్నించారు. ఆయన శనివారం కూడా దర్యాప్తు అధికారుల ఎదుట హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు వచ్చిన ప్రభాకర్‌రావును రాత్రి 8.30 గంటల వరకు వివిధ అంశాలపై విచారించారు. ఈ ప్రక్రియను ఆద్యంతం వీడియో రికార్డింగ్ చేసిన సిట్.. ఆయన వాంగ్మూలాన్నీ నమోదు చేసింది. శుక్రవారం ప్రణీత్‌రావు చెప్పిన వివరాల ఆధారంగానూ సిట్ ప్రభాకర్‌రావుకు ప్రశ్నలు సంధించింది. మూడోసారి విచారణకు వచ్చిన ప్రభాకర్‌రావును ప్రణీత్‌రావుకు అడ్డగోలుగా ఇచ్చిన పదోన్నతి పైనా సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. అంత సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలోనే ఈ అక్రమ ట్యాంపింగ్ బాధ్యతలు అప్పగించారా అన్న కోణంలో ఆరా తీసింది. ఎస్ఐబీలో ఉండగానే ప్రణీత్‌కు సీనియారిటీ ప్రాతిపదికన 2017లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి వచ్చింది. అయితే 2023లో మాత్రం ఇతడికి ప్రభాకర్‌రావు చొరవతోనే యాక్సిలరీ ప్రమోషన్ వచ్చినట్లు దర్యాప్తు అధికారులు చెపుతున్నారు. వాస్తవానికి 2022లోనే ఈ పదోన్నతి ఫైల్‌ను ప్రభాకర్‌రావు సిద్ధం చేసినా, డిపార్ట్‌మెంటల్ పదోన్నతుల కమిటీ ఆమోదించలేదు. ఆ తర్వాత కొందరు కీలక అధికారులు లేని సమయంలో గోల్‌మాల్‌తో ఫైల్‌ను ప్రభాకర్‌రావు క్లియర్ చేయించారనేది అధికారుల ఆరోపణ. ఈ సాన్నిహిత్యం ఉండటంతోనే స్పెషల్ ఆపరేషన్ టీమ్‌ను ప్రణీత్‌కు అప్పగించారా? అంటూ ప్రభాకర్‌రావును ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోని అసమ్మతి నేతలు, అసంతృప్తులతో పాటు ప్రతిపక్షాలపై నిఘా పెట్టడం, అలాగే జర్నలిస్టులు, న్యాయాధికారులు, న్యాయవాదుల ఫోన్‌లు ఎందుకు ట్యాప్ చేశారని ఆరా తీశారు. ట్యాపింగ్ వ్యవహారానికి కర్త, కర్మ, క్రియ ప్రభాకర్‌రావు అని, ఆయన ఆదేశాల మేరకే తాను విధులు నిర్వర్తించానని ప్రణీత్‌రావు చెప్పుండటంతో దీని పైనా ప్రశ్నించారు. అప్పట్లో కీలకంగా వ్యవహరించిన, కీలక బాధ్యతల్లో ఉన్న అధికారుల ఆదేశాల మేరకే తాను పని చేశానని సమాధానం ఇస్తున్న ప్రభాకర్‌రావు.. ఆ వ్యక్తులు ఎవరన్నది మాత్రం స్పష్టంగా చెప్పట్లేదని సిట్ పేర్కొంటోంది.

17న విచారణకు మరోసారి రండి..

ప్రభాకర్‌రావును శనివారం మూడోసారి ప్రశ్నించిన సిట్.. ఈనెల 17న మరోసారి విచారణకు రావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసింది. మరోపక్క సిట్ అధికారులు ఆదివారం నుంచి ట్యాపింగ్ కేసులో బాధితుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేయనున్నారు. వీరిలో రాజకీయ నాయకులు, వ్యాపారులతో పాటు జర్నలిస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే నోటీసులు జారీ చేయడం ద్వారా ప్రభాకర్‌రావు నుంచి 2023లో ఎన్నికల సమయంలో ఆయన వాడిన ఫోన్లను సీజ్ చేయనున్నారని తెలుస్తోంది. వాటిని విశ్లేషిస్తే మరిన్ని వెలుగులోకి రావడంతో పాటు పలు ఆధారాలు లభిస్తాయని అధికారులు చెపుతున్నారు.

రెండో రోజు ఏఐజీకి కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శనివారం మరోసారి గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం సాధారణ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన కేసీఆర్.. మరోసారి ఆస్పత్రికి రావడంతో ఏమైందోనన్న చర్చ జరిగింది. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు లేవని, రెండో రోజు సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగానే వచ్చారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఏఐజీ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్‌కు పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది.

'రాష్ట్రంలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు, అగ్రకులాల నిరుపేదల సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈబీసీల అభివృద్ధికి మంత్రిత్వశాఖ, ఈబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ అగ్రవర్ణాల్లోని నిరుపేదలకు వర్తింపజేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని రవీందర్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ కార్మికులకు కరెంట్ షాక్..

- ఇద్దరు మృతి.. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ఉమ్మడి వరంగల్, జగిత్యాల జిల్లాలో వేర్వేరు ఘటనలు
- మరో ఘటనలో సిరిసిల్ల జిల్లాలో కరెంట్ షాక్‌తో కూలీ దుర్మరణం



రాజయ్య(ఫైల్)



దుంపేట రాజేశం(ఫైల్)

డోర్నకల్ /కేసముద్రం/నల్లబెల్లి/ముస్తాబాద్ (సిరిసిల్ల) /మల్లాపూర్: ఉమ్మడి వరంగల్, జగిత్యాల జిల్లాల్లో శనివారం చోటుచేసుకున్న వేర్వేరు విద్యుత్ ప్రమాదాల్లో నలుగురు విద్యుత్ కార్మికులు కరెంట్ షాక్‌కు గురయ్యారు. అందులో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అలాగే, సిరిసిల్ల జిల్లాలో కిందపడిన విద్యుత్ తీగను సరిచేస్తూ షాక్‌కు గురై ఓ కూలీ మరణించాడు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన బి.క్రాంతికుమార్ (32) ఐదేళ్లుగా డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మున్నేరువాగు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి విద్యుత్ సరఫరా నిలిపివేయాలంటూ ప్రత్యేక యాప్ ద్వారా అనుమతి కోరగా.. సరఫరా నిలిపివేసినట్లు సమాచారం వచ్చింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి వెళ్లి మరమ్మతు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. అతడిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పోల్‌పైనుంచి పడి జేఎల్‌ఎం దుర్మరణం

విద్యుత్ స్తంభంపైకెక్కి, తీగలు సరిచేస్తుండగా కరెంట్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ మృతి చెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన దుంపేట రాజేశం (40) కొత్తదాంరాజుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వాల్గొండలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలను సరిచేసేందుకు స్తంభంపైకి ఎక్కాడు. ఈ క్రమంలో కరెంట్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి మృతిచెందాడు.

కరెంట్‌షాక్‌తో కూలీ దుర్మరణం

రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన బైతి రాజయ్య(48) ఇంట్లో శనివారం విద్యుత్ సర్వీస్ తీగ తెగిపడింది. దానిని పక్కకు తీస్తూ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు ముస్తాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. రాజయ్య భార్య గతంలోనే చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

మరో రెండు ఘటనల్లో ఇద్దరికి గాయాలు..

వరంగల్ జిల్లా పంతులుపల్లికి చెందిన నీలం శ్రీనివాస్ అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గోవిందాపూర్ ఫీడర్‌లో ఎల్‌సీ తీసుకుని శివారు లైన్‌తండాలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేపడుతున్నాడు. అయితే ఏఎల్‌ఎం బాసు.. మద్యం మత్తులో ఉండి ఎల్‌సీ తీసుకున్న విషయం మరిచిపోయి ఫీడర్‌ను ఆన్ చేశాడు. దీంతో శ్రీనివాస్ విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ఏఎల్‌ఎం బాసు మద్యం తాగినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ బూర్గుల అంబేడ్కర్ రాముతండా జీపీ శివారు వీరారెడ్డిపల్లి సమీప వ్యవసాయక్షేత్రంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఆస్పత్రికి పంపించారు.



స్నేహాలు, రిలేషన్‌షిప్‌లపై గందరగోళంలో జెన్-జెడ్

టీనేజర్లకు భావోద్వేగం, స్నేహాలు, అనుబంధాలపై శిక్షణ నివ్వాలంటున్న నిపుణులు

'నెగోషియేటింగ్ ఇంటిమేట్ రిలేషన్‌షిప్స్' పేరుతో కోర్సు తెస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ

పుస్తకాలపై కాకుండా జీవిత అనుభవాలు, ఎదురయ్యే సవాళ్ల ఆధారితంగా కోర్సు

ఇంటర్నెట్ తెచ్చిన మార్పులతో 10, 12 ఏళ్లలోపు పిల్లలకే పెద్దలకు సంబంధించిన విషయాలు తెలిసొస్తున్నాయి. ఒక వయసు వచ్చేటప్పటికే గర్ల్/బాయ్ ఫ్రెండ్స్ కచ్చితంగా ఉండాలనే ధోరణి ఏర్పడుతోంది. అయితే, టీనేజీలో వచ్చే మార్పులకు సంబంధించి భావోద్వేగపరంగా ఇతరత్రా మార్పు లపై మన విద్యా విధానంలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. శారీరక ఆరోగ్యం ఎంత అవసరమో, భావోద్వేగ ఆరోగ్యమూ అంతే ముఖ్యం. యువతకు ఆరోగ్యకర సంబంధాలను బలంగా ఏర్పరచే శక్తిని ఇవ్వాలంటే విద్య కూడా మార్గదర్శకంగా మారాలని నిపుణులు చెబుతున్నారు.

అర్థం చేసుకోరూ..!

సాక్షి, హైదరాబాద్: స్నేహం మొదలుకొని ప్రేమ వరకు... దీని పరిధిలో ప్రభావం చూపే అంశాల్లో ఆత్మవిశ్వాసం, సానుకూల అభిప్రాయం, స్పందన-ప్రతిస్పందన ఎలా ఉండాలన్న దానిపై చాలామందికి అంటే మరీ ముఖ్యంగా జెన్-జెడ్ (జనరేషన్ జెడ్)గా పిలిచే నేటి యువతరానికి అవగాహన ఉండటం లేదు. స్నేహం, ప్రేమ, రిలేషన్‌షిప్‌లో చిన్నపాటి వైఫల్యం ఎదురైనా లేదా అలాంటి భావన కలిగినా అది మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. చిన్న చిన్న సమస్యలు కూడా పెద్ద సమస్యలుగా కనిపిస్తున్నాయి. తిరస్కరణ పెను విపత్తుగా గోచరిస్తోంది. ఇది డిప్రెషన్, ఆత్మహత్యలు లేదా హింసకు పురిగొల్పుతోంది. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న ఇలాంటి అనేక ఘటనలు కలకలం సృష్టించాయి. ఈ నేపథ్యంలో సంబంధాల ప్రభావం, భావోద్వేగ నైపుణ్యాల అవసరం విశ్వవిద్యాలయ స్థాయిలో గుర్తించగా.. ఢిల్లీ వర్సిటీ ఈ సమస్యను తేలిగ్గా తీసుకోకుండా, విద్యాపరంగా ఓ కోర్సు రూపంలో పరిష్కరించేందుకు ముందుకు రావడం విశేషం.

భావోద్వేగాల అవగాహనపై ముందడుగు..

- ప్రేమించడం ఒక్కటే కాదు, ప్రేమను ఒప్పించుకోవడం, అర్థం చేసుకోవడం, పరస్పర గౌరవంతో నడిపించడమూ ఓ కళే. గందరగోళ ప్రపంచంలో జీవిస్తున్న జెన్-జెడ్ తరానికి, ఢిల్లీ యూనివర్సిటీ 'నెగోషి యేటింగ్ ఇంటిమేట్ రిలేషన్‌షిప్స్' అనే ఓ విశిష్టమైన కోర్సును అందుబాటులోకి తెచ్చింది. ఈ కోర్సు ఒక గైడెన్స్ వ్యవస్థలా పనిచేస్తుందని కౌన్సెలర్లు, విద్యావేత్తలు, నిపుణులు చెబుతున్నారు. జెన్-జెడ్ తరానికి అనుభవజ్ఞుల మార్గదర్శనం కల్పించడం, భావోద్వేగ అవగాహన పెంపొందించడంలో ఇది ఓ ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే...

- బాడీ ఇమేజ్, సోషల్ మీడియా ప్రొఫైల్స్ వంటి అంశాలు సంబంధాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.
- నేటి విద్యార్థులు గత తరం కంటే చాలా వ్యక్తిగత ధోరణిలోకి వెళ్లారు. భావోద్వేగాలపై కోర్సులు వారిని అంతర్గతంగా మారుస్తాయి.
- యువత నుంచి 'నేను ఇష్టపడే వ్యక్తిని ఎలా అప్రోచ్ కావాలి?', 'వాళ్ల తల్లిదండ్రులను కలిసేటప్పుడు ఎలా ప్రవర్తించాలి?' అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధాలను నిర్మించుకోవడం, నమ్మకం పెంపొందించడం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం వంటి అంశాలను నేర్పే కోర్సులు తప్పనిసరిగా మారాయి.
- భావోద్వేగపరమైన అవగాహన వల్ల మన బాధను, ఇతరుల బాధను అర్థం చేసుకునే తత్వం అలవడుతుంది.
- స్వీయగౌరవం, ఇతరుల హద్దులను గౌరవించడం నేర్చుకోవచ్చు. అతి తక్కువ సమయంలో సంబంధాలు విడిపోవడం తగ్గించవచ్చు.

'నెగోషియేటింగ్ ఇంటిమేట్ రిలేషన్‌షిప్స్' కోర్సు ప్రత్యేకతలివీ



- ఈ కోర్సు కేవలం థియరీతో నడవదు. విద్యార్థుల స్వీయ అనుభవాలు, డిజిటల్ జీవితం, పాప్ కల్చర్ ప్రభావం, డేటింగ్ చాలెంజెస్ వంటి అంశాలపై విశ్లేషణ చేయించడమే దీని లక్ష్యం.
- సంబంధాల్లో రెడ్ ఫ్లాగ్స్ (అపాయం సూచించే సంకేతాలు) గుర్తించడాన్ని నేర్పించటం.
- భావోద్వేగ సమతుల్యత పెంపొందించటం.
- గౌరవం, ఒప్పందం ఆధారంగా సంబంధాలు నిర్మించడం.
- సమస్యలు, ఒత్తిళ్లు వచ్చినప్పుడు ఎలా పరిష్కరించాలో నేర్పడం.
- స్నేహం, ప్రేమ, లైంగికతలతో ముడిపడిన ప్రవర్తన గురించి మౌలిక అవగాహన కల్పించడం.
- సోషల్ మీడియా, షోలు, రీల్స్ వంటివి మన సంబంధాలపై చూపే ప్రభావాన్ని విశ్లేషించడం.

ఎలా అర్థం చేసుకోవాలో నేర్పించాలి...



- టీనేజీలో వచ్చే మార్పులకు సంబంధించి భావోద్వేగపరంగా ఇతరత్రా మార్పులపై మన విద్యా విధానంలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. టీచర్లకు కూడా విద్యార్థులకు ఈ విషయంపై ఏమి బోధించాలో తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు కూడా ఆలోచించి ప్రతీ విద్యాసంస్థలో ఒకరిద్దరు ఫ్యాకల్టీ మెంబర్లకు భావోద్వేగపరమైన అంశాలు, స్నేహాలు, సంబంధాలపై శిక్షణ ఇచ్చి విద్యార్థులకు బోధించేలా చూడాలి. మేము ఇప్పటికే 500కుపైగా స్కూళ్లలో ప్రేమలు, రిలేషన్స్‌షిప్స్‌ను ఎలా అర్థం చేసుకోవాలి, వాటితో ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశాం.

- సి.వీరేందర్, సైకాలజిస్ట్

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్



ఆపరేషన్ సిందూర్‌తో వాయుసేన శక్తి చూపాం

ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

దేశానికి ఏ అవసరం వచ్చినా ముందుంటాం

యువ అధికారులు దేశ సేవకు అంకితం అవ్వాలి

ఏఎఫ్ఏలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 254 మంది కేడెట్లు

సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ భారత వైమానిక దళ సత్తాకు నిదర్శనంగా నిలుస్తుందని చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (సీఏఎస్) ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. శత్రువును కచ్చితత్వంతో దెబ్బకొట్టగలమని నిరూపించామని, భారత వాయుసేన సామర్థ్యాన్ని ఈ ఆపరేషన్‌లో ప్రదర్శించామని ఆయన పేర్కొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన 254 మంది ఫ్లైయింగ్, గ్రౌండ్ డ్యూటీ విభాగాల ఫ్లైట్ కేడెట్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ) లో శనివారం ఘనంగా కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న కేడెట్లకు రాష్ట్రపతి కమిషన్‌ను(అధికారిక బ్యాడ్జీలను) ప్రదానం చేశారు. వీరితోపాటు భారత నౌకాదళం నుంచి తొమ్మిది మంది అధికారులు, కోస్ట్‌గార్డ్స్ నుంచి ఏడుగురు, వియత్నాం నుంచి ఒకరు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన కేడెట్లకు పతకాలు అందజేశారు. అనంతరం ఏపీ సింగ్ కేడె ట్లను ఉద్దేశించి మాట్లాడుతూ, యువ అధికారులు దేశ సేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి ఏదైనా ముప్పు సంభవించినప్పుడు దానిని ఎదుర్కోవడానికి మొదటి వరుసలో భారత వాయుసేన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, తాను భారత వాయుసేనలో చేరి శుక్రవారంతో 40 ఏళ్లు పూర్తయినట్టు ఏపీ సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. యువ అధికారులకు విజయవంతంగా శిక్షణ ఇచ్చిన ఎయిర్ ఫోర్స్ అకాడమీ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వాయుసేన అధికారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రైనింగ్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ తేజిందర్ సింగ్, ఎయిర్ ఫోర్స్ అకాడమీ కమాండెంట్ ఎయిర్ మార్షల్ పీకే వోహ్రా ఇతర ఎయిర్‌ఫోర్స్ అధికారులు, కేడెట్ల కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు.

బతికుండగానే శ్మశానవాటికకు..

అనారోగ్యం బారిన పడిన వ్యక్తిని ఇంట్లోకి అనుమతించని ఇంటి యజమాని



గోపి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురిలో మానవత్వం మంటగలిసింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి జీవచ్ఛవంలా మారగా అతడిని అద్దె ఇంట్లోకి రానీయలేదు ఆ ఇంటి యజమాని. దీంతో గత్యంతరం లేక కుటుంబ సభ్యులు అతడిని శ్మశానవాటి కకు తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ధర్మపురిలోని ఎస్సీ కాలనీకి చెందిన రంగు గోపినాథ్ (45) స్థానిక నందికూడలి వద్ద టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు. పెద్ద చెల్లి సుజాత, ఆమె కుమారుడు అభిషేక్‌తో కలిసి ఏడాదికాలంగా ఎస్సీ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కొన్ని రోజుల క్రితం గోపి అనారోగ్యం బారిన పడ్డాడు. కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయగా.. మెదడులో రక్తం గడ్డ కట్టిందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో వారం క్రితం గోపి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కరీంనగర్‌లో చికిత్స చేయించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తీసుకెళ్లారు. అప్పు చేసి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టినా అతడి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో బతకడం కష్టమని, ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో గోపిని తిరిగి ధర్మపురికి తీసుకొచ్చారు. అయితే జీవచ్ఛవంలా ఉన్న గోపిని ఇంట్లోకి తీసుకురావద్దంటూ ఇంటి యజమాని నిరాకరించాడు. దీంతో గత్యంతరం లేక కుటుంబ సభ్యులు కొన ఊపి రితో ఉన్న అతడిని ముందుగా శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లారు.

దయ చూపిన మున్నూరుకాపు సంఘం..

శ్మశాన వాటిక వద్ద పడుకోబెట్టిన గోపి పరిస్థితిని గమనించిన మున్నూరుకాపు సంఘం వారు సంఘం భవనంలో ఆశ్రయమి చ్చారు. గోపి దీనస్థితిని తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తక్షణ సాయం కింద రూ.10 వేలు, బీజేపీ నాయకుడు దామెర రాంసుధాకర్ రూ.10,500 ఆర్థిక సాయాన్ని అందించారు.

గిరిజన బిడ్డ 'వీల్' పవర్

తొలిరోజు ఎంజీబీఎస్ నుంచి మిర్యాలగూడకు బస్సు నడిపిన సరిత

దేశంలోనూ, తెలంగాణలోనూ తొలి మహిళా ఆర్టీసీ డ్రైవర్‌గా రికార్డు



సంస్థాన్ నారాయణపురం: మారుమూల తండాలో పుట్టి పెరిగిన గిరిజన బిడ్డ సరిత.. ప్రగతి రథం స్టీరింగ్ పట్టి చరిత్ర సృష్టించింది. శనివారం ఆమె ఎంజీబీఎస్ నుంచి మిర్యాలగూడ వరకు నాన్‌స్టాప్ బస్సు నడిపింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యాతండాకు చెందిన వి.రాంకోటి, రుక్కల కుమార్తె సరిత అక్క దగ్గర ఉంటూ దేవరకొండలో 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి, అక్కడ నుంచి 10వ తరగతి వరకు ఓపెన్ స్కూల్‌లో చదివింది. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో కుటుంబ బాధ్యతను తీసుకుంది. ఈ క్రమంలో ఆటో నడపడం నేర్చుకుంది. ఐదేళ్ల సంస్థాన్ నారాయణపురం నుంచి సీత్యాతండా వరకు ఆటో నడిపింది. అనంతరం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంటూ బస్సు డ్రైవింగ్ నేర్చుకుంది. తర్వాత కాలంలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకుంది. ఆజాద్ ఫౌండేషన్ సహకారంతో సరిత ఢిల్లీకి వెళ్లి కొన్నాళ్లు కారు నడిపింది. రెండేళ్ల తర్వాత ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో 15 మంది మహిళా డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయగా, సరిత ఒక్కతే ఎంపికైంది. దీంతో దేశంలో మొదటి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు పొందింది. ఆమె ఢిల్లీలోని సరోజినీ డిపోలో ఉద్యోగం చేస్తూ రోజూ 185 కిలోమీటర్ల దూరం బస్సు నడిపింది.

తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగం: తెలంగాణలో ఉద్యోగావకాశం కల్పించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి సరిత తీసుకెళ్లింది. కోమటిరెడ్డి సిఫార్సు మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఉద్యోగం సాధించింది. ఎంజీబీఎస్ డిపోలో పోస్టింగ్ ఇచ్చారు.

రక్తదాతల సేవ అమోఘం: గవర్నర్

రాజ్‌భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిష్ణుదేవ్ వర్మ



రక్తదాతను అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: నిస్వార్థ సేవనే ప్రజల జీవితాన్ని కాపాడుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాజ్‌భవన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం సేవగా గుర్తించాల న్నారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలి పారు. అత్యవసర సమయాల్లో రక్తం కావాల్సిన వారికి ఈ దాతలు ఇచ్చిన రక్తం ఎంతో ఉపయోగ పడుతుందని వ్యాఖ్యానించారు. స్వచ్ఛంద రక్త దానం చేసే వారిని, వారిని మోటివేట్ చేసిన వారిని గవర్నర్ అభినందించారు. డాక్టర్లు, రెడ్‌క్రాస్ వలంటీర్లు రక్తాన్ని సురక్షితంగా తీసుకోవడమేకాక, భద్రపరచడాన్ని ప్రశంసించారు. ఈ రక్తదానంలో రాజ్‌భవన్ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాలుపంచుకోవడం సంతోషకరమని వ్యాఖ్యానించారు. రక్తదానం చేసిన వారికి, ఎన్జీవో సంఘాలకు సర్టిఫికె ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్, సంయుక్త కార్యదర్శి భవానీ శంకర్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి చిక్కిన 32 కిలోల చేప

అడవిదేవులపల్లి: నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలోని కృష్ణానదిలో శనివారం మత్స్యకారుడు వల వేయడంతో 32 కిలోల బొచ్చ చాప చిక్కింది. రోజు మాదిరిగా మత్స్యకారుడు కోల దుర్గయ్య కృష్ణానది ఒడ్డున వలవేసి ఉన్నాడు. కృష్ణానది నీరు తగ్గడంతో చేప వలలో పడింది. భారీ చేప చిక్కడంతో దుర్గయ్య సంతోషం వ్యక్తం చేశాడు.



కృష్ణానది వద్ద 32 కిలోల చేపతో మత్స్యకారుడు దుర్గయ్య

'మారణహోమాన్ని ఇజ్రాయెల్ తక్షణమే ఆపాలి'

సాక్షి, హైదరాబాద్: అమెరికా అండతో ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధ మారణహోమాన్ని నిలువరించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. శనివారం సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో వామపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి సీపీఐ నుంచి పశ్య పద్మ, సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి, వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్ (సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ) రమేశ్‌రాజా (సీపీఐఎంఎల్ లిబరేషన్), మురహరి (ఎస్‌యూసీఐ(సి)) పాల్గొన్నారు. గత 20 నెలలుగా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ నిరంతర బాంబులు, వైమానిక దాడులకు పాల్పడుతోందని సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు.

ఇంటి కాంపౌండ్‌లోకి చిరుత


కుటుంబీకుల భయాందోళన.. బీబీపేటలో ఘటన



సీసీ కెమెరాలో రికార్డయిన చిరుత సంచారం

కల్హేర్(నారాయణఖేడ్)/ నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట గ్రామంలో ఓ ఇంటి కాంపౌండ్‌లోకి శనివారం ఉదయం చిరుత చొరబడటం స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట గ్రామానికి చెందిన కల్హేర్ మండల మాజీ జెడ్పీటీసీ స్వప్న భర్త గుండు మోహన్ ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇంటి కాంపౌండ్ గేటు గొళ్లెం వేసి బయటకు వెళ్లారు. అయితే కుటుంబ సభ్యులు ఇంట్లోని సీసీటీవీని పరిశీలిస్తున్న క్రమంలో చిరుత వెళ్లడాన్ని గుర్తించారు. వీడియోని రికార్డు చేసి ఫోన్‌లో గుండు మోహన్‌కు పంపించగా అది చిరుత పులిలా ఉందని, తలుపులు వేసుకుని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. సమాచారాన్ని గుండు మోహన్ గ్రామస్తులకు చేరవేయగా వారు ఇంటి పరిసరాల్లో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ చిరుతను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించారు. అప్పటికే చిరుత ఇంటి వెనుక కాంపౌండ్ నుంచి దూకి వెళ్లిపోయింది. కాగా, ఘటనా స్థలాన్ని మెదక్ డీఎఫ్ఓ శ్రీధర్‌రావు పరిశీలించారు. చిరుత సంచారాన్ని తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన 'సాక్షి'కి వెల్లడించారు.

'గుట్ట'లో ఉచితంగా లడ్డూ ప్రసాదం



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదం ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆలయ ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి శనివారం ప్రారంభించారు. టీటీడీ తరహాలో యాదగిరి క్షేత్రంలో కూడా భక్తులు శ్రీస్వామిని గర్భాలయంలో దర్శించుకొని పశ్చిమ ద్వారం నుంచి బయటకు వచ్చే క్రమంలో ప్రతి శనివారం లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు ఈవో వెల్లడించారు. వారంలో ఆరు రోజులు పులిహోర ప్రసాదం, ప్రతి శనివారం లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా అందిస్తామన్నారు. ముందుగా 100 కిలోల ప్రసాదం పంపిణీతో ట్రయల్ రన్ చేపట్టామని, త్వరలోనే వందశాతం భక్తులకు ఉచిత ప్రసాదం అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 15-6-2025



కూసుమంచి మండలంలో సిద్ధమవుతున్న రైస్ మిల్లు షెడ్డు



రైస్‌మిల్లు షెడ్డులో పరికరాలు

ఎస్సెస్సీ.. ఇంజనీర్!

పదో తరగతి చదివి ఇంజనీర్ పనుల్లో రాణిస్తున్న సుధాకర్

రైస్‌మిల్లుల నిర్వహణ, మరమ్మతుల్లో నైపుణ్యం • 33 ఏళ్లలో 110 మిల్లులు ఫిట్టింగ్ చేసి సత్తాచాటుతున్న వైనం

ముదిగొండ: చదివింది పదో తరగతే.. కానీ చిన్నతనం నుంచే ఇంజనీర్ కావాలన్న పట్టుదలను మాత్రం వీడలేదు. ఓ రైస్‌మిల్లు మెకానిక్ వద్ద కొన్నేళ్లు పని నేర్చుకు ని.. ఆతర్వాత సొంతంగా చిన్నచిన్న మరమ్మతులు చేయ డం మొదలుపెట్టాడు. ఆపై సొంతంగా కొత్త రైస్‌మిల్లుల్లో పరికరాలు బిగించే స్థాయికి చేరాడు. ఒకటి కాదు రెండు కాదు 33 ఏళ్ల కాలంలో 110 మంది రైస్‌మిల్లుల ఏర్పాటులో భాగం గా పంచుకున్న వ్యక్తి విజయగాథ ఇది.

మిత్రులను చూస్తూ..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన తునికిపాటి సుధాకర్ పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. కానీ ఆతర్వాత ఆయన పదో తరగతి మెమో పోయింది. డూప్లికేట్ సర్టిఫికెట్ ఎలా తీసుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఆయన స్నేహితులు ఇంటర్ పూర్తిచేసి ఇంజనీరింగ్ విద్య మొదలుపెట్టారు. అయినప్పటికీ ఉన్నత విద్య చదవాలనే పట్టుదల వీడని సుధాకర్ ఎలా ముందుకు సాగాలా అని ఆలోచనలో పడ్డాడు. ఇంటర్ పాస్ అయి, బీటెక్ చదవాలంటే నాలుగేళ్లు పడుతుంది. ఆతర్వాత ఎంచుకున్న విభాగం లోనూ స్థిరపడాలంటే నైపుణ్యాలు తప్పనిసరి. కానీ సుధాకర్‌కు మెకానికల్ ఇంజనీర్ కావాలని ఉండటం, చదివే పరిస్థితులు లేక తొలుత రైస్‌మిల్లు మెకానిక్ వద్ద శిక్షణ ఆరం భించాడు. కొన్నేళ్లు ఆయన శిక్షణ రాటుదేలాక సొంతంగా మరమ్మతులు చేయడం మొదలుపెట్టాడు.

కొత్త మిల్లులపై దృష్టి

చాన్నాళ్లు రైస్‌మిల్లు మరమ్మతుల రంగంలో పనిచేసిన సుధాకర్ నైపుణ్యం సాధించాడు. ఆతర్వాత కొత్త మిల్లుల ఏర్పాటుపై దృష్టి సారించాడు. ఇలా 33 ఏళ్లలో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలో 110 మిల్లుల ఏర్పాటులో భాగం పంచుకున్నాడు. ఏ స్థాయి మిల్లు అయినా సరే యజమానుల సూచనలతో కావాల్సిన విడిభాగాలు తెప్పించడం.. చకచకా రోజుల వ్యవధిలోనే మిల్లులు సిద్ధం చేయడంలో ప్రావీణ్యం సాధించాడు. విడిభాగాలు తెప్పిం చడం, అమర్చడం, విద్యుత్, వెల్డింగ్ ఇలా అన్నీ ప్రక్రియల్లో నైపుణ్యం సాధించినా సహాయకులతో కలిసి నెలలోగా మిల్లును సిద్ధం చేస్తుండటం విశేషం. అంతేగాక తాను అమర్చిన మిల్లుల్లో ఏ సమస్య వచ్చినా త్వరగా మరమ్మతు చేసి పనులు ఆగకుండా చూస్తుండటంతో పలు జిల్లాల్లో పేరు సాధించాడు.

ఎక్కడెక్కడ..?: ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోనే కాక ఏపీలోని పలు ప్రాంతాల్లో సుధాకర్ రైస్‌మిల్లులు సిద్ధం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో రైస్ మిల్లుల ఏర్పాటులో భాగం పం చుకున్నాడు. మిల్లుల ఏర్పాటుకు కావాల్సిన పరికరాలను విజయవాడ, బెంగళూరు, చైన్నై, హైదరాబాద్‌లో యజమానులతో తెప్పించి.. సామర్థ్యం మేరకు రోజుల వ్యవధిలోనే మిల్లులను సిద్ధం చేస్తుంటామని సుధాకర్ తెలిపారు.

మూడు మిల్లులు సుధాకర్‌తోనే..

2004లో పాల్వంచ సమీపాన పాండురంగాపురం, 2015లో తోడేళ్లగూడెం, 2023లో మిట్టపల్లిలో మూడు రైస్ మిల్లులు ఏర్పాటుచేశాం. ఈ పనులన్నీ సుధాకర్ ఆధ్వర్యంలోనే జరిగాయి. మిల్లుల ఏర్పాటు పనులే కాక ఏ చిన్న మరమ్మతు వచ్చినా చేస్తాడు. తద్వారా మాతో పాటు రైతులకు ఇక్కట్లు లేకుండా పనులు సాగుతున్నాయి.

– ఇలవల సంజీవరెడ్డి, పాండురంగాపురం, పాల్వంచ మండలం



మిల్లులో పరికరాలు బిగిస్తున్న సుధాకర్



వెల్డింగ్ చేస్తూ...

బడాయి కబుర్లు ఎందుకు.. విచారణకు సహకరించు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ–రేస్ కేసులో ఏసీబీ నోటీసు ఇవ్వగానే కేటీఆర్ హడలిపోతున్నా డని, విచారణకు వెళ్తానని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూనే బడాయి కబుర్లు చెప్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కేటీఆర్.. నీ అతి తెలివి ప్రదర్శన ఆపి ఏసీబీ అధికారుల ముందుకొచ్చి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు. సీఎం రాజకీయ కక్ష సాధింపులు, వేధింపులకు పాల్పడితే ఇప్పటికే జైలుకు వెళ్లే వారు. కేటీఆర్‌కు జైలుకు వెళ్లాలన్న ఉబలాటం అంతగా ఉంటే మీ కోరికను దర్యాప్తు సంస్థలు తీర్చుతాయి. అప్పటి వరకు తొందర పడొద్దు' అని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డికి నార్కో అనాలసిస్ టెస్ట్ చేయాలంటూ కేటీఆర్ సంబంధం లేకుండా మాట్లాడుతున్నాడని శ్రీనివాస్ ధ్వజమెత్తారు. నార్కో అనాలసిస్ టెస్ట్ చేయాలా? పాలిగ్రాఫ్ చేయాలా? అన్నది కోర్టులు, విచారణ సంస్థలు నిర్ణయిస్తాయని, ఎవరి మీద కేసు ఉంటే వాళ్లు విచారణకు హాజరవుతారు తప్ప ఇంకొకరు వచ్చి నార్కో అనాలసిస్ టెస్టులు చేసుకోరని వ్యాఖ్యానిం చారు. కల్వకుంట్ల కుటుంబానికి అంత ధైర్యం ఉంటే ముందు మీ అయ్య, మీ చెల్లెలు, మీ బావతో నార్కోటెస్టులు చేయించుకోవాలని సూచించారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ యువ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల పార్టీ ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన కాంగ్రెస్ యువ నాయకులు పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఎ.ఫయీమ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, చనగాని దయాకర్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు గాలి అనిల్‌కుమార్, పారిజాత నర్సింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం వారితో మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉం టుందని, రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ కంటే ఏపీకి ఎక్కువ నిధులిచ్చామంటారా?

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్ ఆంధ్రా పర్యటనలో తెలంగాణ కంటే పదిరెట్ల నిధుల వరద ఏపీకి పారించామని చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు పది రూపాయలు తీసుకురాకున్నా.. ఆంధ్రాకు పంపిస్తున్నామని చెప్పడం ఆత్మాభిమానాన్ని చం పుకోవడమేనన్నారు. బండి సంజయ్ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి.. కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, బీసీ కమీషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టుల్లో జరుగుతున్న నష్టాల మీద కేంద్రప్రభుత్వం స్పందించదని, అలాంటి వాటిపై ఎలాంటి కమిషన్, విచారణ ఉండదన్నారు. ఏపీ జలదోపిడీ విషయంలో బీజేపీ నేతలు, కాంగ్రెస్ నేతలు నోరెత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ చీకటి స్నేహం నడుస్తోందని, కాం గ్రెస్ ప్రభుత్వానికి ముల్లుగుచ్చితే.. బీజేపీ నేతలకు నొప్పిలేస్తుందని ఆరోపిం చారు. కాళేశ్వరం కమిషన్ విషయంలో నివేదిక తుది దశకు వచ్చిందని, సీఎం గా ఉండి దాని విషయం బయట మాట్లాడటం అనైతికమని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు.

తగ్గుతున్న ఐఐటీల ప్రభ

జోసా కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ బ్రాంచీలో ఓపెన్ కేటగిరీలో 2024-25లో కటాఫ్ ర్యాంకులు

ఐఐటీ	2025 (తొలి రౌండ్)		2024 (ఆఖరి రౌండ్)	
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు
బాంబే	66	296	68	421
కాన్పూర్	270	1,109	252	1,117
ఖరగ్‌పూర్	450	1,908	415	1,661
ఢిల్లీ	125	498	116	556
మద్రాస్	171	805	159	757
హైదరాబాద్	667	2,121	656	1,809
తిరుపతి	4,620	8,237	5,024	6,324
రూర్కీ	535	2,013	481	1,870
ధార్వాడ్	6,242	8,966	6,375	11,138

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో జోసా కటాఫ్ ర్యాంకులు (సీఎస్ఈ, ఓపెన్ కేటగిరీ)

నిట్	2025		2024	
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు
వరంగల్	3,386	4,386	3,082	4,683
తిరుచ్చి	1,104	1,646	1,245	2,850
సూరత్‌కల్	1,525	3,531	1,920	4,354
కలకత్తా	4,678	6,856	5,717	9,343
ఆంధ్రప్రదేశ్	16,537	27,253	19,483	26,024
జలంధర్	10,073	18,149	14,414	17,013
అగర్తల	10,073	31,912	26,124	35,092
మిజోరం	31,124	36,191	49,385	75,819

ఐఐటీ హైదరాబాద్‌లో తాజా కౌన్సెలింగ్‌లో సీఎస్ఈ, సివిల్ కటాఫ్ ర్యాంకులు

కేటగిరీ	సీఎస్ఈ		సివిల్	
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు
ఓపెన్	667	2,121	7,945	15,007
ఈడబ్ల్యూఎస్	93	236	1,283	2,104
ఓబీసీ	284	887	3,177	5,919
ఎస్సీ	179	348	1,811	1,896
ఎస్టీ	65	110	533	605

డ్రగ్స్ టెస్ట్ చేయించుకుందామంటే కేటీఆర్ ఎందుకు రాలేదు?

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏసీబీ కేసుల్లో లైడిటెక్టర్ టెస్టులకు సిద్ధం కావాలం టూ సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన సవాల్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఈ–కారు రేసులో నోటీసులివ్వడం తో ఫ్రస్టేషన్‌తో కేటీఆర్ అలా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానిం చారు. 'ఇప్పుడు సీఎం రేవంత్‌కు కేటీఆర్ చాలెంజ్ చేస్తున్నాడు. కానీ డ్రగ్స్ టెస్టు చేయించుకుందాం రమ్మని పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్పుడే రేవంత్ చాలెంజ్ విసిరారు. కానీ కేటీఆర్ ఆ రోజున ఎందుకు రాలేదు? అవినీతి కేసుల్లో లైడిటెక్టర్ టెస్టులు చేయించుకుంటే మరి కోర్టులెందుకు ఉన్నట్టు?' అని శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో చామల ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కేటీఆర్ చెప్తు న్నట్టు వెండెట్టా పాలిటిక్స్ చేయదని, ప్రజా పాలిటిక్స్ చేస్తుంద న్నారు. మొన్నటివరకు కేసీఆర్ చుట్టూ దెయ్యాలు తిరుగు తున్నాయని చెప్పిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారంటేనే ఆ కుటుంబానిదంతా డ్రామా అని అర్థమవుతోందని చామల వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో దివ్యాంగులకు స్వర్ణయుగం

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, ఆయన హయాంలోనే తెలంగాణలోని దివ్యాంగులకు స్వర్ణయుగం ప్రారంభమైందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ అన్నారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని మాట్లాడుతూ.. 40 శాతం వైకల్యం ఉన్నవారికి ఉచిత పరికరాలు అందించడం దేశంలోనే తెలం గాణలో మొదటిసారి జరిగిందని అన్నారు. దివ్యాం గులను దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం కూడా తెలంగాణలోనే సాధ్యమైందన్నారు. అందుకే రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశామని, చరిత్రలో సీఎం రేవంత్ నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి చారి, ఈ విభాగం నేతలు పాల్గొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా హాజరయ్యారు. కాగా, ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీభవన్‌కు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

తిరుమల హాథిరామ్ మఠంలో తెలుగు పీఠాధిపతులకు అవకాశమివ్వాలి

సాక్షి, హైదరాబాద్: తిరుమల కొండపై ఉన్న హాథిరామ్ బావాజీ మఠంలో ఆంధ్రప్రదేశ్, తెలం గాణకు చెందిన బంజారా పీఠాధిపతులకు మాత్రమే పూజలు చేసే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. శనివారం పలువురు బంజారా పీఠాధిపతులు కవితతో సమావేశమైన అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో కవిత ఫోన్‌లో మాట్లాడి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

చిత్ర పరిశ్రమకు సంబంధం లేని వ్యక్తి పేరుతో అవార్డులా?

వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి

సాక్షి, హైదరాబాద్: చిత్ర పరిశ్రమకు సంబంధం లేని వ్యక్తి పేరుతో అవార్డులు అందజేయడం అవివేకమని, గద్దర్‌ను గౌరవించాలంటే వేరే పద్ధతిలో, వేరే మార్గం లో ఆ పని చేసుకోవచ్చని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి, తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల పేరుతో అవార్డు అందజేస్తే అందరూ హర్షిస్తారని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, శోభన్ బాబు, కృష్ణ, దాసరి నారాయణ రావు, రావు గోపాలరావు, సావిత్రి వంటి ఎంతో మంది మహానటులు తెలుగు చిత్ర పరిశ్రమకు సేవ చేశారని, వారి పేరుతో అవార్డులు ఇస్తే బాగుంటుందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని, దేశంపైనే యుద్ధం ప్రకటించే నేపథ్యం గల వ్యక్తికి చిత్ర పరిశ్రమకు ముడిపెట్టి అవార్డులు అందజేయడం సమంజసం కాదని బాలస్వామి అన్నారు.

ఆరోగ్య యోగం



యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందినవారంతా యోగాసనాల్లో నిమగ్నమవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం అనంతపురం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో దివ్యాంగులు, ఉద్యోగులు పాల్గొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

సాగుకు సన్నద్ధం



అనుకున్న సమయానికంటే ముందే వర్షాలు కురవడంతో రైతులు వరిసాగుకుసన్నద్ధమవుతున్నారు. పొలాల్లో ఒకవైపు వరినారు వేసుకుని మిగిలిన పొలమంతా పంటకు సారం అందించేందుకు జీలుగ విత్తనాలు వేశారు. జీలుగు మొక్కలు పెరగగానే ట్రాక్టర్‌తో తొక్కించేస్తారు. వైఎస్సార్ జిల్లా సిద్దవటం మండలం మాచుపల్లె గ్రామ పొలాల్లో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్,కడప

ప్లాస్టిక్ పువ్వులు..చెంతన చిరునవ్వులు



విశాఖ బీచ్ రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద సందర్శకులను ఆకట్టుకునేందుకు రంగురంగుల సింథటిక్ పూలతో గ్లోబ్‌ను తయారుచేసి పెట్టారు. ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ గ్లోబ్‌ను చూసేందుకు పర్యాటకులు ఉత్సుకత చూపిస్తున్నారు. పూల గ్లోబ్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మరో దోపిడీకి తెరలేపిన విద్యుత్ శాఖ



- విద్యుత్ వినియోగదారులపై అదనపు లోడ్, వినియోగ చార్జీలు
- నెల రోజుల్లో చెల్లించకపోతే సర్వీసు తొలగిస్తామని హెచ్చరిక
- ఇప్పటికే రూ.15,485 కోట్ల భారాన్ని మోస్తున్న రాష్ట్ర ప్రజలు
- ఇప్పుడు లోడ్ క్రమబద్ధీకరణ పేరుతో కూటమి మరో దోపిడీ

విజయవాడ నగరంలో స్క్యూ బ్రిడ్జి సమీపంలో నివసించే లక్ష్మికి ఏపీ సీపీడీసీఎల్ నుంచి ఈ నెల విద్యుత్ బిల్లుతో పాటు అదనపు వినియోగానికి సెక్యూరిటీ డిపాజిట్ (అడిషనల్ కన్జంప్షన్) చెల్లించాలంటూ ఓ నోటీసు వచ్చింది. అది చూసిన లక్ష్మికి గుండె ఆగినంత పనైంది. ఆమె విద్యుత్ సర్వీసు తీసుకున్నప్పుడు రెండు నెలలకు అడ్వాన్స్‌గా రూ.1,600 చెల్లించారు. కానీ.. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ వినియోగించిన విద్యుత్ ఆధారంగా రూ.15,132 సెక్యూరిటీ డిపాజిట్ కట్టాల్సి ఉందని, అందులో రూ.1,600 పోనూ మిగిలిన రూ.13,532ను 30 రోజుల్లోగా చెల్లించాలని ఆ నోటీసులో ఉంది. ఇప్పటికిప్పుడు అంత సొమ్ము ఎక్కడి నుంచి తేవాలో తెలియక, ఇదెక్కడి అన్యాయం బాబూ అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.

'విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి. మీ విద్యుత్ సర్వీసు లోడ్ క్రమబద్ధీకరణకు చక్కటి అవకాశం వచ్చింది. చెల్లించాల్సిన డిపాజిట్‌లో 50 శాతం రాయితీ లభిస్తుంది. త్వరపడండి. ఈ అవకాశం కొంతకాలం మాత్రమే' అంటూ ఇటీవల డిస్కంలు అరకొర ప్రకటనలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాయి. అసలు విషయంలోకి వెళితే.. క్రమబద్ధీకరణ పేరుతో రాష్ట్ర ప్రజల నుంచి డిస్కంలు అడ్డదారిలో మరో దోపిడీకి పాల్పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ)ని ఏమార్చి, విద్యుత్ వినియోగదారులను మోసం చేసి, రాయితీ పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఇప్పటికే రూ.15,485 కోట్ల అదనపు చార్జీల భారంతో విద్యుత్ బిల్లులు రెట్టింపయ్యాయి. వాడిన దానికి మించి వాడని విద్యుత్‌కు కూడా అకారణంగా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని జనం గగ్గోలు పెడుతున్నారు. అది చాలదన్నట్టు ఇప్పుడు లోడ్ క్రమబద్ధీకరణ, అదనపు వినియోగ సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో నోటీసులు జారీ చేస్తూ ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యుత్ బిల్లుతో పాటు వస్తున్న ఈ నోటీసులను వినియోగదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. - సాక్షి, అమరావతి

ఇప్పుడెందుకు గుర్తొచ్చింది?

విద్యుత్ సర్వీసు తీసుకునే సమయంలో అధికారులు గతంలో గృహంలో ఉన్న పరికరాల ఆధారంగా కనెక్టెడ్ లోడ్‌ను అంచనా వేసి కాంట్రాక్టెడ్ లోడ్‌ను నిర్ణయించేవారు. ప్రస్తుతం విద్యుత్ బిల్లులో కనెక్టెడ్ లోడ్, కాంట్రాక్టెడ్ లోడ్ వివరాలను చేర్చి, వినియోగదారులు తమ లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని సూచిస్తున్నారు. కాంట్రాక్టెడ్ లోడ్ కంటే ఎక్కువ వినియోగం ఉంటే.. అదనపు లోడ్ ఆధారంగా చార్జీలు విధిస్తున్నారు. అందులో భాగంగా కాంట్రాక్టెడ్ లోడ్ కంటే ఎక్కువగా వినియోగం ఉన్న వినియోగదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నోటీసుల్లో అదనపు లోడ్ చార్జీలను చెల్లించాలని లేదా లోడ్‌ను క్రమబద్ధీకరించాలని చెబుతున్నారు. జూన్ 30లోగా క్రమబద్ధీకరించుకునే వారికి 50 శాతం రాయితీ ఇస్తామని ఏపీఈఆర్సీ ద్వారా ఓ ఆఫర్‌ను కూడా తీసుకొచ్చారు. దానిని ముందు పెట్టి అవసరమైన వాళ్లకు, అవసరం లేని వాళ్లకు కూడా నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పుడు కట్టకపోతే పూర్తి మొత్తం చెల్లించాలని చెబుతున్నారు. ఈ కొత్త చార్జీలు వినియోగదారులకు, ముఖ్యంగా సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ఇన్నాళ్లూ లేని చార్జీలు ఇప్పుడు ఆకస్మికంగా విధించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

అసలేమిటీ లోడ్

విద్యుత్ లోడ్ భారం అనేది ఒక గృహం, సంస్థలో విద్యుత్ వినియోగానికి అవసరమైన మొత్తం విద్యుత్ అవసరాన్ని సూచిస్తుంది. దీనిని సాధారణంగా కిలోవాట్లలో కొలుస్తారు. ఈ లోడ్ రెండు రకాలుగా విభజిస్తారు. ఒకటి కనెక్టెడ్ లోడ్ అంటే.. ఒక విద్యుత్ సర్వీసుకు అనుసంధానంగా ఉన్న ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు, టీవీలు వంటి అన్ని పరికరాల మొత్తం విద్యుత్ సామర్థ్యం. రెండవది కాంట్రాక్టెడ్ లోడ్.. అంటే విద్యుత్ సరఫరా సంస్థతో వినియోగదారుడు చేసుకున్న ఒప్పందం ప్రకారం అనుమతించిన గరిష్ట లోడ్. ఉదాహరణకు 2 కిలోవాట్ల కాంట్రాక్టెడ్ లోడ్‌ను ఎంచుకుని అంతకు మించి వినియోగం ఉంటే అదనపు చార్జీలుగానీ, జరిమానా గానీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే గృహ విద్యుత్ వినియోగంలో చాలామంది సామాన్య, పేద కుటుంబాలు కేవలం ఫ్యాన్లు, లైట్లు, టీవీ వంటి సాధారణ విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగిస్తాయి. వాటి లోడ్ అధికంగా ఉండకపోయినా అదనంగా కట్టాలనడం వల్ల వారిపై ఆర్థిక భారం పడుతుంది. గృహ వినియోగదారులు కిలోవాట్‌కు రూ.2,000 అదనపు లోడ్ చార్జీ, రూ.200 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఈ లెక్కన 5 కిలోవాట్లకు నోటీసు ఇస్తే రూ.11 వేలు చెల్లించాలి. ఇందులో లోడ్ చార్జీలపై సగం రాయితీ ఇస్తే రూ.5 వేలు తగ్గుతుంది. మిగతా రూ.6 వేలు నెల రోజుల్లోపు చెల్లించకపోతే సర్వీసు తొలగించి సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ హెచ్చరిస్తోంది.

క్లుప్తంగా...

ఏపీ న్యాక్‌కు ప్రతిష్టాత్మక గోల్డెన్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న న్యాక్ ఏపీ అదనపు డైరెక్టర్ కె. దినేష్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గోల్డెన్ అవార్డును దక్కించుకుంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ (ఐఎస్‌డీఏ) ఇచ్చే ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ 2025లో ఉత్తమ నైపుణ్య అభివృద్ధి విభాగంలో ఏపీ న్యాక్ ఈ అవార్డును కైవసం చేసుకుంది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో న్యాక్ ఏపీ అదనపు డైరెక్టర్ కె.దినేష్ కుమార్ అవార్డును స్వీకరించారు.

మండలాల్లో బీజేపీ వికసిత్ భారత్ సంకల్ప సభలు



సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం పార్టీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి క్షేత్ర స్థాయిలో వివరించాలని నేతలకు సూచించారు. ఇందులో పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గారపాటి సీతారామంజనేయ చౌదరి, సన్నపురెడ్డి దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రోకలిబండతో భార్యను కొట్టి చంపిన భర్త

అనుమానం, వేధింపులే కారణం

నెల్లూరు(క్రైమ్): భార్య చీటికి మాటికి గొడవపడుతుండడంతో విసిగిపోయిన భర్త రోకలిబండతో కొట్టి హతమార్చాడు. ఈ సంఘటన నెల్లూరులో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు బాలాజీనగర్ గొడహాస్టల్ సమీపంలో ఎల్.విజయ్‌చంద్ర, శైలజ(46) దంపతులు నివసిస్తున్నారు. వారికి బీటెక్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులున్నారు. విజయ్‌చంద్ర ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శైలజ తండ్రి చెన్నైలో ఉంటూ మృతిచెందారు. ఆయనకు చెందిన ఆస్తులు తమకు రావాలంటే కొంత నగదు ఖర్చు చేయాలని ఆమె భర్తకు చెప్పి అతనిచేత పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చుచేయించింది. దీంతో విజయ్‌చంద్ర అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలోనే భర్తపై ఆమె అనుమానం పెంచుకుని వేధించడం మొదలుపెట్టింది. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో నిత్యం భర్తతో గొడవ పడుతుండేది. కుమారులు ప్రశ్నిస్తే వారితోనూ గొడవపడేది. శనివారం మధ్యాహ్నం విజయ్‌చంద్ర ఇంట్లోనే ఉన్నారు. కుమారులను భోజనం తీసుకురమ్మని బయటకు పంపించారు. ఈ క్రమంలో దంపతుల నడుమ మరోమారు గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన భర్త పక్కనే ఉన్న రోకలిబండతో శైలజ తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పెద్దకుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మంత్రిగా రామ్మోహన్ నాయుడు పనికిరాడు

ప్రధాని మోదీకి లేఖ రాసిన కేఏ పాల్

సాక్షి, న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. ఆయనకు పరిపాలన అనుభవం, పరిణతి లేవని వ్యాఖ్యానించారు. ఆ శాఖకు మంత్రిగా రామ్మోహన్ నాయుడు పనికిరాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు శనివారం కేఏ పాల్ ప్రధాని నరేంద్ర మోదీకి ఒక లేఖ రాశారు. మోదీ కూడా రిటైర్‌మెంట్ ప్రకటించాలని, ప్రధాని బాధ్యతను అమిత్ షాకు అప్పగించాలని అందులో వ్యాఖ్యానించారు. విమాన ప్రమాదం తరువాత ఎయిర్ ఇండియా సీఈఓ రాజీనామా చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

తోతాపురి తిప్పలు!

గిట్టుబాటు కాని ధర

- పలుచోట్ల కిలో రూ.4
- కొన్ని ఫ్యాక్టరీలు మాత్రం రూ.5, రూ.6 ఇస్తున్న వైనం
- ఆరు నెలల తర్వాతే నగదు చెల్లింపు
- టోకన్ల కోసం అవస్థలు
- చోద్యం చూస్తున్న అధికారులు



జీడీనెల్లూరులోని ఓ ఫ్యాక్టరీ వద్ద టోకన్ల కోసం గుమికూడిన జనం

కాణిపాకం: తోతాపురి మామిడి రైతులకు ముచ్చెమటలు పడుతున్నాయి. కాయల విక్రయానికి అవసరమైన టోకెన్ల కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని ఫ్యాక్టరీలు కాయలు కొనలేమని చేతులెత్తేశాయి. మరికొన్ని ఫ్యాక్టరీలు అధికారుల ఒత్తిడిమీద కొనుగోలు చేస్తున్నాయి. ఈ తరుణంలో మామిడి వ్యాపారులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు. కిలో రూ.4 అని పాట పాడుతున్నారు. ఫ్యాక్టరీలు రూ.5 నుంచి రూ.6 వరకు కొనుగోలు చేస్తున్నాయి. అయితే నగదు చెల్లింపులు ఆరు నెలల తర్వాతేనని తేల్చిచెబుతున్నాయి.

దిగుబడి అధికమే కారణమా?

చిత్తూరు జిల్లాలో మామిడి సాగు 56 వేల హెక్టార్లలో విస్తరించింది. ఇందులో తోతాపురి 39,895 హెక్టార్ల వరకు ఉండగా.. ఈ సారి 49,9274 టన్నుల వరకు దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారు. దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంబరపడిపోయారు. తీరా ధరలు పతనమవడంతో డీలాపడ్డారు. టేబుల్ రకాల ధరలు కూడా ఈ సారి ఆశాజనకంగా లేవు.

తోతాపురి రూ.4

జిల్లాలోని ఫ్యాక్టరీ నిర్వాహకులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించేస్తున్నారు. తోతాపురి కేజీ రూ.4కే కొనుగోలు చేస్తున్నారు. దీనిపై వరుసగా ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదు. గుడిపాల మండలంలోని ఓ ఫ్యాక్టరీ తొలుత కేజీ రూ.5కే కొనుగోలు చేసింది. అధికారులు ఆ ఫ్యాక్టరీపై ఒత్తిడి తేవడంతో రూ.6కు ఫిక్స్ చేసింది. మిగిలిన ఫ్యాక్టరీలన్నీ అదేబాట పట్టాయి. దీనికితోడు తమిళనాడులోని క్రిష్ణగిరి నుంచి తోతాపురి కాయలను జిల్లాలోని ఫ్యాక్టరీలు అధికంగా దిగుమతి చేసుకుంటున్నాయి. అక్కడ కేజీ రూ.4కే కొనుగోలు చేసి రూ.5కు ఫ్యాక్టరీకి అన్‌లోడ్ చేస్తున్నాయి.

ఆరు నెలల తర్వాతే బిల్లులు

తమిళనాడు నుంచి దిగుమతవుతున్న కాయలకు మాత్రం ఫ్యాక్టరీలు అప్పటికప్పుడు నగదు చెల్లిస్తుండగా.. తెలిసిన వ్యాపారులకు వారం, నెల రోజుల వ్యవధిలో పేమెంట్ చేస్తామని చెబుతున్నాయి. జిల్లాలోని రైతులకు మాత్రం కాయలు తరలించిన ఆరు నెలల తర్వాతే బిల్లులు ఇస్తామని తేల్చిచెబుతున్నాయి.

కూటమి వెన్నుపోటు

మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం పది రోజుల క్రితమే ప్రకటించింది. ఆ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గిట్టుబాటు ధర కల్పించిందని సంబరపడిపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఫ్యాక్టరీలు కచ్చితంగా కొనాల్సిందేనని ఊదరగొట్టారు. కొనలేదంటే చర్యలతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరికలు జారీచేశారు. అది కూడా కేజీ రూ.8కే కొనాలని, ప్రోత్సాహక నిధిగా కేజీకి రూ.4 చొప్పున ప్రభుత్వం ఇస్తుందని సంబరాలు చేసుకున్నారు. తీరా చూస్తే వారంలోనే గిట్టుబాటు ధర ఫల్టీ కొట్టింది. ప్రస్తుతం రూ.5, రూ.6కే కొనుగోలు చేస్తున్నారు.

సిఫార్సులకే టోకన్లు

తోతాపురి విక్రయానికి మామిడి రైతులు నానాఅగచాట్లు పడుతున్నారు. టోకన్ల కోసం ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టోకన్ కోసం నిరీక్షిస్తున్నారు. టోకన్లు జారీచేసే సమయానికి నీకా..నాకా అంటూ పోటీపడుతున్నారు. కొన్ని టోకన్లు మాత్రమే రైతులకు ఇచ్చినట్టే ఇచ్చి..మిగిలిన టోకన్లు అన్నీ కూడా సిఫార్సుల మేరకు వెళ్లిపోతున్నాయి. కూటమి నేతలు చెప్పిన వాళ్లకే టోకన్లను ఇచ్చుకుంటున్నారు. పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి ప్రాంతాల్లో ఈ రకమైన సమస్యలు అధికంగా ఉన్నట్లు మామిడి రైతులు ఆరోపిస్తున్నారు. జీడీనెల్లూరు మండలంలోని ఓ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం టోకన్ల కోసం రైతులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. అరుపులు, కేకలతో దద్దరిల్లింది. తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులు సైతం వారిని అదుపు చేయలేకపోయారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు చొరవ తీసుకుని తోతాపురి కేజీ రూ.8కే కొనుగోలు చేయించేయాల చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దారుణం



ఇంత దారుణం ఎప్పుడూ లేదు. మామిడి పంట బాగా వచ్చిందని అనుకుంటే ధరలు లేవు. ఫ్యాక్టరీ కాడికి వస్తే కొనేవాళ్లు లేరు. టోకన్లు ఉంటేనే కొనుక్కుంటున్నారు. ఈ బాధాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.
- ఏజాస్, ఆవలకొండ, జీడీనెల్లూరు

ఆరు నెలల తర్వాత బిల్లులా?



కాయలు అమ్ముకోవడానికి టోకన్ల కోసం వచ్చాం. టోకన్లు తీసుకోవడానికి నానా పాట్లు పడుతున్నాం. టోకన్లు ఇవ్వడానికి ముందే ఆరు నెలల తర్వాతే డబ్బులు ఇస్తామంటున్నారు. తోతాపురి రూ.8 అన్నారు. ఇప్పుడు రూ.6 అంటున్నారు.
- బాబునాయుడు, రంగాపురం, జీడీనెల్లూరు

రంగురాళ్ల తవ్వకాలకు భారీ స్కెచ్



కరక క్వారీలో తవ్వకాలు జరిగేది ఈ కొండపైనే..

- గొలుగొండ కరక క్వారీ దోచుకునేందుకు పన్నాగం
- అడ్డుకుంటారన్న అనుమానంతో అటవీ అధికారుల మార్పు

కూటమి పాలనలో అక్రమార్కుల ఆటలు తారస్థాయికి చేరాయి. ఏడాది కాలంలో ఇసుక, గ్రావెల్, లేటరైట్, మైనింగ్ వంటి ప్రభుత్వ సంపదను దోచుకోవడమే కాక.. ఇప్పుడు ఏకంగా రంగురాళ్లపైనే కన్నేశారు. ఇందుకోసం అటవీ శాఖలో కింది నుంచి పై వరకు తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకుంటున్నారు. నేడో రేపో డీఎఫ్‌వోగా అస్మదీయుడినే నియమించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రేంజ్ పరిధిలో గల గొలుగొండ కరక క్వారీలో లభ్యమయ్యే రంగురాళ్ల అక్రమ తవ్వకాలకు భారీ స్కెచ్ వేశారు. ఈ రంగురాళ్లకు దేశంలోనే అత్యంత గిరాకీ ఉంటుంది. కరక క్వారీలో అలెక్స్ (సిసలైన పచ్చ వైఢూర్యం) లభ్యమవుతుంది. రంగురాళ్ల తవ్వకాలు చేపట్టేందుకు ఎన్నో ఏళ్లుగా అక్రమార్కుల ముఠా ఎదురుచూస్తోంది. టీడీపీ ప్రభుత్వం వస్తేనే వీరికి అనుకూలంగా ఉంటుంది. ఈ పరిసర ప్రాంతంలోకి ఎవరైనా అక్రమార్కులు ప్రవేశించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. అందుకే గార్డు స్థాయి నుంచి ఫారెస్ట్ రేంజ్ అధికారి వరకూ ఇటీవల బదిలీలలో మార్పు చేసుకున్నారు. ఇప్పుడు డీఎఫ్‌వోగా తమకు అనుకూలమైన వ్యక్తిని రప్పించేందుకు కూటమి ఎమ్మెల్యే కుమారుడి సిఫార్సు లేఖతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అతని సిఫార్సుతోనే ఫారెస్ట్ రేంజ్ అధికారిని తెచ్చుకున్నారు. ఇప్పుడు జిల్లా ఫారెస్ట్ అధికారిని కూడా మార్చేందుకు తీవ్ర ప్రయత్నం జరుగుతోంది.

అవినీతి అధికారికి అందలం!

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా డీఎఫ్‌వోగా పనిచేస్తున్న శామ్యూల్‌ను మార్పు చేసి కూటమి ఎమ్మెల్యే కుమారుడి సిఫార్స్ లేఖతో తనకు అనుకూలంగా పనిచేసే అధికారిని తెచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అవినీతికి మారుపేరు అయిన ఒక అధికారిని తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సదరు అధికారి గతంలో విజయనగరంలో రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ ట్రాప్‌లో చిక్కారు. గతంలో శ్రీకాకుళంలో కూడా ఇతని మీద ఒక ఏసీబీ కేసు ఉంది. రంగురాళ్ల తవ్వకాలకు అడ్డు లేకుండా అలాంటి వ్యక్తిని నర్సీపట్నం తీసుకొస్తున్నారనే వార్త చక్కర్లు కొడుతోంది. ఆయన వీఎంఆర్‌డీ డీఎఫ్‌వోగా రావటానికి భారీ ముడుపులు ఇచ్చి ప్రయత్నం చేసినప్పటికీ.. ఏసీబీ కేసు ఉండటం వలన సంస్థ తీసుకోవటానికి ఇష్టపడలేదు. సదరు అధికారి ప్రస్తుతం విజయవాడలో పనిచేస్తున్నారు. బదిలీ జీవో నేడో, రేపో రానున్నట్లు సమాచారం.

అనుకూలస్తులనే తెచ్చుకున్నారు..!

ఈ నెల 9వ తేదీన కరక క్వారీ ప్రాంత గార్డు అయిన నవీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీనరసింహలకు ఐదేళ్ల కాలపరిమితి ముగియకపోయినా బదిలీ చేయించి, తమకు అనుకూలంగా ఉండే వారిని తెచ్చుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక్కడకు గార్డుగా వచ్చిన వ్యక్తి స్థానిక కూటమి నేతలకు బాగా పరిచయస్తుడు. ఇక్కడకు కొత్తగా వచ్చిన ఫారెస్ట్ రేంజ్ అధికారి కూడా ఈ ప్రాంత కూటమి నాయకులకు సుపరిచితుడు. ఏడాది క్రితం కేడీ పేటలో డీఆర్‌వోగా పనిచేసి ప్రమోషన్‌పై పాడేరు డివిజన్‌లో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పదోన్నతిపై వెళ్లారు. మళ్లీ నర్సీపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా బదిలీపై వచ్చేశారు.



గతంలో జరిపిన తవ్వకాలు



తవ్వకాల్లో లభించిన రంగురాళ్లు (ఫైల్)

బిజినెస్ రీల్

స్పైస్‌జెట్ లాభాలు మూడింతలు



ముంబై: చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ గత ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చి త్రైమాసికంలో రూ.325 కోట్ల స్టాండెలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం (2023–24) క్యూ4లో ప్రకటించిన రూ.119 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. నిర్వహణ ఆదాయం మాత్రం రూ.1,719 నుంచి రూ.1,446 కోట్లకు తగ్గింది. ''మార్చి క్వార్టర్‌లో రికార్డు స్థాయి నికర లాభాన్ని ఆర్జించగలిగాము. ప్రమోటర్ గ్రూప్ క్యూ4లో రూ.294 కోట్లు సహా మొత్తం రూ.500 కోట్లు మూలధనాన్ని సమకూర్చింది. ఇది కంపెనీ దీర్ఘకాలిక దృష్టి, సామర్థ్యంపై నమ్మకాన్ని సూచిస్తుంది'' అని స్పైస్‌జెట్ తెలిపింది. కంపెనీ పూర్తి ఆర్థిక సంవత్సరానికిగానూ గత ఏడేళ్లలో తొలిసారి రూ.59 కోట్ల లాభాన్ని ప్రటించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.409 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తాజాగా నిర్వహణ ఆదాయం 25% క్షీణించి రూ.7,050 కోట్ల నుంచి రూ.5,284 కోట్లకు దిగివచ్చింది. ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంపై స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో వైమానిక పరిశ్రమ వారికి బాసటగా ఉంటుందన్నారు.

బ్రైట్‌కామ్ గ్రూప్ లాభం రూ. 121 కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో డిజిటల్ మార్కెటింగ్, టెక్నాల జీ సొల్యూషన్స్ సంస్థ బ్రైట్‌కామ్ గ్రూప్ లాభం మూడు రెట్లు పెరిగి రూ. 121 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 37 కోట్లు. మరోవైపు, నిర్వహణ ఆదాయం రూ. 705 కోట్ల నుంచి రూ. 987 కోట్లకు ఎగిసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 687 కోట్ల నుంచి రూ. 710 కోట్లకు, ఆదాయం రూ. 4,662 కోట్ల నుంచి రూ. 5,147 కోట్లకు పెరిగింది. తగిన ఆధారాల్లేని కారణంగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తమపై విధించిన నిర్దిష్ట పెనాల్టీలను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిందని కంపెనీ తెలిపింది.

యూనివన్ గ్రూప్‌తో లివ్‌ప్యూర్ జట్టు

ముంబై: దేశవ్యాప్తంగా 100 పైగా బ్రాండ్ స్టోర్స్‌ను ప్రారంభించే దిశగా యూనివన్ గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు లివ్‌ప్యూర్ వెల్లడించింది. వచ్చే 18–24 నెలల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. తొలి దశలో మొదటి ఏడాది హైదరాబాద్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక లో సుమారు 50 స్టోర్స్ ప్రారంభించనున్నట్లు లివ్‌ప్యూర్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేశ్ కౌల్ చెప్పారు. మెట్రోలు, ప్రథమ శ్రేణి, ద్వితీయ శ్రేణి పట్టణాలు, జిల్లా ప్రధాన కేంద్రాల్లో విస్తరణను టార్గెట్‌గా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. తమ అధునాతన వాటర్ ప్యూరిఫయర్లు, వంట గది ఉపకరణాలు, ఎయిర్ కూలర్లు మొదలైన ఉత్పత్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మాధ్యమాలవ్యాప్తంగా లివ్‌ప్యూర్ ఉత్పత్తులను మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు యూనివన్ గ్రూప్‌తో భాగస్వామ్యం తోడ్పడుతుందని పేర్కొన్నారు.

ఐటీసీ ఆశీర్వాద్ ఆటా 'క్వాలిటీ సర్టిఫికెట్'



న్యూఢిల్లీ: ఐటీసీ ఆశీర్వాద్ ఆటా బ్రాండ్ తాజాగా నాణ్యతకు భరోసా కల్పించేలా 'క్వాలిటీ సర్టిఫికెట్'ను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టింది. ఇకపై ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీఆటా ప్యాక్ పై ఈ సర్టిఫికెట్‌కి సంబంధించిన క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుందని సంస్థ తెలిపింది. దీన్ని స్కాన్ చేస్తే ఆటా నాణ్యత, పోషక విలువలు, 40 పైగా క్వాలిటీ కంట్రోల్ పరీక్షల వివరాలు మొదలైనవి ఉండే క్వాలిటీ సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిపై అవగాహన కల్పించేందుకు నటి స్నేహతో టీవీ వాణిజ్య ప్రకటనలను కూడా రూపొందించినట్లు ఐటీసీ ఫుడ్స్ సీవోవో అనుజ్ కుమార్ రుస్తగీ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-6-2025

విశాఖ	550-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

లగ్జరీ కారు .. స్పెషల్ గేరు..

పర్సనలైజేషన్‌కు సంపన్నుల ప్రాధాన్యత

ప్రత్యేక హంగులతో లిమిటెడ్ ఎడిషన్లు

సాధారణ మోడల్స్‌తో పోలిస్తే అధిక రేటు



ఏఎంజీ జీ63 కలెక్టర్స్ ఎడిషన్



మెర్సిడెస్ మేబ్యాక్

లగ్జరీ కార్ల కంపెనీలు మరింత పర్సనలైజ్డ్ అనుభూతిని అందించే కార్లతో సంపన్న కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో భాగంగా స్పెషల్, లిమిటెడ్ ఎడిషన్ వేరియంట్లను ప్రవేశపెడుతున్నాయి. తద్వారా భారీ మార్జిన్లుండే సెగ్మెంట్‌లో వాటాను పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశీయంగా రూ. 50 లక్షలకు పైగా ఉండే లగ్జరీ కార్ల మోడల్స్ గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 51,500 యూనిట్లు అమ్ముడైనట్లు పరిశ్రమ వర్గాల అంచనా. అయితే, శాతాలపరంగా వృద్ధి గత మూడేళ్ల కనిష్టమైన 3.3 శాతానికే పరిమితమైంది. అంతర్జాతీయంగా అనిశ్చితులు, స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటం వంటి అంశాలు ఇందుకు కారణంగా నిల్చాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో 55.3 శాతం వృద్ధి చెందిన లగ్జరీ కార్ల అమ్మకాలు 2024 ఆర్థిక సంవత్సరంలో 16.7 శాతంగా నమోదయ్యాయి. తాజాగా ఇది గణనీయంగా పడిపోవడంతో కొత్త మార్గాలను అన్వేషిస్తున్న కంపెనీలు.. లిమిటెడ్ ఎడిషన్ల బాట పట్టాయి.

హెచ్‌ఎన్‌ఐల జోరు ..

భారత్‌లో 1 కోటి డాలర్ల పైగా (సుమారు రూ. 85 కోట్లు) సంపద ఉన్న అత్యంత సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో లగ్జరీ బ్రాండ్లు.. సదరు సంపన్నులపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం గతేడాది అత్యంత సంపన్నుల (హెచ్‌ఎన్‌ఐ) సంఖ్య 6 శాతం పెరిగి 85,698కి చేరింది. సంపన్న కస్టమర్లు తమ హోదాను, అంతస్తును ప్రతిబింబించే కార్లను కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ, జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్), మినీలాంటి ఆటో దిగ్గజాలు తమ ప్రస్తుత మోడల్స్‌లో స్పెషల్ ఎడిషన్లు, హైపర్ కస్టమైజ్డ్ వెర్షన్లను ప్రవేశపెడుతున్నాయి. లగ్జరీ కార్ల సెగ్మెంట్లో దాదాపు 45 శాతం వాటాతో మెర్సిడెస్ బెంజ్ అగ్రగామిగా ఉంటోంది. తర్వాత స్థానాల్లో బీఎండబ్ల్యూ, జేఎల్‌ఆర్, ఆడి మొదలైనవి ఉన్నాయి. టాప్ ఎండ్ కస్టమర్లు ప్రీమియం అనుభూతి కోసం మరింత ఎక్కువ చెల్లించేందుకు సుముఖంగా ఉంటుండటంతో, ఈ కార్ల కంపెనీలు కొత్త ఆవిష్కరణలకు తెర తీస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో టాటా మోటార్స్‌లో భాగమైన జేఎల్‌ఆర్ కొత్తగా డిఫెండర్ ఆక్టా పేరిట తమ స్టాండర్డ్ డిఫెండర్‌కి సంబంధించిన ప్రత్యేక వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రెగ్యులర్ మోడల్‌తో పోలిస్తే దాదాపు 50 శాతం అధికంగా రూ. 2.59 కోట్లు పలికింది. ఎక్స్‌క్లూజివ్ పెయింట్ షేడ్స్, కస్టమైజ్డ్ ఇంటీరియర్స్, పర్ఫార్మెన్స్ అప్‌గ్రేడేషన్ మొద లైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.



డిఫెండర్ ఆక్టా

మెర్సిడెస్-బెంజ్ సంస్థ మరింత వ్యక్తిగతీకరించడంపై ఫోకస్ పెడుతోంది. తమ టాప్ ఎండ్ లగ్జరీ కస్టమర్లు, సేకరణకర్తలకు హైపర్-పర్సనలైజేషన్ అంశం చాలా కీలకంగా ఉంటోందని మెర్సిడెస్ బెంజ్ వర్గాలు తెలిపాయి. తమ మాన్యుఫ్యాక్చర్ శ్రేణి, ఇతరత్రా ప్రత్యేక ఎడిషన్లకు అసాధారణ డిమాండ్ కనిపించిందని పేర్కొన్నాయి. ఏఎంజీ జీ63 గ్రాండ్ ఎడిషన్‌లో ప్రవేశపెట్టిన మొత్తం 25 యూనిట్లు కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలో అమ్ముడైపోయినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. దీని ధర రూ. 4 కోట్లు. ఇక ఈ ఏడాది మార్చి 17న ప్రవేశపెట్టిన మేబ్యాక్ ఎస్‌ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్‌ను ఉదయం ప్రవేశపెడితే సాయంకాలానికల్లా మొత్తం బుక్ అయిపోయాయి. రెండు రోజుల క్రితమే కంపెనీ కొత్తగా ఏఎంజీ జీ63 'కలెక్టర్స్ ఎడిషన్'ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 4.3 కోట్లు. కేవలం 30 యూనిట్లే విక్రయిస్తున్నట్లు సంస్థ తెలిపింది. చాలాకాలంగా తాము కార్ల కస్టమైజేషన్‌ను అందిస్తున్నామని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. కలెక్టర్స్ ఎడిషన్‌ను బెంగళూరులోని మెర్సిడెస్-బెంజ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా (ఎంబీఆర్‌డీఐ)తో కలిసి, భారత పరిస్థితులకు అనుగుణంగా కంపెనీ రూపొందించింది.

మరికొన్ని బ్రాండ్లను చూస్తే ఎం340ఐ మోడల్‌ను బీఎండబ్ల్యూ రూ. 75,90,000కు విక్రయిస్తోంది. ఇప్పటివరకు 1,000 పైగా యూనిట్లు అమ్ముడయ్యాయి. మరోవైపు రేంజ్ రోవర్ రణ్‌థంబోర్ ప్రత్యేక ఎడిషన్ రేటు రెగ్యులర్ వెర్షన్‌తో పోలిస్తే రూ. 43 లక్షలు అధికంగా రూ. 4.98 కోట్లకు (ఎక్స్-షోరూం) అమ్ముడయ్యింది. మొత్తం 12 వాహనాలూ అమ్ముడైపోయాయి. అటు మినీ కూపర్ ఎస్ జాన్ కూపర్ ధర రూ. 55,90,000గా ఉండగా, మొదటి లాట్ స్వల్ప వ్యవధిలోనే అమ్ముడైపోయింది.

ఉభయతారకంగా ..

వినూత్నంగా తీర్చిదిద్దిన ఇంటీరియర్స్, లుక్‌తో ఈ మోడల్స్ అత్యంత మెరుగైన పనితీరు కనపర్చేవిగా ఉంటాయని జేఎల్‌ఆర్ ఇండియా వర్గాలు తెలిపాయి. ఇలా లిమిటెడ్ ఎడిషన్లు, స్పెషల్ ఎడిషన్ మోడల్స్‌ను ప్రవేశపెట్టడమనేది ఇటు కంపెనీలకు, అటు కస్టమర్లకు .. రెండు వర్గాలకూ ప్రయోజనకరమైన విషయమని ఎస్ అండ్ పీ గ్లోబల్ మొబిలిటీ డైరెక్టర్ పునీత్ గుప్తా తెలిపారు. సదరు మోడల్ జీవితకాలాన్ని, కొనుగోలుదార్లను పెంచుకునేందుకు ఇది కంపెనీలకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఓవరాల్ లుక్, ఫీల్, ఇంటీరియర్స్, పనితీరుపరంగా ఒక విశిష్టమైన గుర్తింపు పొందడమనేది కస్టమర్లకు ప్రయోజనకరమైన అంశంగా ఉంటుంది. తక్కువ మొత్తం పెట్టుబడితో అధిక మార్జిన్లను పొందే అవకాశం ఉండటంతో కంపెనీలకూ ఆదాయాలపరంగా బాగుంటోంది.



రేంజ్‌రోవర్ రణ్‌థంబోర్



బీఎండబ్ల్యూ ఐ7

కొన్ని కార్లు..

- డిఫెండర్ ఆక్టా ధర రూ. 2.59 కోట్లు
- రేంజ్‌రోవర్ రణ్‌థంబోర్ రేటు రూ. 4.98 కోట్లు
- మెర్సిడెస్ మేబ్యాక్ ఎస్‌ఎల్ 680 మోనోగ్రామ్ సిరీస్ ధర రూ. 4.2 కోట్లు
- ఏఎంజీ జీ63 కలెక్టర్స్ ఎడిషన్ రూ. 4.3 కోట్లు

ఆఫీస్ స్పేస్‌కి అమెరికన్ సంస్థల దన్ను

2022–24లో 33 శాతం వాటా



న్యూఢిల్లీ: దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో అమెరికన్ కంపెనీల హవా నడుస్తోంది. 2022–24 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో 64.5 మిలియన్ చ.అ. స్పేస్‌ను సదరు సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఈ వ్యవధిలో మొత్తం వర్క్‌స్పేస్ లీజింగ్‌లో ఇది మూడో వంతు కావడం గమనార్హం. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్‌ఎల్ ఇండియా నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2022–24 క్యాలెండర్ సంవత్సరాల్లో హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణెలో మొత్తం 190 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్‌ను కంపెనీలు లీజుకు తీసుకున్నాయి. ఇందులో చాలా మటుకు అమెరికన్ సంస్థలు ప్రధానంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు చేశాయి. అమెరికన్ కార్పొరేట్లకు ఐటీ సిటీ బెంగళూరు అత్యంత ప్రాధాన్య లొకేషన్‌గా ఉంటోంది. టెక్నాలజీ, బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) కంపెనీలు టాప్ నగరాల్లో ఆఫీస్ డిమాండ్‌కి ప్రధాన చోదకాలుగా నిలుస్తున్నాయి. ప్రతిభావంతులైన నిపుణుల లభ్యత, అనుకూల వ్యవస్థ, వ్యయాలు తక్కువగా ఉండటం, వృద్ధికి దోహదపడే విధానాల దన్ను మొదలైన అంశాల వల్ల అమెరికన్ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుతోందని జేఎల్‌ఎల్ హెడ్ (ఆఫీస్ లీజింగ్, రిటైల్ సర్వీసెస్), సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ (కర్ణాటక, కేరళ) రాహుల్ అరోరా చెప్పారు. అమెరికన్ సంస్థలు తీసుకున్న ఆఫీస్ స్పేస్‌లో 70 శాతం భాగాన్ని జీసీసీల కోసం వినియోగించుకోవడమనేది భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడంపైనా, దేశ వృద్ధి అవకాశాలపైనా వాటికి గల నమ్మకానికి నిదర్శనమని ఆయన వివరించారు.

మళ్లీ విప్రో ప్రమోటర్ వాటా స్వాప్

1.72 శాతం వాటా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ చేతికి



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐటీ దిగ్గజం విప్రో ప్రమోటర్ల వాటాలో 1.72 శాతం చేతులు మారింది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సమాచారం ప్రకారం 1.72 శాతం వాటాకు సమానమైన 18.05 కోట్ల ఈక్విటీ షేర్లను అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ విక్రయించింది. వీటిని షేరుకి రూ. 259 సగటు ధరలో ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ప్రజీమ్ ట్రేడర్స్, జాష్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 4,675 కోట్లుకాగా.. సోమవారం(9న) సైతం అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ 1.93 శాతం వాటాకు సమానమైన 20.23 కోట్ల షేర్లను విక్రయించిన సంగతి తెలిసిందే. వీటిని షేరుకి రూ. 250 సగటు ధరలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు చెందిన ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హర్షమ్ ట్రేడర్స్ అండ్ ప్రజీమ్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 5,057 కోట్లుకాగా.. గతేడాది నవంబర్‌లో ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 1.6 శాతం వాటాకు సమానమైన 8.49 కోట్ల విప్రో షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,757 కోట్లు వెచ్చించింది. అయితే వీటిని ప్రజీమ్, జాష్ ట్రేడర్స్ వీటిని విక్రయించడం గమనార్హం!

సింగిల్ స్పెషాలిటీ ఆస్పత్రుల జోరు



2028 నాటికి 9 బిలియన్ డాలర్లకు మార్కెట్

ఏటా 24 శాతం వృద్ధి .. ఎవెండస్ క్యాపిటల్ నివేదిక

దేశీయంగా సింగిల్ స్పెషాలిటీ హెల్త్‌కేర్ చెయిన్లు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. ఏటా 24 శాతం వృద్ధి రేటుతో 2028 నాటికి ఈ మార్కెట్ పరిమాణం 9 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. ప్రస్తుతం ఇది 4 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. 20 శాతం పైగా ఎబిటా మార్జిన్లు, 30 శాతం పైగా ఆర్‌వోసీఈలు (పెట్టుబడిపై రాబడులు), రెండేళ్ల వ్యవధిలోనే బ్రేక్-ఈవెన్ సాధించే అవకాశాలు మొదలైనవి ఈ పరిశ్రమ వృద్ధికి దోహదపడనున్నాయి. ఎవెండస్ క్యాపిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. గత దశాబ్దకాలంలో ఈ సెగ్మెంట్ .. భారీ స్థాయిలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులను ఆకర్షించింది. సుమారు 3.7 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు వచ్చాయి. హాస్పిటల్స్‌లోకి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఇది సుమారు 35 శాతం. ఇలా వచ్చిన పెట్టుబడుల్లో దాదాపు 70 శాతం భాగం ఐవీఎఫ్, ఐకేర్, తల్లి..బిడ్డ సంరక్షణ, డయాలిసిస్, ఆంకాలజీ వంటి స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు దోహదపడ్డాయి. గత మూడేళ్లుగా దంత సంరక్షణ, యూరాలజీ/నెఫ్రాలజీ, స్కిన్..హెయిర్ కేర్ వంటి స్పెషాలిటీ విభాగాల్లోని ప్రముఖ సంస్థల్లోకి కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయి. ఈ విభాగాల్లో డిమాండ్-సరఫరా మధ్య భారీగా వ్యత్యాసం నెలకొనడం ఇందుకు కారణం.

న్యూఢిల్లీ: నివేదిక ప్రకారం తక్కువ స్థాయి పెట్టుబడి, నిర్దిష్టమైన సేవలకు పరిమితం కావడం తదితర అంశాల వల్ల ఈ విభాగం ఇటు ఇన్వెస్టర్లకు, అటు వ్యవస్థాపకులకు ఆకర్షణీయంగా ఉంటోంది. ఇక ఈ స్పెషాలిటీల్లో అగ్రగాములుగా ఉంటున్న సంస్థలు అధిక వృద్ధి సాధన కోసం ఇతర సంస్థలను విలీనం చేసుకోవడం, కొనుగోలు చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఇందుకోసం కాస్త పెద్ద మొత్తాన్నే వెచ్చించేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. పరిశ్రమలో కన్సాలిడేషన్ చోటు చేసుకునే అవకాశాలను ఇది సూచిస్తోంది.

కన్సాలిడేషన్‌కి అవకాశం..

అగ్ర శ్రేణి సంస్థలు నిధుల సమీకరణ కోసం పబ్లిక్ మార్కెట్ వైపు చూస్తున్నాయి. దీనితో మరిన్ని కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ బాట పట్టనున్నాయి. వీటి సంఖ్య పెరిగే కొద్దీ లిస్టెడ్ సింగిల్ స్పెషాలిటీ చెయిన్స్ మార్కెట్ క్యాప్ ప్రస్తుతమున్న 3.9 బిలియన్ డాలర్ల నుంచి 2030 ఆర్థిక సంవత్సరం నాటికి 18 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లకు నమ్మకం పెరుగుతుండటం, ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటం వంటి అంశాల వల్ల దేశీయంగా సింగిల్ స్పెషాలిటీ హెల్త్‌కేర్ విభాగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పేషంట్ ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపర్చగలిగే సామర్థ్యాలు, సమర్థవంతంగా కార్యకలాపాలను విస్తరించగలిగే వీలు, ఇన్వెస్టర్లకు పెట్టుబడులపై మెరుగైన రాబడులను అందించే అవకాశం ఉండటం వల్ల ఈ విభాగం ఆకర్షణీయంగా ఉంటోందని ఎవెండస్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అన్షుల్ గుప్తా తెలిపారు. ప్రస్తుతం సింగిల్ స్పెషాలిటీ హాస్పిటల్స్ చెయిన్లు .. మెట్రోలు, ప్రథమ శ్రేణి నగరాలకే పరిమితమవుతున్నాయి. ద్వితీయ శ్రేణి మార్కెట్లలో అంతరాలు నెలకొన్న నేపథ్యంలో ఇకపై ఆ ప్రాంతాల్లో వృద్ధికి అవకాశం ఉందని గుప్తా చెప్పారు. క్రిత దశాబ్ద కాలంలో ఏ విధంగానైతే మల్టీ-స్పెషాలిటీ విభాగం విస్తరించిందో అదే విధంగా పబ్లిక్ మార్కెట్లలో ఈ హాస్పిటల్స్ చెయిన్స్ లిస్టింగ్ సందడి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా సంస్థలు పటిష్టమైన వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. సంపన్న దేశాల్లో ఈ తరహా మోడల్స్ విజయవంతమయ్యాయని గుప్తా చెప్పారు.

మార్కెట్ క్యాప్ పెరుగుదల..

వైజాగ్‌లో భారత్, కివీస్ టి20

అక్టోబర్ 15 నుంచి రంజీ ట్రోఫీ ● ముస్తాక్ అలీ ట్రోఫీలో 'సూపర్ లీగ్' దశ ● బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో కొత్త నిర్ణయాలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆరంభంలో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు న్యూజిలాండ్ జట్టు భారత్‌కు రానుంది. ఈ పర్యటనలో భాగంగా టీమిండియాతో కివీస్ 3 వన్డేలు, ఐదు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. దీనికి సంబంధించిన వేదికలు, షెడ్యూల్‌ను అపెక్స్ కౌన్సిల్ శనివారం ఖరారు చేసింది. జనవరి 11న ప్రారంభం కానున్న ఈ పర్యటన 31 జనవరితో ముగియనుంది. 11న బరోడాలో తొలి వన్డే, 14న రాజ్‌కోట్‌లో రెండో వన్డే, 18న ఇండోర్‌లో మూడో వన్డే జరగనున్నాయి. ఇక నాగ్‌పూర్, రాయ్‌పూర్, గువాహటి, విశాఖపట్నం, త్రివేండ్రంలో టి20 సిరీస్ జరగనుంది. జనవరి 28న భారత్, న్యూజిలాండ్ నాలుగో టి20 మ్యాచ్‌కు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ ఎనిమిది మ్యాచ్‌ల్లో ఒకటి హైదరాబాద్ వేదికగా జరగడం ఖాయమే అని అంతా భావించినా... అపెక్స్ కౌన్సిల్ మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు.



రంజీ ట్రోఫీ షెడ్యూల్ విడుదల...

దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీ 2025–26వ సీజన్ ఈ ఏడాది అక్టోబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరగనుంది. రెండు దశలుగా నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ ప్లేట్ గ్రూప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన జట్టు... ఎలైట్ గ్రూప్‌నకు అర్హత సాధించనుంది. ఎలైట్‌లో పేవల ప్రదర్శన చేసిన ఒక జట్టు తదుపరి సీజన్‌లో ప్లేట్ గ్రూప్‌నకు పరిమితం కానుంది. ఈ మేరకు శనివారం నిర్వహించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. గతేడాది రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌లో ఆడిన మేఘాలయ జట్టు ఏడు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. దీంతో ఆట నాణ్యత దెబ్బతింటుందని భావించిన అపెక్స్ కౌన్సిల్... ఈశాన్య రాష్ట్రాల జట్ల నుంచి ఎలైట్ గ్రూప్‌నకు ప్రమోషన్ ఇచ్చే పద్ధతిని పక్కన పెట్టింది. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 19 వరకు తొలి దశ రంజీ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ తర్వాత జనవరి 22 నుంచి ఫిబ్రవరి 1 వరకు రెండో దశ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆగస్టు 28 నుంచి జోనల్ ఫార్మాట్‌లో దులీప్ ట్రోఫీ జరగనుంది. అక్టోబర్ 1 నుంచి 5 వరకు ఇరానీ కప్ నిర్వహించనున్నారు. ఇక సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇప్పటి వరకు ఉన్న క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల తరహాలో కాకుండా... ఈ సీజన్ నుంచి 'సూపర్ లీగ్' నిర్వహించనున్నారు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 18 వరకు ఈ ట్రోఫీ జరగనుంది.

దేవజిత్ సైకియా నేతృత్వంలో త్రిసభ్య కమిటీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో విజేతగా నిలిచిన అనంతరం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు నిర్వహించిన విజయోత్సవాల్లో తొక్కిసలాట జరగడంతో 11 మంది మృతిచెందడంతో అపెక్స్ కౌన్సిల్ ఉత్సవాలకు సంబంధించి కొత్త విధివిధానాలు రూపొందించనుంది. ఇందు కోసం బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా నేతృత్వంలో త్రి సభ్య కమిటీని ఏర్పాటు చేసింది. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కోశాధికారి ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 15 రోజుల్లో ఈ కమిటీ మార్గదర్శకాలు రూపొందించనుంది. 'ఆ ఘటనను దృష్టిలో పెట్టుకొని అపెక్స్ కౌన్సిల్ ఒక కొత్త కమిటీని నియమించింది. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకూడదనే ఉద్దేశంతో ఈ కమిటీ విధివిధానాలు సిద్ధం చేయనుంది' అని బోర్డు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.



ఆర్య-అర్జున్ పసిడి గురి

షూటింగ్ ప్రపంచకప్‌లో స్వర్ణం కైవసం

మ్యూనిక్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) మూడో ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో సురుచి స్వర్ణ పతకం సాధించగా... శనివారం భారత్ ఖాతాలో మరో పసిడి పతకం చేరింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆర్య బోర్సే-అర్జున్ బబూతా జంట అద్వితీయమైన గురితో ఒలింపిక్ చాంపియన్ జిఫీ వాంగ్-లిహావో షెంగ్ (చైనా) ద్వయంపై గెలుపొందింది. ఫైనల్లో ఆర్య-అర్జున్ జోడీ 17–7తో చైనా జంటను చిత్తుచేసి అగ్ర స్థానంలో నిలిచింది. నార్వే జంటకు కాంస్య పతకం దక్కింది. భారత్‌కే చెందిన ఎలవెనిల్ వలరివన్-అంకుశ్ జాధవ్ జోడీ 631.8 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. పోటీల చివరి రోజు క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అర్జున్ 317.7 పాయింట్లు సాధించగా... ఆర్య 317.5 పాయింట్లు స్కోరు చేసింది. దీంతో ఓవరాల్‌గా 635.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో పెరూ రాజధాని లిమాలో జరిగిన రెండో ప్రపంచకప్ టోర్నీ రుద్రాంక్ష్ పాటిల్‌తో కలిసి ఆర్య బోర్సే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో రజత పతకం గెలిచింది. తాజా ప్రపంచకప్‌లో భారత్‌కు ఇది రెండో స్వర్ణం కాగా... ఓవరాల్‌గా నాలుగో పతకం. సిఫ్ట్ కౌర్ సమ్రా, ఎలవెనిల్ వలరివన్ వ్యక్తిగత కాంస్యాలు గెలుచుకున్నారు. ఇక పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లకు నిరాశ ఎదురైంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్-ఆదిత్య మల్రా 577 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. సురుచి సింగ్-వరుణ్ తోమర్ జంట 576 పాయింట్లతో పదో స్థానానికి పరిమితమైంది.

ప్రణతి నాయక్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: ఆసియా ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ కాంస్య పతకంతో సత్తా చాటింది. దక్షిణ కొరియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ మహిళల వాల్ట్ విభాగం ఫైనల్లో శనివారం ప్రణతి 13.466 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. యిహాన్ జాంగ్ (13.650 పాయింట్లు; చైనా), థి క్యూన్ గుయెన్ (13.583 పాయింట్లు; వియత్నాం) వరుసగా స్వర్ణ, రజతాలు దక్కించుకున్నారు. ఈ ఏడాది ఎఫ్ఐజీ ప్రపంచకప్‌లో కాంస్య పతకం నెగ్గిన 30 ఏళ్ల ప్రణతి... ఇప్పుడు అదే ప్రదర్శన పునరావృతం చేసింది. భారత్‌కే చెందిన యువ జిమ్నాస్ట్ సమంత 13.016 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో ప్రణతికి ఇది మూడో పతకం. 2019 ఉలాన్‌బాతర్, 2022 దోహాలోనూ ప్రణతి కాంస్య పతకాలు సాధించింది. భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఈ పోటీల్లో రెండు పతకాలు గెలవగా... ఇప్పుడు ప్రణతి ఆమెను దాటేసింది. తొలి ప్రయత్నంలో 13.666 పాయింట్లతో సత్తాచాటిన ప్రణతి... రెండో ప్రయత్నంలో 12.866 పాయింట్లకే పరిమితమవడంతో... ఓవరాల్ స్కోరుపై ప్రభావం చూపింది. అంతకు ముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో 13. 083 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా ప్రణతి ఫైనల్‌కు చేరింది.


భారత్‌కు మళ్లీ పరాజయమే...

- 2–3తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి
- యూరోప్ అంచెలో వరుసగా ఐదో పరాభవం

అంట్‌వర్ప్ (బెల్జియం): ప్రత్యర్థులు మారుతున్నా... భారత్ ఫలితాలే మారడం లేదు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో భారత సీనియర్ పురుషుల జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. వరుసలో ఐదో ఓటమిని చవిచూసిన భారత్... మూడో ప్రత్యర్థి చేతిలోనూ చిత్తయ్యింది. నెదర్లాండ్స్, అర్జెంటీనాల చేతిల్లో కంగుతిన్న భారత్... తాజాగా ఆస్ట్రేలియా ధాటికి తలవంచింది. శనివారం ఆసీస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–3 స్కోరు తేడాతో ఐరోపాలో అలవాటైన అపజయాన్ని మూటగట్టుకుంది. భారత్ తరఫున అభిషేక్ 8, 35వ నిమిషాల్లో రెండు గోల్స్ సాధించాడు. కంగారూ జట్టులో నాథన్ ఎఫ్రామస్ (42వ ని.), జోయెల్ రింటాల (56వ ని.), టామ్ క్రెయిగ్ (60వ ని.) తలా ఒక గోల్ చేశారు. నిజానికి ఈ ప్రొ లీగ్ హాకీలో మెరుగైన స్థానంతోనే నేరుగా వచ్చే ప్రపంచకప్‌కు అర్హత సాధించాలనుకున్న భారత్‌కు వరుస పరాభవ ఫలితాలు శరాఘాతమయ్యాయి. యూరోప్ లెగ్‌లో మొదట నెదర్లాండ్స్‌తో... తర్వాత అర్జెంటీనాతో ఆడిన రెండేసి చొప్పున ఆడిన మ్యాచ్‌ల్లో భారత్ ఓడింది.

రెండు క్వార్టర్లు ఆధిక్యంలో ఉన్నా...

ఆరంభంలో భారత్ దూకుడు కనబరిచింది. పది నిమిషాల్లోనే ప్రత్యర్థిపై ఆధిక్యత సాధించింది. ఆటగాళ్ల సమన్వయం, డిఫెండర్ల పట్టు... ఇలా ఇన్ని అనుకూలతలున్నప్పటికీ అన్నీ ఆరంభశూరత్వంగానే ఆవిరయ్యాయి. తొలి క్వార్టర్ 8వ నిమిషంలోనే అభిషేక్ గోల్‌తో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్‌లో మరో గోల్ సాధించలేకపోయినప్పటికీ ఆధిక్యాన్ని కాపాడుకోవడంలో డిఫెండర్లు, స్ట్రయికర్లు సమష్టిగా శ్రమించారు. మూడో క్వార్టర్ మొదలైన ఐదు నిమిషాలకే అభిషేక్ మరో గోల్ భారత్ ఆధిక్యం కాస్తా 2–0కు పెరిగింది. ఇలా దాదాపు 41 నిమిషం దాకా కొనసాగిన భారత ఆధిపత్యానికి ఆ మరుసటి నిమిషంలోనే నాథన్ ఎఫ్రామస్ గండి కొట్టాడు. 2–1తో అప్పటికి మంచిస్థితిలోనే ఉంది. అయితే ఆఖరి క్వార్టర్ కూడా ముగిసే దశలో ఆసీస్‌కు లభించిన రెండు పెనాల్టీ కార్నర్లు భారత్‌ను నిండా ముంచేశాయి. 4 నిమిషాల వ్యవధిలో రింటాల (56వ ని.), క్రెయిగ్ (60వ ని.) పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంతో భారత్‌కు మరో పరాజయం తప్పలేదు. నేడు ఇదే వేదికపై భారత్... ఆసీస్‌తో రెండో మ్యాచ్ ఆడుతుంది.


అభిషేక్

మహిళల జట్టు పోరాడినా...

ఆస్ట్రేలియా చేతిలో తప్పని ఓటమి

లండన్: ఎఫ్ఐహెచ్ మహిళల ప్రొ లీగ్‌లో భారత అమ్మాయిలు ఆఖరిదాకా పోరాడినా ఆస్ట్రేలియా చేతిలో పరాజయం తప్పలేదు. శనివారం జరిగిన పోరులో మహిళల జట్టు 2–3 స్కోరుతో కంగారు చేతిలో కంగుతింది. ఆరంభంలో భారత అమ్మాయిలకు కలిసిరాలేదు. తొలిక్వార్టర్లో రెండు పెనాల్టీ కార్నర్లు లభించగా... భారత స్ట్రయికర్లు లక్ష్యం చేర్చేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ ప్రత్యర్థి డిఫెండర్లు, గోల్‌కీపర్ అలీషా సమన్వయంతో అడ్డుకున్నారు. అయితే రెండో క్వార్టర్ మొదలైన నిమిషంలోనే కొట్నీ షానెల్ (16వ నిమిషం) భారత రక్షణ పంక్తిని బోల్తాకొట్టించి ఆసీస్‌కు గోల్ తెచ్చిపెట్టింది. ఇదే క్వార్టర్లో మరో పదినిమిషాలు గడిచేసరికి నెట్‌వద్ద చురుగ్గా మాటువేసిన లెక్సీ పికెరింగ్ (26వ నిమిషం) చాకచక్యంగా గోల్ చేసి ఆసీస్ ఆధిక్యాన్ని 2–0తో రెట్టింపు చేశారు. తిరిగి మూడో క్వార్టర్ మొదలైన కాసేపటికే టాటమ్ స్టివార్ట్ (35వ నిమిషం) పెనాల్టీ స్ట్రోక్‌తో కంగారూ సేన 3–0తో ఎదురులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఎట్టకేలకు మూడో క్వార్టర్ ముగిసే దశలో డ్రాగ్‌ఫ్లికర్ దీపిక (44వ నిమిషం) చేసిన గోల్‌తో భారత్ ఖాతా తెరువగలిగింది. 1–3తో తొలిసారి ఆధిక్యానికి గండికొట్టిన భారత్ మళ్లీ 6 నిమిషాల వ్యవధిలో దీపిక ఫ్లిక్ చేసిన బంతి రిబౌండ్ కాగా... పక్కనే ఉన్న నేహా (52వ నిమిషం)సమయస్ఫూర్తితో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి తరలించింది. ఆఖర్లో స్కోరును సమం చేసే అవకాశం పెనాల్టీ కార్నర్ రూపంలో వచ్చినప్పటికీ గోల్‌గా మలచడంతో భారత స్ట్రయికర్లు విఫలమయ్యారు. ఆదివారం ఇదే వేదికపై ఆస్ట్రేలియాతో భారత అమ్మాయిలు రెండో మ్యాచ్ ఆడతారు.



ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు సన్నాహకంగా బెకెంగ్‌హామ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్, భారత్ 'ఎ' జట్లు తలపడుతున్నాయి. మ్యాచ్ రెండో రోజు ఆటలో దృశ్యాలు.



'అలా క్యాచ్ పడితే నాటౌట్'

- బౌండరీ వద్ద 'బన్నీ హాప్స్'పై నిబంధన మార్పు
- 'కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్' పైనా సవరణలు
- ఐసీసీ కొత్త నియమావళి



International Cricket Council

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న కొన్ని నిబంధనల్లో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మార్పులు చేసింది. వన్డేల్లో రెండు బంతుల వినియోగం, కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్, బౌండరీ లైన్ వద్ద పట్టే క్యాచ్‌లు వివాదాస్పదం కాకుండా ఉండేదుకు ఐసీసీ క్రికెట్ కమిటీ సిఫార్సుల మేరకు సవరణలు తీసుకొచ్చింది. టెస్టు, వన్డే, టి20 మూడు ఫార్మాట్లలోనూ ఈ కొత్త సవరణ నిబంధనలు త్వరలోనే అమలు కానున్నట్లు ఐసీసీ వెల్లడించింది. ఈ నెల 17 నుంచే టెస్టు క్రికెట్‌లో ఇవి అమలవుతాయి. వచ్చే నెల 2 నుంచి వన్డేల్లో, 10 నుంచి టి20 క్రికెట్‌లో మారిన నిబంధనల్ని అమలు చేయనున్నట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

రెండు కొత్త బంతులు యథాతథం కానీ...

ఇప్పుడు వన్డే క్రికెట్‌లో బౌలింగ్ జట్టుకు రెండు కొత్త బంతుల్ని ఒకేసారి ఇస్తున్నారు. ఒక ఎండ్ నుంచి ఒక బౌలర్, మరో ఎండ్ నుంచి ఇంకో బౌలర్ రెండు వేర్వేరు కొత్త బంతుల్ని వినియోగిస్తున్నారు. ఇకపై ఇలా ఉండదు. రెండు కొత్త బంతుల్ని ఒకేసారి ఇచ్చినప్పటికీ చెరో ఎండ్ నుంచి ఉపయోగించడం కుదరదు. రెండు ఎండ్‌ల నుంచి కూడా 1 నుంచి 34 ఓవర్ల వరకు ఒక కొత్త బంతిని, 35 నుంచి 50వ ఓవర్ వరకు రెండో కొత్త బంతిని వాడాల్సివుంటుంది. ఒకవేళ ప్రతికూల వాతావరణంతో 25 ఓవర్లలోపు కుదించిన మ్యాచ్‌లు జరిగితే మాత్రం ఒక ఇన్నింగ్స్ ముగిసేవరకు ఒకే కొత్త బంతిని ఇస్తారు. దీనివల్ల బంతి, బ్యాట్‌కు మధ్య సమతూకం పాటించినట్లవుతుందని ఐసీసీ కమిటీ తెలిపింది.

ఎవరు వీడితే... అదే తరహా ఆటగాడే బరిలోకి


కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా ఇన్నాళ్లు ఎవరిని పడితే వారిని మైదానంలోకి దించేవారు. మరీ ముఖ్యంగా బ్యాటింగ్, ఫీల్డింగ్ పరిస్థితులకు తగిన ఆటగాడిని వ్యూహాత్మకంగా మోహరించేవారు. ఇది ప్రత్యర్థి జట్టుకు ఇబ్బందికరంగా మారేది. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో నాలుగో టి20 సందర్భంగా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే కన్‌కషన్ అయ్యాడు. అయితే అప్పటికే బ్యాటింగ్ ముగియడంతో భారత్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణాను బరిలోకి దించింది. అతను (3/33) మ్యాచ్‌ను గెలిపించే స్పెల్‌తో అదరగొట్టాడు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పుడు దీనిని మార్చేందుకు ఐసీసీ సిద్ధమైంది. ఇక మీదట ఎవరు గాయంతో అచేతన స్థితికి గురైతే కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్ ఆ స్థాయి ఆటగాడిని బరిలోకి దించాలి. అంటే బ్యాటర్ కన్‌కషన్ అయితే మరో బ్యాటర్‌నే మైదానంలో ఆడించాలి. అలాగే వికెట్ కీపర్, పేసర్, స్పిన్నర్, ఆల్‌రౌండర్... ఇలా ఎవరు గాయపడితే అదే తరహా ఆటగాడే ఆడాలి. దీనికి సంబంధించి టాస్‌కు ముందు తుది జట్టు వివరాలు ఇచ్చేటపుడే వికెట్ కీపర్, బ్యాటర్, సీమర్, స్పిన్నర్, ఆల్‌రౌండర్‌లతో కూడిన జాబితాను ఇవ్వాల్సి ఉంటుంది.

బౌండరీ ఆవల పదేపదే తచ్చాడితే 'క్యాచ్' కాదు!

బ్యాటర్ భారీ సిక్సర్లకు ప్రయత్నించినపుడు బౌండరీ లైన్ వద్ద గాల్లోకి లేచి బంతిని లైన్‌కు ఇవతలే విసిరేసిన ఫీల్డర్ మళ్లీ బౌండరీ లైన్ లోపలికి వచ్చి క్యాచ్‌గా అందుకునేవాడు. ఇందులో వివాదాస్పదం ఏమీ లేదు. అయితే కొన్ని అరుదైన సందర్భాల్లో ఫీల్డర్ బంతిని గాల్లోకి విసిరే ప్రయత్నంలో విఫలమవుతాడు. ఫీల్డర్ బౌండరీ లైన్ అవతల కాలు మోపాక కూడా మరోమారు గాల్లోకి ఎగిరి బంతిని మైదానంలోకి పంపి... తిరిగొచ్చి క్యాచ్ అందుకోవడం ఇకపై క్యాచ్ కాదు అవుట్ కాదు. ఈ వివాదాస్పద క్యాచ్‌లపై కమిటీ స్పష్టమైన నిర్ణయం తీసుకుంది.

నీరజ్ చోప్రా... ఎనిమిదేళ్ల తర్వాత

పారిస్ డైమండ్ లీగ్‌లో పాల్గొననున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్



పారిస్: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పారిస్ డైమండ్ లీగ్‌లో టైటిల్ సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాడు. ఈ ఏడాది రెండు టోర్నమెంట్‌లలో రెండో స్థానంలో నిలిచిన 27 ఏళ్ల నీరజ్... ఈ నెల 20 నుంచి జరగనున్న లీగ్‌లో అగ్ర స్థానం దక్కించుకోవాలని చూస్తున్నాడు. చివరిసారిగా 2017లో పారిస్ డైమండ్ లీగ్‌లో పాల్గొన్న నీరజ్... మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత ఇందులో పాల్గొంటున్నాడు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా, రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్‌తో పాటు ఇప్పటికే 90 మీటర్ల మార్క్ దాటిన మరో ఐదుగురు ప్రపంచ స్థాయి జావెలిన్ త్రోయర్లు బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు' అని నిర్వహకులు పేర్కొన్నారు. గతేడాది పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ఈ లీగ్‌కు దూరంగా ఉన్న నీరజ్ చోప్రా... ఈసారి సత్తాచాటాలని భావిస్తున్నాడు. ఈ లీగ్ అనంతరం చెక్ రిపబ్లిక్‌లో జరగనున్న గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో నీరజ్ పాల్గొననున్నాడు. ఆ తర్వాత భారత్‌లో తొలిసారి నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో నీరజ్ పాల్గొననున్నాడు. 'నీరజ్ చోప్రా క్లాసిక్' పేరుతో వచ్చే నెల 5న బెంగళూరు వేదికగా జరగనున్న ఈ ఈవెంట్‌కు ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య 'ఎ' కేటగిరీ గుర్తింపునిచ్చింది. ఇందులో అంతర్జాతీయ స్టార్ జావెలిన్ త్రోయర్లు పాల్గొననున్నారు.


శనివారం కేరళలో తన లోక్‌సభ నియోజకవర్గం వయనాడ్‌లో స్మార్ట్ అంగన్‌వాడీని ప్రారంభించాక చిన్నారులతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ



శనివారం కశ్మీర్‌లోని దాల్ సరస్సులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు. మే 22న పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌కు పర్యాటకుల సంఖ్య తగ్గిన విషయం తెలిసిందే.


ఎయిరిండియా ప్రమాదంలో గాయపడ్డ ఓ మహిళను శనివారం అహ్మదాబాద్ ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన

- కెనడాలో జీ7 సదస్సుకు హాజరు
- సైప్రస్, క్రొయేషియాల్లోనూ పర్యటించనున్న ప్రధాని
- ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి విదేశాలకు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సు జరిగే కెనడాతో పాటు సైప్రస్, క్రొయేషియాల్లో ఆయన పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జీ7 సమావేశంలో మోదీ పాల్గొంటారు. ఇంధన భద్రత, సాంకేతికత, ఆవిష్కరణలతో సహా కీలక ప్రపంచ సమస్యలపై భారత్ వైఖరిని ప్రపంచ దేశాలతో ఆయన పంచుకోనున్నట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది. అందే గాక పలువురు జీ7, ఇతర దేశాధినేతలతో ప్రధాని భేటీ కానున్నారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ తరువాత ఆయనకు ఇదే తొలి విదేశీ పర్యటన. ఖలిస్తానీ సమస్య కారణంగా కెనడాతో దౌత్య సంబంధాలు క్షీణించాక ఆ దేశంలో పర్యటిస్తుండటమూ ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో దౌత్య బంధాలు మెరుగవుతాయని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. ఇందుకు ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి ఇటీవలే చెప్పారు. 2023లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరగడం తెలిసిందే. అందులో భారత ఏజెంట్ల ప్రమేయముందని నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. అంతేగాక అప్పటి భారత హై కమిషనర్ సంజయ్ వర్మతో సహా అనేక మంది మన దౌత్యవేత్తలకు నిజ్జర్ హత్యతో సంబంధముందని కూడా కెనడా ఆరోపించింది. వీటిపై భారత్ మండిపడింది. ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఈ ఉదంతంతో కెనడాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. తర్వాత ట్రూడో తప్పుకోవడం, ఇటీవలి ఎన్నికల్లో మార్క్ కార్నీ ప్రధాని కావడంతో కొన్ని నెలలుగా, అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కొత్త హైకమిషనర్లను నియమించే అవకాశాలను రెండు దేశాలూ పరిశీలిస్తున్నాయి.



భారత్‌కు ప్రాధాన్యం

భారత్ జీ7 సభ్య దేశం కాకపోయినా ఆహ్వానిత దేశంగా 12వసారి పాల్గొంటోంది. ఈ సదస్సుకు మోదీ హాజరవుతుండటం ఇది వరుసగా ఆరోసారి. 1975లో ఫ్రాన్స్ ప్రారంభించిన జీ7కు ఇది 50వ సంవత్సరం. ఫ్రాన్స్‌తో పాటు ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన కెనడా, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికా ఇందులో సభ్య దేశాలు. యూరోపియన్ యూనియన్ కూడా జీ7కు పూర్తిస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తోంది. అంతర్జాతీయ శాంతిభద్రతలు, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ మార్పులు, దేశాల నడుమ సహకారం, అంతర్జాతీయ నేరాల కట్టడికి ఉమ్మడి చర్యలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, యువత, ఉపాధి అవకాశాలు తదితరాలపై జీ7 దృష్టి సారిస్తుంది. భారత్ వంటి దేశాలను 'ప్రచార భాగస్వామి'గా జీ7 ఏటా ఆహ్వానిస్తోంది.

సైప్రస్, క్రొయేషియాలకు తొలిసారి

మోదీ ఆదివారం తొలుత సైప్రస్ వెళ్తారు. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో పలు అంశాలపై చర్చిస్తారు. గత 20 ఏళ్లలో అక్కడ భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. అనంతరం మోదీ కెనడాలో జీ7 సదస్సులో పాల్గొంటారు. అనంతరం 18న క్రొయేషియా వెళ్తారు. భారత ప్రధాని ఒకరు ఆ దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి కానుంది. క్రొయేషియా ప్రధాని అంద్రే ప్లెంకోవిక్‌తో పాటు అధ్యక్షుడు జొరాన్ మిలానోవిక్‌తో కూడా మోదీ భేటీ అవుతారు.

బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల మధ్యంతర పరిహారం

ఎయిర్ ఇండియా ప్రకటన

ముంబై: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున మధ్యంతర పరిహారం అందజేస్తామని ఎయిర్ ఇండియా యాజమాన్యం శనివారం ప్రకటించింది. టాటా సన్స్ సంస్థ ఇప్పటికే ప్రకటించిన రూ.కోటి పరిహారానికి ఇది అదనమని వెల్లడించింది. బాధిత కుటుంబాలను తక్షణమే ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.25 లక్షల చొప్పున(21వేల పౌండ్లు) ఇవ్వబోతున్నట్లు పేర్కొంది. క్షతగాత్రులకూ ఈ సాయం అందిస్తామని ఎయిర్ ఇండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలియజేశారు. బాధిత కుటుంబాలు అన్ని రకాలుగా ఆదుకోవడానికి ప్రత్యేకంగా 200 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. డీజీసీఏ ఆదేశాల మేరకు బోయింగ్ విమానాల్లో భద్రతాపరమైన తనిఖీలు ప్రారంభించినట్లు వివరించారు.

పరిహారంలో పారదర్శకత పాటించాలి: ఖర్గే

అహ్మదాబాద్: విమాన ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు, క్షతగాత్రులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో కచ్చితంగా పారదర్శకత పాటించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. ఆయన శనివారం అహ్మదాబాద్ సిటీ సివిల్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆప్తులను కోల్పోయి కొండంత దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సంతాపం ప్రకటించిన కింగ్ చార్లెస్-3

లండన్: అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు బ్రిటన్ రాజు చార్లెస్-3 శనివారం సంతాపం ప్రకటించారు. బాధితుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. బ్రిటన్ రాజకుటుంబ సభ్యులు సైతం యూనిఫామ్ ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు వెల్లడించాయి. విమాన ప్రమాదంలో భారతీయులతోపాటు బ్రిటన్ పౌరులు సైతం మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే కింగ్ చార్లెస్-3 ఒక ప్రకటన విడుదల చేశారు. తాము తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని పేర్కొన్నారు.

అమెరికాలో సంతాప సభలు

హూస్టన్: విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలియజేస్తూ అమెరికాలో ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలు సభలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ సభలో జరిగాయి. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన దుర్ఘటన తమను తీవ్రంగా కలచివేసిందని ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ గ్రేటర్ హూస్టన్ వ్యవస్థాపక కార్యదర్శి జగదీప్ అహ్లూవాలియా చెప్పారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. అమెరికాలో మరి కొన్ని సంతాప సభలకు ఇండియన్–అమెరికన్ సంఘాలు సిద్ధమవుతున్నాయి.

కాలానుగుణంగా రాజ్యాంగంలో మార్పులు

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి

న్యూఢిల్లీ: ఉత్కృష్టమైన భారత రాజ్యాంగంలో కాలానుగుణంగా, దేశ అవసరాలను బట్టి మార్పులు చోటుచేసుకుంటున్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ చెప్పారు. రాజ్యాంగంలో పలుమార్లు సవరణలు చేసినట్లు తెలిపారు. 'రాజ్యాంగం.. మార్పు చెందే పత్రం' అనే అంశంపై స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్ లా స్కూల్‌లో శుక్రవారం జరిగిన చర్చా కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ మాట్లాడారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల క్రితం అమల్లోకి వచ్చిందని, మారుతున్న కాలాన్నిబట్టి ప్రజల అవసరాలు, డిమాండ్లకు అనుగుణంగా పలుమార్లు సవరణలు జరిగాయని తెలిపారు. పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు లేవనెత్తిన అంశాల ఆధారంగా పార్లమెంట్ స్పందించి, రాజ్యాంగంలో సవరణలు చేసిందని పేర్కొన్నారు. అవసరాలను బట్టి రాజ్యాంగంలో మార్పులు చేర్పులు చేయక తప్పదని ఉద్ఘాటించారు. రాజ్యాంగం అంటే సిరాతో రాసిన నిశ్శబ్ద విప్లవం అని జస్టిస్ గవాయ్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. ప్రజల హక్కులకు పూచీ ఇవ్వడంతోపాటు అణగారిన వర్గాల సాధికారతకు భారత రాజ్యాంగం దోహదపడుతోందని ఆయన వివరించారు.

ఒడిశాలో ఐఈడీ పేలుడు

సీఆర్‌పీఎఫ్ అధికారి మృతి

భువనేశ్వర్: ఒడిశా–జార్ఖండ్ సరిహద్దులో మావోయిస్టుల కోసం భద్రతా సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా ఐఈడీ పేలుడు సంభవించింది. శనివారం ఉదయం ఒడిశా రాష్ట్రం సుందర్‌గఢ్ జిల్లాలో కె.బాలంగ్ గ్రామ పరిధిలోని అడవిలో జరిగిన ఈ ఘటనలో సీఆర్‌పీఎఫ్ ఏఎస్సై సత్యబాన్ కుమార్ సింగ్(34) ప్రాణాలు కోల్పోయారు. ఆయన 134 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌లో పని చేస్తున్నారు.స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్. మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడం వల్ల తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సత్యబాన్‌కుమార్ మృతి చెందినట్లు అధికారులు చెప్పారు. ఈ పేలుడు పదార్థాలను మావోయిస్టులు గత నెల 27న ఓ స్టోన్ క్వారీ నుంచి ఎత్తుకెళ్లారని తెలిపారు. సుందర్‌గఢ్‌లోని బాంకో ప్రాంతంలో క్వారీలు ఉన్నాయి. ఏకంగా ఐదు టన్నుల పేలుడు పదార్థాలను మావోయిస్టులు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇందులో ఇప్పటిదాకా నాలుగింట మూడొంతుల పేలుడు పదార్థాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. మిగిలినవాటి కోసం సీఆర్‌పీఎఫ్, ఒడిశా పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఇదే ఆపరేషన్ సందర్భంగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది.

7,400కు కరోనా కేసులు

24 గంటల్లో 9 మంది మృతి • కర్ణాటకలో అత్యధిక పెరుగుదల

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. యాక్టివ్ కేసుల 7,400కు చేరింది. గత 24 గంటల్లో 269 కేసులు నమోదు కాగా తొమ్మిది మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. కర్ణాటకలో అత్యధికంగా ఒక్కరోజులోనే 132 కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లో 79, కేరళలో 54, మధ్యప్రదేశ్‌లో 20, సిక్కింలో 11, తమిళనాడులో 12, హర్యానాలో 9తోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా 24 గంటల్లో యాక్టివ్ కోవిడ్ కేసుల్లో పెరుగుదల నమోదైంది. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, లద్దాఖ్, మిజోరం, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో కేసులేవీ నమోదు కాలేదని ఆరోగ్య శాఖ తెలిపింది. గత 24 గంటల్లో మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ముగ్గురు, రాజస్థాన్, తమిళనాడులలో ఒక్కొక్కరు మరణించారు. జనవరి 1 నుంచి ఇప్పటివరకు మొత్తం మరణాల సంఖ్య 87కు చేరుకుంది. కోవిడ్‌కు అత్యధికంగా ప్రభావితమైన రాష్ట్రంగా కేరళ ఉంది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 2,109గా ఉంది. తరువాత స్థానాల్లో గుజరాత్ 1,437, ఢిల్లీ 672, మహారాష్ట్ర 613, కర్ణాటక 527, ఉత్తరప్రదేశ్ 248, తమిళనాడు 232, రాజస్థాన్ 180, ఆంధ్రప్రదేశ్ 102 ఉన్నాయి. మణిపూర్, రాజస్థాన్‌లలోనూ కేసులు పెరిగాయి.

దురదృష్టంగా భావించే సీటే

ఇప్పుడు హాట్ కేకు

విమానంలో 11ఏ సీటుపై ఆసక్తికర చర్చ

అప్పట్లో థాయ్ నటుడూ తప్పించుకున్నాడు

11ఏ. ఎయిరిండియా విమాన ప్రమాదం తరువాత ఎక్కడ చూసినా ఈ సీట్ నంబర్ గురించిన చర్చే. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ ఏకైక ప్రయాణికుడు రమేశ్ కూచున్నది ఆ సీట్‌లోనే కావడం తెలిసిందే. సాధారణంగా 11ఏను దురదృష్టకరమైన నంబర్‌గా పిలుస్తారు. ఎందుకంటే అది ఎమర్జెన్సీ ఎగ్జిట్ పక్కనే ఉంటుంది. బిజినెస్ క్లాస్ పూర్తవగానే మొదలయ్యే ఎకానమీ క్లాసులో ఉంటుంది గనుక ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఈ సీటు పక్కనే వస్తుంది. దాంతో 11ఏ సీటుకు కిటికీ ఉండదు. చాలామంది అందమైన మేఘాలను, భూమిపై బుల్లిగా కనిపించే ఊళ్లు, పట్టణాలను చూసే ఆసక్తితో విండో సీటే కోరుకుంటారు. ఆ అవకాశం ఉండదు గనుక 11ఏను ఎవరూ అంతగా ఇష్టపడరు. కానీ రమేశ్ విషయంలో ఈ దురదృష్టకరమైన సీటే ప్రాణదాతగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే సీటు ఊడిపోవడమే గాక పక్కనే ఉన్న ఎమర్జెన్సీ డోర్ విరిగిపోయింది. దాంతో వెంటనే కిందికి దిగి ప్రాణాలతో బయటపడ్డాడు.

అప్పుడూ 11ఏ సీటే

27 ఏళ్ల కిందట థాయ్ ఎయిర్‌వేస్ విమానం కూలిపోయినప్పుడు కూడా అచ్చు ఇలాగే జరిగింది. 1998 డిసెంబర్ 11న దక్షిణ థాయ్‌లాండ్‌లో ల్యాండయ్యే క్రమంలో అది చిత్తడి నేలల్లో పడిపోయింది. విమానంలోని 146 మందిలో 101 మంది మరణించారు. కానీ 11ఏ సీట్‌లో కూర్చున్న థాయ్ నటుడు–గాయకుడు రువాంగ్సాక్ లోయ్చుసాక్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. ఎయిరిండియా ప్రమాదంలోనూ సరిగ్గా అదే నంబర్ సీట్లో కూర్చున్న ప్రయాణికుడు క్షేమంగా బయట పడ్డట్టు తెలిసి ఎంతో ఆశ్చర్యపోయినట్టు చెప్పారాయన. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ''నాకు రెండో జీవితం దక్కింది బహుశా 11ఏలో కూచోవడం వల్లేనేమో. నాటి బోర్డింగ్ పాస్ నా దగ్గర లేదు. కానీ నా సీట్ నంబర్ అప్పుడు పత్రికలన్నింట్లోనూ వచ్చింది. ఆ ప్రమాదం దెబ్బకు దశాబ్దం పాటు నేను విమాన ప్రయాణం చేయలేదు'' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు.

ఆ సీటుపై ఆసక్తి

ఎయిరిండియా విమాన ప్రమాదం తరువాత వాణిజ్య విమానాల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ సీట్లపై ఆసక్తి పెరిగింది. 11ఏ సీట్‌నే బుక్ చేసుకోవాలనుకుంటున్నట్టు చాలా మంది సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. రమేశ్ ఉదంతంతో ఈ సీట్ చాలా సురక్షితమని భావిస్తున్నారు. కానీ అది నిజమనేందుకు ఎలాంటి సాంకేతిక ఆధారాలూ లేవు. ఒక్కో ప్రమాదం ఒక్కోలా జరుగుతుంది గనుక ఫలానా సీటు సురక్షితమని చెప్పలేమని అమెరికాకు చెందిన ఫ్లైట్ సేఫ్టీ ఫౌండేషన్ డైరెక్టర్ మిచెల్ ఫాక్స్ అన్నారు. విమానంలో ముందుకంటే వెనక వైపు సీట్లు ఎక్కువ సురక్షితమని 1971 నుంచి జరిగిన ప్రమాదాలపై 2007లో పాపులర్ మెకానిక్స్ చేసిన అధ్యయనంలో తేలింది.



ఇల్లే తాజ్‌మహల్!

భార్యపై ప్రేమతో తాజ్‌మహల్‌ను పోలిన ఇంటి నిర్మాణం

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన నాలుగు పడక గదుల ఇల్లు

భోపాల్: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత పాలరాతి సౌధం తాజ్‌మహల్ గురించి తెలియంది ఎవరికి? అచ్చంగా తాజ్‌మహల్‌ను పోలిన నాలుగు పడక గదుల సుందరమైన ఇల్లు మధ్యప్రదేశ్‌లో ఉందని మీకు తెలుసా? ప్రస్తుతం ఈ ఇల్లు ఒక పర్యాటక కేంద్రంగా మారిపోయింది. సోషల్ మీడియాలోనూ జనం ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజ్‌మహల్ ఇంటి చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్‌లో విస్తృతంగా షేర్ చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ సిటీలో ఆనంద్ ప్రకాశ్ చౌక్సీ తన భార్యపై ప్రేమను చాటుకుంటూ పాలరాతితో తాజ్‌మహల్‌ను పోలిన ఇల్లు నిర్మించారు. ఇందుకోసం రాజస్తాన్‌లో దొరికే మకరానా మార్బుల్‌ను ఉపయోగించినట్లు ఆనంద్ ప్రకాశ్ చౌక్సీ చెప్పారు. ఆగ్రాలోని అసలైన తాజ్‌మహల్ కొలతలను తాము పాటించినట్లు తెలిపారు. తాజ్‌మహల్ కొలతలు మీటర్లలో తీసుకొని, అదే సంఖ్యను అడుగుల్లోకి మార్చి ఇంటిని నిర్మించామని వెల్లడించారు. ఒరిజినల్ తాజ్‌మహల్ పరిమాణంలో తమ ఇల్లు మూడింట ఒక వంతు ఉంటుందన్నారు. ఆనంద్ ప్రకాశ్ చౌక్సీ సొంత పాఠశాల ప్రాంగణంలోనే ఈ ఇల్లు నిర్మితమైంది. పాలరాతి గుమ్మటాలు, స్తంభాలు, తలుపులు, కిటికీలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. లోపలి భాగం సైతం తెల్లగా, అందంగా మెరిసిపోతోంది. కళ్లెదుట తాజ్‌మహల్‌ను చూసినట్లే ఉందని సందర్శకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో ప్రేమ సందేశాన్ని పంచడానికే తాజ్‌మహల్ రూపంలో ఇంటిని నిర్మించుకున్నట్లు ఆనంద్ ప్రకాశ్ చౌక్సీ చెప్పారు. ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను షాజహాన్ చక్రవర్తి తన భార్య ముంతాజ్ మహల్‌పై ప్రేమకు గుర్తుగా నిర్మించిన సంగతి తెలిసిందే. మరో విశేషం ఏమిటంటే షాజహాన్‌కు బుర్హాన్‌పూర్‌తో అనుబంధం ఉంది. ఆయన ఇక్కడ జంతువులను వేటాడేవారు. ఆనంద్ ప్రకాశ్ ఆధునిక షాజహాన్ అని నెటిజన్లు అభివర్ణిస్తున్నారు.

చాయ్‌వాలీ తప్పించుకుంది

కొడుకు మాత్రం బలయ్యాడు

అహ్మదాబాద్: ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం బీజే మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఓ టీ స్టాల్ వెనక కూలింది. ఆ టీ కొట్టు నడిపే సీతాబెన్ అనే మహిళ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. కాలిన గాయాలతో బతికి బయటపడింది. చెట్టుకింద టీస్టాల్లో నిద్రపోతున్న 14 ఏళ్ల కుమారుడు ఆకాశ్ మాత్రం మంటలకు బలయ్యాడు. తన వెనకగా చెలరేగుతున్న మంటల నుంచి సీతాబెన్ తప్పించుకుని పరుగెత్తుకుంటూ వస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఐసీయూలో కోలుకుంటున్న ఆమె మీడియాతో మాట్లాడింది. ''నేను విమానాన్ని చూడలేదు. కానీ భారీ శబ్దం విన్పించింది. వెంటనే మంటలు, పొగ కమ్ముకుంటుండటంతో ఏమీ కన్పించకుండా పోయింది. భయపడి పరుగులు తీశాను'' అంటూ గుర్తు చేసుకుంది.

నా భార్యకింకా తెలియదు

సీతాబెన్ భర్త సురేశ్‌కుమార్ కూడా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ''ప్రమాద సమయంలో నేను ఇంట్లో ఉన్నా. టీ స్టాల్లో ఉన్న నా భార్యకు ఆకాశ్ లంచ్ బాక్స్ తీసుకెళ్లాడు. తర్వాత అక్కడే పడుకుని ప్రమాదానికి బలైపోయాడు'' అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. ''ఈ ఘోరం గురించి నా భార్యకు ఇంకా చెప్పలేదు. నా కొడుకు మృతదేహం గుర్తించలేనంతగా కాలిపోయింది. దాంతో పరీక్షల నిమిత్తం నా డీఎన్ఏ నమూనా ఇచ్చా'' అంటూ గుండెలవిసేలా రోదించాడు.

ఇజ్రాయెల్ కాల్పుల్లో 27 మంది పాలస్తీనా పౌరులు మృతి

గాజా: ఇజ్రాయెల్ సైన్యం అటు ఇరాన్‌తోపాటు ఇటు గాజాపై ఏకకాలంలో దాడులకు దిగింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉదయం గాజాలో జరిగిన కాల్పుల్లో 27 మంది పాలస్తీనా పౌరులు మరణించారు. మరో 125 మంది గాయపడినట్లు స్థానిక అధికారులు చెప్పారు. సెంట్రల్ గాజాలోని ఆహార పంపిణీ కేంద్రాల వద్ద గుమికూడిన జనంపై ఇజ్రాయెల్ జవాన్లు కాల్పులు జరిపినట్లు తెలిపారు. తమపై దాడి చేసేందుకు కొందరు ప్రయత్నించడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని జవాన్లు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 55 వేల మందికిపైగా పాలస్తీనా పౌరులు మృతి చెందారు.

విదేశాంగ విధానం అస్తవ్యస్తం: ఖర్గే

న్యూఢిల్లీ: గాజాలో కాల్పుల విరమణ కోరుతూ ఐక్యరాజ్యసమితి సాధారణ సభ తీర్మానంపై జరిగిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉండడాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుపట్టారు. నరేంద్ర మోదీ పాలనలో భారత విదేశాంగ విధానం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఈ మేరకు ఖర్గే శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. యుద్ధానికి, మారణహోమానికి భారత్ ముమ్మాటికీ వ్యతిరేకమని పేర్కొన్నారు. ఆ విధానాన్ని మోదీ ప్రభుత్వం వదిలేసిందా? అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు నక్సలైట్ల మృతి

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని నక్సలిజం ప్రభావిత బాలాఘాట్ జిల్లాలో శనివారం పోలీసులు, నక్సలైట్లకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు చనిపోయారు. వీరిలో ముగ్గురు మహిళలున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని బాలాఘాట్ జిల్లా అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనాస్థలి నుంచి ఒక గ్రనేడ్ లాంఛర్, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, మరో రెండు బోర్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు.

ట్రంప్‌కు పుతిన్ ఫోన్

మాస్కో: రష్యా అధినేత పుతిన్ శనివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా ఘర్షణలు, ఉక్రెయిన్ పరిణామాలు, శాంతి చర్చలపై ఇరువురు నేతలు 50 నిమిషాల పాటు మాట్లాడుకున్నట్లు పుతిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ శనివారం చెప్పారు. ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో ఇటీవల జరిగిన చర్చల సారాంశాన్ని ట్రంప్‌కు పుతిన్ వివరించారని తెలిపారు.

ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు

పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

ఎయిర్ సేఫ్టీపై ఉన్నతాధికారులతో సమీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి బృందం దర్యాప్తు చేస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం ఎయిర్ సేఫ్టీపై ఉన్నతాధికారులతో సమీక్ష అనంతరం ఢిల్లీలోని ఉడాన్ భవన్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు అక్కడి వారంతా మృతులకు సంతాపసూచికగా ఒక నిమిషం మౌనం పాటించారు. ''ఉన్నత స్థాయి బృందంలో హోంశాఖ కార్యదర్శి, పౌర విమానయాన శాఖ కార్యదర్శి, అహ్మదాబాద్ పోలీసు కమిషనర్, ఐబీ స్పెషల్ డైరెక్టర్ నియమించాం. అవసరమైతే మరి కొందరిని కమిటీలోకి తీసుకుంటాం. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందిస్తుందని భావిస్తున్నాం''అని మంత్రి తెలిపారు. విమాన ప్రమాదం జరిగిన తీరును వివరించారు. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాయన్నారు. ''బోయింగ్787–8 డ్రీమ్‌లైనర్ విమానంలోని బ్లాక్‌బాక్స్ శుక్రవారం సాయంత్రం దొరికింది. దానిని డీకోడ్ చేసి అందులోని సమాచారాన్ని సమగ్ర స్థాయిలో విశ్లేషించిన తర్వాతే మీడియాకు అదనపు సమాచారం అందజేస్తాం. బోయింగ్ 787 సిరీస్ విమానాల భద్రతపై దర్యాప్తునకు ఆదేశించాం. ప్రస్తుతం బోయింగ్787 సిరీస్‌లో 33 విమానాలు ఉన్నాయి. వీటిలో ఏడు విమానాల భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించా. ఈ సిరీస్ విమానాలను తరచూ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించాం. ఉన్నత స్థాయి బృందం సోమవారం భేటీ అవుతుంది''అని మంత్రి పేర్కొన్నారు.



ఆ బాధ నాకూ తెలుసు..

ఈ విమాన ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని రామ్మోహన్ అన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. 'రోడ్డు ప్రమాదంలో నా తండ్రిని కోల్పోయా.. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు'అని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని, మృతదేహాలను వీలైనంత తొందరగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తామని కేంద్రమంత్రి తెలిపారు.

ముసునూరి నాయకుల మొదటి రాజధాని?

తెలుగు జాతి గౌరవాన్ని సుసంపన్నం చేసి, దాని కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన కాకతీయ రాజుల సామ్రాజ్యం ముస్లిం రాజుల దాడివల్ల ధ్వంసమైంది. క్రీ.శ.1323లో జరిగిన యుద్ధంలో కాకతీయుల చివరి రాజు రెండో ప్రతాపరుద్రుడు ఓటమి పాలై ఢిల్లీ సైన్యానికి పట్టుబడ్డాడు. ఇతడు అవమాన భారాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడంతో ఓరుగల్లులో కాకతీయ సామ్రాజ్య సౌధం శాశ్వతంగా కుప్పకూలిపోయింది. తెలుగునాట ముస్లిం సైనిక పాలనకు పునాది పడింది. వీరి పాలనలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న తెలుగు ప్రజలు స్వేచ్ఛ కోసం విముక్తి పోరాటానికి నడుం బిగించారు. 'ముసునూరి ప్రోలయ నాయకుడు' ఈ విమోచన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజలను ముందుకు నడిపించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర



కాకతీయుల అనంతర పరిస్థితులు

ఢిల్లీ సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ (క్రీ.శ.1320–25) కుమారుడు జునాఖాన్ (మహ్మద్‌బిన్ తుగ్లక్). ఇతడినే ఉలుగ్‌ఖాన్ అని కూడా అంటారు. కాకతీయులపై విజయం (1323) సాధించిన జునాఖాన్ వారి రాజ్యాన్ని ఢిల్లీ సుల్తానత్‌లో కలిపాడు. ఇతడి నాయకత్వంలోని ఢిల్లీ సుల్తాన్ తురుష్క సైన్యం కాకతీయ రాజ్యానికి చెందిన ప్రజల సమస్త సంపదను దోచుకుంది. ఓరుగల్లు పేరును సుల్తాన్‌పూర్‌గా మార్చారు. కాకతీయులు నిర్మించిన అనేక కోటలు, దుర్గాలు, దేవాలయాలను నాశనం చేశారు. దోచుకున్న సంపదనంతా ఢిల్లీకి తరలించారు. తురుష్క సైన్యం తమ క్రూరమైన చర్యలతో తెలుగు ప్రజలను భయకంపితులను చేసింది. చాళుక్యులు, కాకతీయులు నిర్మించిన అనేక దేవాలయాలను కూలగొట్టి వాటి స్థానంలో మసీదులను నిర్మించారు. మత మార్పిడులకు పాల్పడ్డారు. ముసునూరి ప్రోలయ నాయకుడు కందరాడ గ్రామంలో (పిఠాపురం సమీపంలో) వేయించిన 'విలాసతామ్ర శాసనం', విజయనగర కంపరాయల భార్య గంగాదేవి రచించిన 'మధురా విజయం' (సంస్కృత కావ్యం), ప్రముఖ ముస్లిం చరిత్రకారుడు జియావుద్దీన్ బరౌనీ రచనల ద్వారా ఈ వివరాలు తెలుస్తున్నాయి. భారతదేశానికి వచ్చిన విదేశీ ముస్లింలు ఢిల్లీ సుల్తాన్ల కాలంలో ఉత్తర భారతం నుంచి తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు.

కాకతీయుల పతనం దక్షిణ భారత దేశానికి చెందిన అనేక రాజ్యాలకు శాపంగా మారింది. వీటిలో చాలా రాజ్యాలు 1325 వరకు తుగ్లక్ ఆధీనంలోకి వచ్చాయి. వారిలో ఉన్న అనైక్యత కారణంగా ముస్లిం సైన్యాన్ని అడ్డుకోలేక చాలా మంది రాజులు ఢిల్లీ సుల్తాన్‌కు లొంగిపోయారు. దౌల్తాబాద్ (దేవగిరి) వజీరైన మాలిక్ బుర్హనుద్దీన్‌ను తెలుగు ప్రాంతానికి అధికారిగా నియమించారు. పాలనలో ఇతడికి సహాయం అందించడానికి సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు) కోటకు అధిపతిగా 'మాలిక్ మక్బూల్'ను నియమించారు. ఢిల్లీ సింహాసనం కోసం వారసత్వ పోరు జరిగింది. మహ్మద్ బిన్ తుగ్లక్ తన తండ్రిని చంపి సుల్తానయ్యాడు. ఈ నేపథ్యంలో కాకతీయుల కాలంలో పనిచేసిన సైన్యాధికారులు, అనేక మంది బలమైన నాయంకరులు ఏకమై ఢిల్లీ సుల్తాన్‌పై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. తెలుగు ప్రాంతంపై ఇస్లాం పాలనను అంతం చేయడమే ప్రథమ కర్తవ్యంగా ఈ తిరుగుబాటులో అనేక వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. ఈ పోరాటం హిందూ మతోద్ధరణకు, సంస్కృతి రక్షణకు తోడ్పడిందని అనితల్లి (రాజమండ్రి రెడ్డి రాజు కాటయ వేమారెడ్డి కుమార్తె) వేయించిన కలువచేరు శాసనం (క్రీ.శ. 1423) ద్వారా తెలుస్తోంది.

కాకతీయుల నాయంకర విధానం

కాకతీయుల సైనిక పరిపాలనను 'నాయంకర విధానం' అని పిలుస్తారు. రుద్రమదేవి ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని రెండో ప్రతాపరుద్రుడు పునర్ వ్యవస్థీకరించి బలోపేతం చేశాడు. సైన్యాధికారులైన ఈ నాయంకరులు తమ ఆధీనంలో, వారి స్థాయిని బట్టి స్వతంత్రంగా కొంత సైన్యాన్ని పోషించేవారు. సైన్య పోషణకు అయ్యే ఖర్చు నిమిత్తం వీరికి కొన్ని గ్రామాలపై పూర్తి అధికారం ఇచ్చారు. వీరు ఈ గ్రామాల నుంచి శిస్తు వసూలు చేసుకునేవారు. కొంత సొమ్మును రాజుకు కప్పంగా చెల్లించేవారు. రాజుకు అవసరమైనప్పుడు సైనిక సహాయం చేయడం వీరి బాధ్యత. కాకతీయులకు నమ్మకంగా ఉన్న వంశస్థుల వారే వంశపారంపర్యంగా నాయంకరులుగా నియమితులయ్యారు. కాకతీయులు సాధించిన అనేక విజయాల్లో వీరు గణనీయ పాత్ర పోషించారు. రెండో ప్రతాపరుద్రుడి పాలన చివరి నాటికి ఈ నాయంకరులు చిన్న చిన్న రాజులుగా అవతరించారు. ఢిల్లీ సుల్తాన్ దాడుల వల్ల వీరి ప్రాబల్యం పతనమైంది. వీరు తమ ఉనికిని నిలుపుకోవడానికి ఢిల్లీ పాలనను ఎదురించాలని ఏకమయ్యారు. ఆ కాలంలో 75 మంది నాయంకరులున్నట్లుగా కలువచేరు శాసనం ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎక్కువగా వెలమ కులానికి చెందిన నాయకులే ఉన్నారని 'ప్రతాపరుద్ర చరిత్ర' ద్వారా తెలుస్తోంది. వీరితో పాటు రెడ్డి, కమ్మ, కాపు, తెలగ, యాదవ నాయకులు కూడా ఉన్నట్లు ఆధారాలున్నాయి. రైతు కుటుంబాలకు చెందిన వీరు మొదట సైన్యాధికారులుగా నియమితులై ఆ తర్వాత క్రమంగా ప్రభువులయ్యారు.

తెలుగు నాయకుల విమోచనోద్యమం

ప్రతాపరుద్రుడి మరణం తర్వాత వయోవృద్ధులైన కాకతీయ సేనానుల్లో ముఖ్యమైనవారు – ఇందలూరి అన్నయ్య, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమ నాయకుడు, రేచర్ల ఏచ నాయకుడు, యాదవసాంగపనిదేవుడు. వీరు నాయంకరుల వారసులను ఏకం చేసి ఢిల్లీ సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించాలని నిశ్చయించారు. ముసునూరి ప్రోలయ నాయకుడిని వీరికి నాయకుడిగా ఎన్నుకున్నట్లు విలాసతామ్ర శాసనం, పోలవరం శాసనం, కలువ చేరు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రోలయకు అండగా అతడి పిన తండ్రి కుమారుడైన ముసునూరి కాపయ నాయకుడు వ్యవహరించాడు. వీరి నాయకత్వాన్ని అద్దంకి వేమారెడ్డి, కొప్పుల ప్రోలయ నాయకుడు, రేచర్ల సింగమ నాయకుడు, మంచికొండ గణపతి నాయకుడు, ఉండీ వేంగభూపాలుడు, ఎరువ చోడభక్తిరాజు, ఆరవీటి సోమదేవ రాజు లాంటి ముఖ్యులు సమర్థించారు. 1325 చివర్లో మధ్యాంధ్ర ప్రాంతంలో ముసునూరి ప్రోలయ నాయకుడు తురుష్క సైన్యాలను ఓడించి రేఖపల్లిలో స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడికి అనుయాయిగా వేమారెడ్డి అద్దంకిలో రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు.

ముసునూరి నాయకులు

కమ్మ వ్యవసాయదారుల కుటుంబానికి చెందిన ముసునూరు నాయకులు దివిసీమను పాలించిన పిన్నచోడుని ఆశ్రయంలో ఉండేవారు. పిన్నచోడుని కుమార్తెలను (నారాంబ, పేరాంబ) వివాహమాడిన గణపతి దేవుడు వారి సోదరుడైన జాయపసేనానిని తన ఆస్థానంలో చేర్చుకోవడంతో ఈ ముసునూరు వారు కూడా కాకతీయుల కొలువులో చేరారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోని ముసునూరు గ్రామం వీరి తొలి నివాసం. వీరు సైనిక శిక్షణ పొందడం ద్వారా వీరులయ్యారు. ప్రతాపరుద్రుడి మంత్రి అయిన ఇందలూరి అన్నయ్య సహకారంతో ముసునూరి పోచినాయకుడు కాకతీయ నాయంకరుడయ్యాడు. ఇతని కుమారుడు ముసునూరి ప్రోలయ నాయకుడు.

ముసునూరి ప్రోలయ నాయకుడు (1325–33): గోదావరి తీరంలోని రేఖపల్లి దుర్గం రాజధానిగా (భద్రాచలం తాలుకా) చేసుకొని ఇతడు మహ్మదీయులను ఎదుర్కొన్నాడు. ఇతడి నాయకత్వంలో సామంత ప్రభువులు చాలా విజయాలు సాధించారు. ప్రతి విజయంలో సోదరుడైన కాపయ నాయకుడి పాత్ర ఉంది. ఇతడికి 'ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్య' బిరుదు ఉంది.

ముసునూరి కాపయ నాయకుడు (1333–69): ముస్లిం చరిత్రకారులు ఇతడిని కన్యానాయక్, కృష్ణానాయక్‌గా వ్యవహరించారు. ప్రోలయ మరణం తర్వాత రేఖపల్లి కేంద్రంగా కాపయ పాలనను ప్రారంభించాడు. ఢిల్లీ పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి ప్రోలయ స్థానంలో ఇతడు నాయకత్వం వహించాడు. సుల్తాన్ కబంధ హస్తాల నుంచి ఓరుగల్లును విముక్తి చేయడానికి కంకణం కట్టుకున్నాడు. హోయసాల రాజ్యాన్ని పాలిస్తున్న మూడో భల్లాలుడు పంపించిన సైన్యం సహకారంతో 1336–37 కాలంలో ఓరుగల్లు కోటపై దాడి చేశాడు. దీంతో ఓరుగల్లు పాలకుడు మాలిక్ మక్బూల్ ఢిల్లీకి పారిపోయాడు. 1337లో ఓరుగల్లు కోటను వశపర్చుకున్న కాపయ నాయకుడు అంతకుముందు కాకతీయుల ఆధీనంలో ఉన్న అనేక ప్రాంతాలను తిరిగి తన అధికారంలోకి తెచ్చుకున్నాడు. కాపయ నాయకుడికి 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్ర సురత్రాణ' బిరుదులున్నాయి.

ఢిల్లీ సుల్తాన్ ముప్పు తొలగిన తర్వాత అప్పటి వరకూ కాపయకు సామంతులుగా ఉన్న సహచరులు కాపయను ధిక్కరించి స్వతంత్రులయ్యారు. కాలక్రమంలో రాచకొండ (నల్గొండ జిల్లా)లో వెలమ నాయకులు (రేచర్ల అనపోత నాయకుడు), అద్దంకి, కొండవీడుల్లో రెడ్డి రాజులు (ప్రోలయ వేమారెడ్డి), విజయనగరంలో యాదవులు, కోరుకొండలో మంచికొండ నాయకులు (ముమ్మడి నాయకుడు), పిఠాపురంలో కొప్పుల నాయకులు బలమైన స్వతంత్ర్య రాజులుగా అవతరించారు.

ఓరుగల్లు రాజ్యానికి పొరుగున ఉన్న గుల్బర్గా (కర్ణాటక)కు సేనాధిపతిగా అల్లావుద్దీన్ బహమన్ షా (హసన్ గంగూ/ జాఫర్ ఖాన్) వ్యవహరించేవాడు. 1347లో ఇతడు తమ రాజైన ఢిల్లీ సుల్తాన్‌ను ఎదిరించి, గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్వతంత్రంగా స్థాపించాడు. ఢిల్లీ సేనల్ని ఓడించడంలో హసన్ గంగూకు కాపయ నాయకుడు సైన్య సహకారం అందించాడు. తన అవసరం తీరిన తర్వాత హసన్ గంగూ రాజ్య విస్తరణ కాంక్షతో 1350లో తెలంగాణపై దండయాత్ర చేశాడు. కాపయ నాయకుడు ఓడిపోయి కౌలాస్ కోట (నిజామాబాద్)ను బహమనీలకు ధారాదత్తం చేసి సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ 1356–57లో తెలంగాణాపై మళ్లీ దాడి చేసి కాపయను ఓడించాడు. దీంతో కాపయ భువనగిరి కోట (నల్గొండ)ను వదులుకొని బహమనీలకు కప్పం కట్టడానికి అంగీకరించాడు.

హసన్ గంగూ మరణం తర్వాత 1359లో మొదటి మహ్మద్‌షా బహమనీ సుల్తాన్‌గా అవతరించాడు. కాపయ నాయకుడి కుమారుడు వినాయక దేవుడు, విజయనగర రాజైన మొదటి బుక్కరాయలు పంపిన సైన్యం సహకారంతో 1361లో భువనగిరి కోటను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఇతడు కౌలాస్ కోటను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉండగా మొదటి మహ్మద్ షా ఓరుగల్లు కోటను ముట్టడించి కాపయ నాయకుడిని ఓడించి సంధి చేసుకున్నాడు. ఆ తర్వాత మొదటి మహ్మద్ షా వినాయక దేవుడిని అతిక్రూరంగా హత్య చేశాడు.

కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌ను ఓడించడమే ధ్యేయంగా విజయనగరాధీశులతో కలిసి ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ షా తుగ్లక్ సహాయమర్థించాడు. 'కాఫిర్ల' (హిందువుల)తో కలిసి స్వజాతీయులపై (ముస్లిం) యుద్ధం చేయడానికి ఫిరోజ్ షా నిరాకరించాడు. అది తెలిసిన మొదటి మహ్మద్ షా ఓరుగల్లుపై దండెత్తి సర్వనాశనం చేశాడు. కాపయ నాయకుడు చేసేదేమీ లేక బహమనీ రాజుతో సంధి చేసుకొని గోల్కొండ కోటను, అపార ధనరాశులను అప్పగించాడు. అప్పటికే కుంగిపోయిన ముసునూరి కాపయ నాయకుడు రేచర్ల వెలమ నాయకుడైన అనపోత నాయకుడి చేతిలో 1369లో భీమారం (వరంగల్) సమీపంలో జరిగిన యుద్ధంలో మరణించాడు. దీంతో ముసునూరి నాయకుల పాలన ముగిసింది.

తెలంగాణ రాజ్యం కమ్మ నాయకుల పాలన నుంచి వెలమ నాయకుల పాలనలోకి వెళ్లింది. ఓరుగల్లు రాచకొండ రాజ్యంలో భాగంగా మారింది. దీనికి రాజు అనపోత నాయకుడు. ఓరుగల్లు పట్టణం తన ప్రతిష్ఠను క్రమంగా కోల్పోయింది.

మాదిరి ప్రశ్నలు

1. ముసునూరి నాయకుల మొదటి రాజధాని?
   1) ఓరుగల్లు 2) ఉయ్యూరు
   3) రేఖపల్లి 4) రాచకొండ
2. ముసునూరి ప్రోలయ నాయకుడు వేయించిన శాసనం?
   1) విలాస తామ్ర శాసనం
   2) విప్పర్ల శాసనం 3) కలవచేరు శాసనం
   4) పైవన్నీ
3. బహమనీ రాజ్యస్థాపకుడు ఎవరు?
   1) మహ్మద్ షా 2) హసన్ గంగూ
   3) నిజాం షా 4) జునాఖాన్
4. కాకతీయుల చివరి రాజు?
   1) రుద్రదేవుడు 2) మహాదేవుడు
   3) గణపతి దేవుడు 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జూన్-2025

సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనలకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్‌తో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే సీఎస్ఐఆర్–యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) జూన్–2025 నోటిఫికేషన్ విడుదలైంది.

» **సబ్జెక్టులు:** కెమికల్ సైన్సెస్,ఎర్త్,అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్.

» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులవ్వాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, థర్డ్‌జెండర్, దివ్యాంగ అభ్యర్థులు 50 శాతం మార్కులు ఉండాలి. » **వయసు:** 30.07.2025 నాటికి 30 ఏళ్లు మించకుండా ఉండాలి.

» **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష. మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.06.2025

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 25.06.2025 నుంచి 26.06.2025 వరకు

» **పరీక్షల తేదీలు:** 26, 27, 28.07.2025.

» **వెబ్‌సైట్:** http://csirnet.nta.ac.in

ఎయిమ్స్ గోరఖ్‌పూర్‌లో 50 ఫ్యాకల్టీ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) గోరఖ్‌పూర్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.

» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–06, అడిషనల్ ప్రొఫెసర్–05, అసోసియేట్ ప్రొఫెసర్–18, అసిస్టెంట్ ప్రొఫెసర్–21.

» **విభాగాలు:** బర్న్–ప్లాస్టిక్ సర్జరీ,కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ(మెడికల్), జనరల్ మెడిసిన్, మెడికల్ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, రేడియాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, యూరాలజీ.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ(ఎండీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,20,000, అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.2,00,000.

» **వయసు:** 29.06.2025 నాటికి ప్రొఫెసర్/అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.

» **దరఖాస్తు విధానం:** గూగుల్ ఫామ్ ద్వారా.

» **దరఖాస్తులకు చివరితేది:** 29.06.2025.

» **వెబ్‌సైట్:** https://aiimsgorakhpur.edu.in

తెల్ల ఫాస్ఫరస్‌ను దేనిలో నిల్వ ఉంచుతారు?



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

భౌతిక రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్, సల్ఫర్, దాని సమ్మేళనాలు: సాధారణ ఉప్పు, దాని ఉత్పన్నాలు

- **సల్ఫర్ ధాతువులు:** కాపర్ పైరటీస్– CuS, ఐరన్ పైరటీస్ - FeS, గెలీనా PbS, సిన్నబార్ - HgS, జింక్ బ్లెండ్ ZnS
- భూగర్భ ఉపరితలంలో లభించే ధాతువుల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి సిసిలీ పద్ధతి.
- భూమి పొరల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి ఫ్రాష్ పద్ధతి.
- సిసిలీ పద్ధతిలో ఉపయోగించే కొలిమి – కాల్కారోని
- సల్ఫర్ అణువు ఆకృతి – కిరీటం
- సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత 96°C
- ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్ 444°C వద్ద ఏర్పడుతుంది.
- CaSను కాగిత పరిశ్రమలో విరంజనకారిగా ఉపయోగిస్తారు.
- **గన్‌పౌడర్ సంఘటనం:** సల్ఫర్ + బొగ్గుపొడి + KNO_3
- చర్మవ్యాధుల నివారణలో ఉపయోగించేది – HgS
- SO_2 వాయువు గాలి కంటే 2½ రెట్లు బరువైంది.
- ఫౌంటెన్ ప్రయోగం వల్ల SO_2 నీటిలో కరుగుతుందని, దానికి ఆమ్ల లక్షణం ఉంటుందని నిరూపించవచ్చు.
- SO_2 వాయువు విరంజన చర్యకు కారణం – నవజాత హైడ్రోజన్ ఏర్పడటం
- స్పర్శాపద్ధతిలో ఉపయోగించే ఉత్ప్రేరకం – V_2O_5
- నీలి కాపర్ సల్ఫేట్‌కు H_2SO_4ను కలిపినపుడు రంగును కోల్పోతుంది. ఈ ప్రక్రియను నిర్జలీకరణం అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని రసాయనాల రాజు అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని డిటర్జెంట్స్, పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు. బ్యాటరీలను నిల్వచేయడానికి వాడుతారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లం Au, Pt వంటి లోహాలతో చర్య జరపదు.
- అగ్నిపర్వతాల నుంచి వెలువడే వాయువు H_2S
- H_2S తయారు చేయడానికి ఉపయోగించే పరికరం – కిప్పు పరికరం
- H_2S గాలి కంటే బరువైంది. ఆమ్ల లక్షణాన్ని కలిగి ఉంటుంది.
- లెడ్ ఎసిటేట్‌లో ముంచిన వడపోత కాగితాన్ని H_2S నల్లగా మారుస్తుంది.
- ఓలియంను నీటితో చర్య జరిపిస్తే H_2SO_4 ఏర్పడుతుంది.
- H_2S క్షయకరణ కారకంగా పనిచేస్తుంది.
- సల్ఫర్ రూపాంతరాల్లో అత్యంత స్థిరమైంది – రాంబిక్ సల్ఫర్
- $K_2Cr_2O_4$లో ముంచిన వడపోత కాగితాన్ని SO_2 వాయువు ఆకుపచ్చగా మారుస్తుంది.
- ఫాస్ఫొరైట్ ఫార్ములా $Ca_3(PO_4)_2$
- మెటా ఫాస్ఫారిక్ ఆమ్లం ఫార్ములా HPO_3
- ఫాస్ఫరస్ పరిశ్రమలో పనిచేసే శ్రామికులకు వచ్చే జబ్బు – ఫాసిజా
- భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మెరుస్తుంది. దీన్ని ఫాస్ఫారిజన్స్ అంటారు.
- ఎలుకలను చంపడానికి తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తారు.
- ఫాస్ఫర్ బ్రాంజ్ మిశ్రమలోహం – Cu + Sn + P
- అగ్గిపుల్లలోని పదార్థాలు $KClO_3, Sb_2S_3$, బంక
- అగ్గిపెట్టె పక్కభాగంలోని పదార్థాలు – ఎర్రభాస్వరం, Sb_2, గాజుముక్కలు.
- ఫాస్ఫారిక్ ఆమ్లం ఒక త్రిక్షార ఆమ్లం.
- సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ఫాస్ఫేటిక్ ఎరువు.
- గాఢ ఉప్పు ద్రావణంలోనికి HCl వాయు వును పంపి శుద్ధమైన ఉప్పును పొందుతారు.
- ఉప్పునీటి ద్రావణాన్ని బ్రైన్ ద్రావణం అంటారు.
- సోడియం లోహం మెర్క్యురీతో కలిసి సోడియం అమాల్గంను ఏర్పరుస్తుంది.
- క్లోరిన్.. ఆకుపచ్చ పసుపు రంగు ఉన్న వాయువు.
- తడిపిన పూలు క్లోరిన్ సమక్షంలో రంగును కోల్పోవడానికి కారణం నవజాత ఆక్సిజన్ ఏర్పడటం.
- బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా $CaOCl_2$
- ఫాస్‌జీన్ ఫార్ములా – $COCl_2$; టియర్ గ్యాస్ – CCl_3NO_2; క్లోరోఫామ్ – $CHCl_3$;

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో సల్ఫర్ ధాతువు కానిది?
   ఎ) కాపర్ పైరటీస్ బి) హెమటైట్
   సి) గెలీనా డి) సిన్నబార్
2. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత?
   ఎ) 106°C బి) 86°C
   సి) 90°C డి) 96°C
3. అత్యంత స్థిరత్వం ఉన్న సల్ఫర్ రూపాంతరం?
   ఎ) ప్లాస్టిక్ సల్ఫర్
   బి) మోనోక్లినిక్ సల్ఫర్
   సి) రాంబిక్ సల్ఫర్
   డి) ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్
4. సిసిలీ పద్ధతిలో సల్ఫర్ ధాతువును ఉంచే కొలిమి పేరు?
   ఎ) బ్లాస్ట్ కొలిమి బి) షాఫ్ట్‌కొలిమి
   సి) కాల్కరోని కొలిమి డి) రివర్బరేటరీ
5. గన్ పౌడర్ అంటే?
   ఎ) ఫాస్ఫరస్, చార్‌కోల్, మెగ్నీషియం పౌడర్
   బి) సల్ఫర్, బొగ్గుపొడి, KNO_3 మిశ్రమం
   సి) Se, దీపాంగారం
   డి) బొగ్గుపొడి, NCl_3 ల మిశ్రమం
6. $2SO_2 + O_2 \xrightarrow{400-500^\circ C} 2SO_3$ (స్పర్శాపద్ధతి) ఈ చర్యలో ఉత్ప్రేరకం?
   ఎ) Ni బి) Mo
   సి) Fe డి) V_2O_5
7. రసాయనాల రాజు అని దేన్ని అంటారు?
   ఎ) H_2SO_4 బి) H_2SO_3
   సి) $H_2S_2O_7$ డి) H_3PO_4
8. నీలి కాపర్ సల్ఫేట్‌కు సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని కలిపినపుడు రంగుని కోల్పోతుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   ఎ) ఆక్సీకరణం బి) నిర్జలీకరణం
   సి) క్షయకరణం డి) ఫెర్మెంటేషన్
9. సల్ఫ్యూరిక్ ఆమ్లం ఏ లోహాలతో చర్య పొందదు?
   ఎ) Zn, Mg బి) Cu, Ca
   సి) Au, Pt డి) Ag, Sn
10. ఫెర్రస్ సల్ఫైడ్.. హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్య పొందినపుడు ఏర్పడే వాయువు?
    ఎ) SO_2 బి) SO_3
    సి) H_2S డి) NH_3
11. $K_2Cr_2O_7$ ద్రవంలో ముంచిన వడపోత కాగితాన్ని ఏ వాయువు దగ్గరకు తీసుకెళ్తే లేత ఆకుపచ్చ రంగుని పొందుతుంది?
    ఎ) H_2S బి) SO_2
    సి) N_2O డి) NO
12. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించేది?
    ఎ) ZnS బి) CaS
    సి) HgS డి) PbS
13. ఓలియంను నీటితో చర్య జరిపితే ఏర్పడే ఆమ్లం?
    ఎ) HNO_3 బి) H_2SO_4
    సి) H_2SO_3 డి) H_3PO_3
14. ఫాస్ఫరస్ మూలకం?
    ఎ) P_8 బి) P_4
    సి) P_6 డి) P_3
15. కిందివాటిలో నిర్జలీకరణి?
    ఎ) H_3PO_4 బి) $Ca_3(PO_4)_2$
    సి) P_2O_5 డి) Na_3PO_4
16. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక?
    ఎ) నత్రజని ఎరువు
    బి) ఫాస్ఫాటిక్ ఎరువు
    సి) పొటాషియం ఎరువు
    డి) కాల్షియం ఎరువు
17. అగ్గిపుల్ల తలలో ఉండే రసాయనిక పదార్థాలు?
    ఎ) $KClO_3$, Sb_2S_3, బంక
    బి) KCl, $SbCl_3$, బంక
    సి) NaCl, Sb_2S_3, బంక
    డి) P_4,Sb_2S_3, గాజుముక్కలు
18. కాల్షియం ఫాస్ఫేట్ —————— ను కలిగి ఉంటుంది.
    ఎ) $CO_2(PO_2)_3$
    బి) $CaHPO_2$
    సి) $Ca_3(PO_4)_2$
    డి) $Ca(H_2PO_4)_2$
19. P_2O_5 ను చల్లని నీటిలో కరిగించినపుడు ఏర్పడేది?
    ఎ) H_3PO_4 బి) HPO_3
    సి) PH_3 డి) PH_3, H_3PO_4
20. ఫాస్ఫర్ బ్రాంజ్ అనే మిశ్రమలోహం సంఘటనం?
    ఎ) Cu + Sn + P
    బి) Cu + Zn + P
    సి) Cu + Sn
    డి) Cu + Mg + S
21. తెల్ల ఫాస్ఫరస్‌ను దేనిలో నిల్వ ఉంచుతారు?
    ఎ) Cs_2 బి) కిరోసిన్
    సి) నీరు డి) CCl_4
22. చీకటిలో భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మండి మెరుస్తుంది. దీన్ని ఏమంటారు?
    ఎ) ప్రతిదీప్తి బి) రసాయనశక్తి
    సి) ఫాస్ఫారిజన్స్ డి) జీవదీప్తి
23. కిందివాటిలో ఏది ఫాస్ఫారికామ్ల లవణం కాదు?
    ఎ) NaH_2PO_4 బి) Na_2HPO_4
    సి) Na_3PO_4 డి) H_3PO_4
24. కిందివాటిలో దేన్ని ఎలుకల మందుగా ఉపయోగిస్తారు?
    ఎ) కాల్షియం ఫాస్ఫైడ్
    బి) జింక్ ఫాస్ఫైడ్
    సి) మెగ్నీషియం ఫాస్ఫైడ్
    డి) ఫాస్పీన్
25. సముద్ర నీటిలో ఉప్పుశాతం?
    ఎ) 3.2% బి) 2.8%
    సి) 4.6% డి) 5.2%
26. క్లోరిన్ వాయువు రంగు
    ఎ) ఎరుపు బి) నీలం
    సి) ఆకుపచ్చ–పసుపు
    డి) నలుపు
27. నీటిలో హైడ్రోజన్ క్లోరైడ్ స్వభావం?
    ఎ) క్షారం బి) ఆమ్లం
    సి) తటస్థ డి) ద్వంద్వ
28. టియర్ గ్యాస్ ఫార్ములా
    ఎ) $COCl_2$ బి) $CaOCl_2$
    సి) CCl_3NO_2 డి) $CaSO_4$
29. $CHCl_3$ను ఏమంటారు?
    ఎ) బ్లీచింగ్ పౌడర్
    బి) ఫాస్‌జీన్ సి) క్లోరోఫాం
    డి) అమాల్గం
30. బ్రైన్ ద్రావణం అంటే?
    ఎ) ఉప్పు+ నీరు
    బి) చక్కెర+ నీరు
    సి) యూరియా+ నీరు
    డి) గ్లూకోజ్ + నీరు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) బి; 6) డి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి; 11) బి; 12) సి; 13) బి; 14) బి; 15) సి; 16) బి; 17) ఎ; 18) సి; 19) బి; 20) ఎ; 21) సి; 22) సి; 23) డి; 24) బి; 25) బి; 26) సి; 27) బి; 28) సి; 29) సి; 30) ఎ.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సల్ఫ్యూరిక్ ఆమ్లంలోని మూలకాలు (DSC-1996)
   ఎ) నత్రజని, సల్ఫర్, ఆక్సిజన్
   బి) హైడ్రోజన్, సల్ఫర్, ఆక్సిజన్
   సి) సల్ఫర్, ఆక్సిజన్
   డి) ఫాస్ఫరస్, సల్ఫర్, హైడ్రోజన్
2. వాసనలేని ఆమ్లానికి ఉదాహరణ (DSC-2001)
   ఎ) HNO_3 బి) H_3PO_4
   సి) HCl డి) H_2SO_4
3. రంగులేని, చిక్కటి నూనె వంటి ఆమ్లం? (DSC-2002)
   ఎ) H_2SO_4 బి) H_3PO_4
   సి) HNO_3 డి) HCl
4. ఫాస్ఫారిక్ ఆమ్ల సంకేతం (DSC-2003)
   ఎ) H_3PO_4 బి) H_2SO_4
   సి) HNO_3
   డి) CH_3COOH
5. జడవాయువు కాని దానికి ఉదాహరణ (DSC-2000)
   ఎ) క్లోరిన్ బి) హీలియం
   సి) నియాన్ డి) ఆర్గాన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) ఎ

కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా,బోట్స్వానా,కాంగో,కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు, ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్తరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:
- మధ్యప్రదేశ్ – కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ - అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ – కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. అవి:
1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబి మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:
- బిహార్ – గయ.
- జార్ఖండ్ – కోడెర్మా, హజారీబాగ్, సింగ్భూమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ – నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ - ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:
- ఆంధ్రప్రదేశ్ – కడప.
- తెలంగాణ – ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు,పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు),తెలంగాణ(నల్గొండ, ఖమ్మం), బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్తరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్ (జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.


కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.



ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్తరాల్లో లభ్యమవుతోంది. అవి:

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్తరాల్లోని దామోదర్ లోయ(జార్ఖండ్ -దామోదర్),సోన్ (మధ్యప్రదేశ్),మహానది (ఒడిశా), గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా (మహారాష్ట్ర) లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..
1. **అంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90-95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:** ఇందులో 85-90 శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30-40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ - జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్ - రాణీగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ - కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో- అరంద్, తాతాపాని- రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ -సింగ్రౌలి,సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర - చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ - సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు - నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం - మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ - బికనీర్ .
ఉత్తర ప్రదేశ్ - నామ్‌చిక్, నాంరూథ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా,జపాన్,ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్'క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హంగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర:మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది - HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:
1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కోనియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ (నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కోనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
   1) అమెరికా 2) ఉక్రెయిన్
   3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్ఘేరిటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిందా దేనికి ప్రసిద్ధి?
   1) కాపర్ 2) క్రోమైట్
   3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4;
5) 1; 6) 3; 7) 2; 8) 2.

What is the code for "manage"?



BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between C and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G
   4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 81 goods full
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):

Q	P	S	R	Row 2
B	C	D	A	Row 1

8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 **14.** 5 **15.** 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**